ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
శ్రీకాకుళం : fb.com/vaartha Digital
Published from Srikakulam ,Visakhapatnam, Vijayawada, Hyderabad,Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem
28-9-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 239 పేజీలు: 16 వెల: 6.50



## 'శత'క్కొట్టారు!
వెస్టిండీస్‌పై భారత్ ఘన విజయం
విరాట్ కోహ్లీ, శుభమన్ గిల్ సెంచరీలు
కోహ్లీ రికార్డుల వెల్లువ
3లో



# సర్జికల్ స్ట్రైక్‌కు పదేళ్లు

● ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపుతాం ● జీరో టాలరెన్స్ విధానం అమలు ● జనగణనలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి ● డ్రగ్స్‌కు వ్యతిరేకంగా యువత పోరు ప్రశంసనీయం ● పర్యావరణ పరిరక్షణకు ప్రాధానమివ్వండి ● మన్ కీ బాత్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోడీ ● దేశ వారసత్వం నుంచి కొత్త అవకాశాల వరకు ప్రస్తావన

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 27:** ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపుతామని ప్రధాని నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. ఉగ్రవాదం విషయంలో భారత్ జీరో టాలరెన్స్ విధానాన్ని పాటిస్తోందని తెలిపారు. ఉగ్రవాదానికి బలమైన, నిర్ణయాత్మక ప్రతిస్పందన ఉంటుందనే విషయాన్ని భారత్ స్పష్టం చేసిందని తెలిపారు. ఆదివారం నిర్వహించిన 'మన్ కీ బాత్' 138వ ఎపిసోడ్‌లో దేశ ప్రజలను ఉద్దేశించి ప్రధాని మోడీ ప్రసంగించారు. ఈ సందర్భంగా సర్జికల్ స్ట్రైక్ 10వ వార్షికోత్సవం, దేశ వారసత్వం, పర్యావరణ పరిరక్షణ, యువత, క్రీడలు, మహిళా సాధికారత, గ్రామీణ ఆర్థికాభివృద్ధి వంటి పలు అంశాలను ప్రస్తావించారు. సర్జికల్ స్ట్రైక్ జరిగి 10 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ప్రధాని మోడీ భారత సైనికుల ధైర్యసాహసాలను గుర్తు చేసుకున్నారు. 2016 సెప్టెంబరు 28-29 తేదీల్లో భారత సైన్యం నియంత్రణ రేఖ (ఎల్‌ఓసి) దాటి పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై సర్జికల్ స్ట్రైక్ నిర్వహించిందని ఆయన పేర్కొన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ అనుసరించిన విధానంలో సర్జికల్ స్ట్రైక్ ఒక ముఖ్యమైన ఉదాహరణగా నిలిచిందని, 'నేటి భారత్ ఉగ్రవాదాన్ని సహించదు' అని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. దేశ చరిత్ర, వారసత్వంతో పాటు పర్యావరణ పరిరక్షణ, యువత, క్రీడలు, మహిళా సాధికారత, స్థానిక ఉత్పత్తులకు మార్కెట్ వంటి అంశాలను ప్రస్తావించారు. ప్రజల స్థానిక స్థాయి ప్రయత్నాలు సామాజిక, ఆర్థిక మార్పులకు దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. జనగణనను జాతీయ బాధ్యతగా అభివర్ణించారు. ప్రతిపౌరుడు ఇందులో భాగస్వామి కావాలని కోరారు. జనగణన సమ >>2

# పల్లె పండుగ 3.0

## రేపు నెల్లూరు జిల్లా ఉదయగిరిలో శ్రీకారం

సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్ హాజరు
రూ.11,085 కోట్లతో అభివృద్ధి పనులు
రోడ్లు, రవాణా రంగాలకు ప్రాధాన్యత
రైతులకు, ఉద్యాన రంగానికి పెద్దపీట
గ్రామాల్లో మెరుగైన గ్రామాల్లో వసతుల కల్పన




**విజయవాడ,సెప్టెంబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:** పల్లెల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభివృద్ధి వెలుగులు నింపేందుకు కీలక కార్యచరణ చేపట్టింది. ఈ నెల 29వ తేదీన పల్లె పండుగ 3.0ను ప్రారంభించనుంది.. ఇందులో భాగంగా రూ.11,085 కోట్లతో గ్రామీణ ప్రాంతాల్లో భారీఎత్తున అభివృద్ధి పనులు జరుగనున్నాయి. నెల్లూరు జిల్లా ఉదయగిరిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ చేతుల మీదుగా ఈ పనులు ప్రారంభం కానున్నాయి. గ్రామాల్లో రూ. 2,700 కోట్ల వ్యయంతో 6,000 కిలోమీటర్ల మేర సిసి రోడ్ల నిర్మాణం జరగనుంది. రూ.7,550 కోట్ల వ్యయంతో 9,500 కిలోమీటర్ల బిటి రోడ్ల పనులను చేపట్టనుంది. రూ.300 కోట్లతో పాడి రైతుల కోసం 22,000 మిని గోకులాలను ఎపి సర్కార్ నిర్మించనుంది. రూ. 225 కోట్ల వ్యయంతో ఉద్యానవన శాఖ ద్వారా 50,000 ఎకరాల్లో తోటల పెంపకానికి ఏపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. రూ.110 కోట్ల వ్యయంతో 1,000 కిలోమీటర్ల మేజిక్ డ్రెయిన్లు నిర్మాణాన్ని చేపట్టనుంది. రూ. 200 కోట్లతో బస్ షెల్టర్లు, గ్రామ పంచాయతీ భవనాలు, రచ్చబండ తదితర పనులు జరగనున్నాయి. మొత్తం రూ.11,085 కోట్లతో కేంద్రం వాటాగా రూ.5,391 కోట్లు, రాష్ట్రం వాటా రూ.5,694 కోట్లను ఖర్చు చేయనుంది. వీబీ-జీ రామ్ జీ కింద రూ.1,750 కోట్లు, గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కింద రూ.3,800 కోట్లు, నాబార్డ్, సాస్కి, ఇతర నిధులతో రూ.2,000 కోట్లతో ఆయా పనులను ప్రభుత్వం చేపట్టనుంది.పల్లె పండుగ 1.0 కింద 4 వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు, 22,514 పశువుల షెడ్లు, 21,000 వ్యవసాయ పంట కుంటలు, 64 వేల ఎకరాల్లో ఉద్యాన పంటల పెంపకాన్ని పంచాయతీ రాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ శాఖ చేపట్టింది. పల్లె పండుగ 2.0 కింద రూ. 2,500 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 8 వేల 300 కిలోమీటర్ల బీటీ రోడ్లు, 15750 పశువుల షెడ్లు, 15,500 పశువుల నీటి తొట్టెలు, 86 వేల వ్యవసాయ కుంటలు, 82 వేల వ్యక్తిగత సోక్ పిట్లు, 32 కిలోమీటర్ల మ్యాజిక్ డ్రైన్లను ఏపీ ప్రభుత్వం నిర్మించనుంది.

**ఎల్లుండి పవన్ కల్యాణ్‌తో కలిసి సీఎం కీలక ప్రోగ్రాం..**

విజయవాడ, సెప్టెంబరు 27 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ ప్రాంతాల రూపురేఖలను మార్చే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం మరో భారీ కార్యక్రమానికి తెరతీసింది. రాష్ట్రంలోని గ్రామాల్లో అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తూ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'పల్లె పండుగ 3.0 కార్యక్రమం సెప్టెంబర్ 29న లాంఛనంగా ప్రారంభం కానుంది. నెల్లూరు జిల్లా ఉదయగిరి వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేతుల మీదుగా ఈ అభివృద్ధి పనులు >>2

## స్వర్ణ, వార్డు సచివాలయ ఉద్యోగులకు శుభవార్త

# పదోన్నతులకు గ్రీన్‌సిగ్నల్!

పురపాలక శాఖ ఉత్తర్వులు
స్పష్టత ఇచ్చిన ప్రభుత్వం
తొలి విడతలో 1630కి ప్రమోషన్
మంత్రి నారాయణ వెల్లడి

**విజయవాడ,సెప్టెంబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:** స్వర్ణ వార్డు సచివాలయ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ఈ ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు (జీవో ఎంఎస్‌నెం 244) జారీ చేసింది. వార్డు సచివాలయ సిబ్బందికి ప్రమోషన్ ఛానెల్‌ను సుగమం చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మిగులు పోస్టుల సర్దుబాటు ద్వారా మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖలో కొత్తగా 815 జూనియర్ అసిస్టెంట్ పోస్టుల కల్పనకు ఎపి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అర్హత కలిగిన వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలకు నూతనంగా క్రియేట్ చేసిన జూనియర్ అసిస్టెంట్ పోస్టుల్లోకి ప్రమోషన్లను కూటమి ప్రభుత్వం కల్పించింది.

**ఉత్తర్వుల్లో స్పష్టత ఇచ్చిన ప్రభుత్వం:**

వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీల ప్రమోషన్ల అనంతరం, వార్డు డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలకు వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలుగా పదోన్నతులను కల్పించింది. 815 వార్డు శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీ (గ్రేడ్2) పోస్టులను గ్రేడ్1గా ప్రభుత్వం అప్‌గ్రేడ్‌చేసింది. 815 వార్డు ప్లానింగ్, రెగ్యులేషన్ సెక్రటరీ (గ్రేడ్2) పోస్టులను కూడా గ్రేడ్1 హోదాకు అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వానికి ఎలాంటి అదనపు ఆర్థిక భారం లేకుండా ఈ పోస్టుల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను పూర్తి చేసింది. ఏడేళ్లుగా సచివాలయ సిబ్బందిగా పనిచేస్తున్నా, ప్రభుత్వం నుంచి అందాల్సిన ప్రయోజనాలు, సౌకర్యాలు అందడం లేదని వారు ఆవేదన వ్యక్తం >>2

## వరద సహాయక చర్యలు

# వేగవంతం చేయండి

రహదారులకు విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరించాలి
ప్రజారోగ్య పరిస్థితిపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి
వ్యాధుల వ్యాప్తి నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలి
పంటల నష్టం అంచనాల్లో ఏ రైతుకూ అన్యాయం జరగకూడదు
వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలపై డి.సిఎం పవన్ సమీక్ష
సహాయక, పునరుద్ధరణ చర్యలను వేగవంతం చేయాలని ఆదేశం



**విజయవాడ, సెప్టెంబరు 27 ప్రభాతవార్త ప్రతినిధి:** తీవ్ర వాయుగుండం ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు, తదనంతర వరదల మూలంగా పిఠాపురం నియోజకవర్గంలో తలెత్తిన పరిస్థితులపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారు. భారీ వర్షాలు, వరదల ప్రభావం పడిన ప్రాంతాల్లో ప్రజలకు వెంటనే సహాయం అందించడంతోపాటు, రహదారులు, విద్యుత్ వ్యవస్థలకు జరిగిన నష్టాన్ని త్వరగా పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. పంట నష్టంపై సమగ్ర నివేదికను సిద్ధం చేసే ప్రక్రియను తక్షణం చేపట్టాలని స్పష్టం చేశారు. శనివారం అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ వ్యవసాయం, రోడ్లు-భవనాలు, విద్యుత్, మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో ముందుకు వెళ్లి సహాయక చర్యలను వేగవంతం చేయాలని చెప్పారు. ముఖ్యంగా పంట నష్టాన్ని వెంటనే అంచనా వేసి, రైతులకు ఎదురవుతున్న సమస్యలను తగ్గించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో వీలైనంత త్వరగా సాధారణ పరిస్థితులు నెలకొల్పేలా అధికారులు ప్రణాళికాబద్ధంగా పనులు చేయాలన్నారు.

**ప్రతీ ఒక్కరైతు నష్టాన్నీ నమోదు చేయాలి:**

తీవ్ర వాయుగుండం ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా పిఠాపురం, గొల్లప్రోలు, యు.కొత్తపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో పంటలు నీటమునిగి దెబ్బతిన్న విషయాన్ని వ్యవసాయ శాఖ అధికారులు పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువచ్చారు. వరి, పత్తి, మినుము, మొక్కజొన్న తదితర పంటలకు జరిగిన నష్టాన్ని గ్రామాల వారీగా అంచనా వేస్తున్నట్లు అధికారులు వివరించారు. పంట దశ, నీటిమునక తీవ్రత, దెబ్బతిన్న విస్తీర్ణం, నష్టం స్థాయిని క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలను నమోదు చేస్తున్నట్లు తెలిపారు. దీనిపై స్పందించిన పవన్ కల్యాణ్ రైతులకు జరిగిన పంటనష్టాన్ని వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా, సమగ్రంగా అంచనా వేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రైతుకు >>2

# శబరి ఉగ్రరూపం.. గోదావరికి వరద



**వేలేరుపాడు, సెప్టెంబరు27, ప్రభాతవార్త:** ఎగువ ప్రాంతాల్లో గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి, శబరి నదుల్లో వరద ఉధృతి మళ్లీ పెరిగింది. భద్రాచలం వద్ద 33 అడుగుల నుంచి గోదావరి నీటిమట్టం ఒక్కసారిగా 43 అడుగులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. దీంతో లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. వరద ఉధృతి కారణంగా ఏలూరు జిల్లా రుద్రమ >>2

# విధులు నిర్వహిస్తూ.. గుండెపోటుతో సిఐ మృతి

## చలో విజయవాడ నిరసనలో సిఐ అహమ్మద్ అలీ ఆకస్మిక మరణం


సిఐ అహమ్మద్ అలీ (ఫైల్)

**విజయవాడ,సెప్టెంబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:** గ్రామ సచివాలయాల ఉద్యోగుల నిరసన సందర్భంగా పరిస్థితులను అదుపు చేస్తూ విజయవాడనున్న పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ అహమ్మద్ అలీ ఆకస్మికంగా మరణించారు. ఆదివారం సచివాలయ ఉద్యోగులు తలపెట్టిన ఆందోళన కార్యక్రమం నేపథ్యంలో విజయవాడ వ్యాప్తంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ భద్రతా ఏర్పాట్లలో భాగంగా సిఐ అహ్మాద్ అలీ తన సిబ్బందితో కలిసి గాంధీ నగర్‌లోని ధర్నా చౌక్ వద్ద విధుల్లో పాల్గొన్నారు. పరిస్థితిని పర్యవేక్షిస్తూ, చురుకుగా విధులు నిర్వర్తిస్తున్న >>2



## ఎన్‌ఆర్‌ఐల కోసం శ్రీవారి హుండీ నాణేలు

సెవెన్‌హిల్స్ టు సెవెన్ కాంటినెంట్స్ పేరుతో పునఃప్రారంభం

**తిరుమల,సెప్టెంబరు 27ప్రభాతవార్తప్రతినిధి:** వడ్డీకాసుల వేంకటేశ్వరస్వామికి తిరుమల ఆలయంలో హుండీలో విదేశీ భక్తులు సమర్పించుకునే కానుకలను తిరిగి ఎన్‌ఆర్‌ఐలకు అందుబాటులో ఉంచనున్నారు. ఇప్పటికే స్వామివారి హుండీకి వస్తున్న విదేశీ కరెన్సీ,నాణేల కానుకలు భారీగా శ్రీవారి ఖజానాలో ఉన్నాయి. వీటిని కొంతవరకు భారం తగ్గించుకుని టిటిడి ఖజానాకు మరింత ఆదాయం సమకూర్చునేందుకు సిద్ధమైంది. "సెవెన్ హిల్స్ టు సెవెన్ కాంటినెంట్స్" పేరుతో ఎపిఎన్‌ఆర్‌టి పునఃప్రారంభమైంది. గతంలోనే తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో మొదలైన ఈ సేవలు మళ్లీ ఆగిపోయాయి. ఇప్పుడు మళ్లీ అదే విధానం అమలులోకి తీసుకువస్తున్నారు. ప్రస్తుతం 20 డాలర్ల విలువైన అమెరికా నాణేల బాక్సుల విక్రయం విజయవాడ తాడేపల్లి ఎన్‌ఆర్‌టి కార్యాలయంలో అందు >>2

## వైద్యారోగ్యశాఖలో ఇక

# కాగితరహిత సేవలు!

మంత్రి సత్యకుమార్ చొరవతో అందుబాటులోకి 'ఎంఎంఏట్రిక్స్' ఆధారిత పోర్టల్
రియల్ టైంలో వినతుల పరిష్కార చర్యలు.. నిరంతర పర్యవేక్షణ
సమీక్ష సమావేశాల నిర్ణయాలు, ఆదేశాల అమలు పై కూడా పర్యవేక్షణ
ఈ వ్యవస్థ ప్రభుత్వ శాఖల్లో ఇదే తొలిసారి




**విజయవాడ, సెప్టెంబరు 27 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆరోగ్యశాఖ దాఖలయ్యే అర్జీల పరిష్కారం అయ్యే వరకు దాని పురోగతిని పర్యవేక్షించే 'ఎంఎంఏట్రిక్స్' ఎఐ ఆధారిత పోర్టలును త్వరలో వైద్యారోగ్యశాఖలో అందుబాటులోకి తీసుకురానున్నారు. కాగిత రహిత పాలనలో భాగంగా మంత్రి సత్యకుమార్ ఆదేశాలకు అనుగుణంగా ఈ నూతన వ్యవస్థను అందుబాటులోకి తీసుకుని వస్తున్నారు. వైద్య,ఆరోగ్యశాఖ కార్యాలయానికి వచ్చే ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేసి, అర్జీ ఎక్కడ ఉంది, ఎవరి వద్ద ఉంది, ఏ చర్య తీసుకున్నారు, ఇంకా ఏం చేయాలి, ఎప్పటిలోగా పరిష్కరించాలి అనే వివరాలు ఇందులో నమోదవుతాయి. సాధారణంగా 10 పనిదినాల్లో ప్రక్రియను పూర్తి చేసేలా గడువు నిర్దేశించనున్నారు. వివిధ వర్గాల నుంచి వచ్చే వినతులపై మంత్రి జారీ చేసిన ఆదేశాల >>2


అతిథులకు భోజనాలు వడ్డిస్తున్న మంత్రి దుర్గేష్

## ఆంధ్ర వంటకాలు అద్భుతహో

పర్యాటక ప్రమోషన్‌లో వినూత్న ఒరవడి..
ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకల్లో
ఎపి పర్యాటకానికి సోషల్ మీడియా బూస్ట్
స్వయంగా పూతరేకులు చేసిన పర్యాటక మంత్రి కందుల దుర్గేష్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 27,ప్రభాతవార్త:** ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని మంజీరా హోటల్‌లో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు జరిగాయి. ఈ వేడుకల్లో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ స్వయంగా పాల్గొని ఏర్పాట్లను పరిశీలించారు. రాష్ట్రంలోని అద్భుతమైన పర్యాటక ప్రాంతాలను విశ్వవ్యాప్తం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లతో కలిసి మంత్రి దుర్గేష్ బంతిభోజనాలు చేయడం ఈ కార్యక్రమపు ప్రధాన హైలైట్‌గా నిలిచింది. అంతకుముందు మంత్రి కందుల దుర్గేష్ స్వయంగా అతిథులకు భోజనం వడ్డించి తన ఆప్యాయతను చాటుకున్నారు. అరిటాకులో వడ్డించిన ఘుమ >>2

# అన్నమయ్య ప్రాజెక్టుకు ఏమైంది?


చెయ్యేరునదిలో కొత్త ప్రాజెక్టు కోసం పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

● కళ్ల ముందే నీరు... కరవుతో రైతులకు కన్నీరు ● కరవు సీమలో 71 టిఎంసిల నీరు సముద్రం పాలు ● గాలేరు నగిరి నీటితో ఆయకట్టుకు నీరు అసాధ్యం ● తేల్చి చెప్పిన జలవనరుల శాఖ అధికారులు ● ప్రాజెక్టు పునర్ నిర్మాణ అధ్యయన నివేదికలేమయ్యాయి? ● నిపుణుల కమిటీ సిఫార్సులు బుట్టదాఖలేనా?!

**రాజంపేట, సెప్టెంబరు 27 ప్రభాతవార్త:** ఒక మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టు కట్టేందుకు 25యేళ్లు పట్టింది. రూ.8.23 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పూర్తయ్యే నాటికి రూ.51 కోట్లు ఖర్చు అయింది. నేటికీ ఈ ప్రాజెక్టు చరిత్రకు 50 యేళ్లు. పాలకుల వైఖరితో రైతులకు దినదిన గండంగా మారింది. ప్రాజెక్టు ఎర్త్ డ్యామ్ వరదల్లో కొట్టుకుపోతే ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు ప్రాజెక్టు పునర్ నిర్మించేందుకు అన్ని నివేదికలు సిద్ధం చేసి టెండర్లు పిలిచిన ఓ అధికారి పదవీ విరమణ చేసే కొద్దిరోజుల ముందు ముఖ్యమంత్రిని తప్పుదోవ పట్టించేలా సమాచారం ఇచ్చి వేలాదిమంది ఆయకట్టు రైతుల జీవితాలతో చెలగాటమాడి వెళ్లారు. ఫలితంగా కూటమి ప్రభుత్వం నిర్ణయం రైతాంగానికి నిద్రలేని రాత్రులను మిగుల్చుతోంది. సిఎం ఆదేశాలతో సమగ్ర అధ్యయనం చేసిన జల వనరులశాఖ ప్రాజెక్టు నిర్మాణం మినహా ప్రత్యామ్నాయం లేదని తేల్చి చెప్పుతూ ప్రభుత్వానికి నివేదికపంపారు. ఓ ఉన్నతాధికారి నివేదించినట్లుగా అన్నమయ్య ప్రాజెక్టుకు గాలేరు-నగరి ప్రధాన కాలువ ద్వారా వాణిజ్య పంటలకు సాగునీరు అందించడం అసాధ్యమని ప్రభుత్వానికి పంపిన నివేదికలో అధికారులు స్పష్టం చేశారు. శ్రీశైలం నుంచి దిగువ ప్రాజెక్టులకు చేసే కేటాయింపులు (నికరజలాలు) ఒక కొత్త ప్రాజెక్టు మొత్తం ఆయకట్టు ఎలా సాగునీరు ఇవ్వగలదని, సాంకేతికంగా ఇది అసాధ్యమని జిల్లా జల వనరులశాఖ పంపిన నివేదికలో స్పష్టం చేసినట్లు తెలిసింది. 2019 నవంబరు 19న అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయిన తర్వాత కళ్ళముందే సాగునీరు కనిపిస్తూ వృధాగా 71 టిఎంసిలు సముద్రంలో కలిసిపోయిన >>3



ఆదివారం భద్రాచలం వద్ద ఉప్పొంగి ప్రవహిస్తున్న గోదావరి నది

# శ్రీవారి హుండీ నాణేలు

>> బాటులో ఉంచుతున్నారు. ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని ప్రతిరోజూ 90వేలమంది వరకు భక్తులు దర్శనం చేసుకుంటున్నారు. వీరిలో విదేశీయులు ఉన్నారు. ఇలా విదేశీ భక్తులు హుండీలో కానుకలుగా ఆయా దేశాల కరెన్సీ,నాణేలు సమర్పించుకుంటున్నారు. ప్రతిరోజూ తిరుమలేశుని హుండీ ఆదాయం 4కోట్ల రూపాయల వరకు చేకూరుతోంది. తిరుమల శ్రీవారి హుండీలో భక్తులు సమర్పించిన విదేశీ నాణేలను ఎన్ఆర్ఐలకు అందుబాటులోకి తెచ్చే కార్యక్రమం ఐదేళ్ల విరామం తర్వాత మళ్లీ ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్ నాన్‌రెసిడెంట్ తెలుగు (ఏపిఎన్ఆర్‌టి) సొసైటీ ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని పునరుద్ధరించింది. శ్రీవారి హుండీలోని నాణేలను పవిత్రంగా భావించే ఎన్ఆర్ఐల కోసం ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆర్‌బిఐ నిబంధనల ప్రకారం బ్యాంకులు విదేశీ కరెన్సీ నోట్లను మాత్రమే స్వీకరిస్తాయి కానీ నాణేలను తీసుకోవు. దీంతో టిటిడి వద్ద ప్రతీ యేటా పెద్ద మొత్తంలో విదేశీ నాణేలు నిల్వ గుట్టగా పేరుకుపోతున్నాయి. ఈ సమస్యకు పరిష్కారంగా విదేశీ నాణేలను టిటిడి నుండి కొనుగోలు చేసి ఎన్ఆర్ఐలకు అందించాలనే వినూత్న ఆలోచనతో 2019కి ముందు అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఏపిఎన్ఆర్‌టి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అప్పట్లోనే సుమారు 10 లక్షల రూపాయలు విలువైన అమెరికా నాణేలను టిటిడి నుండి కొనుగోలు చేసింది.

**గత వైసిపి ఐదేళ్లలో ఆగిన విధానం:**

2019-24 మధ్యరాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు ఈ కార్యక్రమం పూర్తిగా నిలిచిపోయింది. దీంతో అప్పట్లో కొనుగోలు చేసిన నాణేలన్నీ ఎన్ఆర్‌టి సొసైటీ వద్దనే ఉండిపోయాయి. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉండటంతో ఏపిఎన్ఆర్‌టి సొసైటీ ఈ కార్యక్రమాన్ని మళ్లీ పునరుద్ధరించింది. శ్రీవారిపాదాల చెంతకుచేరినఈనాణేలను పవిత్రమైనవిగాభావించే ఎన్ఆర్ఐలకు అందించాలని నిర్ణయించింది.

**అమెరికా నాణేలు అందుబాటులో:**

ఎన్ఆర్‌టి సొసైటీ వద్ద ప్రస్తుతం అమెరికా డాలర్ నాణేలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని సొసైటీ అధ్యక్షుడు వేమూరు రవి కుమార్ తెలిపారు. ఒక్కో పెట్టెలో 20 డాలర్ల విలువైన నాణేలు ఉండగా, వాటిని 25 డాలర్లకు అందిస్తున్నట్లు వివరించారు. ఈ నాణేలు కావాలనుకునే ఎన్ఆర్ఐలు గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ఏపిఎన్ఆర్‌టీ కార్యాలయంలో సంప్రదించి వాటినిపొందవచ్చని ఆయన సూచించారు. త్వరలో ఇతర దేశాల నాణేలను కూడా అందుబాటులోకి తెచ్చే సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నట్లు టిటిడిలో చర్చ.

# శబరి ఉగ్రరూపం.. గోదావరికి వరద

>> కోట- వేలేరుపాడు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వేలేరుపాడు-కోయిదా మార్గంలోని ఎద్దువాగు ముంపునకు గురికావడంతో ఆయా ప్రాంతాల ప్రజలు పడవలపైనే ప్రయాణాలు సాగిస్తున్నారు. సుమారు 20 గ్రామాలకు రాకపోకలు అంతరాయం ఏర్పడినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు శబరి నది కూడా ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వేలేరుపాడు పరిసర ప్రాంతాల్లో వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ఆదివారం రాత్రికి గోదావరి నీటిమట్టం మరో రెండు, మూడు అడుగుల మేర పెరిగిన అనంతరం క్రమంగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. వరద పరిస్థితులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షి స్తున్నారు. పోలీసు, రెవెన్యూ, పంచాయతీతో పాటు వివిధ శాఖల సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నారు.

# ఉద్యోగ నియామకాలకు సంబంధించి గరిష్ట వయోపరిమితి పెంపు

**విజయవాడ,సెప్టెంబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:** ఉద్యోగ నియామకాలకు సంబంధించి గరిష్ట వయోపరిమితిని పెంపుదల చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగ నియామకాలకు గరిష్ట వయోపరిమితి పెంపుదల చేసింది. ఈ మేరకు 187 ,188 జీవోలను రాష్ట్ర ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ విడుదల చేసింది.ఈ ఉత్తర్వులు అమలులోకి వచ్చాయి. 2027 సెప్టెంబర్ 30వరకూ ఈ గరిష్ట వయో పరిమితి పెంపుదల అమల్లో ఉంటుందని వెల్లడించింది.రాష్ట్రంలో ఏపీపీఎస్‌సీ.డీఎస్సీ సహా ఇతర రిక్రూటింగ్ ఏజెన్సీలు చేసే నియామక ప్రక్రియలకు ఈ వయోపరిమితి పెంపుదల అమలు కానుంది. ఈసారి యూనిఫాం సర్వీసులకు సర్వీసులకు రెండేళ్లపాటు సాధారణ కేటగిరీలో వయోపరిమితి సడలించారు. మిగిలిన రిక్రూట్‌మెంట్‌లకు 34 ఏళ్ల గరిష్ట వయో పరిమితి నుంచి 44 ఏళ్లకు పెంచారు. రిజర్వ్‌డ్ కేటగిరీలకు మిగిలిన వాటికి వాటి సడలింపులు తథంగా వర్తిస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసింది.లక్షల మంది నిరుద్యోగులు ప్రభుత్వ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు వయసు దాటిపోవడం తీవ్ర ఆవేదన గురిచేసిందని. దీనిపై ప్రజాప్రతినిధులు, ఉపముఖ్యమంత్రి, మానవ వనరుల శాఖ మంత్రుల నుంచి వచ్చిన విజ్ఞప్తులమేరకు ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు వివరించింది. ఇప్పటికే అమలు లోకి వచ్చిన ఈ ఉత్తర్వులను అనుసరించి తాజా ఉద్యోగాల నోటిఫికేషన్‌లో గరిష్ట వయోపరిమితి వర్తింపులో ఉంటుంది.

# పల్లె పండుగ 3.0

>> ప్రారంభం కానున్నాయి. గ్రామీణ ప్రాంతాలను సర్వతోముఖాభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ఈ విడతలో ఏకంగా రూ.11,085 కోట్ల భారీ వ్యయంతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనుంది. ఇందులో కేంద్ర ప్రభుత్వం వాటాగా రూ.5,391 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం వాటాగా రూ.5,694 కోట్లు వెచ్చిస్తున్నారు. విభిన్న పథకాలు, నిధుల సమీకరణ ద్వారా ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోంది. ఇందులో భాగంగా విబి జి రామ్ జి కింద రూ.1,750 కోట్లు, గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కింద రూ.3,800 కోట్లు, అలాగే నాబార్డ్, సాస్కీ, ఇతర నిధుల ద్వారా మరో రూ.2,000 కోట్లతో పనులు చేపట్టనున్నారు. రోడ్లు, రవాణా రంగాలకు అత్యంత ప్రాధాన్యత:గ్రామాలను పట్టణాలతో అనుసంధానించేలా పటిష్టమైన రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. ఇందులో భాగంగా రూ.2,700 కోట్ల వ్యయంతో సుమారు 6,000 కిలోమీటర్ల మేర నూతనంగా సిసి రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. అలాగే రవాణా సౌకర్యాలను మెరుగుపరిచేందుకు రూ.7,550 కోట్ల భారీ వ్యయంతో 9,500 కిలోమీటర్ల మేర బిటి రోడ్ల పనులను ముమ్మరం చేయనున్నారు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో రవాణా మరింత సులువు కానుంది.

రైతులకు, ఉద్యాన రంగానికి పెద్దపీట:వ్యవసాయం, పాడి పరిశ్రమను నమ్ముకున్న రైతులకు భరోసా కల్పించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. పాడి రైతుల సంక్షేమం కోసం రూ.300 కోట్ల వ్యయంతో సుమారు 22,000 మిని గోకులాల (పశువుల షెడ్లు) నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అంతేకాకుండా, ఉద్యానవన రంగాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో రూ.225 కోట్ల వ్యయంతో ఉద్యానవన శాఖ ద్వారా 50,000 ఎకరాల్లో సరికొత్త తోటల పెంపకాన్ని చేపట్టనున్నారు.

**మెరుగైన మురుగునీటి పారుదల, గ్రామాల్లో వసతులు:**

గ్రామాల్లో పరిశుభ్రతను కాపాడేందుకు రూ.110 కోట్ల వ్యయంతో 1,000 కిలోమీటర్ల మేర మేజిక్ డ్రెయిన్ల (మురుగునీటి కాలువలు) నిర్మాణ పనులు చేపట్టనున్నారు. వీటితో పాటు గ్రామ పంచాయతీ భవనాలు, బస్ షెల్టర్లు, రచ్చబండలు తదితర ప్రజా అవసరాల నిర్మాణాల కోసం రూ.200 కోట్లను కేటాయించారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ పనులు సాగనున్నాయి.

**విజయవంతమైన ప్రస్థానం :**

ఇప్పటికే 'పల్లె పండుగ 1.0' కింద పంచాయతీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా 4 వేల కి.మీ సిసి రోడ్లు, 22,514 పశువుల షెడ్లు, 21,000 వ్యవసాయ పంట కుంటలు, 64 వేల ఎకరాల్లో ఉద్యాన పంటల పెంపకాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. అలాగే 'పల్లె పండుగ 2.0' ద్వారా 2,500 కి.మీ సీసీ రోడ్లు, 8,300 కి.మీ బిటి రోడ్లు, 15,750 పశువుల షెడ్లు, 15,500 పశువుల నీటి తొట్టెలు, 86 వేల వ్యవసాయ కుంటలు, 82 వేల వ్యక్తిగత సోక్ పిట్లు, 32 కి.మీ మేజిక్ డ్రెయిన్ల నిర్మాణాలను చేపట్టి అద్భుతమైన ఫలితాలను సాధించారు. ఈ స్ఫూర్తితోనే ఇప్పుడు మరింత భారీ స్థాయిలో 'పల్లె పండుగ 3.0'ను ప్రభుత్వం అమలు చేస్తోంది.

# సర్జికల్ స్ట్రైక్‌కు పదేళ్లు

>> యంలో అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ విధానాన్ని కూడా ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. దేశ జనాభా, సామాజిక, ఆర్థిక పరిస్థితులకు సంబంధించిన సమాచార సేకరణలో పౌరుల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు.

**అశోక్ సింఘాల్‌కు నివాళి:**

మన్ కీ బాత్‌లో ప్రధాని మోడీ ప్రముఖ సామాజిక నాయకుడు, విశ్వ హిందూ పరిషత్ మాజీ నేత అశోక్ సింఘాల్‌ను కూడా గుర్తు చేసుకున్నారు. 1926 సెప్టెంబర్ 27న ఆగ్రాలో జన్మించిన సింఘాల్ శతజయంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పించారు. సింఘాల్ సమాజంలో ఉంటూనే తపస్వి జీవితం గడిపారని మోడీ పేర్కొన్నారు. రామ జన్మభూమి ఉద్యమానికి ఆయన దిశ, ఉత్సాహం అందించారని తెలిపారు.

**మొధేరా సూర్య దేవాలయానికి వెయ్యేళ్ల చరిత్ర:**

గుజరాత్‌లోని మొధేరా సూర్య దేవాలయం చరిత్రను కూడా ప్రధాని ప్రస్తావించారు. 1025లో రాజు భీమదేవుడు ఈ ఆలయాన్ని నిర్మించారని పేర్కొన్నారు. చారిత్రక వారసత్వంతో పాటు మొధేరా ప్రస్తుతం దేశంలో తొలి 'సోలార్ విలేజ్'గా కూడా గుర్తింపు పొందిందని మోడీ తెలిపారు. గత చరిత్రతో ఆధునిక సాంకేతికతను అనుసంధానం చేయడాన్ని ఆయన ప్రస్తావించారు.

**పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం:**

దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలు చేపడుతున్న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను ప్రధాని మోడీ ప్రశంసించారు. అసోంలో ప్రకృతి పరిరక్షణ చర్యల ద్వారా స్థానికంగా సానుకూల మార్పులు చోటుచేసుకుంటున్నాయని ఆయన వివరించారు. అలాగే పశ్చిమ బెంగాల్‌లోని సుందర్‌బన్స్‌లో ఝూర్ఖాలి ప్రాంత మహిళలు మాంగ్రూవ్ అడవులను అభివృద్ధి చేస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. వీరిలో కొందరు పులి దాడుల్లో భర్తలను కోల్పోయిన మహిళలు ఉన్నారని తెలిపారు. మహిళలు పెంచుతున్న మాంగ్రూవ్ చెట్లు గ్రామాలకు సహజ రక్షణ కవచంగా మారడంతో పాటు వారికి ఆదాయ వనరుగా కూడా ఉపయోగపడుతున్నాయని ప్రధాని పేర్కొన్నారు. దీనిని పర్యావరణ పరిరక్షణ, మహిళా సాధికారతకు అనుసంధానమైన ప్రయత్నంగా వివరించారు.

**'నషా ముక్త్ యువ అభియాన్'పై ప్రస్తావన:**

యువతలో మాదకద్రవ్యాల వినియోగాన్ని తగ్గించేందుకు జరుగుతున్న 'నషా ముక్త్ యువ అభియాన్' గురించి కూడా మోడీ మాట్లాడారు. లక్షలాది మంది యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేయడంతో పాటు, ఈ సందేశాన్ని ఇతరులకు చేరవేసే బాధ్యతను కూడా తీసుకున్నారని ఆయన తెలిపారు.

**గ్రామీణ ప్రాంతాల హాకీ ప్రతిభకు కొత్త వేదిక:**

క్రీడల అంశంలో రాజిందర్ సింగ్ సీనియర్ చేస్తున్న ప్రయత్నాలను ప్రధాని ప్రస్తావించారు. గ్రామాలు, చిన్న పట్టణాల్లో ఉన్న హాకీ ప్రతిభను గుర్తించి వారికి శిక్షణ అందించడంలో ఆయన చేస్తున్న కృషిని మోడీ అభినందించారు. దేశం క్రీడల్లో మరింత మెరుగ్గా రాణించాలంటే గ్రామాలు, పట్టణాల వరకు వెళ్లి ప్రతిభను గుర్తించడం అవసరమని ప్రధాని అన్నారు. సరైన శిక్షణ, అవకాశాలు లభిస్తే గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా గొప్ప క్రీడాకారులు వెలుగులోకి వస్తారని పేర్కొన్నారు.



భారీ వర్షాలతో నీటమునిగిన బ్యాంకాక్.. చెరువును తలపిస్తున్న విమానాశ్రయం

# పదోన్నతులకు గ్రీన్‌సిగ్నల్!

>> చేశారు. నిరసనకు పోలీసులు అనుమతి నిరాకరించినా.. పెద్ద సంఖ్యలో ఉద్యోగులు తరలి రావటంతో పోలీసులు వారిని ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. ఈ సమయంలోనే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

**4 కేటగిరీల ఉద్యోగులకు ప్రమోషన్లు:**

స్వర్ణ వార్డు ఉద్యోగులకు పదోన్నతులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మొత్తం నాలుగు కేటగిరీల ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించేందుకు అనుమతి మంజూరు చేసినట్లు మంత్రి నారాయణ వెల్లడించారు. తాజా ప్రభుత్వం నిర్ణయం ద్వారా మొత్తం నాలుగు కేటగిరీల్లో కలిసి 1630 మంది ఉద్యోగులకు లబ్ధిచేకూరనుంది. ముందుగా రెండు కేటగిరీలకు ప్రమోషన్ అవకాశాలు దక్కనున్నాయి. ఇందులో భాగంగా 815 జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. గ్రేడ్2 స్థాయిలో ఉన్న 815 పోస్టులను ప్రభుత్వం గ్రేడ్1కు అప్‌గ్రేడ్ చేసింది. ఈ ప్రక్రియలో ముందుగా వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలకు ప్రమోషన్లు కల్పిస్తారు. వారి ప్రమోషన్ల ద్వారా ఖాళీ అయ్యే పోస్టుల్లో.. డేటాప్రాసెసింగ్ సెక్రటరీలకు పదోన్నతి కల్పిస్తామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. మొత్తం నాలుగు కేటగిరీల ఉద్యోగులకు ప్రమోషన్లకు అనుమతి లభించగా, అందులో మిగిలిన మరో రెండు కేటగిరీల ఉద్యోగుల ప్రమోషన్లపై కూడా త్వరలోనే స్పష్టమైన నిబంధనలు జారీ చేస్తామని మంత్రి నారాయణ ప్రకటించారు. తాజాగా ప్రభుత్వ నిర్ణయంతో స్వర్ణ వార్డు ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# గుండెపోటుతో సిఐ మృతి

>> సమయంలో ఆయనకు హఠాత్తుగా ఛాతీలో నొప్పి రావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. వెంటనే అప్రమత్తమైన సహచర సిబ్బంది, ఇతర అధికారులు ఆయనను హుటాహుటిన విజయవాడలోని ఆంధ్రా హాస్పిటల్ కు తరలించారు. అత్యవసర విభాగంలో వైద్యులు ఆయనకు తక్షణ చికిత్స అందించేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. అయితే, అప్పటికే ఆయన పరిస్థితి విషమించడంతో చికిత్స ఫలించక తుదిశ్వాస విడిచారు. విధి నిర్వహణలోనే ఒక సమర్థుడైన అధికారి ప్రాణాలు కోల్పోవడం పోలీసు వర్గాలను తీవ్రంగాకలిచివేసింది. సీఐ అలీ మరణవార్త తెలియగానే ఆయన కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఆయనతో కలిసి పనిచేసిన సహచర అధికారులు, సిబ్బంది ఈ ఘటనతో దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆయన మృతి పట్ల పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. అంకితభావంతో పనిచేసే అధికారిని కోల్పోయామని సహచరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**సిఐ మృతి పట్ల హోం మంత్రి దిగ్భ్రాంతి**

విజయవాడ నున్న పోలీస్ స్టేషన్ సిఐ అహ్మద్ అలీ గారి ఆకస్మిక మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి హోం మంత్రి వంగలపూడి అనిత వ్యక్తం చేసారు.ఈ మేరకు అనిత ఒక ప్రకటన విడుదల చేసారు.విధి నిర్వహణలో ఉండగానే అస్వస్థతకు గురై మృతి చెందడం అత్యంత విషాదకరమన్నారు.ప్రజల భద్రత కోసం నిరంతరం సేవలందించే పోలీసు కుటుంబంలో ఒక సమర్థవంతమైన అధికారి అహ్మద్ అలీని కోల్పోవడం బాధాకరమని వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు.ఆయన మరణ వార్త విని దిగ్భ్రాంతికి గురయ్యానన్నారు. అహ్మద్ అలీ గారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.ఈ విషాద సమయంలో ప్రభుత్వం వారి కుటుంబానికి అండగా ఉంటుంది అన్నారు.

# కాగితరహిత సేవలు!

>> అమలు ఏ దశలో ఉందో ఎప్పటికప్పుడు తెలుసుకునేలా ఈ విధానాన్ని రూపొందించారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న నేపథ్యంలో వైద్యారోగ్యశాఖ దీనికి రూపకల్పన చేసింది. ప్రస్తుతం వినతుల స్వీకరణ, వాటిపై తీసుకున్న చర్యలు, పరిష్కార స్థితికి సంబంధించిన సమాచారం సంతృప్తికరంగా అందుబాటులో లేకపోవడంతో విస్తృత ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ కొత్త విధానానికి మంత్రి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ శాఖల్లో ఇదే తొలిసారి. ఈ విధానంలో వివిధ వర్గాల వారు, ప్రజా ప్రతినిధుల నుంచి వచ్చే వినతులపై శాఖపరమైన తీసుకునే చర్యలను నిశితంగా పోర్టల్ ద్వారా మంత్రి, కార్యదర్శి, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, ఇతర హెచ్‌ఓడిలు ఎప్పటికప్పుడు అని స్థాయిల్లో తెలుసుకునేలా లాగిన్ సౌకర్యం కల్పించనున్నారు అలర్ట్ మెసేజ్‌లు కూడా ఇందులో ఉంటాయి. ఈ పోర్టల్ ద్వారా భవిష్యత్తులో మరికొన్ని సదుపాయాలు అందుబాటులోనికి రానున్నాయి. ఎంఎంఎట్రిక్స్ అంటే మంత్రి పర్యవేక్షణలో వినతులపై తీసుకునే చర్యలను నమోదు చేసి, వాటి పురోగతిని పర్యవేక్షించే విధానం. ఇది ఈ-ఆఫీస్‌కు ప్రత్యామ్నాయం కాదు. ఇ-ఆఫీస్ అధికారిక దస్త్ర ప్రక్రియగా కొనసాగుతుంది. ఆ దస్త్రంపై చర్యల పురోగతిని ఎంఎంఎట్రిక్స్‌లో పర్యవేక్షి స్తారు. ప్రతి అర్జీకి ఎంఎంఎట్రిక్స్ గుర్తింపు సంఖ్య, ఈ-ఆఫీస్ స్వీకరణ సంఖ్య, ఈ-ఆఫీస్ దస్త్ర సంఖ్యఉంటాయి. అర్జీ అందిన రోజే దాన్ని నమోదు చేస్తారు. అందిన తేదీ, ఎవరి ద్వారా వచ్చింది, మంత్రి చేసిన వ్యాఖ్యలు, అర్జీ రకం, ప్రాధాన్యత తదితర వివరాలతో పాటు అర్జీదారు లేదా ప్రజాప్రతినిధి, ఉద్యోగి తదితర వర్గాల్లో ఎవరి ద్వారా వినతి వచ్చిందో నమోదు చేస్తారు. కార్యదర్శి అర్జీని పరిశీలించి సంబంధిత శాఖకు పంపుతారు. తీసుకోవాల్సిన చర్యను స్పష్టంగా పేర్కొని, ప్రాధాన్యతను బట్టి గడువు నిర్ణయిస్తారు. సాధారణంగా 10 పనిదినాల గడువును వ్యవస్థ సూచిస్తుంది. వెంటనే పంపలేని అర్జీలకు కారణాన్ని నమోదు చేసి కార్యదర్శి వద్ద ఉంచే అవకాశం ఉంటుంది. సంబంధిత శాఖ అర్జీని స్వీకరించినట్లు నమోదు చేస్తుంది. దరఖాస్తుదారుకు స్వీకరణ పత్రం జారీ చేస్తుంది. పత్రం తయారీ, ఆమోదం, పంపిన వివరాలు కూడా వ్యవస్థలో నమోదవుతాయి.శాఖాధిపతి అర్జీని సంబంధిత అధికారికి అప్పగిస్తారు. అధికారి అవసరమైన చర్యలు తీసుకుని చర్యల నివేదిక సమర్పించాలి. తీసుకున్న చర్యలు, జారీ చేసిన ఉత్తర్వులు, సంబంధిత పత్రాలు, ప్రస్తుత పరిస్థితితోపాటు ఆధారాలను జత చేయాలి.

**లోపాలుంటే తిరిగి.. సరిచేసి మళ్లీ నివేదిక:**

నివేదికలో సమాచారం లోపిస్తే శాఖాధిపతి దాన్ని తిరిగి పంపుతారు. లోపాలను సరిచేసి అధికారి మళ్లీ నివేదిక సమర్పించాలి. గత నివేదికలు, వ్యాఖ్యలు కూడా రికార్డులో ఉంటాయి.పరిశీలించిన తర్వాతే పరిష్కారం. నివేదిక సమర్పించినంత మాత్రాన అర్జీ పరిష్కారమైనట్లు కాదు. సంబంధిత ఉన్నతాధికారి నివేదిక, ఆధారాలను పరిశీలించి సమస్య పరిష్కారమైనట్లు నిర్ధారించిన తర్వాతే పరిష్కరించినదిగా నమోదు చేస్తారు. లోపాలుంటే మళ్లీ చర్య కోసం పంపిస్తారు.

దరఖాస్తుదారుకు కేసును పరిశీలించిన తర్వాత కార్యదర్శి ముగింపు కారణాన్ని నమోదు చేసి మూసివేస్తారు. సంబంధిత శాఖ తీసుకున్న చర్యలు, పరిష్కార విధానాన్ని దరఖాస్తుదారుకు తెలియజేస్తుంది. ప్రజాప్రతినిధులు ఇచ్చిన వినతులపై తీసుకున్న చర్యల వివరాలను కూడా వారికి తెలియజేస్తారు.

**మంత్రి సమీక్ష ఆదేశాల అమలు పై కూడా పర్యవేక్షణ:**

మంత్రి సమీక్ష సమావేశాల్లో ఇచ్చే ఆదేశాలను కూడా సమీక్ష చర్యల నమోదు విభాగంలో నమోదు చేస్తారు. బాధ్యత వహించే అధికారి, గడువు, తీసుకున్న చర్యలను నమోదు చేసి, గడువు దాటిన అంశాలను ప్రత్యేకంగా గుర్తిస్తారు. తదుపరి సమీక్షలో వాటి పురోగతిని పరిశీలించవచ్చు.డ్యాష్‌బోర్డు ద్వారా పెండింగ్‌లో ఉన్న అర్జీలు, వివిధ శాఖల్లో ప్రక్రియలో ఉన్నవి, మంత్రి స్థాయిలో పరిశీలించాల్సిన అంశాలను ఒకేచోట చూడవచ్చు. ఎంఎంఎట్రిక్స్ గుర్తింపు సంఖ్య, వినతిపత్రం సంఖ్య, ఈఆఫీస్ స్వీకరణ సంఖ్య, దస్త్ర సంఖ్య, అంశం, దరఖాస్తుదారు, జిల్లా, నియోజకవర్గం వంటి వివరాలతో అర్జీని వెతకవచ్చు. ఎవరు, ఎప్పుడు ఏ చర్య తీసుకున్నారన్న వివరాలతో దాని పూర్తి చరిత్రను చూడవచ్చు. అర్జీ ఇచ్చిన తర్వాత దాని పరిస్థితి తెలుసుకోవడానికి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం తగ్గుతుంది. అర్జీ ఎవరి వద్ద ఉందో, ఏ చర్య తీసుకున్నారో, గడువు ఎంత ఉందో తెలుసుకునే అవకాశం ఉంటుంది. తీసుకున్న చర్యలకు ఆధారాలు ఉండటంతో ప్రక్రియలో స్పష్టత పెరుగుతుంది.

# ఆంధ్ర వంటకాలు అద్భుతహో

>> ఘుమఘుమలాడే సాంప్రదాయ ఆంధ్ర వంటకాలను ఇన్ఫ్లుయెన్సర్లకు రుచి చూపించి, మన వంటకాల గొప్పతనాన్ని వారికి వివరించారు. ఈ సందర్భంగా వారు భోజనాలు అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. ఉమ్మడి గోదావరి జిల్లా ప్రసిద్ధ మిఠాయి అయిన పూతరేకులను మంత్రి కందుల దుర్గేష్ స్వయంగా తన చేతులతో తయారు చేసి, వారికి వడ్డించడం అందరినీ ఆకట్టుకుంది. రాష్ట్రంలో ప్రాచుర్యానికి నోచుకోని అనేక సుందరమైన పర్యాటక ప్రాంతాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఇన్ఫ్లుయెన్సర్లకు మంత్రి దుర్గేష్ సూచించారు. ఈ వేడుకల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సెల్ఫీ పాయింట్ వద్ద మంత్రి దుర్గేష్, అధికారులు, ఇన్ఫ్లుయెన్సర్లు ఉత్సాహంగా ఫోటోలు దిగి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ స్పెషల్ సిఎస్ ఎస్.ఎస్. రావత్,టూరిజం ఎండీ పట్టాన్ శెట్టి రవి సుభాష్, తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, అసిస్టెంట్ కలెక్టర్ ఆదిత్య శర్మ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# సహాయక చర్యలు వేగవంతం చేయండి

>> జరిగిన నష్టాన్ని క్షేత్రస్థాయిలో నమోదు చేసి, ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగకుండా పూర్తి వివరాలతో నివేదికలను సత్వరమే ప్రభుత్వానికి సమర్పించాలని దిశా నిర్దేశం చేశారు.

**జల్లూరు కల్వర్టు వద్ద రాకపోకలు సాధారణం:**

జల్లూరు కల్వర్టు వద్ద భారీ వర్షాల కారణంగా పెరిగిన నీటి ప్రవాహం, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితిని రోడ్లు-భవనాల శాఖ అధికారులు పవన్ కళ్యాణ్ గారికి వివరించారు. కల్వర్టుపై నీటి మట్టం గణనీయంగా తగ్గిందని, ఇప్పటికే అమర్చిన పైపుల భాగం సురక్షితంగా ఉందని, ప్రస్తుతం వాహన రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేదని అధికారులు పవన్ కళ్యాణ్ తెలిపారు. జల్లూరు కల్వర్టు నిర్మాణంలో మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రివర్యులు ఆదేశించారు. కల్వర్టు పరిసర ప్రాంతాలతో పాటు సుద్దవాగు వంతెన అప్రోచ్ రోడ్డు, తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న ఇతర రహదారులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన మరమ్మతులు, పునరుద్ధరణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలన్నారు. ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

**సుద్దగడ్డ వాగు వంతెన అప్రోచ్ రోడ్డుకు మరమ్మతులు:**

సుద్దగడ్డ వాగు వంతెన, అప్రోచ్ రోడ్డును సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిస్థితిని పవన్ దృష్టికి తీసుకువచ్చారు. భారీ వర్షాల కారణంగా వంతెన పరిసర ప్రాంతాలు నీటమునిగిన నేపథ్యంలో అప్రోచ్ రోడ్డులో స్వల్ప స్థాయిలో సెటిల్మెంట్ క్రాక్ఏర్పడినట్లు అధికారులు తెలిపారు. లోపాన్ని గుర్తించిన వెంటనే ఇంజనీరింగ్ అధికారులు స్పందించి అవసరమైన మరమ్మతులు చేపట్టి పూర్తిగా సరిదిద్దినట్లు వివరించారు. ప్రస్తుతం సుద్దవాగు వంతెన, అప్రోచ్ రోడ్డు సురక్షితంగా ఉన్నాయని, ప్రజల రాకపోకలకు ఎటువంటి ఇబ్బంది లేదని తెలిపారు. ఈ పని డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్‌లో ఉన్నందున నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. అదేవిధంగా జల్లూరు కల్వర్టు, సుద్దగడ్డ వాగు వంతెన అప్రోచ్ రోడ్డు సహా తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న ఇతర రహదారుల పరిస్థితిని కూడా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నట్లు అధికారులు పవన్ కళ్యాణ్ వివరించారు. ఈ నేపథ్యంలో దెబ్బతిన్నరహదారులు, కల్వర్టులు, అప్రోచ్ రోడ్లను వెంటనే పరిశీలించి అవసరమైన మరమ్మతులు, పునరుద్ధరణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని పవన్ కళ్యాణ్ రోడ్లు-భవనాల శాఖ అధికారులను సూచించారు. ప్రజల రాకపోకలకు ఎటువంటిఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు.

**విద్యుత్ సరఫరా పూర్తిగా పునరుద్ధరణ:**

భారీ వర్షాలు, ఈదురుగాలుల కారణంగా దెబ్బతిన్న విద్యుత్ లైన్లు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల పరిస్థితిని విద్యుత్ శాఖ అధికారులు పవన్ కళ్యాణ్ వివరించారు. విద్యుత్ సరఫరాకు ఏర్పడిన అంతరాయాన్ని తొలగించేందుకు చేపట్టిన చర్యలను వివరించారు. అధికారులు అందించిన వివరాలపై స్పందించిన పవన్ దెబ్బతిన్న విద్యుత్ లైన్ల మరమ్మతులు, కూలిన స్తంభాల పునరుద్ధరణ, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, అవసరమైన చోట్ల కొత్త పరికరాల ఏర్పాటు వంటి పనులను అత్యవసర ప్రాతిపదికన పూర్తి చేసి, ప్రజలకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. గత రెండు రోజులుగా మీ సూచనల మేరకు చేపట్టిన చర్యలతో ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా సాధారణ స్థితికి చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. భవిష్యత్తులో తుపానులు, భారీ వర్షాల సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, విద్యుత్ మౌలిక వసతుల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు.

**వరద బాధిత కుటుంబాలకు ఆహారం, తాగు నీరు:**

వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపడుతున్న సహాయక చర్యలను గొల్లప్రోలు మున్సిపల్ అధికారులు పవన్ తెలియజేశారు. వరద ప్రభావిత కుటుంబాలను గుర్తించి వారికి ఆహారం, తాగునీరు, ఇతర అత్యవసర సౌకర్యాలు అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. వరద ప్రభావిత కుటుంబాలకు తక్షణ సహాయం అందించాలని, ఆహారం, తాగునీటి కొరత లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని స్పష్టంచేశారు.

**గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు ముమ్మరం:**

వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజారోగ్య పరిరక్షణకు చేపడుతున్న చర్యలను జిల్లా పంచాయతీ అధికారులు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి వివరించారు. వర్షపు నీటి నిల్వలు, కూలిపోయిన చెట్లు, గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితిపై తీసుకుంటున్న చర్యలను ఆయనకు తెలియజేశారు. తాగునీటి వనరుల భద్రత కోసం నీటి ట్యాంకులకు క్లోరినేషన్, గ్రామాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు అధికారులు చెప్పారు. వరద ప్రభావిత గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలను మరింత ముమ్మరం చేయాలని ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ ఆదేశించారు.

వర్షపు నీటి నిల్వలున్న చోట డీవాటరింగ్, కూలిన చెట్లను వెంటనే తొలగించడం, తాగునీటి వనరులను సురక్షితంగా ఉంచడంతోపాటు దోమలు, నీటి ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని నిర్దేశించారు. ప్రభావిత ప్రాంతాల్లో ప్రజారోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, వ్యాధుల వ్యాప్తిని నివారించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ప్రజల భద్రత, ఆరోగ్యం, సౌకర్యాలకు ప్రాధాన్యతనిస్తూ గ్రామ పంచాయతీ యంత్రాంగం అప్రమత్తంగా పనిచేయాలన్నారు.

## వారం - వర్జ్యం

28-09-2026, సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్షఋతువు, కృష్ణపక్షం, చిత్త కార్తె
తి. విదియ రా.7.11, న.రేవతి ఉ.10.14
వ.తె.5.14 - ఉ.6.46
దు.ము.12.21 - మ.1.09
రాహు. ఉ.7.30-ఉ.9.00.
శుభ స. ఉ.7.00-ఉ.8.00

## వార్తాఫలం

**మేషం :** బాధ్యతల బరువుకన్నా కొండను మోయడం తేలికని భావిస్తారు. ఉత్తర ప్రత్యుత్తరాలను సాగిస్తారు.

**వృషభం :** ఆదాయ మార్గాలు వృద్ధి చేసుకునే విషయమై దీర్ఘాలోచనలు సాగిస్తారు. ఆస్తి తగాదాలు తీరి లబ్ధిని పొందుతారు.

**మిథునం :** శుభకార్యాలు సానుకూల పడతాయి. వీసా, పాస్ పోర్ట్ వంటి అంశాలు అనుకూలంగా ఉంటాయి.

**కర్కాటకం :** దూరప్రాంత ప్రయాణ సూచన. క్రమ శిక్షణకు అధిక ప్రాముఖ్యతనిస్తారు. ఆనందోత్సాహాలను కలిగి ఉంటారు.

**సింహం :** సంఘ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. రాజకీయ, కళా పారిశ్రామిక రంగాలలోని వారికి అనుకూలం.

**కన్య :** అనుకున్న విధంగా నూతన కార్యక్రమాలను ప్రారంభించ గలుగుతారు. సకుటుంబంగా దైవ దర్శనం చేసుకుంటారు.

**తుల :** నూతన గృహం కొనుగోలు యత్నాలు దాదాపు పూర్తవుతాయి. బంధు వర్గంతో మాటపట్టింపులు ఏర్పడతాయి.

**వృశ్చికం :** భూముల క్రయవిక్రయాలలో స్వల్ప లాభ సూచన. సన్నిహిత వర్గం అందుబాటులో ఉంటారు.

**ధనుస్సు :** నిజం చెప్పి చెడ్డవారవడం కన్నా అబద్ధం చెప్పి మంచివారు అనిపించుకోవడం ఉత్తమం.మానసికవత్తిడి అధికంగాఉంటుంది

**మకరం :** మీ అంచనాలకన్నా మీ ఇంటిలోని వారి ఊహే నిజమవుతుంది. వైఖరిలో స్వల్పమైన మార్పులు చోటు చేసుకుంటాయి.

**కుంభం :** సాంకేతిక విషయాలపైన ఆసక్తిని చూపుతారు. సకుటుంబంగా దైవ దర్శనం చేసుకుంటారు.

**మీనం:** సంతాన విద్యా, విషయాలపైన దృష్టిని కేంద్రీకరిస్తారు. క్రయవిక్రయాలలో స్వల్ప లాభ సూచన. వత్తిడి అధికంగా ఉంటుంది.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

### స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఆందోళన

# 'చలో విజయవాడ ఉద్రిక్తం



ఆదివారంవిజయవాడలో సచివాలయ ఉద్యోగుల ఆందోళనను అడ్డుకుంటున్న పోలీసులు

**విజయవాడ, సెప్టెంబరు 27 ప్రభాతవార్త ప్రతినిధి:** స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల చలో విజయవాడ కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విజయవాడ ధర్నా చౌక్ వద్ద స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు పిలుపును ఇచ్చారు. ఈ ఆందోళనకు అనుమతి లేదని పోలీసులు ప్రకటించారు. అయినప్పటికి ఆదివారం ఉదయం పెద్ద సంఖ్యలో విజయవాడ చేరుకున్నారు. వారు ధర్నా చౌక్‌కు చేరుకుంటున్న క్రమంలో పోలీసు సిబ్బందివారి అడ్డుకున్నారు. దాంతో ఉద్యోగులు ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. ఈ క్రమంలో పోలీసులు వారిని ఎక్కడిక్కడ అడ్డుకున్నారు.పోలీసులతో సచివాలయా ఉద్యోగులు వాగ్వాదానికి దిగారు. తమను ఎక్కడైతే పోలీసులు అడ్డగించారో అక్కడే రోడ్లపై బైఠాయించి ఆందోళనకు దిగారు. వారిని ఆయా ప్రాంతాల నుంచి తరలించే క్రమంలో ఉద్రిక్తతతో కూడిన పరిస్థితులు నెలకొన్నాయి. దాంతో వారిని పోలీసులు బలవంతంగా సమీప పోలీసు స్టేషన్లకు తరలించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమను పోలీసులు అన్యాయంగా అరెస్టు చేస్తున్నారని ఉద్యోగులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో పోలీసుల కళ్లుగప్పి విజయవాడ అలంకార జంక్షన్‌లోని ధర్నా చౌక్ చేరుకునేందుకు ఉద్యోగులు ప్రయత్నించడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు వారిని చొక్కాలు పట్టుకుని, భుజాలు పట్టుకుని పక్కకు లాగే ప్రయత్నం చేయడంతో పరిస్దితి ఉద్రిక్తతకు దారి తీసింది. తమపై చేతులు వేస్తే సహించమని ఉద్యోగులు పోలీసులను హెచ్చరించారు. రోడ్డుపైనే ఉద్యోగులు నిరసన దిగారు. ఈ పరిణామాల నడుమ ఆందోళన చేస్తున్న ఉద్యోగులను వారు ప్రతిఘటిస్తున్నా పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకుని వాహనాల్లో పోలీస్ స్టేషన్లకు తరలించారు. తమ సమస్యలకు ప్రభుత్వం లిఖితపూర్వక హామీ ఇచ్చే వరకు ఆందోళనలు విరమించేది లేదని ఉద్యోగులు స్పష్టం చేశారు. గత ఏడు సంవత్సరాలుగా సచివాలయ ఉద్యోగులుగా పనిచేస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో ప్రభుత్వ ప్రయోజనాలు అందడం లేదని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే విశాఖపట్నంలో నిరసన కార్యక్రమం నిర్వహించామని, శాంతియుతంగా పోరాడేందుకు అనుమతి కోరినా అధికారులు తాత్సారం చేసి చివరకు నిరాకరించారని ఆరోపించారు.

## సచివాలయ ఉద్యోగుల సంక్షేమంలో పూర్తి సానుకూలం: మంత్రి డిఎస్‌బి.స్వామి

**విజయవాడ,సెప్టెంబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:**సచివాలయఉద్యోగుల సంక్షేమం విషయంలో సంకీర్ణ ప్రభుత్వం పూర్తి సానుకూల రీతిలో ఉందని మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి వెల్లడించారు.సచివాలయ ఉద్యోగుల ఆందోళనపై మంత్రి స్పందించారు. వారికి గతంలో ఇచ్చిన వాగ్దానాలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు. సిబ్బంది రెగ్యులరైజేషన్, వారికి కల్పించాల్సిన సౌకర్యాల విషయంలో ప్రభుత్వం వెనకడుగు వేయదని స్పష్టం చేశారు. ఉద్యోగులకు గతంలో జరగాల్సిన రెగ్యులరైజేషన్‌ను ప్రస్తుత ప్రభుత్వమే అమలు చేసిందని గుర్తుచేశారు. త్వరలో కొత్త పీఆర్సీ కమిషన్ వేయబోతున్నామని తీపి కబురు చెప్పారు. ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు, పదోన్నతుల ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని మంత్రి తెలిపారు. వారి డిమాండ్ మేరకు నోషనల్ ఇంక్రిమెంట్ల దస్త్రం ఆర్థిక శాఖ పరిశీలనకు పంపామని వెల్లడించారు.ఉద్యోగుల సంక్షేమం పట్ల కూటమి ప్రభుత్వం పూర్తి సానుకూలంగా ఉందని స్పష్టంచేశారు. అయితే ఆందోళనల పేరుతో కొందరు రాజకీయ లబ్ధి కోసం ఉద్యోగులను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు.

## నూతన షాదీఖానాను ప్రారంభించిన మంత్రులు

### రూ.2.60 కోట్లతో నిర్మాణం

**బనగానపల్లె, సెప్టెంబరు 27 ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణంలో నూతనంగా నిర్మించిన షాదీఖానాను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఆదివారం ప్రారంభించారు. రూ.2.60 కోట్ల వ్యయంతో నిర్మించిన షాదీఖానాను ముస్లిం సమాజానికి అంకితం చేశారు. షాదీఖానా నిర్మాణానికి మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి తన సొంత నిధుల నుంచి రూ.1.60 కోట్లు వెచ్చించినట్లు కార్యక్రమంలో వెల్లడించారు. అదేవిధంగా మరో రూ.18 లక్షల సొంత నిధులతో వంట పాత్రలు, షామియానాలను సమకూర్చినట్లు తెలిపారు. నూతన షాదీఖానాలో విశాలమైన ఫంక్షన్ హాల్, డైనింగ్ హాల్, వధూవరుల కోసం ప్రత్యేక గదులు, పార్కింగ్ తదితర సౌకర్యాలను ఏర్పాటు చేశారు. దీంతో ముస్లిం కుటుంబాలు వివాహాలు, ఇతర శుభకార్యాలను నిర్వహించుకునేందుకు సౌకర్యం



ఆదివారం షాదీఖానాను ప్రారంభించిన మంత్రులు జనార్ధన్ రెడ్డి, ఫరూక్

కలిగింది. ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న ముస్లిం కుటుంబాల కల నూతన షాదీఖానా ప్రారంభోత్సవంతో సాకారమైందని పలువురు పేర్కొన్నారు. షాదీఖానా ప్రారంభోత్సవం సందర్భంగా బనగానపల్లెలో సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో అధికారులు,ముస్లిం మత పెద్దలు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అన్నమయ్య ప్రాజెక్టుకు ఏమైంది?

>> విషయం తెలుసుకొని పాలకులు అనుసరిస్తున్న వైఖరితో కడగండ్లను చవిచూస్తున్న రైతాంగం వ్యథలపై 'వార్త' అందిస్తున్న ప్రత్యేక కథనం ఇది.

కడప జిల్లా రాజంపేట మండలం బాదన గడ్డ వద్ద చెయ్యేరు నదిపై 24.4.1976న అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు చెయ్యేరు జలాశయాన్ని (ప్రస్తుతం అన్నమయ్య ప్రాజెక్ట 8.23 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించారు. 2.242 టిఎంసిల నీటి నిల్వ సామర్థంతో తలపెట్టిన ఈ ప్రాజెక్టు నిర్మాణం నది అంతర్భాగంలో సొరంగాలు ఉండడంతో స్వదేశీ, విదేశీ నిపుణుల పరిశీలన, నిధుల కొరత లాంటి ఎన్నో సమస్యలను అధిగమించి 2001 నాటికి ప్రాజెక్టు పూర్తయింది. అప్పటి, ప్రస్తుతం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాడు ప్రారంభించారు. అంటే ప్రాజెక్టు ప్రారంభించిన 25 సంవత్సరాలకు ప్రాజెక్టు నిర్మాణం పూర్తయింది. 2003లో ఒకసారి ప్రాజెక్టు గేటు కొట్టుకుపోయింది. 2019లో మరొకసారి మరో గేటు కొట్టుకుపోయింది. 2021 నవంబర్ 19న చెయ్యేరు నదికి భారీగా వరదలు రావడంతో ప్రాజెక్ట్ మట్టికట్ట (ఎర్త్ డ్యామ్) కొట్టుకుపోయి 41 మంది జల సమాధి కూడా అయ్యారు. దీంతో నాటి జగన్ సర్కార్ అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణానికి నిపుణుల కమిటీని నియమించింది. నిపుణులు కమిటీ సూచనల మేరకు అప్పటి ప్రాజెక్టు ఇఇ రవికిరణ్ సారథ్యంలో సమగ్ర అంచనాలు రూపొందించారు. నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతమున్న ప్రాజెక్టు ఐదు గేట్లతో పాటు మరో ఐదు గేట్లు ఏర్పాటు చేయాలని అంచనాలు సిద్ధం చేశారు. ఇదే సందర్భంలో అన్నమయ్య ప్రాజెక్టులో నీటి విలువ సామర్థ్యం 10 టిఎంసిలకు పెంచి కడితే ఎలా ఉంటుందన్న ఆలోచనతో ప్రాథమిక అంచనాలు సిద్ధం చేశాక రూ.1900 కోట్లు దాటింది. దీంతో ఈ అంశాన్ని అప్పుడే పక్కన పెట్టేశారు. ఆ తర్వాత రూ.468 కోట్ల అంచనా వ్యయంతో 2022 మార్చిలో నివేదిక సిద్ధం చేశారు. ఆ తర్వాత అన్నమయ్య పునర్ నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిపుణుల కమిటీని నియమించింది. నిపుణుల కమిటీలో సిడిఓ కేదార్నాథ్ రెడ్డి, హైడ్రాలజీ సిఇ టివిఎన్ఎఆర్ కుమార్, సిఇ సిడిఓఎ శ్రీనివాస్, విశ్రాంత సిఇ హైడ్రాలజీ ఎక్స్పెర్ట్ ఎంఎల్ నరసింహం, తిరుపతి ఐఐటి ప్రొఫెసర్ రోషన్ శ్రీవాత్సవ్, విశ్రాంత చీఫ్ ఇంజనీర్లు ఐఎస్ఎల్ రాజు, డాక్టర్ ఎం. విశ్వేశ్వరయ్య పరిశీలించారు. ఈ నిపుణుల బృందం సిఫారసు మేరకు 2022 జులైలో మరోసారి సమగ్ర అంచనాలు సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు రూ.787.77 కోట్ల అంచనా వ్యయంతో జల వనరుల శాఖ శాఖ అన్నమయ్య పునర్నిర్మాణానికి నివేదిక పంపింది. 5.60 ఆరు లక్షల క్యూసెక్కుల నీటి విడుదల సామర్థ్యంతో ప్రస్తుతం ఉన్న ఐదు గేట్లతో పాటు మరో పదహారు గేట్లు ఏర్పాటు చేయాలని నివేదికల్లో పేర్కొన్నారు. ఈ మేరకు 2022 అక్టోబరులో జగన్ సర్కార్ ప్రాజెక్ట్ పునర్నిర్మాణానికి పరిపాలనపరమైన అనుమతులు మంజూరు చేస్తూ 2075 జీవో జారీ చేసింది. 2022 డిసెంబరు 21న ప్రాజెక్టు పునర్నిర్మాణానికి టెండర్లు పిలవడం జరిగింది. టెండర్లలో హైదరాబాద్ చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ అన్నమయ్య ప్రాజెక్టు పునర్ నిర్మించేందుకు టెండర్ కైవసం చేసుకుంది. ఆ తర్వాత 2023 మే లో ప్రాజెక్టు పునర్ నిర్మాణం కోసం నిర్మాణ సంస్థ ఇన్వెస్టిగేషన్ పనులను ప్రారంభించింది. జూన్‌లో కేంద్ర జల సంఘం అసిస్టెంట్ డైరెక్టర్ నితిన్ కుమార్, సెంట్రల్ డిజైన్స్ ఎక్స్‌ఫర్ట్ రత్నకుమార్, మరో విశ్రాంత చీఫ్ ఇంజనీర్ గిరిధర్ ప్రాజెక్టులు పరిశీలించారు. ఈ నిపుణుల సిఫార్సులతో నీటి విడుదల సామర్థ్యం 8.22 లక్షల క్యూసెక్కులుగా నిర్ణయించి ఈ మేరకు జలవంద్రుల శాఖ హైడ్రాలజీ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. ఆ తర్వాత జగన్ సర్కార్ నిధులు విడుదల చేయకపోవడంతో నిర్మాణ సంస్థ పనులు నిలిపివేసింది. ఇంతలోపు 2024లో ఎన్నికలు రావడం, అధికారం మార్పిడి జరగడం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో యేడాది పాటు అన్నమయ్య ప్రాజెక్టు ప్రస్తావన లేకుండా పోయింది.

**ప్రాజెక్టు పునర్నిర్మాణం బాధ్యత కూటమి ప్రభుత్వానిదే:**

అయితే, 2025 మే 22న కడపలో జరిగిన మహానాడులో అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణం బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. సిఎం ప్రకటించిన 24 గంటల లోపే రాష్ట్ర జల వనరుల శాఖ అధికారుల ఆదేశాలతో పూర్తి సమాచారంతో ఇక్కడి నుంచి జిల్లా అధికారులు తరలి వెళ్లారు. జూన్ 10న అన్నమయ్య పునర్నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిపుణుల కమిటీని నియమిస్తూ జారీ చేసింది నిపుణుల కమిటీలో ప్రస్తా పోలవరం ప్రాజెక్టు అథారిటీ డైరెక్టర్ రమేష్ కుమార్, హైడ్రాలజీ ఎక్స్‌ఫర్ట్ కె.సత్యనారాయణ, విశ్రాంత జియాలజిస్ట్ ఎం.రాజు, సెంట్రల్ డిఎంసి చీఫ్ ఇంజనీరింగ్ నియమించింది. ఈ మేరకు నిపుణుల కమిటీ జులై 13న అన్నమయ్య ప్రాజెక్టును పరిశీలించింది. ఎర్త్ డ్యామ్ నిర్మించిన చోట జియో ఫిజికల్ ఇన్వెస్టిగేషన్ పనులు చేపట్టారు. ఆ తర్వాత నీటి విడుదల సామర్థ్యంపై పలు అనుమానాలు తెరమీదకు రావడంతో చెన్నై ఐఐటి నిపుణుల సహాయంతో పాటు పుణెకు వెళ్లి కూడా నివేదికలు తీసుకున్నారు. ఆ తర్వాత చెన్నై ఐఐటి సంస్థ నిపుణులు 4.11 లక్షల నీటి విడుదల సామర్థ్యంతో తుది నివేదికను అందజేశారు. ఈ కసరత్తు పూర్తయ్యా నాటికి యేడాది పట్టింది. ఈ నివేదిక పరిశీలించిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ, రాష్ట్ర ప్రభుత్వ జలవనరుల శాఖ సలహాదారుడు వెంకటేశ్వర్లు అధ్యక్షతన సమావేశమై ప్రాజెక్టు నీటి విడుదల సామర్థం సామర్థ్యం 4.75 లక్షల నిర్ణయించి అధికారికంగా ఈ ఏడాది జూన్‌లో ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో జూన్ నెలాఖరులో జరిగిన ప్రాజెక్టులను నిర్మాణం పై సిఎం నిర్వహించిన సమావేశంలో ఏం జరిగిందో తెలియదు. కానీ కొద్దిరోజుల్లో పదవీ విరమణ చేసే ఓ ఉన్నతాధికారి అన్నమయ్య పునర్నిర్మాణానికి అంత ఖర్చు ఎందుకని, ఫీజిబిలిటీ లేదని, దానికంటే అన్నమయ్య ప్రాజెక్టుకు కిలోమీటర్ దూరంలో వెళుతున్న గాలేరు నగిరి ప్రధాన కాలువ ద్వారా నీటిని అన్నమయ్య ప్రధాన కాలువకు మళ్ళిస్తే తక్కువ ఖర్చుతో ఆయకట్టుకు నీరు అందించవచ్చని సలహా ఇచ్చారు. దీంతో సిఎం ఈ ప్రతిపాదన పై సమగ్ర నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా ప్రస్తుత ప్రాజెక్టు స్థానంలో కొత్తగా ప్రాజెక్టు కడితే ఎలా ఉంటుందన్న ఆలోచన కూడా వచ్చింది. వెంటనే జియాలజిస్ట్ నిపుణుడు రాజు జులై 15న పరిశీలించి వెళ్లారు. ప్రస్తుత ప్రాజెక్టుకు 1.2 కిలోమీటర్ల దూరంలో నూతన ప్రాజెక్టు కట్టేందుకు అనువైన ప్రదేశాన్ని నిర్ణయించారు. ఇక్కడ నది అంతర్భాగంలో భౌగోళిక పరిస్థితులు ఎలా ఉన్నాయో తెలుసుకునేందుకు పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. కొత్త ప్రాజెక్టుకు ఎంపిక చేసిన స్థలంలో కూడా నదీ గర్భంలో ఎన్ని మీటర్ల వరకు ఇసుక లోతు ఉంది. జియాలజికల్ పరిస్థితులు ఎలా ఉన్నాయి? ప్రాజెక్టు నిర్మాణానికి అనువా లేదా అనే విషయాన్ని ప్రాథమికంగా గుర్తించాల్సి వుంది. ప్రాథమిక సర్వేలో అనువుగా ఉంటేనే తర్వాత చేపట్టే చేపట్టాల్సిన పనులపై ముందుకు వెళ్లే అవకాశం ఉంది. లేదంటే మరలా ప్రస్తుత ప్రాజెక్టును పునర్ నిర్మించడం పైన దృష్టి సారించాల్సిన అవసరం ఏర్పడుతుంది. అందుకే జలవనరుల శాఖ ఉన్నత స్థాయి అధికారుల ఆదేశాల మేరకు సర్వే చేస్తున్నట్లు కడప ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్ బాలచంద్రారెడ్డి 'వార్త' ప్రతినిధికి గత నెల 23న తెలిపారు. నిపుణుల కమిటీ సభ్యుడు రాజు కొత్త ప్రాజెక్టుకు ఎంపిక చేసిన స్థలంలో నదీ గర్భంలో ఎలక్ట్రికల్ రెస్టివిటీ మెథడ్ (ఈఆర్ఎం), ఎలక్ట్రికల్ రెస్టివిటీ టోమోగ్రఫి( ఈఆర్‌టి) పరీక్షలు నిర్వహించారు. ఈఆర్ఎం అంటే భూగర్భ జల అన్వేషణ. భూగర్భ జల వనరులు గుర్తించడం, భూగర్భ జల కాలుష్యాన్ని కనుగొనడం, నిర్మాణానికి ముందు భూగర్భ శిలలలోతు, బలాన్ని తనిఖీ చేయడం, ఈఆర్‌టి అంటే బలహీనమైన రాతి ప్రాంతాలను గుర్తించడం, నిర్మాణానికి ముందు నేల స్థిరత్వాన్ని పరీక్షి ంచడం, ఒక విధంగా చెప్పాలంటే సిటీ స్కాన్ లాగా భూగర్భంలో పరిస్థితులను స్కాన్ చేయడం. ఈ రెండు పద్ధతుల ద్వారా సర్వే జరిగిన తర్వాత నిర్దేశించిన నదీ గర్భంలో ప్రాజెక్టు నిర్మాణానికి అనువుగా ఉందా లేదా అనే విషయం ప్రాథమికంగా నిర్దిష్టమైన అంచనాకు రావచ్చు. ఈ పరీక్షల ఫలితాలు వెలుడైన తర్వాత ఏం చేయాలో నిపుణులు నిర్ణయిస్తారు. అనుకూల ఫలితాలు వచ్చినట్లయితే బోర్ డ్రిల్లింగ్ ద్వారా పనులు చేపడతారు. తద్వారా ప్రాజెక్టు నిర్మాణానికి ఎలాంటి ఫౌండేషన్లు అవసరమో నిర్ణయిస్తారు. ఈ మేరకు 15 రోజుల క్రితం టెస్టింగ్ పనులు చేపట్టారు. మరలా తాజాగా టెస్టింగ్ పనులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అన్నమయ్య పాట పునర్ నిర్మాణం కోసం నియమించిన నిపుణుల కమిటీ ఐదేళ్లపాటు అటు జగన్ సర్కార్ హయాంలోనూ ఇటు చంద్రబాబు హయాంలోనూ చెప్పిన నివేదికలు ఏమయ్యాయి. రూ.468 కోట్ల అంచనాల నుంచి అకస్మాత్తుగా రూ.787 కోట్లకు అంచనాలు ఎలా పెరిగాయి. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో ఒక కొత్త ప్రాజెక్టు కట్టడం సాధ్యమేనా? ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర అటవీ శాఖ అనుమతులు అవసరం. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టును పక్కనపెట్టి కొత్త పాయింట్లు కట్టడం ఆషామాషీ కాదు ఉన్న ప్రాజెక్టును పునర్ నిర్మించేందుకే కేంద్రం నిధుల కోసమో, ప్రపంచ బ్యాంకు నిధుల కోసం ఆధారపడే పరిస్థితి ఉన్న నేపథ్యంలో ఎందుకు ఇలా పాలకులు వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదు. అన్నమయ్య ప్రాజెక్టు కింద 9500 ఎకరాల వాణిజ్య పంటలు సాగవుతున్నాయి. ప్రతియేటా రూ.150 కోట్లకు పైబడి వాణిజ్య పంటల ద్వారా జరుగుతున్న ఉత్పత్తులు రాష్ట్ర జిడిపికి ఎంత దోహదం చేస్తుందో తెలియనిది కాదు. పక్కా ప్రణాళికతో కట్టిన ఒక ప్రాజెక్టును పక్కన పెట్టాలనుకోవడం, ఐదేళ్లపాటు చేసిన అధ్యయనాలు పక్కన పెట్టడం, రైతుల జీవితాలతో చెలగాటడం ఆడటం కాదా? ఇకనైనా కూటమి సర్కార్ 22,500 ఎకరాలకు సాగునీరు అందించే అన్నమయ్య పునర్నిర్మాణం పట్ల త్వరితగతిన నిర్ణయం తీసుకొని రైతుల కడగళ్ళు తీర్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# రైతుల చూపు పామాయిల్ సాగువైపు

### ఉచిత మొక్కలు, ఎరువుల సాయం, మార్కెట్‌కు భరోసా కల్పిస్తున్న ప్రభుత్వం



**నూజివీడు, సెప్టెంబరు27 ప్రభాతవార్త:** పామాయిల్ సాగు రైతులకు క్రమంగా సిరులు కురిపిస్తోంది. నెలనెలా ఆదాయం, గిట్టుబాటు ధర, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, మార్కెట్ భరోసాతో రైతులు పామాయిల్ సాగువైపు ఆసక్తి చూపుతున్నారు. ఏలూరు జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే సుమారు 1.35 లక్షల ఎకరాల్లో పామాయిల్ తోటలు విస్తరించగా, 2025-26లో మరో 14 వేల హెక్టార్లలో సాగు విస్తరణకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. పామాయిల్ సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఉచిత మొక్కలతో పాటు రాయితీలు, ఎరువుల సాయం అందిస్తోంది. దీంతో తోటల ఏర్పాటులో రైతులపై పెట్టుబడి భారం కొంత తగ్గుతోంది. ప్రతి మండలంలో మార్కెటింగ్ సౌకర్యం ఉండటం, పామాయిల్ గెలల కొనుగోలుకు వ్యవస్థ అందుబాటులో ఉండటంతో రైతుల్లో నమ్మకం పెరుగుతోంది. మామిడి, మొక్కజొన్న, మిర్చి, పొగాకు వంటి పంటల్లో సీజన్‌కు అనుగుణంగా ఆదాయం లభిస్తుండగా, పామాయిల్ తోటల్లో కాపు వచ్చిన తర్వాత క్రమం తప్పకుండా గెలలు కోసి విక్రయించే అవకాశంఉంటుంది. దీంతో రైతులకు నెలనెలానగదు ఆదాయం సమకూరు తోంది.

**టన్నుకు రూ.24 వేలకుపైగా:** ప్రస్తుతం పామాయిల్ గెలలకు టన్నుకు రూ.24 వేలకుపైగా ధర లభిస్తుండటంతో రైతుల్లో ఆసక్తి మరింత పెరి గింది. మార్కెట్ సౌకర్యం, ప్రభుత్వ సహకారం కలిసి రావడంతో పామాయిల్ సాగు విస్తీర్ణం పెరుగుతోంది.

**మామిడిని తొలగించి.. పామాయిల్ వైపు:** నూజివీడు డివిజన్‌లో ఒకప్పుడు మామిడి తోటలు ప్రధానంగా ఉండేవి. అయితే పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులు, దిగుబడి-ధరల్లో మార్పుల కారణంగా కొందరు రైతులు మామిడి తోటలను తొలగించి వాటి స్థానంలో పామాయిల్ మొక్కలు నాటుతున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలు, మార్కెట్ భరోసా, నెలనెలా ఆదాయం కారణంగా రానున్న రోజుల్లో సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉందని రైతులు భావిస్తున్నారు.

## ఎల్‌నినోలోనూ 10.40 లక్షల ఎకరాలకు సాగునీరు: మంత్రి నిమ్మల

**పాలకొల్లు, సెప్టెంబరు 27 ప్రభాతవార్త:** రైతుల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డా. నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు రూరల్, వరిధనం గ్రామాల్లో రూ.1.98 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆదివారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పుంత రహదారులు, తట్ట కంకర రోడ్ల వంటి ప్రాథమిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ధాన్యం కొనుగోలు అనంతరం 48 గంటల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమయ్యేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఉన్నప్పటికీ ఉభయ గోదావరి జిల్లాల్లో 10.40 లక్షల ఎకరాలకు సాగునీరు అందించగలిగామని మంత్రి తెలిపారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చ డం, రైతు కుటుంబాల ఆర్థికాభివృద్ధికి తోడ్ప డటమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గ్రామీణ రహదారుల అభివృద్ధితో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. రైతు సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.



పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

## నారాయణ ఎంబిఎలో ప్రభంజన్-2026 విజయ ప్రభంజనం

### 36 కళాశాలలు..1,850 మంది విద్యార్థులతో 8వ ఎడిషన్ ఘన విజయం

**హైదరాబాద్,సెప్టెంబరు27,ప్రభాతవార్త:** మేనేజ్‌మెంట్ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభకు జాతీయ స్థాయి వేదికను కల్పిస్తూ, నారాయణ ఇంజనీరింగ్ కళాశాల (స్వయం ప్రతిపత్తి) ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిష్ఠాత్మక జాతీయ స్థాయి మేనేజ్మెంట్ ఫెస్ట్ ప్రభంజన్-2026 ఘన విజయాన్ని సాధించింది. నారాయణ ఇంజనీరింగ్ కాలేజీ నెల్లూరు, కళాశాల సీబ్లాక్ ఆడిటోరియంలో జరిగిన 8వ ఎడిషన్ కు తెలుగు రాష్ట్రాలతో పాటు చెన్నై బెంగళూరు నుంచి కళాశాలలకు చెందిన సుమారు 150 మంది విద్యార్థులు తరలివచ్చి వివిధ మేనేజ్ మెంట్ పోటీల్లో తమ ప్రతిభను చాటారు.గత ఎడిషన్ల విజయ పరంపరను కొనసాగిస్తూ నిర్వహించిన ఈ మెగా ఫెస్ట్ విద్యార్థుల్లోని మేనేజీరియల్ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు సృజనాత్మక ఆలోచన విశ్లేషణాత్మక దృక్పథం, కమ్యూనికేషన్ సామర్థ్యాలను వెలికితీసే వేదికగా నిలిచింది. ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో బీస్మార్ట్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థులు తమ ఆలోచనలను ఆచరణలోకి తీసుకురావడానికి పోటీతత్వ స్ఫూర్తిని పెంపొందించుకోవడానికి పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలను ప్రదర్శించడానికి దోహదపడింది.




ప్రభంజన్-2026కు విశేష అతిథిగా హాజరైన ప్రముఖ యువ పారిశ్రామికవేత్త హంగర్ ఫ్రీ ఇండియా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, పెప్సీ ఎంటీవీ యూత్ ఐకాన్ శరత్ బాబు మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు, సమస్య పరిష్కార నైపుణ్యం సృజనాత్మక ఆలోచన, సామాజిక బాధ్యతను పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్హతలతో పాటు అవకాశాలను గుర్తించి సద్వినియోగం చేసుకోవడం, నిరంతరం కొత్త విషయాలను నేర్చుకోవడం, సమాజానికి ఉపయోగపడే ఆలోచనలను ఆచరణలోకి తీసుకురావడం ద్వారా యువత తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవచ్చన్నారు. మేనేజ్మెంట్ విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎదురుచూసే స్థాయిని దాటి, ఉద్యోగాలు కల్పించే పారిశ్రామికవేత్తలుగా, సమర్థవంతమైన మేనేజర్లుగా, బాధ్యతాయుతమైన నాయకులుగా ఎదగాలని ఆకాంక్షి ంచారు. నారాయణ గ్రూప్ డైరెక్టర్, ప్రభంజన్ 2026 చీఫ్ ప్యాటన్ శరణి పొంగూరు మాట్లాడుతూ ప్రభంజన్-2026 వేర్ స్పిన్ అండన స్పీడ్ మాటర్స్ అనే నివారం మేనేజ్మెంట్ రంగానికి అనుగుణంగా ఉందన్నారు. భిన్నంగా ఆలోచించడం, కొత్త అవకాశాలను గుర్తించడం, ఆలోచనలను వేగంగా ఆచరణలోకి తీసుకురా వడం యువ మేనేజర్లకు ఎంతో అవసరమన్నారు. తరగతి గది బోధనతో పాటు క్విజ్, ప్రజెంటేషన్, యంగ్ మేనేజర్, న్యూ బిజినెస్ ఇండియా వంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా కమ్యూనికేషన్, నాయకత్వం. టీమ్‌వర్క్ నిర్ణయ సామర్థ్యం, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయన్నారు. నారా యణ ఎంబీఏలో నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమ అనుసంధానం. ఇంటర్న్‌షిప్లు, మెంటారింగ్, ప్లేస్మెంట్ శిక్షణతో పాటు బిజినెస్ అనలిటిక్స్ ఎక్సెల్, ఎస్క్యూఎల్, అధునాతన ఏఐటూల్స్ వంటి ఆధునిక నైపుణ్యాలపై శిక్షణ అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

# 'శత'క్కొట్టారు

### వెస్టిండీస్‌పై భారత్ ఘనవిజయం

### విరాట్ కోహ్లి, శుభ్‌మన్ గిల్ సెంచరీలు



**తిరువనంతపురం, సెప్టెంబరు 27:**వన్డే ప్రపంచకప్ సన్నాహక సిరీస్‌ను భారత జట్టు ఘనంగా మొదలెట్టింది. తిరువనంతపురంలో శివాలెత్తిన విరాట్ కోహ్లి (139 నాటౌట్) వన్డేల్లో 55వశతకంతో రెచ్చిపోగా కెప్టెన్ శుభ్‌మన్ గిల్(110) సెంచరీతో వెస్టిండీస్ బౌలర్ల భరతం పట్టాడు. రెండో వికెట్‌కు 151 పరుగుల భాగస్వామ్యంతో గెలుపు పునాది వేశారిద్దరూ. బౌండరీలతో దడ పుట్టించిన ఈ జోడీ విధ్వంసంతో 296 పరుగుల లక్ష్యం కరిగిపోయింది. విండీస్ నిర్దేశించిన 296 పరుగుల ఛేదనలో ఓపెనర్ రోహిత్ శర్మ(32) ఉన్నంతసేపు ఆకట్టుకున్నాడు. బౌండరీ వద్ద అల్జారీ జోసెఫ్ క్యాచ్ జారవిడవంతో బతికిపోయిన హిట్‌మ్యాన్ పెద్ద స్కోర్ చేయలేదు. అతడు త్వరగా ఔటైనా గిల్ దూకుడైన ఆటతో స్కోర్ బోర్డును ఉరికించాడు. తనదైన షాట్లతో అలరిస్తూ ఈ ఫార్మాట్లో 21వ ఫిఫ్టీ సాధించాడు గిల్. రోహిత్ ఔటయ్యాక విరాట్ కోహ్లి(139 నాటౌట్) జతగా హాఫ్ సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పాడు. అల్జారీ ఓవర్లో సిక్సర్‌తో విరాట్ యాభై పూర్తి చేసుకున్నాడు. రెండో వికెట్‌కు 151 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన ఈ జోడీని విడదీశాడు. గిల్ ఔటయ్యాక మరింత రెచ్చిపోయిన కోహ్లి రోస్టన్ చేజ్ ఓవర్లో కళ్లు చెదిరే సిక్సర్లు బాదాడు. మోతీ ఓవర్లో బంతిని లాంగ్ ఆన్‌లో స్టాండ్స్‌లోకి పంపిన విరాట్ వన్డేల్లో 55వ శతకం అందుకున్నాడు. సెంచరీ తర్వాత భీకరంగా ఆడిన కోహ్లి కార్టీ వేసిన 42వ ఓవర్లో సిక్సర్‌తో మ్యాచ్‌ను ముగించాడు. ఎనిమిది వికెట్ల తేడాతో గెలుపొందిన టీమిండియా మూడు వన్డేల సిరీస్‌లో సూపర్ బోణీ చేసింది.భారత పర్యటన తొలి వన్డేల్లో వెస్టిం డీస్‌కు ఓపెనర్లు శుభారంభమిచ్చారు. తిరువనంతపురంలో జస్టిన్ గ్రీవ్స్ (107), జాన్ క్యాంప్‌బెల్(62)లు ఖతర్నాక్ బ్యాటింగ్‌తో అలరిస్తూ శతక భాగస్వామ్యం నెలకొల్పారు. టీమిండియా బౌలర్లను కాచుకున్ ఈ ద్వయం దూకుడుగా ఆడడంతో విండీస్ స్కోర్‌పరుగులు తీసింది. క్రీజులో పాతుకుపోయిన క్యాంప్‌బెల్‌ను పెవిలియన్ పంపిన కుల్దీప్ యాదవ్(4-40) తొలి వికెట్ అందించాడు. 20వ ఓవర్లో అతడు ఫ్లయిట్ చేసిన రెండో బంతిని స్వీప్ షాట్‌కు ప్రయత్నించిన ఈ లెఫ్ట్ హ్యాండర్ ప్రసిధ్ కృష్ణకుదొరికాడు. దాంతో 135 వద్ద తొలి వికెట్‌పడింది. అనంతరం కేసీ కార్టీ(13), కెప్టెన్ షాయ్ హోప్(12)లు క్రీజులో నిలవలేదు. ఓవైపువికెట్లు పడుతున్నా గ్రీవ్స్ 104 బంతుల్లో 12 ఫోర్లతో తొలి శతకం సాధించాడు. భారత గడ్డపై వంద కొట్టిన 13వ కరీబియన్ బ్యాటర్‌గా రికార్డు సాధించిన అతడిని సైతం కుల్దీప్ బోల్తా కొట్టించాడు.

# ఆడుకుంటూ వెళ్లి తిరిగిరాని లోకాలకు..

### విద్యుత్ తీగ రూపంలో మృత్యువు

### ఇద్దరు చిన్నారుల విషాదాంతం

**నెల్లూరు క్రైమ్, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:** అమ్మానాన్నలు కూలి పనులకు వెళ్లగా బంధువుల ఇంటికి వెళ్లిన ఆ చిన్నారులను మృత్యువు విద్యుత్ తీగ రూపంలో వెంటాడింది. కలిసి ఆడుకుంటూ కబుర్లు చెప్పుకున్న అక్కాచెల్లెళ్ళు క్షణాల వ్యవధిలోనే విద్యుత్ షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోయారు. కన్నబిడ్డలు ఇక లేరన్న వార్తతో తల్లిదండ్రుల రోదనలు స్థానికులను కంటతడి పెట్టించాయి. నెల్లూరు నగరంలోని హరినాథపురం రెండో వీధిలో నాగసాయి మందిరం సమీపంలో ఆదివారం ఉదయం ఈ విషాదకర ఘటన చోటు చేసుకుంది. మార్కాపురం జిల్లా చంద్రశేఖర పురం మండలం జైబైలు గ్రామానికి చెందిన గురవయ్య, సుజాత దంపతులు కొన్నాళ్ల క్రితం జీవనోపాధి కోసం నెల్లూరు నగరానికి వచ్చి ఇక్కడే స్థిరపడ్డారు. భార్యాభర్తలు ఇద్దరూ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తు న్నారు.వారికి జ్యోతి (11), అమూల్య (7) ఇద్దరు కుమార్తెలు, మరో కుమారుడు ఉన్నాడు. సమీ పంలోని కరుణాల మిట్ట నగరపాలక ఉన్నత పాఠశాలలో ఇద్దరూ చదువుకుంటున్నారు. ఆదివారం పాఠశాల సెలవు కావడంతో ఇద్దరూ ఇంటి బయట ఆడుకుంటున్నారు. అదే సమ యంలో వారి సమీప బంధువులైన శేఖర్, మల్లీ శ్వరి దంపతులు సమీపంలోని కొత్త ఇంట్లోకి ఇటీవలే చేరారు. వారి పిల్లలు బయట ఆడుకుంటున్న జ్యోతి, అమూల్యలను తమ ఇంటికి తీసుకెళ్లారు. అందరూ కలిసి ఆడుకుంటుండగా జ్యోతి, అమూల్య ఇద్దరూ రెండో అంతస్తులోని డాబాపైకి వెళ్లారు. అక్కడ విద్యుత్ బల్బుకు సం బంధించిన తీగ తెగిపోయి డాబాపై పడి ఉంది. అదే సమయంలో పైభాగంలోని వాటర్ ట్యాంక్ నిండిపోవడంతో నీరు ఓవర్‌ఫ్లో అవుతూ డాబాపైకి చేరింది. నీటిలో విద్యుత్ తీగ పడి ఉన్న విషయాన్ని గమనించని చిన్నారులు అక్కడికి వెళ్లడంతో ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురయ్యారు. విద్యుత్ షాక్ తగలడంతో ఇద్దరూ కేకలు వేస్తూ కుప్పకూలిపోయారు. వారి వెనుకే వస్తున్న మల్లీశ్వరి పిల్లలు ఈదృశ్యాన్ని గమనించి వెంటనే కిందికి వెళ్లి తల్లికి సమాచారం అందించారు. మల్లీశ్వరి స్థానికుల సహాయంతో విద్యుత్ సరఫరాను నిలిపి వేయించారు. అప్పటికే జ్యోతి అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన అమూ ల్యను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆమె కూడా మృతి చెం దింది. దీంతో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు చిన్నారులు ఒకేసారి ప్రాణాలు కోల్పోవడంతో హరినాథపురంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై ఫిర్యాదు అందుకున్న బాలాజీనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ప్రజాస్వామిక ఉద్యమానికి రంగం సిద్ధం: శ్రీనివాసరావు

**కావలి (నెల్లూరు),సెప్టెంబరు 27,ప్రభాతవార్త:** దేశంలో ప్రజా స్వామిక ఉద్యమానికి రంగం సిద్ధమైందని, కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తన తొత్తు ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్‌ను తక్షణం తొలగించాలని, రాష్ట్రంలోని వామపక్షాలు, యువత ఆధ్వర్యంలో ఆందోళన చేసేందుకు సమాయత్తమవుతున్నాయని సిపిఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. కావలి సిపిఎం పార్టీ కార్యాలయంలో ఆదివారం కామ్రేడ్ కాలేషా సంతాప సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆ యన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసభలో పాల్గొనేందుకు విచ్చేసిన వి.శ్రీనివాస రావు విలేకరులతో మా ట్లాడారు ఎన్డిఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి గడచిన 14 ఏళ్లలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని విధ్వంసం చేసిందని ఆరోపించారు.

ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్,జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం. మోహన్ రావు,షేక్ రెహనా బేగం,జిల్లా కమిటీ సభ్యులు పసుపులేటి పెంచలయ్య, సీనియర్ నాయకులు తాళ్లూరు మాల్యాద్రి పాల్గొన్నారు.

# రూ.7.86లక్షల కోట్ల కేంద్ర రుణ లక్ష్యం

## ఇందులో రూ.15 వేలకోట్ల సావరిన్ గ్రీన్ బాండ్స్
## రూ.50 వేల కోట్ల వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సెస్
## ప్రస్తుత 2026-27 రెండో అర్ధభాగానికి రుణ ప్రణాళిక

**హైదరాబాద్, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:** ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరం రెండవ అర్ధభాగం కోసం కేంద్ర ప్రభుత్వం రుణ ప్రణాళికను నిర్ణయించింది. ఈ అర్ధభాగంలో రూ.7.86 లక్షల కోట్ల రుణం సేకరించనుంది. ఈ మేరకు దీనికి సంబంధించి కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రతిపాదనలు రూపొందించింది. ఆర్థిక మంత్రిత్వ శాఖలోని సీనియర్ కార్యదర్శి ఒకరు వీటి వివరాలను తెలిపారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో సంప్రదించి, 2026-27 ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో (హెచ్2) రూ.7,86,000 కోట్లు రుణం తీసుకోవాలని నిర్ణయించింది. ఇందులో రూ.15 వేల కోట్ల సావరిన్ గ్రీన్ బాండ్ల (ఎస్‌జిఆర్‌బిఎస్) జారీ కూడా ఉంది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనాలైన రూ.17.20 లక్షల కోట్లతో పోలిస్తే, భారత ప్రభుత్వం కాలపరిమితి గల సెక్యూరిటీల ద్వారా రూ.15,99,506 కోట్ల మార్కెట్ రుణం తీసుకుంటుందని అంచనా వేసింది. ఈ నేపధ్యంలో ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో తీసుకునే మొత్తం 23 వారపు వేలం ద్వారా రూ.7,86,000 కోట్లు స్థూల మార్కెట్ రుణాల సేకరణ పూర్తి చేయబడుతుందని ప్రణాళికలో పేర్కొంది. ఈ మార్కెట్ రుణాలు 3, 5, 7, 10, 15, 30, 40 మరియు 50 సంవత్సరాల కాలపరిమితి గల సెక్యూరిటీలపై విస్తరించబడతాయని పేర్కొంది. వివిధ కాలపరిమితుల క్రింద రుణాల వాటాలో భాగంగా 3సంవత్సరాలు (6.9 శాతం), 5సంవత్సరాలు (12.1 శాతం), 7 సంవత్సరాలు (9.1 శాతం), 10సంవత్సరాలు (26.3 శాతం), 15 సంవత్సరాలు (17.6 శాతం), 30సంవత్సరాలు (9.2 శాతం), 40 సంవత్సరాలు (8.9 శాతం), 50సంవత్సరాలు (9.9శాతం) చొప్పున వడ్డీ ప్రక్రియను సులభతరం చేయడానికి ప్రభుత్వం సెక్యూరిటీల మార్పిడి చేయనుంది. బహిరంగ ఈ వేలంలో సూచించిన ప్రతి సెక్యూరిటీకి రూ.2 వేల కోట్ల వరకు అదనపు రుణం కింద గ్రీన్‌షూ ఆప్షన్‌ను వినియోగించుకునే హక్కును ప్రభుత్వం వినియోగించుకోనుంది. అలాగే 2026-27 ఆర్థిక సంవత్సరం మూడవ త్రైమాసికంలో, ప్రభుత్వం 13 వేలం వారాలలో ట్రెజరీ బిల్లుల (టిబిల్లులు) జారీ ద్వారా వారానికి రూ.23 వేల కోట్లు రుణం తీసుకోనుంది. దీనికి గాను కేటాయింపులు చూస్తే 91రోజుల టిబిల్లుల కింద రూ.8 వేల కోట్లు, 182రోజుల టిబిల్లుల కింద మరో రూ.8, వేల కోట్లు, 364రోజుల టిబిల్లుల కింద రూ.7 వేల కోట్లుగా ఉన్నాయి. కాగా ప్రభుత్వ ఖాతాలలో ఏవైనా తాత్కాలిక అసమతుల్యతలు ఏర్పడితే వాటిని సరిదిద్దేందుకు, 2026-27 ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థానికి గాను వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సెస్ (డబ్ల్యూఎంఎ) పరిమితిని రిజర్వ్ బ్యాంక్ రూ.50 వేల కోట్లుగా నిర్ధారించింది.



## మణిపూర్‌లో నాగాపౌరుల కాల్చివేత

**ఇంఫాల్, సెప్టెంబరు 27:** మణిపూర్‌లో హింసాత్మక సంఘటనలు కొనసాగుతున్నాయి. తాజాగా ఇద్దరు నాగా పౌరులను సాయుధ వ్యక్తులు కాల్చి చంపారు. ఈ కాల్పుల్లో మరో ఇద్దరు నాగా పౌరులు గాయపడ్డారు. భద్రతా దళాలు సంఘటనా ప్రాంతానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించాయి. సేనాపతి జిల్లాలోని కాలెన్‌జాంగ్ గ్రామంలో ఈ సంఘటన జరిగింది. గ్రామ పెద్దకు చెందిన ఇంట్లో ఉన్న నాగా పౌరులపై గుర్తు తెలియని సాయుధ వ్యక్తులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఇద్దరు నాగా పౌరులు మరణించగా మరో ఇద్దరు గాయపడ్డారు. మృతులను ఆ జిల్లాలోని వేర్వేరు గ్రామాలకు చెందిన రాకీ, కుమార్‌గా గుర్తించారు. ఈ కాల్పుల సంఘటన గురించి తెలిసిన వెంటనే పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడి పరిస్థితిని సమీక్షించారు.

## మహాకుంభమేళా కోసం సిఎం పూర్వీకుల ఇల్లు కూల్చేసిన అధికారులు



**ఉజ్జయిని, సెప్టెంబరు 27:** మధ్యప్రదేశ్‌లో 2028లో జరిగే సింహస్థ మహాకుంభమేళా కోసం ఉజ్జయినిలో రోడ్డు విస్తరణ పనులు గత కొన్ని రోజులుగా సాగుతున్న సందర్భంగా ఉజ్జయినిలోని సీఎం మోహన్ యాదవ్ పూర్వీకుల ఇంటిని అధికారులు కూల్చేశారు. ఈ కార్యక్రమాన్ని స్వయంగా సీఎం ప్రారంభించారు. ఉజ్జయినిలో రోడ్డు విస్తరణ ప్రాజెక్టులో భాగంగా అడ్డుగా ఉన్న మొత్తం 272 కట్టడాలను కూల్చివేయాలని అధికారులు నిర్ణయించారు.ఇందులో సీఎం మోహన్ యాదవ్ పూర్వీకుల ఇల్లు కూడా ఉంది. అయితే ఆ ఇంటిని కూల్చేందుకు అధికారులు వెనకాడడంతో స్వయంగా సీఎం మోహన్ యాదవ్ గునపంతో తొలి దెబ్బ ఇంటి ముందు గడప వద్ద కొట్టి కూల్చివేత పనులను ప్రారంభించారు. అంతకుముందు ఇంట్లో పూజలు నిర్వహించారు. అయితే తన చిన్ననాటి జ్ఞాపకాలు ఉన్న ఇల్లు కావడంతో ఒకింత సీఎం భావోద్వేగానికి గురయ్యారు. కానీ రోడ్డు విస్తరణ, సమాజ హిత కోసం ఇలాంటివి తప్పవని స్పష్టం చేశారు. ఇక సింహస్థ మహాకుంభమేళాలో భాగంగా ఉజ్జయినిలో రోడ్డు విస్తరణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ మేరకు ప్రజలు ఈ రోడ్డు విస్తరణ పనులకు సహకరించాలని సీఎం మోహన్ యాదవ్ కోరారు. వచ్చే సింహస్థ మహా కుంభమేళా పనులు ఎలాంటి ఆటంకం లేకుండా జరిగేందుకు ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు. ఇక ఉజ్జయినిలో సీఎం ఇల్లు ఆయన తండ్రి పూనమ్ చంద్, అంకుల్ శంకర్ లాల్ పేర్లమీద రిజిస్టర్ అయి ఉంది. శంకర్ లాల్ కుటుంబం ఈ ఇంట్లోనే నివసిస్తుండగా సీఎం సోదరి కళావతి యాదవ్ కు సెపరేట్ గా ఇల్లు ఉంది. ఇక సీఎం తాత శ్రీ రామ చంద్ర 1974లో ఈ ఇంటిని నిర్మించారు. ఉజ్జయినిలో రానున్న మహాకుంభమేళాలో భాగంగా 500 కిలోమీటర్ల వరకు రోడ్లను విస్తరించే కార్యక్రమం చేస్తున్నారు. ఈ రోడ్డు విస్తరణలో భాగంగానే సీఎం ఇంటిని అధికారులు కూల్చేశారు. అయితే తన ఇంటిని కూల్చడంపై సీఎం ఎలాంటి నష్టపరిహారం ఆశించలేదు. ఈ ప్రాంతంలో కూల్చివేతలతో తమ ఇళ్లను కోల్పోయిన 271 మంది బాధితులకు స్థానిక కలెక్టర్ ఆదేశాల మేరకు నష్టపరిహారం అందనుంది.

# రోడ్డు పనుల తనిఖీల్లో యువకుడి చెంపపగులగొట్టిన ఢిల్లీ మంత్రి

**న్యూఢిల్లీ,సెప్టెంబరు 27:** దేశ రాజధాని ఢిల్లీలోని తిలక్ నగర్ లో రోడ్డు మరమ్మతు పనుల తనిఖీలో భాగంగా పీడబ్ల్యూ మంత్రి పర్వేశ్ వర్మ పక్కనే ఉన్న ఓ యువకుడి చెంప పగులగొట్టిన ఘటన ఇప్పుడు రాజకీయంగా తీవ్ర వివాదాస్పదం అయింది. తిలక్ నగర్ లోని రోడ్డు తనిఖీల్లో భాగంగా స్థానిక ఆప్ ఎమ్మెల్యే జర్నైల్ సింగ్‌కు ఢిల్లీ మంత్రి పర్వేశ్ వర్మకు మధ్య మాటల వాగ్వాదం చెలరేగింది. రోడ్డు పనుల్లో నాణ్యత విషయంలో ఇరు వర్గాల మధ్య వాదనలు నడుస్తుండగా ఆప్ ఎమ్మెల్యే జర్నైల్ సింగ్ అనుచరుడు అయిన ఓ యువకుడు మంత్రి పర్వేశ్ వర్మను ఫోన్‌లో వీడియో తీస్తుండగా ఒక్కసారిగా కోపోద్రిక్తుడైన ఆయన యువకుడి చెంప చెల్లుమనిపించాడు. యువకుడి వద్ద నుంచి ఫోన్ లాక్కొని మరీ దాడి చేశారు మంత్రి పర్వేశ్ వర్మ. దాంతో అక్కడి పరిస్థితి ఒక్కసారిగా వేడెక్కింది. ఇరు వర్గాల మధ్య కాస్త తోపులాట, ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారాయి. ఈ ఘటన సమయంలో మంత్రి తీరుపై అక్కడి కార్యకర్తలు పలు రకాలుగా తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ మేరకు వారి మాటలు ఆ వీడియోలో స్పష్టంగా వినిపిస్తున్నాయి. అతడ్ని ఎలా కొడతారు అని ఆ జనంలోంచి ఓ



కార్యకర్త అరిచాడు. అతడ్ని కొట్టేశాడు చూడండి అంటూ మరో కార్యకర్త మాటలు వినిపిస్తున్నాయి. మరో వ్యక్తి ఏమైంది కనిపించడం లేదు అన్న వాయిస్ వినిపిస్తోంది. ఇంకో కార్యకర్త మాట్లాడుతూ.. కామన్ మ్యాన్‌ను ఎవరూ కొట్టడానికి రైట్ లేదు అని అన్నాడు. ఇక తిలక్ నగర్ లోని రోడ్డు పనులను తనిఖీ చేసేందుకు మంత్రి పర్వేశ్ వర్మ, ఆప్ ఎమ్మెల్యే జర్నైల్ సింగ్ అక్కడకు రావడంతో తప్పు మీదంటే.. మీదని ఇరు వర్గాల మధ్య నినాదాలు స్టార్ట్ అయ్యాయి.

## అస్సోం సిఎం భయపడ్డారు: అశుతోష్ రాంకా

**గువాహతి, సెప్టెంబరు 27:** అసోం రాజధాని గువహటిలో సీజేపీ నేతలను స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. సీజేపీ కో ఫౌండర్ అశుతోష్ రాంకా సహా పలువురు సీజేపీ నేతల్ని పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. అసోంలో పాఠశాలల పరిస్థితిని గురించి అంచనా వేసేందుకు అధ్యయన బాట పట్టారు. అసోం ప్రజలకు, ఇండియాకు వివరించాలని తాము పర్యటన చేపట్టినట్లు సీజేపీ నేతలు అన్నారు. తమను అడ్డుకోవడం ద్వారా అసోం సీఎం హిమంత బిశ్వశర్మ తమకు భయపడ్డారని సీజేపీ నేతలు ఆరోపించారు.రాంకా సహా సీజేపీ నేతల్ని అదుపు చేయడంపై సీజేపీ ఫౌండర్ అభిజీత్ దీప్కే ప్రశ్నించారు.

## తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఇరాన్: డొనాల్డ్‌ట్రంప్

**వాషింగ్టన్, సెప్టెంబరు 27:** వరల్డ్‌వైడ్‌గా ఆయిల్ రవాణాలో అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన ఆదివారం వాషింగ్టన్ డీసీలో మీడియాతో మాట్లాడుతూ ఇరాన్ దేశం ఆర్థికంగా తీవ్ర సంక్షోభంలో చిక్కుకుందని, ఆ దేశం హర్మూజ్ జలసంధిని వెంటనే తెరిచేయాలని ఉవ్విళ్లూరుతోందని ఎద్దేవా చేశారు. జలసంధి పునరుద్ధరణ ప్రతిపాదనను అమెరికా స్పష్టంగా తిరస్కరించిన నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు.

## రాజకీయ దుమారంతో వెనక్కి తగ్గిన టివికె సర్కార్



**చెన్నై, సెప్టెంబరు 27:** తమిళనాడు రాజకీయాల్లో తీవ్ర దుమారానికి దారితీసిన ఒక కీలక నిర్ణయంపై విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వం వెనక్కి తగ్గింది. సమాచార హక్కు చట్టం పరిధి నుంచి పబ్లిక్ (లా అండ్ ఆర్డర్) శాఖను తప్పిస్తూ కొద్ది రోజుల క్రితం జారీ చేసిన వివాదాస్పద ఉత్తర్వులను ప్రభుత్వం అధికారికంగా రద్దు చేసింది. దీనివల్ల ప్రజలకు ఎలాంటి సమాచార హక్కు కోల్పోయే ప్రమాదం లేకుండా మళ్లీ పాత పద్ధతే కొనసాగనుంది. తీవ్ర విమర్శలు వ్యక్తమైన నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న ఈ యూటర్న్ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఆర్టీఐ చట్టం2005 లోని సెక్షన్ 24(4) ప్రకారం పబ్లిక్ (లా అండ్ ఆర్డర్) శాఖను ఇంటెలిజెన్స్ అండ్ సెక్యూరిటీ ఆర్గనైజేషన్‌గా పేర్కొంటూ తమిళనాడు ప్రభుత్వం ఇటీవల జీవో నెం. 57 ను జారీ చేసింది. ఈ శాఖ పరిధిలోకి పోలీసు కాల్పులు, కస్టడీ మరణాలు, చిత్రహింసల విచారణ నివేదికలు వంటి అత్యంత కీలకమైన అంశాలు వస్తాయి. ఒకవేళ ఈ ఉత్తర్వులు అమల్లో ఉంటే, లా అండ్ ఆర్డర్ విభాగానికి సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని సాధారణ ప్రజలు ఆర్టీఐ ద్వారా అడిగి తెలుసుకునే అవకాశం ఉండేది కాదు. ఈ నిబంధనపై విపక్షాలు తీవ్ర స్థాయిలో మండిపడ్డాయి. ఈ నిర్ణయంపై సీపీఎం ఎంపీ వెంకటేశన్, కాంగ్రెస్ ఎంపీ కార్తి చిదంబరంతో పాటు పలువురు ప్రముఖులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది తమిళనాడును పోలీస్ స్టేట్‌గా మార్చే కుట్ర అని, ప్రజాస్వామ్య జవాబుదారీతనానికి ఇది విఘాతమని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో తెచ్చిన ఆర్టీఐ చట్టాన్ని బలహీనపరిచేలా ఇలాంటి నిర్ణయాలు ఉండకూడదని హితవు పలికారు. ప్రజల నుంచి వ్యక్తమవుతున్న అసంతృప్తిని, వ్యతిరేకతను గమనించిన టీవీకే ప్రభుత్వం ప్రజాభావాలకు గౌరవం ఇస్తూ ఆ ఉత్తర్వులను తక్షణమే వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించింది. టీవీకే మంత్రులు సీటీఆర్ నిర్మల్ కుమార్ , రాజ్ మోహన్ సమాచార హక్కు చట్టాన్ని పూర్తిగా ఎత్తేయలేదని, కేవలం వర్గపోరాటాలు, కొన్ని సున్నితమైన శాంతిభద్రతల అంశాలకు మాత్రమే మినహాయింపు ఇవ్వాలని భావించామని తెలిపారు. భావప్రకటన స్వేచ్ఛకు ఎక్కడా భంగం కలగకుండా పారదర్శక పాలన అందిస్తామని స్పష్టం చేశారు. ఏదేమైనప్పటికీ, ప్రజల నుంచి వచ్చిన తీవ్ర నిరసనల కారణంగా ప్రభుత్వం క్షణాల వ్యవధిలోనే పునరాలోచించి ఈ వివాదానికి తెరదించింది.

# వారణాసి ఎన్నికను రద్దుచేసి మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి



**వారణాసి, సెప్టెంబరు 27:** ఉత్తర్ ప్రదేశ్‌లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. ఇప్పటికే ఆ రాష్ట్రంలో రాజకీయ వేడి మొదలైంది. ఇలాంటి సమయంలో కాంగ్రెస్ రాష్ట్రాధ్యక్షుడు అజయ్ రాయ్ సంచలన ఆరోపణలు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను అరెస్ట్ చేయడంతో పాటు, 2024లో ప్రధాని నరేంద్రమోడీ గెలిచిన వారణాసి లోక్‌సభ ఎన్నికల్ని రద్దు చేసి, మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆగ్రాలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆదివారం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. జ్ఞానేష్ కుమార్ అవినీతిపరుడని, నిజాయితీ లేని అధికారి అని ఆరోపించారు. ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడి బీజేపీ గెలిచిందని, బీజేపీకి ఆయన సహకరించారని అన్నారు. జ్ఞానేష్ కుమార్ పదవిలో ఉన్న సమయంలో నిర్వహించిన అన్ని రాష్ట్రాల ఎన్నికల్ని రద్దు చేసి, తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో వారణాసి నుంచి పోటీ చేసిన నరేంద్రమోడీ మరోసారి విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో మోడీ 6,12,970 ఓట్లు సాధించగా, కాంగ్రెస్ తరుపున పోటీ చేసిన అజయ్ రాయ్‌కు 4,60,457 ఓట్లు వచ్చాయి. మోడీ1,52,513 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. ఈ ఫలితాలపై అజయ్ రాయ్ అనుమానాలు వ్యక్తం చేశారు. వారణాసి ఎన్నికల్ని రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని కోరారు.

# పురుడు పోసుకున్న పాత పగ..!!

- వైసిపి పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు రాజారెడ్డి పై హత్యాయత్నం.
- మాస్కులు ధరించి వచ్చి, కళ్ళల్లో కారం చల్లి, రాళ్లతో తలపై దాడి చేసి పరార్.
- గంటల వ్యవధి లోనే పట్టుకున్న గోరంట్ల పోలీసులు..??
- ప్రాణాపాయ స్థితిలో బెంగళూరులో చికిత్సలు పొందుతున్న రాజారెడ్డి.

**గోరంట్ల సెప్టెంబర్ 27 ప్రభాతవార్త:** వ్యక్తిగత పాత కక్షలు పెట్టుకున్న కొందరు ఆ కక్షలను తీర్చుకోవాలనే ఉద్దేశంతో వ్యూహాత్మకంగా వ్యక్తిపై హత్యాయత్నం చేసిన సంఘటన తీవ్ర సంచలనంగా మారింది. ఇలాంటి సంఘటన గోరంట్ల పట్టణంలో ఆదివారం చోటుచేసుకుంది. ఈ సంఘటనలో గోరంట్ల మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షులు చిట్టిపీ రాజారెడ్డి పై ఐదుగురు ముఠా దాడి చేసిన సంఘటన చోటుచేసుకుంది. అయితే దాడి చేసిన నిందితులు జిల్లా సరిహద్దు దాటి పారిపోతుండగా వేకవంతంగా స్పందించిన గోరంట్ల పోలీసులు గంటల వ్యవధిలోనే శ్రీ సత్య సాయి జిల్లా సరిహద్దు కుక్కంటి క్రాస్ వద్ద నిందితులు కారులో పారిపోతుండగా వలపన్ని పట్టుకున్నట్లు సమాచారం. వివరాల్లోకెళితే సత్య సాయి జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షులు, గోరంట్ల మేజర్ పంచాయితీ తాజా మాజీ ఉపసర్పంచ్ రాజారెడ్డి పై దుండగులు హత్యాయత్నానికి పాల్పడ్డారు. రాజారెడ్డి పరిస్థితి విషమంగా ఉండడంతో ఆయన్ను హుటాహుటిన బెంగళూరు లోని హాస్టర్ ఆస్పత్రికి తరలించారు. వైసిపి నేత రాజారెడ్డి గోరంట్ల పట్టణ చివరలోని తన వ్యవసాయ పొలం వద్ద ఉండగా ఐదు మంది గుర్తు తెలియని వ్యక్తులు అక్కడికి వచ్చి ఒకసారిగా కలలో కారం చల్లి తీవ్రంగా దాడి చేయడంతో ఆయన తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో హుటా హుటిన గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సల అనంతరం రాజారెడ్డిని బెంగళూరు తరలించారు. ఆస్పత్రికి చేరుకున్న స్థానిక ఎస్సై రామచంద్ర ఏఎస్ఐ వివరాలను నమోదు చేసుకున్నారు. సంఘటన జరిగినప్పుడు ఆ ప్రాంతంలో మరో ఐదు మంది రాజారెడ్డి మిత్రులు ఉన్నప్పటికీ వారికి సైతం కళ్ళ ల్లో కారం చల్లినట్లు తెలిపారు. ఈ సంఘటనపై వెంటనే స్పందించిన సీఐ బోయశేఖర్ నిందితుల కోసం వేట ప్రారంభించి గంటల వ్యవధిలోనే నిందితులను అదుపులోకి తీసుకోవడం విశేషం. నెల రోజులుగా గతంలో జరిగిన ఓ సంఘటనకు సంబంధించిన పాత పగ నెంబర్ వేసుకుంటూ వస్తున్నప్పటికీ సంబంధిత శాఖ అధికారులు పసి గట్ట లేకపోవడంలో విఫలమయ్యారని విమర్శలు వినిపిస్తున్నాయి.

# సంతానోత్పత్తిని ప్రోత్సహించే దిశలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు




- కు.ని శస్త్ర చికిత్సలకు ప్రోత్సాహకాలకు ఫుల్‌స్టాప్ పెట్టేలా ఎపి పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ 2026 నిర్ణయం
- రెండో, మూడో బిడ్డ జననాలను ప్రోత్సహించేలా పథకాల అమలు: యేటా రూ.1000కోట్లు

**విజయవాడ,సెప్టెంబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో సంతోన్పత్తిని ప్రోత్సహించే దిశలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది.తాజాగా ముగ్గురు ఆ పై పిల్లలున్న కుటుంబాలకు ప్రత్యేక ప్రోత్సాహకాలను ఇస్తుంది.ఆ క్రమంలో ఇప్పటి వరకు కుటుంబ నియంత్రణ చికిత్స చేయించుకునే వారికి ప్రోత్సాహకాలు తగ్గింస్తుంది.అత్యధికంగా ఆంధ్రప్రదేశ్ వివాహిత మహిళల్లో 69.5 శాతం మంది కుటుంబ నియంత్రణ(కు.ని) శస్త్రచికిత్సలు చేయించుకుంటున్నారు.ఇది దేశంలోనే అత్యధికగా శాతంగా మారింది.ఒకరు లేక,ఇద్దరు ఉండే చిన్న కుటుంబం చాలు అనే అభిప్రాయం ప్రజల్లో బలీయంగా ఉన్న పరిస్థితి, ఒక రకంగా రెండు దశాబ్దాలుగా అమలు చేసిన జనాభా నియంత్రణ విధానాలతో రాష్ట్రంలో జననాల రేటు పడిపోయింది.అంతేకాకుండా రాజకీయంగా కుడా ఇద్దరు కంటే ఎక్కువ పిల్లలు ఉన్న కుటుంబాల వారికి స్దానిక ఎన్నికల్లో పోటీకి అనర్హత ఉండేది.ఈ మధ్య ప్రభుత్వం ఈ నిబంధన రద్దు చేసింది. ఏపీ పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ 2026 ద్వారా సంతానోత్పత్తి విధానాలను ప్రోత్సహించి కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు 50 శాతానికి తగ్గడానికి కనీసం ఐదేళ్ల నుంచి పదేళ్లు పడుతుందని ప్రభుత్వం అంచనా వేస్తుంది అని ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి (ఈఏసీపీఎం) తెలిపింది.టెక్నికల్ గ్రూప్ ఆఫ్ పాపులేషన్ ప్రొజెక్షన్ నివేదిక ప్రకారం 2036 నాటికి ఏపీ జనాభాలో 14 సంవత్సరాల లోపు పిల్లల వాటా 16 శాతం కంటే తక్కువకు పడిపోతుందని, 60 ఏళ్ల పైబడిన వృద్ధుల వాటా 19 శాతం పెరగనుందని అంచనా వేసింది. ఈ క్రమంలోతక్కువ మంది పిల్లలను కనడం సాధారణంగా మారిన తర్వాత, తిరిగి సంతానోత్పత్తి రేటు పెంచడం కష్టమవుతుంది. సిక్కిం, ఆంధ్రప్రదేశ్ లాంటి రాష్ట్రాలు ఇప్పటికే ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. దేశంలో జనాభా నియంత్రణ ఆలోచనా విధానం, ప్రస్తుత మార్పులు, వివిధ రాష్ట్రాల్లో పరిస్థితిని తాజాగా విడుదల చేసిన ది ఫ్యోస్ట్ ఆఫ్ పాపులేషన్ పాస్ట్ వర్కింగ్ పేపర్‌లో విశ్లేషించింది. ఇందులో ఆంధ్రప్రదేశ్ పరిస్థితినీ ప్రముఖంగా ప్రస్తావించింది. జనాభా స్థిరీకరణకు అవసరమైన భర్తీ స్థాయి (రీప్లేస్‌మెంట్ లెవెల్) 2.1గా ఉంది. దేశంలో సంతానోత్పత్తి రేటు (టీఎఫ్‌ఆర్) 1.9 ఉంది. కానీ ఆంధ్రప్రదేశ్‌ఇది 1.4 మాత్రమే. 2001 నుంచి ఈ తగ్గుదల నమోదవుతోంది. కర్ణాటక, తెలంగాణల్లో 1.5 చొప్పున, కేరళం, తమిళనాడు, పశ్చిమ బంగాల్‌లో 1.3 చొప్పున ఉంది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం ఏపీలో 15 సంవత్సరాల నుంచి 49 సంవత్సరాల మహిళల్లో 69.5 శాతం మంది కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు (ట్యూబెక్టమీ) చేయించుకున్నారు. ఇది దేశంలోనే అత్యధికం. పురుషుల్లో వ్యాసెక్టమీ చేయించుకున్నవారు 0.8 శాతం మంది మాత్రమే ఉంది.అధిక సంతానోత్పత్తి రేటున్న యూపీ కంటే ఆంధ్రప్రదేశ్ లోనే ఎక్కువగా ఆపరేషన్లకు ప్రోత్సాహకాలు అందించారు. శాశ్వత కుటుంబ నియంత్రణ పద్ధతులకు ఏటా రూ.13.81 కోట్లు కేటాయించారు. తాత్కాలిక పద్ధతులకు రూ.2. 99 కోట్లు మాత్రమే కేటాయించారు. జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద తాత్కాలిక పద్ధతుల కంటే, శాశ్వత శస్త్రచికిత్సలకే ఎక్కువ ప్రోత్సాహకాలు ఇవ్వడం వల్లనే ఆపరేషన్ల సంఖ్య ఏపీలో విపరీతంగా పెరిగింది.ఆంధ్రప్రదేశ్‌లో జనాభా నియంత్రణ నుంచి నిర్వ హణ దిశగా సర్కార్ అడుగులు వేస్తోంది. 202620- 27 ఆర్థిక ఏడాదిలో శాశ్వత కుటుంబ నియంత్రణ ఆపరేషన్లకు ఎలాంటి ప్రోత్సాహకాల బడ్జెట్‌ను కేటాయించలేదు. ఇకపై కు.ని. శస్త్రచి కిత్సల ప్రోత్సాహకాలు రద్దు చేసి, విరామ పద్ధ తులకు ప్రాధాన్యం ఇస్తున్నామని ఏపీ పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ 2026 పేర్కొంది.ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలున్నవారు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయకూడదనే ఆంక్షల చట్టాన్ని రద్దు చేసింది.రెండో, మూడో బిడ్డ జననాలను ప్రోత్సహించేలా పథకాలకు ఏటా సంవత్సరానికి రూ.వెయ్యి కోట్లు ఖర్చవుతోందని అంచనా వేసింది.సంతానోత్పత్తి వృద్ధి పెంచేందుకు ఇకపై ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటుంది.

# హైదరాబాద్ -విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారి హైవే విస్తరణ

- భూసేకరణ, నిర్మాణ వ్యయాలతో కలిపి రూ. 12,000 కోట్ల వ్యయం అంచనా!



**విజయవాడ,సెప్టెంబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:** హైదరాబాద్- విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 65)ని ఆరు లేన్లుగా విస్తరించే ప్రాజెక్టుకు కీలకమైన ప్రతిపాదన అమలు చురుగ్గా కార్యచరణ జరుగుతుంది. నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా సమర్పించిన ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వానికి చెందిన పబ్లిక్‌ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ అప్రైజల్ కమిటీ ఇటీవల ఆమోదం తెలిపింది. హైదరాబాద్ - విజయవాడ మధ్య 226 కి.మీ, విజయవాడ- మచిలీపట్నం మధ్య 58 కి.మీ కలిపి మొత్తం 284 కి.మీ విస్తరణ ప్రాజెక్టుకు సంబంధించి, గత నెలలోనే పబ్లిక్‌ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ అప్రైజల్ కమిటీ సమావేశం. గతంలో లేవనెత్తిన అభ్యంతరాలపై నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా అందించిన వివరణలను కమిటీ పరిశీలించింది. ఆ తర్వాత ప్రాజెక్టుకు కొత్తగా ఆమోదం తెలిపింది. భూసేకరణ, నిర్మాణ వ్యయాలతో కలిపి అంచనా వేసిన రూ. 12,000 కోట్ల వ్యయానికి ఆమోదం లభించిందని సమాచారం. ఈ ప్రాజెక్ట్ ఇప్పుడు ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీకి సమర్పిస్తారు. భారీ ప్రాజెక్టులకు తుది ఆమోదం తెలిపే అధికారం ఈ కమిటీకి ఉంటుంది. ఆమోదం లభించిన తర్వాత, భూసేకరణ, టెండర్ల ఆహ్వానం (ప్యాకజీల వారీగా) ప్రక్రియలు ప్రారంభమవుతాయి. అనంతరం ప్రధాన మంత్రి నేతృత్వంలోని ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోద అనంతర పరిణామాలు రోడ్డు నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపడుతున్నారు.హైదరాబాద్ శివార్లలోని మల్కాపూర్ నుంచి విజయవాడలోని గొల్లపూడి బైపాస్ వరకు ఉన్న 226 కి.మీ మార్గాన్ని నాలుగు లేన్ల నుంచి ఆరు లేన్లకు విస్తరిస్తారు. ఈ పనులు రెండు ప్యాకేజీలలో జరుగుతాయని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు చెబుతున్నారు.,ఒకటి హైదరాబాద్ నుంచి నందిగామ వరకు, మరొకటి నందిగామ నుంచి గొల్లపూడి వద్ద ఉన్న విజయవాడ బైపాస్ వరకు జరుగుతాయి ఈ విస్తరణ పనులు బిల్డ్ ఆపరేట్‌ట్రాన్స్‌ఫర్ (బిఒటీ)విధానంలో చేపట్టారు.విజయవాడ నుంచి మచిలీపట్నం వరకు రహదారి విస్తరణలో భాగంగా, కనూరు సిద్ధార్థ కళాశాల నుంచి దావులూరు టోల్ ప్లాజా దాటి అమరావతి ఔటర్ రింగ్ రోడ్ ను కలిసే ప్రాంతం వరకు ఉన్న 14 కి.మీ మార్గంలో, ప్రస్తుతం ఉన్న నాలుగు లేన్లకు ఇరువైపులా సర్వీస్ రోడ్లు నిర్మిస్తారు.ఔటర్ రింగ్ రోడ్ క్రాసింగ్ పాయింట్ నుంచి మచిలీపట్నం వరకు ఉన్న 44 కి.మీ రహదారిని ఆరు లేన్లకు విస్తరిస్తారు. ఈ ప్రాజెక్టు హైబ్రిడ్ యాన్యుటీ మోడల్‌ఖి కింద ఒకే ప్యాకేజీగా అమలు చేస్తారు.

# ఉత్తరాదిన భారీ వర్షాలు

- 14 రాష్ట్రాల్లో ఐఎండి హెచ్చరికలు....

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 27:** దేశంలోని పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కొనసాగుతున్నాయి. ఉతర్రప్రదేశ్, బీహార్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్ సహా పలు ప్రాంతాల్లో వర్షాల కారణంగా జనజీవనం ప్రభావితమవుతోంది. భారత వాతావరణ శాఖ తాజా అంచనాల ప్రకారం ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో గత రెండురోజులుగా భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాల నేపథ్యంలో ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, బీహార్, ఒడిశా, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, పంజాబ్, హర్యానా, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో వర్షాలు కొనసాగుతాయని ఐఎండి హెచ్చరించింది. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో చాలా భారీ వర్షాలకు అవకాశం ఉందని తెలిపింది. బీహార్, హర్యానా, ఢిల్లీ, హిమాచల్‌ప్రదేశ్, జార్ఖండ్, ఒడిశా, సబ్‌హిమాలయన్ పశ్చిమ బెంగాల్, సిక్కింలో కూడా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఉత్తరప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో వరుసగా వర్షాలు కురుస్తుండటంతో నీటిముంపు సమస్యలు తలెత్తుతున్నాయి. రాష్ట్రంలోని తూర్పు, పశ్చిమ ప్రాంతాలకు ఐఎండి భారీ వర్షాల హెచ్చరికలు జారీ చేసింది. ఆదివారం తూర్పు యూపీలో భారీ వర్షాలు, పశ్చిమ యూపీలో చాలా భారీ వర్షాలు కురిసాయి. సోమవారం నుంచి పరిస్థితి మెరుగుపడే అవకాశం ఉంది. లక్నో సహా పలు నగరాల్లో భారీ వర్షాల కారణంగా రోడ్లపై నీరు నిలిచింది. కొన్ని ప్రాంతాల్లో చెట్లు, నిర్మాణాలు దెబ్బతిన్న ఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో కాన్పూర్‌లోని పలు ప్రాంతాల్లో నీటిముంపు ఏర్పడింది. గోరఖ్‌పూర్‌లో కూడా భారీ వర్షాలతో రోడ్లు, మార్కెట్లు జలమయమయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో ఇళ్లలోకి, దుకాణాల్లోకి వర్షపు నీరు చేరినట్లు సమాచారం. ఉన్నావ్ ప్రాంతంలోని గంగా ఎక్స్‌ప్రెస్‌వేపై కూడా నీరు నిలవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రహదారులపై నీటిమట్టం పెరగడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

# దేశ ప్రగతికి అంకితమైన మహోన్నతుడు అశోక్ సింఘాల్

## ఆయన జ్ఞాపకాలను స్మరించుకున్న ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 27:** 'పరోపకారార్థమిదం శరీరం' ఇది మన ప్రాచీన వివేచనాత్మక నానుడి. ఈ ప్రకృతిలో వృక్షం తన పండ్లను తానే ఆరగించదు ఏ నదీ తన నీటిని తానే తాగదు అలాగే సాధుజనులు కూడా ఈ ధరణిపై ఆ స్ఫూర్తితోనే జన్మనెత్తుతారని ఇది ప్రబోధిస్తుంది. ఆశ్రితులకు పండ్లతో ఆకలి తీర్చే వృక్షం. తీరం చేరినవారికి దప్పిక తీర్చే నది. వ్యక్తిగత విజయం కన్నా సాటివారి సంక్షేమానికి అంకితమైన జీవితానికి ఎంతో పరమార్థం ఉంటుందని మన రుషులు, మునులు అనాదిగా ప్రబోధిస్తూనే వచ్చారు. ఆ స్ఫూర్తిని తన జీవితంలో నిండుగా ప్రతిబింబించిన వ్యక్తులలో అశోక్ సింఘాల్ కూడా ఒకరు. 1981నాటి ఒక సంఘటనలో ఆయన స్వదస్తూరీతో రాసిన లేఖ నాకు అందింది. సహజంగానే నాకు అదొక ప్రత్యేక సం దర్భంగా అనిపించింది. త్వరలో చేపట్టబోయే ఓ కీలక కార్యక్రమాన్ని ఆ లేఖలో ప్రస్తావిస్తూ, ఆయన కర్తవ్య నిర్దేశం చేశారు. ఆయన దశాబ్దాలపాటు రేయింబవళ్లు శ్రమించడం నేను స్వయంగా చూశాను. ప్రత్యేకించి గుజరాత్‌లోని గిరి జన ప్రాంతాలలో పర్యటనకు ఆయన ఆసక్తి చూపేవారు. దేశంలోని ఏ ప్రాంతంలోనైనా ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే, బాధితులకు ఆపన్న హస్తం అందించడం కోసం అందరికన్నా ముందు అక్కడికి చేరడం, లేదా అప్పటికే చేరు కున్న కార్యకర్తలకు దిశా నిర్దేశం చేయడంలో అశోక్ అగ్రస్థానంలో ఉండేవారు. గుజరాత్‌లోని కచ్‌లో 2001 నాటి భూకంపం తర్వాత ఆయనతో కలసి పనిచేసిన నా అనుభవం చిరస్మరణీయం. సాటి మానవులపై కరుణ, వారి సంక్షేమంపై శ్రద్ధ చూపే విశిష్ట లక్షణాలను అశోక్ బాల్యంలోనే అలవరచు కున్నారు. ఆయన తండ్రి మహావీర్ పరిపాలన యంత్రాంగంలో అత్యున్నత హోదాగల అధికారి. అలాంటి ఎంతో గొప్ప, సంపన్న కుటుంబంలో అశోక్ సింఘాల్ జన్మించారు. ఆయన సోదరులలో ఒకరైన బి.పి. సింఘాల్ పోలీసు అధికారిగా ఉద్యోగం చేసి, ఆ తర్వాత పార్లమెంటు సభ్యుడిగా ప్రజలకు సేవలందించారు. మరో సోద రుడు వి.పి.సింఘాల్ త్రిపుర రాష్ట్రం ఏర్పడి నప్పుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. అశోక్ చిన్న నాటినుంచే భిన్న దృక్కో ణం వైపు ఆకర్షితులయ్యారు. మాతృ భూమికి పునరుజ్జీవం, భరతమాత బిడ్డల పూర్వ వైభవ పునరుద్ధరణ. చిన్నతనాన ప్రయాగ్‌రాజ్‌లో నదీ సంగమం వద్ద అశోక్ గంటల తరబడి దీర్ఘాలోచనలో మునిగిపోయేవారు. అలా ఆ నదిని చూస్తూ, దానిపైనే కాకుండా, అక్కడ పుణ్యస్నానాలు చేయడానికి వచ్చే సాధువులు, సన్యాసులు, భక్తులపైనా ఆసక్తి పెంచుకున్నారు. పరోపకారార్థ మిదం శరీరం అనే నానుడికి అనుగుణంగా ఆయన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) వైపు ఆకర్షితులయ్యారు. తదాదిగా తనకు అప్పగించిన ప్రతి బాధ్యతను ఉత్సాహంతో, క్రమశిక్షణతో, కర్తవ్య భావనతో నిర్వర్తించారు.

పట్టుదల, అవిరళ కృషితో సంస్థలను, ఉద్యమాలను అశోక్ సింఘాల్ నడిపించారు. అద్భుత కంఠస్వరం, యావత్ సభను మంత్రముగ్ధం చేయగల వాగ్ధాటి ఆయన సొంతం. మరోవైపు సాటి కార్యకర్తలతో సౌహార్ద సంబంధాలపై ఆయన శ్రద్ధ కూడా ప్రశంసనీయం. సింఘాల్‌తో పరిచయం తర్వాత ఆయనెంత నిరాడంబరుడో తెలిసి, అందరూ ఆశ్చర్యపోవాల్సిందే. సాధుసంతులలోనూ ఆయనకు ప్రగాఢ అనుబంధం ఉండేది. కాబట్టే, దేశంలోని సాధువులు, దార్శనికులలో ఆయనపై అపార గౌరవం కనిపించేది. వారంతా ఆయన సలహాలు, సూచనలకు ఎంతో విలువనిస్తే, శ్రద్ధగా ఆలకించేవారు. ఈ నేపథ్యంలో అశోక్ సింఘాల్ మహోన్నత వ్యక్తిత్వాన్ని చాటే రెండు సందర్భాలు స్ఫురణకొస్తున్నాయి. మొదటిది షికాగాలో స్వామి వివేకానంద ప్రసంగ శతాబ్ది వేడుకల్లో భాగంగా 1993లో విశ్వ హిందూ పరిషత్ అమెరికాలో ఒక సదస్సును నిర్వహించింది. అసలు ఇలాంటి కార్యక్రమాన్ని విదేశాల్లో నిర్వహించాలనే విశిష్ట ఆలోచన, తదనుగుణ ప్రణాళిక, విభిన్న భాగస్వాములను ఏకతాటిపైకి తేవడం ఆయనలోని అనుపమాన నిర్వహణ సామర్థ్యానికి మచ్చుతునకలు. ఇక రెండోది ట్రినిడాడ్‌టొబాగోలోని పోర్ట్ ఆఫ్ స్పెయిన్‌లో ప్రపంచ హిందూ సదస్సు 2000 నిర్వహణ. రామజన్మభూమి ఉద్యమంలో అశోక్ సింఘాల్ కీలక పాత్ర పోషించడాన్ని గుర్తుచేసుకోకపోతే ఆయన ప్రస్తావనకు అర్థం ఉండదు. ఆయన 1991నాటి బోట్ క్లబ్ సభలో చేసిన ప్రసంగం ప్రతి ఒక్కరి మదిలో నేటికీ నిలిచి ఉంది. సమాజం సామరస్యం నెలకొనాలని, సౌభ్రాత్ర భావన సందేశాన్ని పునరుద్ఘాటించాలని ఆయనెంతో గట్టిగా చెప్పేవారు. ఈ స్పష్టమైన వ్యక్తిత్వం ఆయన విశ్వాసంలో వ్యక్తమయ్యేది. అయోధ్యలో రామమందిర నిర్మాణానికి తొలి పునాది రాయిని బీహార్‌లోని అణగారిన వర్గాల క్షేత్రస్థాయి వీహెచ్‌పీ కార్యకర్త కామేశ్వర్ చౌపాల్ చేతుల మీదుగా వేయించాలన్నది ఆయన ఆలోచన. ఇక కాశీలో ఒక ధర్మ పరిరక్షణ సభలో డోమ్ రాజాను సత్కరించాలని నిర్ణయించుకున్న ఆయన, ఆ తర్వాత వివిధ సామాజిక కార్యక్రమాలలో ఆయనతో కలిసి పనిచేశారు. దేశ పురోగమనంతోపాటు మరో రెండు రంగాలపై అశోక్ సింఘాల్ ఎంతో ఆసక్తి చూపేవారు. వాటిలో ఒకటి విద్య రెండోది సంగీతం. బీహెచ్‌యూలో విద్యాభ్యాసం చేసిన సమయంలో ఉత్తమ విద్యార్థిగానూ సింఘాల్ గుర్తింపు పొందారు. అశోక్ సింఘాల్ అద్భుత గాయకుడని ఆయనతో సాన్నిహిత్యం గలవారికి తెలుసు నాగ్‌పూర్‌లో సమావేశాల సందర్భంగా ఆయన ఏకల్ గీత్ ఆలాపనతో అందరినీ అప్రతిభులను చేయడం నేను ప్రత్యక్షంగా చూశాను. తద్వారా ఆయన సమావేశాలకు ఒక సుహృద్భావ వాతావరణాన్ని సృష్టించేవారు. ముఖ్యంగా తన 90వ జన్మదినం సందర్భంగా 2015లో ఆయన అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తుతూ హే మాతృభూమి మేరీ హే పితృభూమి మేరీ అని పాడిన వీడియో ఎంతగా ప్రజల్లోకి దూసుకెళ్లిందో నాకిప్పటికీ గుర్తుంది. ఈ నేపథ్యంలో ఇవాళ ఆయన శతజయంతి సందర్భంగా యువతరం మరింతగా ఆయన మహోన్నత వ్యక్తిత్వం గురించి తెలుసుకునేలా మనం కృషి చేద్దాం. మన మాతృభూమి కోసం, ప్రజా సంక్షేమం కోసం ఆయన కన్న కలల సాకారం దిశగా మన ప్రతిజ్ఞను పునరుద్ఘాటిద్దాం.

# రక్షణ రంగంలో స్వయంప్రతిపత్తి

## రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 27:** చిన్న స్క్రూల నుంచి చిప్స్, పూర్తిస్థాయి ఆయుధ వ్యవస్థల వరకు అన్నీ దేశంలోనే తయారు చేయడం ద్వారా భారత్ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని సాధిస్తుందని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. దేశం ప్రస్తుతం అదే దిశగా ముందుకు సాగుతోందని ఆయన అన్నారు. ఆదివారం జరిగిన డిఫెన్స్ సమ్మిట్‌లో ఆయన మాట్లాడుతూ మేక్ ఇన్ ఇండియా విధానం వెనుక ఉన్న ఉద్దేశాన్ని వివరించారు. మన సిద్ధాంతం చాలా సులభం. ఇక్కడ తయారు చేయగలిగిన వస్తువును బయట నుంచి ఎందుకు కొనుగోలు చేయాలి దీన్నే మనం స్వావలంబన అంటాం. చిప్స్ నుంచి నౌకల వరకు, స్క్రూల నుంచి సంపూర్ణ ఆయుధ వ్యవస్థల వరకు దేశీయంగా తయారు చేయడం ద్వారానే వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి సాధ్యమవుతుందని రాజ్‌నాథ్ సింగ్ నొక్కి చెప్పారు. భవిష్యత్ సవాళ్లను ఎదుర్కోవడానికి భారత్ సన్నద్ధతపై మాట్లాడుతూ, రక్షణ రంగంలో ఇప్పటికే కీలకమైన, నిర్మాణాత్మక సంస్కరణలు చేపట్టామని తెలిపారు. మేము కేవలం ప్రస్తుత అవసరాలను తీర్చడానికే పరిమితం కాలేదు. స్వావలంబన, భవిష్యత్ లక్ష్యాలతో ముందుకు వెళుతున్నాం. రక్షణ రంగం వేగం పుంజుకుందని ఆయన వివరించారు. టెలికాం రంగంలో 2జీ నుంచి 5జీకి మారిన వృద్ధిని ఉదాహరణగా చూపుతూ, యుద్ధ తంత్రాలు కూడా ఇప్పుడు 5వ తరంలోకి ప్రవేశించాయని అన్నారు. ప్రస్తుతం 5వ తరం యుద్ధాలపై చర్చ జరుగుతోంది. మారుతున్న ఈ వాతావరణంలో ప్రధానమంత్రి నాయకత్వంలో మన రక్షణ సన్నద్ధత కూడా అభివృద్ధి చెందుతోంది. స్వదేశీ క్వాంటం టెక్నాలజీని ప్రోత్సహిస్తున్నాం. కాంటాక్ట్, నాన్ కాంటాక్ట్, కైనెటిక్, నాన్‌కైనెటిక్ యుద్ధాల్లో మన సామర్థ్యాలను బలోపేతం చేసుకుంటున్నాం" అని తెలిపారు. భవిష్యత్తులో యుద్ధాలు మల్టీడొమైన్ ఎన్విరాన్‌మెంట్‌లో జరుగుతాయని, పూర్తిగా టెక్నాలజీ ఆధారితంగా ఉంటాయని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఆధునిక సైనికుడు కేవలం సైనికుడు మాత్రమే కాదు. వారు మల్టీడొమైన్‌లో పనిచేస్తారు. భవిష్యత్తులో యుద్ధ క్షేత్రం టెక్నాలజీతో నడుస్తుంది. టెక్నాలజీలో ఏ దేశం ముందుంటుందో, యుద్ధంలోనూ అదే దేశం ముందుంటుంది. మన రక్షణ వ్యూహం భవిష్యత్ సవాళ్లకు సిద్ధంగా ఉందని ఆయన భరోసా ఇచ్చారు.

# మొజ్తబా ఖమేనీ శిథిలాల నుంచి వెలికితీశాం

## మొహ్సెన్ హెయ్‌దరీ వెల్లడి



**టెహ్రాన్, సెప్టెంబరు 27:** ఇరాన్‌పై అమెరికా– ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభించిన మొదట్లోనే మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణించిన సంగతి తెలిసిందే. ఆ దాడిలో ఆయన కుమారుడు, కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా కూడా మరణించినట్లు తొలుత వార్తలు వచ్చినప్పటికీ.. దాడుల నుంచి ఆయన త్రుటిలో బయటపడినట్లు ఇరాన్ వెల్లడించింది. ఫిబ్రవరిలో జరిగిన ఈ ఘటన గురించి ఇరాన్ అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ సభ్యుడు మొహ్సెన్ హెయ్‌దరీ తాజాగా కీలక విషయాలు వెల్లడించారు. తమ అగ్రనేతపై దాడి జరిగింది ఒకసారి మాత్రమే కాదని.. రెండుసార్లు అమెరికా ఆయనను లక్ష్యంగా చేసుకుందని తెలిపారు. 'అలీ ఖమేనీ సహా కీలక నేతలు ఓ భవనంలో సమావేశమైన సమయంలో అమెరికా దాడులు చేసింది. ఈ ఘటనలో మాజీ సుప్రీం లీడర్ నేత ప్రాణాలు కోల్పోయారు. తీవ్రంగా గాయపడిన మొజ్తాబాను వైద్యం కోసం వెంటనే ఓ ఆస్పత్రికి తరలించాం. తర్వాత అమెరికా–ఇజ్రాయెల్ దళాలు ఆ ఆస్పత్రిపై కూడా విరుచుపడ్డాయి. దీంతో అది పూర్తిగా ధ్వంసమైంది. కొన్ని గంటల పాటు శ్రమించి మా బలగాలు శిథిలాల నుంచి మొజ్తాబాను బయటకు తీశారు. కొన ఊపిరితో ఉన్న ఆయనను మరో సురక్షిత ప్రాంతానికి తరలించి చికిత్స అం దిం చాం. బహిరంగంగా ప్రకటించే వరకు.. ఆయనను తదుపరి సుప్రీంగా ఎన్నుకున్న విషయం కూడా మొజ్తాబాకు తెలియదు. తర్వాత దానిని ఆయన అంగీకరించక తప్పలేదు.

# పుతిన్‌తో మాట్లాడాలి: జెలెన్‌స్కీకి ట్రంప్ సూచన



**వాషింగ్టన్, సెప్టెంబరు 27:** నాలుగేళ్లకుపైగా రష్యా–ఉక్రెయిన్ మధ్య ఘర్షణలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మాట్లాడి త్వరలో ఓ ఒప్పందానికి వస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశంలో జెలెన్‌స్కీతో భేటీపై మీడియా వద్ద ఈవ్యాఖ్యలు చేశారు. 'ఇన్నేళ్లుగా పుతిన్, జెలెన్‌స్కీ సర్దుకుపోతూవస్తున్నారు. త్వరలోనే వారు ఓ ఒప్పందానికి రావచ్చు. శీతాకాలానికి ముందే ప్రకటన వెలువడినా ఆశ్చర్యపోనక్కరలేదు. ఎందుకంటే యుద్ధాన్నిముగించాలని జెలెన్‌స్కీకోరుకుంటున్నారు'అనిట్రంప్ పేర్కొన్నారు.

# సంక్షిప్త వార్తలు

## 110 రోజులకు చేరిన నిరసనలు



**పాక్ ఆక్రమిత కాశ్మీర్, సెప్టెంబరు 27:** పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పిఒకె)లో కొంతకాలంగా ఆందోళనలు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. తమను భారత్‌లో కలపాలంటూ పిఒకెలో స్థానిక ప్రజలు అవామీ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తున్నారు. గత జూన్ 9న ప్రారంభమైన నిరస నలు శనివారానికి 110 రోజుకు చేరాయి. పాక్ ఆక్రమిత జమ్మూ కాశ్మీర్‌ను ఇండియాలోని జమ్మూ కాశ్మీర్‌లో కలపాలని అక్కడి వారు డిమాండ్ చేస్తున్నారు. పిఒకెలోని ముందోల్ గ్రామంలో శని వారం భారీ నిసరన ప్రదర్శన జరిగింది. ఈ ఆందోళనల్లో 25,000 మంది పాల్గొన్నారు.

## భారత్‌కు శాశ్వత సభ్యత్వం ఉండాలి: సెర్గీ లావ్రోవ్



**న్యూయార్క్, సెప్టెంబరు 27:** ఐక్యరాజ్యసమితిలో ఇండియాకు శాశ్వత సభ్యత్వం కల్పించే ప్రతిపా దనకు తాము మద్దతు ఇస్తున్నామని రష్యా ప్రకటించింది. పశ్చిమ దేశాలకు మాత్రం ఈ విష యంలో చోటు లేదని కూడా రష్యా స్పష్టం చేసింది. అమెరికా, న్యూయార్క్‌లో ఐక్యరాజ్యసమితి సాధారణ సర్వసభ్య వార్షిక సమావేశం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ మాట్లాడారు. ఇండియా శాశ్వత సభ్యత్వానికి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఇదే సమయంలో ఏ పాశ్చాత్య దేశానికి కొత్తగా శాశ్వత సభ్యత్వం కల్పించేందుకు తాము వ్యతిరేకం అని లావ్రోవ్ స్పష్టం చేశారు.

## దక్షిణాఫ్రికాలో కాల్పులు: 27 మంది మృతి



**జోహాన్స్‌బర్గ్, సెప్టెంబరు 27:** ప్రపంచంలోనే అత్యధిక నేరాలు జరిగే దేశాలలో ఒకటైన దక్షిణాఫ్రికా మరోసారి రక్తమోడింది. జోహన్నెస్‌బర్గ్, కేప్‌టౌన్ ప్రాంతాల్లో జరిగిన ఈ దారుణ కాండలో కనీసం 27 మంది ప్రాణాలు కోల్పోయారు. జోహన్నెస్‌బర్గ్ నగరానికి నైరుతి దిశలో ఉన్న వెడెలా టౌన్ షిప్‌లోని ఒక బార్‌లో గత రాత్రి ఘోర కాల్పులు చోటుచేసుకున్నాయి. ఏకే47 రైఫిల్స్, పిస్టళ్లతో వచ్చిన ఎనిమిది మంది దుండగులు ఒక్కసారిగా బార్‌పై విచక్షణారహి తంగా కాల్పులు జరిపారు. ఈ దాడిలో అక్కడికక్కడే 17 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మరువకముందే కేప్‌టౌన్ సమీపంలోని ల్యాండ్లే ప్రాం తంలో ఆదివారం తెల్లవారు జామున జరిగిన సామూహిక కాల్పుల్లో మరో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో మరో 11 మంది తీవ్రంగా గాయపడ్డారు.

## నేపాల్ హిమపాతంలో 10మంది గల్లంతు



**ఖాట్మండు, సెప్టెంబరు 27:** నేపాల్‌లో ఆదివారం ఉదయం సంభవించిన హిమపాతం వల్ల 10 మంది గల్లంతైనట్లు పర్వతారోహణ సంస్థ నిర్వాహకులు ప్రకటించారు. ఈ ఘటన పశ్చిమ నేపాల్, హిమ్లుంగ్ హిమల్ బేస్ క్యాంప్‌లో ఆదివారం ఉదయం జరిగింది. ఈ ప్రాంతం టిబెట్ సరిహద్దులో ఉంటుంది. వరుసగా కురుస్తున్న మంచు వల్ల మంచు పర్వతం విరిగిపడటం వల్ల పదిమంది కొట్టుకుపోయారని నిర్వాహకుడు మింగ్మా గ్యాల్జె షెర్పా తెలిపారు. గల్లంతైన వారిలో ఇద్దరు కిచెన్ స్టాఫ్ కూడా ఉన్నట్లు వెల్లడించారు. షెర్పా తెలిపిన వివరాల ప్రకారం వాతావరణం సరిగ్గా లేదని గతవారమే హెచ్చరించారు.

## బంగ్లాదేశ్‌లో మరో హిందూ నగల వ్యాపారి హత్య



**ఢాకా, సెప్టెంబరు 27:** బంగ్లాదేశ్‌లో మైనారిటీల భద్రతపై మరోసారి తీవ్ర కలకలం రేగింది. తాజాగా మణికట్టు వ్యాపారం చేసుకునే ఒక హిందూ జ్యువెలర్ దారుణ హత్యకు గురయ్యారు. మైమన్ సింగ్ జిల్లాలోని ఒక స్లూయిస్ గేట్ వద్ద నీటిలో తేలుతున్న ప్లాస్టిక్ డ్రమ్‌లో ఆయన మృతదేహం కనిపించడం అక్కడి స్థానికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. చనిపోయిన వ్యక్తిని 50 ఏళ్ల నిరంజన్ చంద్ర సూత్రధార్‌గా గుర్తించారు.




# ఆధార్ ఉచిత అప్‌డేట్ గడువు పొడిగింపు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 27:** ఆధార్ ఫ్రీ అప్‌డేట్ విషయంలో యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా కీలక ప్రకటన చేసింది. 5 నుంచి 17 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్‌ను ఈనెల 30 వరకు ఉచితంగా చేసుకునే అవకాశం ఉంది. ఆ తర్వాత వర్తించే రుసుములు చెల్లించాల్సి రావచ్చు. ఐదు సంవత్సరాల లోపు పిల్లల ఆధార్ నమోదు సమయంలో వేలిముద్రలు, కనుపాపల వివరాలు తీసుకోరు. పిల్లలకు ఐదేళ్లు నిండినప్పుడు ఫొటో, వేలిముద్రలు, రెండు కనుపాపల వివరాలతో తొలి తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్ చేయాలి. 15 ఏళ్లు నిండినప్పుడు మరోసారి బయోమెట్రిక్ వివరాలను అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. యుఐడిఎఐ ప్రకారం 5-7, 15-17 ఏళ్ల వయస్సు మధ్య జరిగే నిర్దేశిత బయోమెట్రిక్ అప్‌డేట్లు ఉచితంగా ఉంటాయి. 7 నుంచి 15 ఏళ్ల మధ్య పిల్లల తొలి తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్‌కు ప్రత్యేకంగా ఫీజు మినహాయింపు ఇచ్చింది.

# కాంగ్రెస్ హయాంలో అన్నీ కుంభకోణాలే..

## గుజరాత్‌లో ఎల్ఎన్‌జి రైలును ప్రారంభించిన హోంమంత్రి అమిత్‌షా




**సబర్మతి, సెప్టెంబరు 27:** కాంగ్రెస్ హయాంలో కుంభకోణాలు తప్ప మరేమీ జరగలేదని, కానీ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పాలనలో రైల్వేలో సమూల మార్పులు జరిగాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. గత 12 ఏళ్లలో మోడీపై ఎవరూ అవినీతి ఆరోపణలు చేయలేకపోయారని చెప్పారు. అర్థరహితంగా మాట్లాడే కాంగ్రెస్ పార్టీని వాస్తవాలు, గణాంకాల ఆధారంగా చర్చకు రావాలని సవాలు చేయా లంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం గుజరాత్‌లోని సబర్మతి రైల్వే స్టేషన్ నుంచి భార తదేశపు తొలి ఎల్ఎన్‌జీ రైలును జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో షా ప్రసంగించారు. మోడీ ప్రభుత్వం, రైళ్లలో 97 శాతం బయోటాయి లెట్లను ఏర్పాటు చేసిందని, అలాగే 87 శాతం ఎల్‌హెచ్‌బి కోచ్‌లను భారతదేశంలోనే తయారు చేశారని అమిత్ షా పేర్కొన్నారు. వీటితో పాటు రైల్వే విద్యుదీకరణ 70 శాతానికి పెరిగిందని, రైల్వే భద్రతకు సంబంధించి బడ్జెట్ 67 శాతం పెరిగిందని, అలాగే లోకోమోటివ్ తయారీ సామ ర్థ్యం కూడా 66 శాతం పెరిగిందని ఆయన పేర్కొ న్నారు. మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ భావనలను మోడీ బలోపేతం చేశారని చెప్పారు. 2015-16లో రైల్వేలు 293 కోట్ల లీటర్ల డీజిల్‌ను వినియోగించాయి. 2024-25 నాటికి ఇది 108 కోట్ల లీటర్లకు తగ్గింది. 2030 నాటికి ఇది సున్నాకి చేరుతుంది. ఫలితంగా విదేశీ కరెన్సీని ఆదా చేయగలుగుతాం అని షా పేర్కొన్నారు. 2010-11లో ఏటా కేవలం 75 కి.మీ. మేర రైల్వే మార్గాల విద్యుదీకరణ జరగ్గా, 202324 నాటికి ఆ సంఖ్య 7,188 కి.మీ.కి పెరిగిందని షా చెప్పారు. రైల్వే శాఖ 99.6 శాతం విద్యుదీకరణను పూర్తి చేసిందని, మిగిలిన 0.3 శాతాన్ని కూడా తాము పూర్తి చేస్తామని చెప్పారు. విద్యుదీకరణ విషయంలో చైనాలో 92 శాతం, స్పెయిన్‌లో 68 శాతం, ఫ్రాన్స్‌లో 60 శాతం, బ్రిటన్ వంటి దేశంలో 49 శాతం పురోగతి ఉంది. భారత్‌లో మాత్రం దీన్ని 100 శాతానికి చేర్చే దిశగా తాము ముందుకు సాగుతామని షా పేర్కొన్నారు. ఈ సందర్భంగా రూ.1500 కోట్లకు పైగా విలువైన ప్రధాన రైల్వే ప్రాజెక్టులకు అమిత్‌షా శంకుస్థాపన చేశారు. వీటిలో రైలు మార్గాల డబ్లింగ్ పనులు, రైలు ప్రమాదాలను నివారించే కవచ్ రక్షణ వ్యవస్థ, ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థ, 12 ఎలక్ట్రిక్ లోకోమోటివ్ నిర్వహణ ఉన్నాయి. ఈ కార్యక్రమంలో గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, ఉప ముఖ్యమంత్రి హర్ష్ సంఘవి, రైల్వే శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# లవ్లీ ప్రొఫెషనల్ వర్సిటీలో విద్యార్థుల నిరసన

**అమృత్‌సర్, సెప్టెంబరు 27:** సోషల్ మీడియాలో వైరల్ అయిన నిర్ధారణ లేని పోస్టులు పంజాబ్‌లోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ (ఎల్‌పీయూ)లో తీవ్ర విధ్వంసానికి దారితీశాయి. ఓ విద్యార్థినిపై సామూహిక అత్యాచారం జరిగిందని అనంతరం ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రచారం జరగడంతో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఈ ఆరోపణలకు సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఇప్పటివరకు ఎలాంటి ఆధారాలు కూడా లభించలేదని పోలీసులు స్పష్టం చేశారు. ఫగ్వారా ప్రాంతంలోని ఎల్‌పీయూ క్యాంపస్‌లో గత అర్ధరాత్రి తర్వాత ఈ ఉద్రిక్తత మొదలైనట్లు తెలుస్తోంది. సుమారు 2 వేల మంది విద్యార్థులు లేడీస్ హాస్టల్ సమీపంలో గుమిగూడి నిరసనకు దిగారు. మొదట నినాదాలు, ఆందోళనతో కొనసాగిన నిరసన క్రమంగా తీవ్ర ఉద్రిక్తంగా మారింది. అనంతరం కొందరు విద్యార్థులు క్యాంపస్‌లోని కిటికీ అద్దాలు, ఫ్లవర్ పాట్స్, ఇతర సామగ్రిని ధ్వంసం చేశారు. కొన్ని వస్తువులకు, బిల్డింగ్‌లోని కొన్ని ప్రాంతాలకు నిప్పు పెట్టినట్లు వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. విద్యార్థుల ఆందోళన కేవలం ఎల్‌పీయూ క్యాంపస్‌కే పరిమితం కాలేదు. జలంధర్‌ఫగ్వారా జాతీయ రహదారిపైకి వెళ్లి రాకపోకలను అడ్డుకున్నారు. దీంతో నేషనల్ హైవేపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు కపుర్తలా పోలీసులు భారీగా మోహరించారు. ఎస్ఎస్పీ గౌరవ్ తూరా స్వయంగా ఘటనాస్థలికి చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం రహదారిని క్లియర్ చేసి పోలీసులు ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. వైరల్‌అవుతున్న అత్యాచారం, ఆత్మహత్య ఆరోపణలపై పోలీసులు కీలక విషయాలను వెల్లడించారు. కపుర్తలా ఎస్ఎస్పీ గౌరవ్ తూరా వెల్లడించిన వివరాల ప్రకారం విద్యార్థులు చెబుతున్నట్లుగా అత్యాచారం జరిగినట్లు నిర్ధారించే ఆధారాలు ఇప్పటివరకు లభించలేదు.

# నాలుగేళ్లలో పార్టీ ఫిరాయించిన ఎంపి, ఎమ్మెల్యేలు 111

## పార్టీల విలీనం, ఫిరాయింపులే కీలకం



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 27:** దేశంలో గడచిన నాలుగేళ్లలో 111 మంది సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేలు తమ రాజకీయ పార్టీలు మారారు. వీరిలో 26 మంది లోక్‌సభ ఎంపీలు, ఏడుగురు రాజ్యసభ ఎంపీలు, 78 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ 111 మందిలో 29 మంది అంటే 26 శాతం మంది ప్రజాప్రతినిధులు బీజేపీలో చేరారు. పార్టీ మారిన ప్రజాప్రతినిధులను చేర్చుకోవడంలో ఆ పార్టీ రెండవ అతిపెద్ద పార్టీగా నిలిచింది. అత్యధికంగా 32 మంది ప్రజాప్రతినిధులు నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పీఎఫ్)లో చేరారు. ఇది మొత్తం సంఖ్యలో 29 శాతం ఉన్నది. ఎమ్మెల్యేలు పార్టీ మారడం వల్ల కాకుండా 2025లో పార్టీ విలీనం వల్ల ఇది జరిగింది. ముఖ్యమంత్రి నెయిఫియు రియో నేతృత్వంలోని నేషనలిస్ట్ డెమోక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (ఎన్డీపీపీ)కి చెందిన 32 మంది ఎమ్మెల్యేలు, కేవలం ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్న ఎన్‌పీఎఫ్‌లో విలీనమ్యారు. ఈ విలీనం తర్వాత ఎన్‌పీఎఫ్ శాసనసభాపక్ష నాయకుడిగా సీఎం రియో ఎన్నికయ్యారు. అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్, నేషనల్ ఎలక్షన్ వాచ్ నిర్వహించిన తాజా విశ్లేషణ ప్రకారం ఈ వివరాలు వెల్లడయ్యాయి. 2022-26 మధ్య జరిగిన సాధారణ ఎన్నికలు, ఉప ఎన్నికలను పరిగణనలోకి తీసుకుని ఈ అధ్యయనం జరిపాయి. ఈ నివేదిక ప్రకారం, 17 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో పార్టీ మార్పులు జరిగాయి. అత్యధికంగా నాగాలాండ్‌లో 32 మంది ప్రజా ప్రతినిధులు పార్టీ మారారు. ఆ తర్వాతి స్థానాల్లో పశ్చిమ బెంగాల్ (20 మంది), తెలంగాణ (తొమ్మిది మంది), గోవా, పంజాబ్‌లో ఎనిమిది మంది చొప్పున ప్రజా ప్రతినిధులు పార్టీలు మారారు. అయితే ఈ 111 మంది ప్రజా ప్రతినిధుల కేసులు కేవలం సాధారణ పార్టీ ఫిరాయింపులు మాత్రమే కావు. పార్టీ విలీనాలు, ఉప ఎన్నికల్లో గెలిచే ముందు రాజీనామా చేసి పార్టీ మారిన ప్రజాప్రతినిధులు, అలాగే అనర్హతకు గురై ఆ తర్వాత మరో పార్టీ టికెట్‌పై గెలిచిన వారిని కూడా ఏడీఆర్ పరిగణనలోకి తీసుకున్నది. మరోవైపు ఏడీఆర్ జాబితా ప్రకారం బీజేపీలో చేరిన 29 మంది చట్టసభ సభ్యులలో, ఏడుగురు రాజ్యసభ ఎంపీలు, 22 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నుంచి ఎన్నికైన ఏడుగురు రాజ్యసభ సభ్యులైన స్వాతి మాలివాల్, అశోక్ మిట్టల్, హర్భజన్ సింగ్, రాఘవ్ చద్దా, సందీప్ కుమార్ పాఠక్, విక్రమ్‌జిత్ సింగ్ సాహ్నీ, రాజిందర్ గుప్తా ఆ తర్వాత బీజేపీలో చేరారు. ఇక బీజేపీలో చేరిన 22 మంది ఎమ్మెల్యేల్లో కాంగ్రెస్‌కు చెందిన 8 మంది గోవా ఎమ్మెల్యేలు, గుజరాత్ నుంచి నలుగురు, హిమాచల్ ప్రదేశ్ నుంచి ఇద్దరు శాసన సభ్యులు ఉన్నారు. మణిపూర్‌కు చెందిన ఐదుగురు జేడీ(యూ) ఎమ్మెల్యేలు కూడా బీజేపీలో చేరినట్లు ఈ నివేదిక పేర్కొంది. కాగా, ఎన్‌పీఎఫ్, బీజేపీ తర్వాత త్రిపురా రాష్ట్రానికి చెందిన నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ) 20 మంది ప్రజాప్రతినిధులను ( 111 మందిలో 18 శాతం) తనలో చేర్చుకున్నది. 2026 పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధికారాన్ని కోల్పోయిన తర్వాత, ఆ పార్టీకి చెందిన 20 మంది లోక్‌సభ ఎంపీలు తిరుగుబాటు చేశారు. జూన్ 14న తక్కువ ప్రాచుర్యం కలిగిన ఎన్‌సీపీఐలో తమ పార్టీని విలీనం చేస్తున్నట్లు వారు తెలిపారు. లోక్‌సభలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి మద్దతు ప్రకటించారు.

# గుట్కా అక్రమ తరలింపును అడ్డుకున్న తమిళనాడు పోలీస్

## జేమ్స్‌బాండ్ తరహాలో హెడ్‌కానిస్టేబుల్ ఛేజింగ్




**చెన్నై,సెప్టెంబరు 27:** కర్ణాటక నుంచి అక్రమంగా గుట్కా తరలిస్తున్న ముగ్గురు రాజస్థాన్‌కు చెందిన వ్యక్తులను తమిళనాడులోని కోయంబత్తూరు పోలీసులు సినిమా స్టైల్‌లో ఛేజ్ చేసి పట్టుకున్నారు. బెంగళూరు నుంచి కారులో 300 కిలోల నిషేధిత పొగాకు ఉత్పత్తులను తరలిస్తుండగా కోవిల్‌పాళయం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. తనిఖీల సమయంలో పోలీసులు ఆపడానికి ప్రయత్నించగా, నిందితులు ఎస్ఐని పక్కకు తోసేసి కారుతో పరారయ్యేందుకు యత్నిం చారు. నిందితులను పట్టుకునేందుకు హెడ్ కానిస్టేబుల్ వేల్మురుగన్ అత్యంత సాహసంతో పరుగులు తీస్తున్న కారు పైకప్పుపైకి దూకారు. కారుపై పోలీసు వేలాడుతున్నప్పటికీ నిందితులు ఏమాత్రం పట్టించుకోకుండా సుమారు 40 కిలోమీటర్ల దూరం వేగంగా కారును నడిపారు. ఈ వాహనం విళాంకురిచ్చి, కాళపట్టి, సిత్రా మీదుగా కనియూర్ టోల్‌ప్లాజా వైపు దూసుకెళ్లింది. కారు పైకప్పుపై హెడ్ కానిస్టేబుల్ వేలాడుతున్న దృశ్యాలను దారిన పోయే వాహనదారులు తమ సెల్‌ఫోన్లలో వీడియోలు రికార్డు చేశారు. సమాచారం అందుకున్న ఇతర పోలీసులు, అంబులెన్స్ సిబ్బంది వెంటనే అప్రమత్తమై కారును వెంబడించారు. అవినాశి పోలీసుల సహకారంతో అన్నపూర్ణ హోటల్ సమీపంలో పోలీసులు ఆ కారును పూర్తిగా చుట్టుముట్టి నిలిపివేశారు.

కారు ఆగిన వెంటనే ఇద్దరు నిందితులు పారిపోయేందుకు ప్రయత్నించగా, అప్రమత్తమైన పోలీసులు వెంటాడి ఆ ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిం దితుల నుంచి 300కిలోల గుట్కా, పొగాకు ఉత్ప త్తులతో పాటు రవాణాకు ఉపయోగించిన కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రా ణాలను సైతం లెక్కచేయకుండా కారు పైకప్పుపై 40 కిలోమీటర్లు ప్రయాణించి నిందితులను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన హెడ్ కాని స్టేబుల్ వేల్మురుగన్ ధైర్యసాహసాలను అభినందిస్తూ తమిళనాడు వ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

28 -9Pg6exHMNWJQE.qxd:28 -9Pg6exHMNWJQE.qxd 1/1/02 6:10 AM Page 1



### నేషనల్ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని

# విజయవాడలో 2కె రన్

**విజయవాడ, సెప్టెంబర్ 27,ప్రభాతవార్తప్రతినిధి:** ఆరోగ్యకరమైన జీవనశైలికి క్రమం తప్పని వ్యాయామం, సమతుల ఆహారం, క్రమబద్ధమైన దినచర్య, ముందస్తు ఆరోగ్య సంరక్షణ ఎంతో అవసరమని సీఎం, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ అన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం.. నిత్య వ్యాయామమే ఆరోగ్యానికి పునాది అనే సందేశంతో నేషనల్ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలో ఆదివారం నిర్వహించిన 2కే రన్ ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా జరిగింది. ఆరోగ్యం, ఫిట్‌నెస్, వెల్‌నెస్, ముందస్తు ఆరోగ్య సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో బీఆర్‌టీఎస్ రోడ్డులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆరోగ్య, ఫిట్‌నెస్‌పై ఆసక్తి ఉన్నవారు, రోటరీ సభ్యులు, కుటుంబాలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీ గాయత్రి ఆయుర్వేదిక్ మల్టీ స్పెషాలిటీ సెంటర్, రోటరీ విజయవాడ మిడ్‌టౌన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ 2కే రన్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ కె. విజయానంద్ మాట్లాడుతూ నేషనల్ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ప్రజల్లో ఆరోగ్యం, వెల్‌నెస్‌పై అవగాహన కల్పించేందుకు 2కే రన్ నిర్వహించడం అభినందనీయమని నిర్వాహకులను ప్రశంసించారు. నడక, పరుగు, క్రమం తప్పని వ్యాయామం వంటి



చిన్నచిన్న ఆరోగ్యకరమైన అలవాట్లను దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. ఆయుర్వేదంలోని సమగ్ర ఆరోగ్య విధానం ప్రాధాన్యతను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు, వ్యాధులు వచ్చిన తర్వాత చికిత్స పొందడం కంటే ముందస్తు ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన ఆహారం, తగిన విశ్రాంతి, నిత్య శారీరక వ్యాయామం సమగ్ర ఆరోగ్యానికి దోహదపడతాయని తెలిపారు. బీఆర్‌టీఎస్ రోడ్డులో ఉదయం 7 గంటలకు ప్రారంభమైన 2కే రన్లో పాల్గొన్న వారు ఆరోగ్యప్రాధాన్యత, వ్యాయమం, సమతుల్యత ఆహారంఅనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. వివిధ వయసుల వారు ఉత్సాహంగా పాల్గొన్న ఈ కార్యక్రమం ప్రజల్లో ఫిట్‌నెస్‌పై అవగాహన పెంపొందించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించింది.

## స్వచ్ఛత వైపు ప్రజలు అడుగులు వేయాలి

• స్వచ్ఛ ఆంధ్ర చైర్మన్ పట్టాభిరామ్



**విజయవాడ.సెప్టెంబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:** స్వచ్ఛత వైపు ప్రజలు అడుగులు వేయాలని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి రామ్ పిలుపు ఇచ్చారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబర్ 2న స్వచ్ఛథాన్2026 ను మరింత ఆకర్షణీయంగా నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. విజయవాడ ఉత్సవ్ కు ప్రారంభ వేడుకగా నిలువనున్న స్వచ్ఛథాన్ రాష్ట్రం లో స్వచ్ఛత, పచ్చదనంపై ప్రభావవంతమైన సందేశాన్ని ఇవ్వనుందన్నారు. విజయవాడ బందరు రోడ్డులో ఆదివారం ఉదయం 6 గంటలకు జరిగిన హెచ్‌డీఎఫ్‌సీ స్వచ్ఛథాన్2026 ప్రోమో రన్ లో పాల్గొన్న అమరావతి రన్నర్స్, విజయవాడ రన్నర్స్ ను ఉద్దేశించి పట్టాభిరామ్ మాట్లాడారు. రాష్ట్ర రాజధాని అమరావతికి స్వాగత ద్వారం లాంటి విజయవాడలోని అంబేద్కర్ విగ్రహం, ఆర్టీసీ బస్టాండు, కనకదుర్గ గుడి, ప్రకాశం బ్యారేజ్, అమరావతి సీడ్ యాక్సిస్ రోడ్ , కృష్ణా నది కరకట్ట వంటి వివిధ ఐకానిక్ స్పాట్స్ ను కలుపుతూ స్వచ్ఛథాన్ రెండవ సంచిక రూట్ ను రూపొందించారు. పరుగులో పాల్గొనబోతున్న వారికి ఒక కొత్త అనుభవాన్నిఅందిం చనున్నట్లు చెప్పారు. స్వచ్ఛత ఇతివృత్తంతో దేశంలో నిర్వహిస్తున్న ఏకైక మారథాన్‌గా నిలుస్తున్న స్వచ్ఛథాన్2026లో పాల్గొనే ప్రతి ఒక్క రికీ మెడల్ తోపాటు ఒక మొక్కను కూడా బహుమతిగా ఇచ్చి స్వచ్ఛ ఆంధ్రతో పాటు హరితాంధ్ర ప్రదేశ్ సందేశాన్ని కూడా ఇస్తున్నట్లు పట్టాభి రామ్ చెప్పారు. స్వచ్ఛత విషయంలో దేశంలో మన రాష్ట్రం ఒక ఆదర్శప్రాయంగా ఉండాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పని చేస్తున్నారని చెప్పారు. వారి ఆశయాలకు అనుగుణంగా స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

# అమరావతిలో ప్రపంచ పర్యాటక దినోత్సవం

**అమరావతి.సెప్టెంబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:** డిజిటల్ ఎజెండా అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టు రీడిజైన్ టూరిజం" అనే ప్రధాన ఇతివృత్తంతో ప్రపంచ పర్యాటక దినోత్సవ కార్యక్రమాలను అమరావతిలో ఘనంగా నిర్వహించారు. చారిత్రక వారసత్వ నగరమైన అమరావతిలో పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అమరావతిలోని ఎస్సీ గురుకుల పాఠశాల (మహిళలు)లో విద్యార్థులకు పర్యాటక ప్రదేశాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో క్విజ్, వ్యాసరచన మరియు డిబేట్ పోటీలు నిర్వహించారు. అనంతరం ఉదయం 9.00 గంటలకు అమరావతి ఆర్కియాలజీ మ్యూజియం వద్ద నుంచి అమరావతి స్థూపం మీదుగా బుద్ధుని విగ్రహం వరకు హెరిటేజ్ వాక్ నిర్వహించారు. హెరిటేజ్ వాక్ అనంతరం బుద్ధుని విగ్రహం పరిసరాల్లో పరిశుభ్రత కార్యక్రమం, స్వచ్ఛ ఆంధ్ర ప్లెడ్జ్ మరియు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. అలాగే వివిధ పోటీల్లో విజేతలకు అవార్డులను ప్రదానం చేశారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం2026 థీమ్‌కు అనుగుణంగా, పర్యాటక రంగంలో డిజిటల్ సాంకేతికత, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం, వారసత్వ పర్యాటక అభివృద్ధి మరియు స్థిరమైన పర్యాటకం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.. స్పెషల్ చీఫ్ సెక్రటరీ రావత్, పర్యాటక శాఖ ముఖ్య కార్యనిర్వహణ అధికారి రవి సుభాష్ సూచనల మేరకు, పల్నాడు జిల్లా కలెక్టర్ జిల్లా మేజిస్ట్రేట్ డా. కృతిక శుక్లా ఆదేశాల మేరకు ఈ ఉత్సవాలు నిర్వహించారు, ఈ సందర్భంగా పల్నాడు జిల్లా కలెక్టర్ డా. కృతిక శుక్లా అమరావతిలో పర్యాటక, చారిత్రక మరియు బౌద్ధ వారసత్వ పరంగా ప్రాముఖ్యత కలిగిన కాలచక్ర మ్యూజియాన్ని సీఎస్ఆర్ నిధుల సహకారంతో రూ.8 లక్షల వ్యయంతో ఆధునికీకరించి అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని తెలియజేశారు. కాలచక్ర మ్యూజియం ఆధునికీకరణ పనులను త్వరితగతిన చేపట్టేందుకు తిశిగిదీది ఇంజనీరింగ్ సిబ్బంది



అమరావతిలో ప్రపంచ పర్యాటక దినోత్సవం బుద్ద విగ్రహం వద్ద ప్రదర్శన

చర్యలు తీసుకుంటున్నారని, టెండర్ ప్రక్రియను త్వరలోనే పూర్తి చేసి పనులను ప్రారంభించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు ప్రపంచ పర్యాటక దినోత్సవ కార్యక్రమంలో తెలిపారు. అమరావతి బౌద్ధ వారసత్వం, చారిత్రక ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని కాలచక్ర మ్యూజియం ఆధునికీకరణ పూర్తయితే పర్యాటకులకు మరింత మెరుగైన సౌకర్యాలు, సమాచారాన్ని అందించడంతో పాటు అమరావతి పర్యాటక ఆకర్షణను మరింత పెంచేందుకు దోహదపడుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి నాయుడమ్మ, ।విగితిదిబీ గుంటూరు చాప్టర్ కన్వీనర్ రవిశంకర్, అఖిల భారత పంచాయతీ పరిషత్ (ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు పల్నాడు జిల్లా పర్యాటక మండలి సభ్యులు డా. జాస్తి వీరాంజనేయులు, కోలా వెంకటేశ్వరరావు, అమరావతి ఎంపీడీవో శివ పార్వతి, డిప్యూటీ ఎంపీడీవో రాజబాబు, ఈవోపీఆర్డీ పద్మజ, ఎంఈవో శివబాబు, ఎంఈవో 2 ప్రసాద్, అమరావతి యూనిట్ మేనేజర్ అశోక్, డీఈ కుమార్, మాజీ ఎంపీపీ మేకల హనుమంతరావు, గురుకుల పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

### దేశ ప్రజల భావోద్వేగాలకు ప్రతిరూపమైన

# ప్రజా గొంతుక మన్‌కీబాత్

• బిజెపి జాతీయ ఉపాధ్యక్షుడు రామ్ మాధవ్

**తిరుమల,సెప్టెంబర్ 27ప్రభాతవార్తప్రతినిధి:** దేశ ప్రధాని నరేంద్ర మోదీ "మన్ కీ బాత్" కార్యక్రమం కేవలం రేడియో ప్రసంగం కాదని, అది దేశ ప్రజల భావోద్వేగాలకు ప్రతిరూపమైన ప్రజా గొంతుక అని బిజెపి జాతీయ ఉపాధ్యక్షుడు రామ్ మాధవ్ అభివర్ణించారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ లేవనెత్తిన ఓట్ చోరీ ఆరోపణలు, ఎన్నికల సంఘం పై చేస్తున్న నిరాధార విమర్శలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఆదివారం ఉదయం తిరుమల శ్రీవారిని బిజెపి జాతీయ ఉపాధ్యక్షుడు వారణాసి రామ్ మాధవ్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం తిరుపతిలోని బిజెపి జిల్లా పార్టీ కార్యాలయాన్ని సందర్శించారు. అక్కడ పార్టీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ అధ్యక్షతన పార్టీ కార్యకర్తలతో కలిసి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిర్వహించిన మన్ కీ బాత్ 138వ ఎపిసోడ్‌ను వీక్షించారు. ఈ సందర్భంగా రామ్ మాధవ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజల సంక్షేమం కోసం చేస్తున్న నిరంతర కృషిని కొనియాడారు. ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పును జీర్ణించుకోలేక, పరాజయ భయంతో ప్రతిపక్షాలు రాజ్యాంగ సంస్థలను అప్రతిష్ట పాలు చేసేలా చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపు నిచ్చారు. అక్టోబర్ 7వ తేదీకి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ముఖ్యమంత్రి , ప్రధానమంత్రి పదవులలో అద్భుతమైన 25 సంవత్సరాల సుపరిపాలనను పూర్తి చేసుకుంటున్న సందర్భంగా దేశవ్యాప్తంగా చేపట్టిన సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమాలను మరింత ఉత్సాహంగా, విజయవంతంగా పూర్తి చేయాలని కోరారు. మన రాజకీయ ప్రయాణం పదవుల కోసం కాకుండా నిజమైన ప్రజా సేవల కోసమేనని, మోదీ నాయకత్వ శైలిని ప్రపంచ దేశాల నాయకులు కొనియాడుతున్నారని ఆయన తెలిపారు.

## సెమీఫైనల్స్‌కు చేరిన బాల్ బ్యాడ్మింటన్ పోటీలు

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 27 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తిలోని విద్యా ప్రకాశానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం లో మూడు రోజులుగా జరుగుతున్న జాతీయస్థాయి 72వ జాతీయ స్థాయి సీనియర్ బాలురు, బాలికల బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం సాయంత్రం అందిన సమాచారం మేరకు సెమీఫైనల్స్ కు చేరుకున్నాయి. దేశంలో 29 రాష్ట్రాల నుంచి సుమారు 500 మందికి పైగా బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారులు హాజరయ్యారు. రాష్ట్ర అసోసియేషన్ కార్యదర్శి బాలాజీ, శ్రీకాళహస్తి అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్ వెంకట స్వామిలు పర్యవేక్షిస్తున్నారు. రెండు రోజులుగా ఎండలు దడపుట్టిస్తున్నా క్రీడాకారులు ఖాతరు చేయక విజయానికి పరుగులు తీసారు. వచ్చిన క్రీడాకారులకు బస సదుపాయాలను నిర్వాహకులు పర్యవేక్షించారు. అలాగే భోజన వసతులు కల్పించారు. వచ్చిన వారికి సమాచారం ఇవ్వటానికి ప్రత్యేక బృందాన్ని నియమించుకున్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించుటకు రాష్ట్ర అసోసియేషన్ అనుమతించటంతో ఇక్కడ నిర్వహించారు. మొదటి స్థానం సాధించిన క్రీడాకారునికి శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి రూ.లక్షలు ప్రకటించగా ఇతర బహుమతులను రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ పర్యవేక్షిస్తున్నారు. కాగా వచ్చిన క్రీడాకారులకు బస వసతి కల్పించటంలో వన్‌టౌన్ సిఐ వెంకటేష్ చొరవ చూపారు.

**క్వార్టర్ ఫైనల్స్ ఫలితాలు:** శ్రీకాళహస్తిలో జరుగుతున్న జాతీయ స్థాయి 72వ సీనియర్‌బాలురు, బాలికల పోటీల్లో ఆదివారం సాయంత్రం జరిగిన క్వార్టర్ ఫైనల్స్ ఫలితాలను నిర్వాహకులు ప్రకటించారు. బాలురు విభాగంలో ఇండియన్‌రైల్వే



టీం పుదుచ్చేరిపై విజయం సాధించింది. ఆంధ్రప్రదేశ్ టీం మహారాష్ట్రపై విజయం సాధించింది. కర్నాటక టీం తెలంగాణ జటుపై విజయం సాధించింది. తమిళనాడు క్రీడాకారులు ఏఐఇఎస్‌సిబిపై గెలుపొంది సెమిఫైనల్స్ కు చేరుకున్నారు. నాలుగు టీంలు సెమిఫైనల్స్‌లో తలపడనున్నారు.

**బాలికల టీం ఫలితాలు:**72వ జాతీయ బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో బాలికల విభాగం క్వార్టర్ ఫైనల్స్‌లో విజయం సాధించిన టీంల వివరాలను నిర్వాహకులు ప్రకటించారు. తమిళనాడు బాలికలు బీహార్‌పై గెలుపొందారు. ఉత్కంఠభరి తంగా సాగిన మరో మ్యాచ్‌లో కర్నాటక బాలికలు రాజస్థాన్‌పై గెలుపొందారు. కాగా అంధ్రప్రదేశ్ బాలికలు తమ సత్తా చూపి కేరళపై గెలుపు సాదించి సెమిఫైనల్స్ కు చేరుకున్నారు. దాంతో ఈ విభాగంలో ఆంధ్ర ప్రదేశ్, కర్నాటక, తెలంగాణ, తమిళనాడు బాలికలు తమసత్తా చూపారు. ఉత్తరాది రాష్ట్రాల పై దక్షిణాధి రాష్ట్రాల బాలికలు విజయం సాధించి తమ సత్తా చాటారు.

## అదనపు పొగాకు విక్రయాలకు కేంద్రం అనుమతి

• ఏలూరు ఎంపి పుట్టా,

**ఏలూరు, సెప్టెంబరు 26, (ప్రభాతవార్త):** పొగాకు బోర్డు నిర్దేశించిన కోటాకు మించి రైతులు పండించిన అదనపు పొగాకును ఎలాంటి పెనాల్టీ లేకుండా వేలం కేంద్రాల్లో విక్రయించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతిస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయడంపై ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయంతో పొగాకు రైతులకు ఎంతో ఊరట కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. పొగాకు బోర్డులో నమోదైన డీలర్లు, వ్యాపారులు అదనపు పొగాకును సాధారణ సర్వీస్ ఛార్జీలు చెల్లించి వేలం ద్వారా కొనుగోలు చేసేందుకు కేంద్రం అవకాశం కల్పించిందన్నారు. అలాగే బార్న్‌కు రూ.50.00 వేల చొప్పున వడ్డీలేని రుణానికి ఆమోదం లభించిందని, దీనివల్ల సుమారు 44 వేల మంది రైతులకు రూ.220 కోట్ల వరకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. సెప్టెంబరు 13న జంగా రెడ్డిగూడెం ప్రాంతానికి చెందిన పొగాకు రైతులు, రైతు సంఘాల నాయకులు తనను కలిసి అదనపు పంటను వేలం కేంద్రాల్లో విక్రయించేందుకు అనుమతి ఇప్పించాలని కోరారని ఎంపీ గుర్తుచేశారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్‌తో పాటు అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు కూడా కేంద్రంతో చర్చించడంతో తాజా ఉత్తర్వులు వెలువడ్డాయని చెప్పారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ధరల స్థిరీకరణ పథకం కింద లోగ్రేడ్, ఆఫ్‌గ్రేడ్ పొగాకుకు కిలోకు రూ.10 చొప్పున ఆర్థిక సాయం అందించేందుకు రూ.94 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. అంతర్జాతీయ పరిస్థితుల కారణంగా కొంతకాలంగా మార్కెట్ ఒడిదుడుకులు ఎదుర్కొన్నప్పటికీ ప్రస్తుతం ధరలు మెరుగుపడి కిలో రూ.345 వరకు చేరాయని, రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.

## తిరుమల సమాచారం

### వారాంతం... నిండిన తిరుమల కొండ

• వెంకన్న సర్వదర్శనానికి 26గంటలు



**తిరుమల,సెప్టెంబర్ 27ప్రభాతవార్తప్రతినిధి:**సెలవులు కలసి రావడంతో వారాంతంతో తిరుమల భక్తజనసంద్రంగా మారింది. కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం ఆదివారం ఉదయానికే లక్షమందికిపైగాభక్తులు తిరుమలకు చేరుకోవడంతో కొండ కిటకిటలాడుతోంది. ఉదయానికే తిరుమలలో వైకుంఠం– 2 క్యూ కాంప్లెక్స్‌లు నిండిపోయి భక్తుల క్యూలైన్లు ఆలయం వెలుపలకు చేరాయి. శిలా తోరణం వరకు లైన్లలో భక్తులు వేలాదిమంది బారులుతీరి నిలబడ్డారు. ఉదయం 6గంటల సమయానికి సాధారణ సర్వదర్శనం కోసం 24గంటలు సమయం నిరీక్షణ తప్పడంలేదు. వెలుపల క్యూలైన్లలో ఉన్న భక్తులకు మరో 10గంటలు అదనపు సమయం దర్శనానికి పట్టవచ్చు. దీంతో టిటిడి అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు సిద్దంచేసి శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంతరాయంగా సేవలందిస్తున్నారు. సామాన్యభక్తులు పెద్ద సంఖ్యలో ఏడుకొండలకు చేరుకొంటున్నారు. సాయంత్రం వరకు 47వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. ఇంకా 25వేలమంది భక్తులు అర్ధరాత్రివరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి. కాగా శనివారం రాత్రివరకు 82,181మంది భక్తులకు మహాలఘులో దర్శనం చేయించారు. కానుకల ద్వారా 3.94కోట్ల రూపాయలు హుండీ ఆదాయం లభించింది.

## నవంబరులో శ్రీవారి పుష్పయాగం

• ఒకే టికెట్‌పై రెండుసార్లు శ్రీవారి దర్శనం

**తిరుమల,సెప్టెంబర్ 27ప్రభాతవార్తప్రతినిధి:** సహజంగానే తిరుమలకు వచ్చిన భక్తులు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దివ్యమనోహరరూపాన్ని క్షణకాలంపాటు దర్శించుకుంటేనే ఆత్మసంతృప్తి చెందుతుంటారు. అలాంటిది మళ్ళీమళ్ళీ చూడాలనిపించి మనసు ఉవ్విళ్ళూరుతుంది. ఇప్పుడు దీన్ని నిజంచేస్తూ టిటిడి



అధికారులు భక్తులకు ఒక మహదవకాశం కల్పించారు. నవంబర్‌లో శ్రీవారి ఉత్సవమూర్తులు శ్రీదేవిభూదేవి సమేత మలయప్పస్వామికి జరిగే పుష్పయాగంరోజు ఒక్క టికెట్ పొందితే ఒకే రోజు తమ ఇష్టదైవమ్ తిరుమలేశుని రెండుసార్లు దర్శించుకునే అద్భుత అవకాశాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం కల్పించింది. శ్రీవారి ఆలయంలో నవంబరు 16న పుష్ప యాగం జరగనుంది. ఈ పుష్పయాగానికి సంబంధించిన ఆర్జితసేవా టికెట్లను టిటిడి ఈ నెలలోనే విడుదల చేయనుంది. ఈ టికెట్ 700 రూపాయలు చెల్లించి ఇద్దరు గృహస్థ భక్తులకు బుక్ చేసుకునే అవకాశం ఉంది. పుష్పయాగం టికెట్ పొందినవారు నవంబర్ 16న ఉదయం ఆరు గంటలకు తిరుమలలోని సుపథం మార్గం ద్వారా ఆలయ ప్రాంగణంలో ఉన్న కల్యాణ మండపంలో నిర్వహించే స్నపనతిరుమంజనం అభిషేకసేవలో పాల్గొనవచ్చు. ఆ తర్వాత తిరుమల శ్రీవారిని దర్శించుకునే అవకాశాన్ని కల్పిస్తారు. మళ్ళీ అదే రోజు రెండోసారి మధ్యాహ్నం 12.30 గంటలకు ఈ టికెట్ ఉన్న భక్తులు సుపథం మార్గం క్యూలైన్లో ప్రవేశించి మలయప్ప స్వామికి నిర్వహించే పుష్ప యాగ మహోత్సవంలో పాల్గొంటారు. ఆలయంలోపల మరోసారి శ్రీవారి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు. ఇలా ఒకే టికెట్ పై ఒకేరోజు రెండుసార్లు శ్రీవారిని దర్శించుకునే అవకాశాన్ని టిటిడి బోర్డు భక్తులకు కల్పిస్తోంది.

# శ్రీకాళహస్తీశ్వరుని దర్శనం కోసం భక్తుల నిరీక్షణ

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త:** దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తులతో కిట కిట లాడింది. దక్షిణ కైలాసంలో వెలసిన వాయులింగేశ్వరుడు భక్తులు తమ ఇష్టదైవం ముక్కంటీశునికి దర్శించుకొని శుభాలు పొందాలని పరుగులు తీశారు. ఓ వైపు సామాన్యభక్తుల తాకిడి మరో వైపు అతిథుల తాకిడితో ఆలయం కిట కిట లాడింది. అడుగు తీసి అడుగు వేయలేని స్థితి చోటు చేసుకుంది. అయితే వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఆలయ ఇఓబికె వెంకటేశు, వారి సిబ్బంది ఇంకోవైపు భక్తుల సదుపాయాల్ని పర్యవేక్షించారు. అలాగే తన సిబ్బందిని సమాయత్త పరచారు. తిరుమలేశుని దర్శనానికి వచ్చిన భక్తులకు దర్శనం ఆలస్యం అవుతుండటంతో సమీపంలోని ఆలయాల దర్శనానికి రద్దీ ఏర్పడింది. ఒక్కసారిగా జనం తండోపతండాలుగా కదలి తరంగాల్లా కదలి వచ్చారు. రెండు రోజులుగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల రద్దీ అధికమైంది. ఆదివారం ఉదయం నుంచి శ్రీకాళహస్తి పట్టణంలోని ఎటు చూసినా జనం జనం. ఆలయాధికారుల అంచనాల మేరకు ఆదివారం సుమారు 30 వేల మంది భక్తులు దర్శనం చేసుకొని ఉండవచ్చునని అంచనా. ఏ లాడ్జిలో చూసినా ఏ హోటల్‌లో పరిశీలించినా, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో చూసినా జనమే



జనం. అయితే గ్యాస్ కొరతతో చాలా ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు మూతపడ్డాయి. అల్పాహార దుకాణాలు మూతపడ్డాయి. ఆదివారం భక్త జనులు తండోపతండాలుగా శ్రీకాళహస్తికి తరలివచ్చారు. పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రం శ్రీకాళహస్తీశ్వరాలయం. శ్రీకాళహస్తీశ్వరాలయంతో పాటు పరిసర దేవాలయాలు భక్తులతో కిట కిట లాడుతున్నాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఎలాంటి ఇబ్బంది లేకుండా సిబ్బంది ఆలయ ఎఇఓవిద్యాసాగర్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్లు వెంటకస్వామి, హరియాదవ్ వారి సహాచరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఇఓ స్వయంగా సిబ్బందితో కలసి కంచుగడప వద్ద, రాహుకేతుదోష నివారణ పూజలు జరిగే చోట ప్రత్యేకంగా తిరుగుతూ పర్యవేక్షించగా గేట్ల వద్ద సిబ్బంది అప్రమత్తమయ్యారు. క్యూలైన్లలో దళారులనుక్రమబద్ధీకరించాలనిసిబ్బందికి సూచించారు.

**భక్తుల ఇక్కట్లు:** శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి వస్తున్న భక్తులు స్థానికంగా ఓ వైపు ఆటోలు, మరోవైపు లాడ్జిల యజమానులు, ఇంకోవైపు దుకాణం దారులు విచ్చల విడిగా దోపిడి చేస్తున్నారు. ఇక్కడ విధి విధానాలు లేదు. పోలీసుల అదుపు లేదు. ఎవరికి తోచిన విధంగా వారు దోచుకోవటమే లక్ష్యంగా మారింది. బస్సు దిగిన యాత్రికుల్ని ఆటోల డ్రైవర్లు ఇష్టం వచ్చినట్లు మభ్యపెడుతున్నారు. దేవస్థానంకు సంబంధించిన బస సదుపాయాలకు సంబంధించి విస్తృత ప్రచారం నిర్వహించాల్సి ఉంది. లేకుంటే ఇంకా భక్తులు దోపిడికి గురౌతూ దేవస్థానం అభాసుపాలయ్యే ప్రమాదం ఉంది. ఆలయానికి సంబంధించి దళారుల రాజ్యమనే విమర్శలు వచ్చినపుడు పరిశీలించి పరిష్కరించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. దాంతో ఇక్కడకు వచ్చిన భక్తులు నిలువు దోపిడికి గురౌతున్నారు. స్పీడ్ యుగంలో త్వర త్వరగా దర్శనం చేసుకొని వెళ్ళాలనే తపనతో దళారులను ఆశ్రయిస్తూ జేబులు ఖాళీ చేయించుకుంటున్నారు. అధికారుల పర్యవేక్షణేమో సూపర్ కానీ ఫలితం మాత్రం శూన్యం అన్నట్లు మారింది.



## శ్రీవారి దర్శనంతో ఆనందం

**తిరుమల,సెప్టెంబర్ 27ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవారి దర్శనం చేసుకోవడం మనసు ఆనందంగా ఉందని ప్రముఖులు విశ్వాసం వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం తిరుమలకు బిజెపి కేంద్ర ఉపాధ్యక్షుడు రామ్ మాధవ్, తమిళనాడు మాజీ సిఎం సతీమణి దుర్గా స్టాలిన్, ఆంధ్రప్రదేశ్ విప్ బొమ్మిడి నాయకర్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ చోళ్ళ బొజ్జి రెడ్డి, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాస్ రావు వేర్వేరుగా ఉదయం ఆలయంలోనికి చేరుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్‌లో వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శనం చేయించారు. ఆలయ అర్చకులు వేదాశీర్వచనంచేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

### గడువులోపు పనులు పూర్తికావాలి

**తిరుమల,సెప్టెంబర్ 27ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకువస్తున్న విద్యుత్ బస్సులకోసం తిరుపతి జిల్లా రీజియన్ పరిధిలో విద్యుత్ బస్సులకు అవసరమైన మౌళిక సదుపాయాలు వేగవంతంగా కల్పించాలని ఆర్టీసి జోన్4 ఇడి ఆర్.ఆర్.కె.కిషోర్ సూచించారు. విద్యుత్‌బస్సులు వస్తే కాలుష్య నియంత్రణేగాక పర్యావరణ పరిరక్షణకు మార్గం సుగమమవుతుందన్నారు. తిరుపతి పరిధిలోని మంగళం ఆర్టీసి ఇబస్ డిపోలో అభివృద్ధి పనులను ఆదివారం ఉదయం జోన్4 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.ఆర్.కె.కిషోర్ తనిఖీ చేశారు. డిపోను సందర్శించి అక్కడ జరుగుతున్న ఇబస్ డిపో సివిల్ ఎల్రక్టికల్ ఇంజినీరింగ్ పనులని పరిశీలించారు. ఈ సందర్భంగా డిపోలో జరుగుతున్న వివిధ సివిల్, ఎల్రక్టికల్ పనుల పురోగతిని సమీక్షించి, పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా సివిల్, ఎల్రక్టికల్ ఇంజినీరింగ్ విభాగాల అధికారులకు కాంట్రాక్టర్లకు సూచనలు చేశారు.

## నేడు డయల్ యువర్ ఎస్పీడిసిఎల్ సిఎండి

**తిరుపతి, సెప్టెంబర్ 27 ప్రభాతవార్తప్రతినిధి:** విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నేడు (సోమవారం)ఉదయం 10 గంటల నుండి నుంచి మధ్యాహ్నం 12.30 గంటలవరకు "డయల్ యువర్ సిఎండి" కార్యక్రమాన్ని ఎస్పీడీసీఎల్ నిర్వహించనుంది. ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ సిఎండి కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు 8977716661 నంబర్‌కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురావచ్చు. ఈ కార్యక్రమం ద్వారా తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురాదలచిన వినియోగదారులు తమ వద్ద విద్యుత్ సర్వీసు నంబరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. కాగా డయల్ యువర్ ఎస్పీడీసీఎల్ సిఎండి కార్యక్రమంతో బాటుసర్కిల్ స్థాయిలో కూడా ప్రతి సోమవారం ఉదయం 8:30 గంటల నుండి నుంచి 9:30 గంటల వరకు "డయల్ యువర్ ఎస్ఇ" కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.



జిల్లాస్థాయిలో తమ విద్యుత్ సమస్యలను ఎస్ఇల దృష్టికి తీసుకువచ్చేందుకు వీలుగా వినియోగదారులు.

నంబర్లకు ఫోన్‌చేసి తెలియజేయాలి.

| | | |
|---|---|---|
| తిరుపతి: 8712652679 | కడప: 08562242457 | శ్రీసత్యసాయి: 9963707847 |
| ,చిత్తూరు: 7993147979, | ,కర్నూలు: 7382614308 | |
| నెల్లూరు: 08612320427, | ,నంద్యాల: 7382618976, | |
| అన్నమయ్య: 9440817449, | అనంతపురం: 9154790350, | |

# అక్టోబరు 12 నుండి శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు

• అక్టోబరు 16న గరుడ వాహనం, 17న పుష్పకవిమానం

**తిరుమల,సెప్టెంబర్ 27ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 12 నుండి 20వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. చాంద్రమానం ప్రకారం ప్రతి మూడు సంవత్సరాలకోసారి అధికమాసం వస్తుంది. ఇలావచ్చిన సందర్భాల్లో కన్యామాసం(భాద్రపదం)లో వార్షిక బ్రహ్మోత్సవాలు, దసరా నవరాత్రుల్లో (ఆశ్వయుజం) నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణం, పెద్ద రథం, ధ్వజావరోహణం ఉండవు. ప్రతిరోజూ ఉదయం వాహనసేవ 8 నుండి 10 గంటల వరకు, రాత్రి వాహనసేవ 7 నుండి 9 గంటల వరకు జరుగుతుంది. గరుడవాహనసేవ రాత్రి 6.30 నుండి 11.30 గంటల వరకు జరుగుతుంది. ఈ బ్రహ్మోత్సవాల్లో వాహనసేవల వైశిష్టం ప్రత్యేకత.

**-వాహన సేవల వివరాలు :**

శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలలో అక్టోబరు 11న ఆదివారం రాత్రి అంకురార్పణం – రాత్రి 7 నుండి 9 గంటల వరకు,
అక్టోబరు 12న ఉదయం 9 గంటలకు బంగారు తిరుచ్చి ఉత్సవం, రాత్రి 7 గంటలకు
**పెద్దశేష వాహనం -**
అక్టోబరు 13 ఉదయం 8 గంటలకు
చిన్నశేష వాహనం, రాత్రి 7 గంటలకు
హంస వాహనం, 14 న ఉదయం 8 గంటలకు
సింహ వాహనం, రాత్రి రాత్రి 7 గంటలకు
ముత్యపుపందిరి వాహనం , 15 న ఉదయం 8 గంటలకు
కల్పవృక్ష వాహనం, రాత్రి 7 గంటలకు
సర్వభూపాల వాహనం , 16న ఉదయం 8 గంటలకు
**- మోహినీ అవతారం,**
**సాయంత్రం 6.30 గంటలకు**
గరుడ వాహనం ,17న ఉదయం 8 గంటలకుహనుమంత వాహనం, సాయంత్రం 4



గంటలకు పుష్పక విమానం, రాత్రి 7 గంటలకు గజ వాహనం ,18న అక్టోబరు 18 ఉదయం 8 గంటలకుసూర్యప్రభ వాహనం, రాత్రి 7గంటలకు చంద్రప్రభ వాహనం ,19న ఉదయం 7 గంటలకు స్వర్ణరథం, రాత్రి 7 గంటలకు అశ్వ వాహనం, అక్టోబర్ 20వతేదీ మంగళవారం ఉదయం 6 గంటలకు చక్రస్నానంతో ముగుస్తాయి.

విశాఖపట్నం అనకాపల్లి అల్లూరి సీతారామరాజు
వార్త
సోమవారం 28, సెప్టెంబరు 2026


'కమిటీ కుర్రోళ్లు' నిర్మాత ఫణి అడపాకకు

# హోంమంత్రి అనిత సత్కారం



విశాఖపట్నం, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :

'కమిటీ కుర్రోళ్లు' సినిమా సహ నిర్మాత ఫణి అడపాకను ఆదివారం విశాఖపట్నం ఎంవీపీ నివాసం వద్ద రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ఘనంగా సత్కరించి, 'కమిటీ కుర్రోళ్లు' చిత్ర బృందానికి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల 'కమిటీ కుర్రోళ్లు' చిత్రం 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో ఉత్తమ తెలుగు చిత్రం, ఉత్తమ మేకప్ విభాగాల్లో అవార్డులు సాధించడం పట్ల హోంమంత్రి అనిత హర్షం వ్యక్తం చేశారు. తెలుగు సినిమా రంగంలో మంచి కథాంశంతో రూపొందిన 'కమిటీ కుర్రోళ్లు' జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం తెలుగు చిత్ర పరిశ్రమకు గర్వకారణమని అనిత పేర్కొన్నారు. భవిష్యత్తులో ఫణి అడపాక, చిత్ర బృందం మరిన్ని విజయాలు సాధించాలని ఆమె ఆకాంక్షించారు. 2024లో విడుదలైన 'కమిటీ కుర్రోళ్లు' చిత్రానికి ఫణి అడపాక సహ నిర్మాతల్లో ఒకరిగా వ్యవహరించారు.

సబ్బవరంలో

## నూతన అగ్నిమాపక కేంద్రం ప్రారంభం

ప్రజల భద్రతకు ఫైర్ సిబ్బంది అంకితభావంతో సేవలందిస్తున్నారు: హోంమంత్రి అనిత



సబ్బవరం, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :

అనకాపల్లి జిల్లాలో హోంమంత్రి వంగల పూడి అనిత ఆదివారం పర్యటించారు. సబ్బవ రంలో రూ.1.60 కోట్ల వ్యయంతో 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించిన నూతన అగ్నిమా పక కేంద్ర భవనాన్ని హోం మంత్రి అనిత ప్రారంభించారు. ఈ సంద ర్భంగా అగ్నిమాపక కేంద్రంలోని వివిధ గదులను హోంమంత్రి పరిశీ లించారు. నూతన అగ్నిమాపక వాహనాన్ని ప్రారంభించారు. ఫైర్ డిపార్ట్‌మెంట్ ఏర్పాటు చేసిన స్టాల్‌ను సందర్శించి, వివిధ అగ్నిమాపక పరికరాల పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అగ్నిమాపక కేంద్రం ప్రాంగణంలో హోంమంత్రి అనిత, ఎమ్మెల్యే (తరువాయి 8వ పేజీలో)



హోమియో ఐ.ఐ.హెచ్.పి సంస్థ వ్యవస్థాపకులు

## పద్మశ్రీ డాక్టర్ సక్సేనా 114 వ జన్మదిన వేడుకలు




విశాఖపట్నం, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :

ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోమీయోపతిక్ ఫిజిషియన్స్ (ఐ.ఐ.హెచ్.పి) – విశాఖ జిల్లా శాఖ నందలి హోమియో వైద్యులు సంస్థకు చెందిన ఆద్యులు, వ్యవస్థాపకులు పద్మశ్రీ డాక్టర్ కె.జి.సక్సేనా 114వ జన్మదిన వేడుకలను ఆదివారం 3 గంటలకు ఇసుకతోట నందలి సునీత బ్లోజమ్స్ క్లినిక్ నందు విశాఖ హోమియో వైద్య సభ్యులు కూడి ఘనంగా జరిపారు. మొదటగా రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ పగడాల చంద్రశేఖర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ వాకా సునీతలు జ్యోతిని వెలిగించి సభను (తరువాయి 8వ పేజీలో)

## ఓటు చోరీ పేరిట ప్రతిపక్షాల ఆరోపణలు నిరాధారం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్



విశాఖపట్నం, సెప్టెంబర్ 27 ప్రభాత వార్త :

ప్రజల్లో బీజేపీకి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు, కొన్ని వామపక్షాలు, మేధావుల పేరుతో మాట్లాడుతున్న వర్గాలు నిరాధార ఆరోపణలు చేస్తున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాదవ్ విమర్శించారు. విశాఖ భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో బిజెపి జిల్లా అధ్యక్షులు పరుశురామరాజు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన పత్రికా సమావేశంలో ముఖ్య అతిథిగా (తరువాయి 8వ పేజీలో)

ప్రతికూల వాతావరణంలో

## మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు

మత్స్యకారుల భద్రతే ప్రధానం: జీవీ రామచంద్రరావు

విశాఖపట్నం, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త:



ప్రతికూల వాతావరణ పరిస్థితులు కొన సాగుతున్న నేపథ్యంలో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని వైఎస్ ఆర్సీపీ రాష్ట్ర కార్యదర్శి, మత్స్యకార నాయకుడు జీవీ రామచంద్రరావు విజ్ఞప్తి చేశారు. వాతావరణ పరిస్థితులు పూర్తిగా అనుకూ లించే వరకు సముద్రంలో చేపల వేటకు వెళ్లవద్దని ఆయన మత్స్యకారులం దరికీ సూచించారు. కాకినాడ నుంచి చేపల వేటకు వెళ్లిన మోటరైజ్డ్ పడవ శని వారం ఉదయం ఒడిశాలోని పారాదీప్‌కు సురక్షితంగా చేరి నట్లు తెలి పారు. పడవలో ఉన్న తొమ్మిది మంది మత్స్యకారులు క్షేమంగా ఉన్నారని పేర్కొన్నారు. ప్రతికూల వాతావరణంలో (తరువాయి 8వ పేజీలో)

# భవిష్యత్ అంతా టూరిజానిదే..

అంతర్జాతీయ పర్యాటక పటంలో విశాఖకు సముచిత స్థానం

ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం 'వైజాగ్ వేవ్స్' వేడుకలు

పర్యాటక, ఐటీ, వైద్య రంగాల హబ్‌గా నగరాభివృద్ధి: జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి

రాష్ట్రానికి వచ్చే విదేశీ పర్యాటకుల్లో 85% విశాఖకే: జిల్లా కలెక్టర్

నగరంలో రూ. 4,000 కోట్ల అభివృద్ధి పనులు, బీచ్ రోడ్డు విస్తరణ: ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు







విశాఖపట్నం,సెప్టెంబర్ 27, ప్రభాత వార్త :

విశాఖను ఐటీ, మెడికల్ టూరిజం, బీచ్ టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని జిల్లా ఇంచార్జి మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి అన్నారు. "ఏ ఇజం లేదు.. భవిష్యత్తంతా టూరిజం" అనే నినాదంతో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆధ్వర్యంలో నూతన విధానాలతో పర్యాటకాన్ని ప్రోత్సహిస్తున్నామని, విశాఖను సమగ్రంగా అభివృద్ధి చేస్తామని ఆయన చెప్పారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని పర్యాటక శాఖ, జీవీఎంసీ, జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని సిరిపురం ద్రోణంరాజు సర్కిల్ వద్ద ఆదివారం సాయంత్రం 'వైజాగ్ వేవ్స్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయ స్వామి, విశాఖ తూర్పు శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు, జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లకు విశాఖ నగరం అంటే ఎంతో మక్కువ అని పేర్కొన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని అరకు, పాడేరు ఏజెన్సీ అందాల నుంచి అనకాపల్లి బౌద్ధ క్షేత్రాల వరకు పర్యాటకంగా అపార అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

**ఇటలీ అమాల్ఫీ కోస్ట్‌తో సమానమైన అందాలు: జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్**

జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ మాట్లాడుతూ తిరుమల మినహా రాష్ట్రంలో అత్యధిక పర్యాటక కార్యకలాపాలు విశాఖలోనే (తరువాయి 8వ పేజీలో)

# మున్సిపల్ ఎన్నికల్లో కూటమి ప్రభంజనం సృష్టించాలి

కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో నాయకుల పిలుపు.. 100 శాతం విజయం లక్ష్యంగా కూటమి

స్పీకర్ సమక్షంలో నర్సీపట్నం నాయకుల కీలక భేటీ





విశాఖపట్నం, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :

రాబోయే మున్సిపాలిటీ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల పూర్తిస్థాయి విజయాన్ని ఖరారు చేసేందుకు గాను నర్సీపట్నంలో కూటమి నాయకుల ముఖ్యమైన కోఆర్డినేషన్ కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. గౌరవ స్పీకర్ గారి సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు వంశీకృష్ణ, జనసేన నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ సూర్యచంద్ర, జనసేన చోడవరం నియోజకవర్గం పివిఎస్ఎన్.రాజు, టీడీపీ పట్టణ అధ్యక్షులు చింతకాయల రాజేష్, ప్రధాన కార్యదర్శి లాలం మురళీకృష్ణ, బీజేపీ నాయకులు గాదె శ్రీనివాసరావు, మరియు నర్సీపట్నం మున్సిపాలిటీ జనసేన పార్టీ నాయకురాలు అద్దేపల్లి సౌజన్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక మున్సిపాలిటీ ఎన్నికల్లో కూటమి తరపున తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీలు ఉమ్మడిగా పోటీ చేసి (తరువాయి 8వ పేజీలో)

స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల సిబ్బంది రెగ్యులైజేషన్, సౌకర్యాల విషయంలో

# కూటమి ప్రభుత్వం రాజీపడదు

స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి



విశాఖపట్నం , సెప్టెంబర్ 27ప్రభాత వార్త :

స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాల సిబ్బంది రెగ్యులరైజేషన్, సౌకర్యాల విషయంలో కూటమి ప్రభుత్వం రాజీ పడదని ఆ శాఖ మంత్రి డాక్టర్ .డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఆదివారం విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడుతూ స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాల సిబ్బంది రెగ్యులరైజేషన్, సౌకర్యాల విషయంలో కూటమి ప్రభుత్వం రాజీ పడదన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఉద్యోగులను రెగ్యులర్ చేయలేదని , రెగ్యులరైజేషన్?ను మా ప్రభుత్వమే అమలు చేసిందన్నారు . నోషనల్ ఇంక్రిమెంట్స్ ఫైల్? ను ఇప్పటికే ఆర్థికశాఖకు పంపడం జరిగిందని నోషనల్ ఇంక్రిమెంట్స్ పై ఆర్థిక శాఖతో నిరంతరం పాలో అఫ్ చేస్తున్నామని చెప్పారు . సిబ్బంది కొరత ఉన్నప్పుడు ఒకరికొకరు సేవలు అందించేలా డీసెంట్రలైజ్ చేశామని,ఉద్యోగులకు ఆటోమేటిక్ లీవ్స్ సాంక్షన్ విధానం తీసుకొచ్చామన్నారు. ఉన్నతాధికారి స్పం దించకున్నా రెండు రోజుల సీఎల్‌లు మంజూరయ్యే వెసులుబాటు కల్పించా మన్నారు. వైసీపీ హయాంలో ఒక్క ఉద్యోగికి ప్రమోషన్ ఇవ్వలేదని, మేం అధికారంలోకి వచ్చాక ఇప్పటికే సుమారు 14 వేల మందికి ప్రమోషన్లు ఇచ్చామని, మిగతా వారికి నెల రోజుల్లో ప్రమోషన్లు కల్పిస్తామన్నారు. జూని యర్ అసిస్టెంట్ క్యాడర్ కావాలని ఉద్యోగులు కోరుతున్నారు. త్వరలో కొత్త పీఆర్సీ కమిషన్ వేస్తామని, ఉద్యోగులు తమ రిప్రెజెంటేషన్ కమిషన్ కి ఇవ్వాలని సూచించారు. పిఆర్సి కమిషన్ (తరువాయి 8వ పేజీలో)




నమ్మించి

# దోపిడీ చేశారు

మనీ ఎక్స్ఛేంజ్ పేరుతో బాధితులకు టోకరా

రూ.70 లక్షల నగదు.. 10 తులాల బంగారం అపహరణ

డాలర్లు ఇస్తామంటూ ఆన్‌లైన్‌లో పరిచయం..

కారులో ఉన్న వారిపై దాడి

నిందితుల కోసం మూడు ప్రత్యేక బృందాలతో గాలింపు

అనుమానితులను విచారిస్తున్న పోలీసులు

విశాఖపట్నం సెప్టెంబర్ 27 ప్రభాత వార్త :

మనీ ఎక్స్ఛేంజ్ పేరుతో ఆన్‌లైన్‌లో పరిచయమైన వ్యక్తులను నమ్మిన బాధితులకు నిందితులు కుచ్చుటోపీ పెట్టారు.డాలర్లు ఇస్తామంటూ నమ్మించి, భారీ మొత్తంలో నగదు, బంగారంతో వచ్చిన వారిని మార్గమధ్యలో అడ్డగించి దాడి చేశారు. వారి వద్ద ఉన్న రూ.70 లక్షల నగదు, పది తులాల బంగారు ఆభరణాలతో కూడిన రెండు బ్యాగులను ఎత్తుకెళ్లారు. ఈ ఘటన విశాఖ నగరంలో శుక్రవారం అర్ధరాత్రి కలకలం రేపింది. పోలీసుల వివరాల ప్రకారం.. టెక్కలి ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్న రమేష్‌కు, అతని స్నేహితుడికి ఆన్‌లైన్ ద్వారా కొంతమంది వ్యక్తులు పరిచయమయ్యారు. డాలర్లు తమ వద్ద ఉన్నాయని, వాటిని ఇస్తే అందుకు సమానమైన మొత్తాన్ని రూపాయల్లో చెల్లించాలంటూ వారు ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మనీ ఎక్స్ఛేంజ్ ఒప్పందం కుదుర్చుకున్న (తరువాయి 8వ పేజీలో)

చరిత్రను పలకరిస్తూ...

# వారసత్వ బాటలో విశాఖ!

చారిత్రక కట్టడాల సందర్శన ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఘనంగా హెరిటేజ్ వాక్





విశాఖపట్నం, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త :

ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖలో ఆదివారం హెరిటేజ్ వాక్ నిర్వహిం చారు. విశాఖ పాత నగరం నుంచి బీచ్ రోడ్డు వరకు సాగిన ఈ వాక్లో నగరంలోని చారిత్రక కట్టడాలు, వారసత్వ ప్రదేశాలను సందర్శిస్తూ వాటి విశిష్టతను తెలుసుకున్నారు. హెరిటేజ్ వాక్ లో భాగంగా సెయింట్ అలోషియస్ స్కూల్, సెయింట్ జాన్ చర్చి, క్వీన్ విక్టోరియా పెవిలియన్, లైట్ హౌస్, టౌన్ హాల్ తదితర చారిత్రక ప్రదేశాలను సందర్శించారు. ఆయా కట్టడాల చారిత్రక నేపథ్యం, వాస్తు విశిష్టత, విశాఖ నగర అభివృద్ధిలో వాటి పాత్రను పాల్గొన్న వారికి వివరించారు. విశాఖ నగరానికి ఉన్న చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని భవిష్యత్ (తరువాయి 8వ పేజీలో)



# వహ్వా.. వహ్వా.. నాట్యకళకు జనం బ్రహ్మరథం

సీఎంఆర్ అధినేత ఎం.వెంకటరమణతో పాటు పలువురిని ఘనంగా సత్కరించారు

వైశాఖీ నృత్యోత్సవ్‌లో అలరించిన కూచిపూడి, భరతనాట్యం, చక్రీ నృత్యాల



విశాఖపట్నం, సెప్టెంబరు 27 ప్రభాతవార్త

కళాభారతి ఆడిటోరియంలో వైశాఖీ నృత్యోత్సవ్ -2026 రెండో రోజు నృత్య ప్రదర్శనలు ఆది వారం ఘనంగా జరిగాయి. నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిం చిన ఈ ఉత్సవంలో కూచిపూడి, భరతనాట్యం, రాజస్థానీ జానపద నృత్యం చక్రీ ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కళలను ప్రోత్సహిస్తున్న సీఎంఆర్ అధినేత మావూరి వెంకట రమణతో పాటు పలువురుని సత్కరించారు. అనంతరం కళాకారుల హావభా వాలు, నాట్య ముద్రలు, లయబద్ధమైన నృత్య విన్యాసాలకు ప్రేక్షకుల నుంచి హర్షధ్వానాలు లభించాయి. మైసూరుకు చెందిన కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ వసుంధర దొరస్వామి (తరువాయి 8వ పేజీలో)

# సబ్బవరంలో నూతన అగ్నిమాపక కేంద్రం ప్రారంభం

(7వ పేజీ తరువాయి)

పంచకర్ల రమేష్‌బాబు, ఏపీ ఆయిల్‌ఫెడ్ చైర్మన్ గండి బాబ్జీ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ.. సబ్బవరం తన సొంతూరు కావడంతో ఇక్కడికి రావడం ఎంతో ఆనందంగా ఉంటుందని అన్నారు. అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది అద్భుతంగా పనిచేస్తున్నారని అభినందించారు. విపత్తులు సంభవించినప్పుడు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఫైర్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.
బుడమేరు వరదల సమయంలో ఫైర్ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పరిసరాలను శుభ్రం చేయడంలో కీలకంగా సేవలందించారని గుర్తుచేశారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వ హయాంలో అనేక నూతన అగ్నిమాపక కేంద్రాలను నిర్మించడంతో పాటు పెద్ద సంఖ్యలో అగ్నిమాపక వాహనాలను కొనుగోలు చేసినట్లు తెలిపారు. పెందుర్తి నియోజకవర్గం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులు తమ సత్తా చాటాలని ఆమె పిలుపునిచ్చారు.

# హోమియో ఐ.ఐ.హెచ్.పి సంస్థ వ్యవస్థాపకులు పద్మశ్రీ డాక్టర్ సక్సేనా 114 వ జన్మదిన వేడుకలు

(7వ పేజీ తరువాయి)

ప్రారంభించారు, తర్వాత సంస్థ జాతీయ సభ్యులు డాక్టర్.కె.శర్మ మరియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.బి.కె.సతీష్ లు ముఖ్య అతిధులుగా విచ్చేసి తమ సంస్థ వ్యవస్థాపకులైన పద్మశ్రీ డాక్టర్ కె.జి.సక్సేనా చిత్రపటానికి పూలమాలలు అలంకరించగా తోటి వైద్యులు పూలతో నివాళులర్పించారు,
పిదప విశాఖ శాఖ అధ్యక్షులు డాక్టర్.పి.రాఘవేంద్ర రావు బర్త్ డే కేక్ కటింగ్ జరిపి, సక్సేనా గారు పట్టభద్రులైన హోమియో వైద్యుల గుర్తింపు కోసం ప్రభుత్వ పరంగా ఎంతో శ్రమించి క్వాలిఫికేషన్ ఉన్నవారే శాస్త్రీయంగా హోమియో వైద్యానికి అర్హులని తెలియజెప్పే విధంగా ఈ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హోమియోపతిక్ ఫిజిషియన్స్ అను సంస్థని ఏర్పాటు చేయటం జరిగిందని చెప్పారు, అంతే కాకుండా పద్మశ్రీ డాక్టర్ సక్సేనా భారత దేశాధ్యక్షులకు పలుమార్లు ఉన్నతమైన గౌరవ హోమియో వైద్యులుగా నియమించబడ్డారని డాక్టర్ రాఘవేంద్ర రావు తెలిపారు. ఆఖరున విశాఖ కార్యదర్శి వందన సమర్పణతో సభ ముగిసింది. ఈ కార్యక్రమానికి డాక్టర్ చీగటి చంద్రశేఖర్, డాక్టర్ బి.వి.బాస్కర్, డాక్టర్.ఎ.భవాణి, డాక్టర్.కె.వి.సుబ్బలక్ష్మీ,డా శ్రీదేవి డా శ్రీకాంత్ డాక్టర్.పవన్ మొదలగు వైద్యులు పాల్గొన్నారని ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ వాకా సునీత ఒక ప్రకటనలో తెలిపారు.

## ప్రతికూల వాతావరణంలో
# మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు

(7వ పేజీ తరువాయి)

సముద్రంలోకి వెళ్లడం వల్ల మత్స్యకారుల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని జీవీ రామచంద్రరావు అన్నారు. వాతావరణం పూర్తిగా అనుకూలించే వరకు మత్స్యకారులు వేటకు వెళ్లకుండా కుటుంబాల భద్రతను దృష్టిలో ఉంచుకోవాలని కోరారు. "మత్స్యకారుల భద్రతే అత్యంత ముఖ్యం. వాతావరణం అనుకూలించే వరకు ఎవరూ సముద్రంలోకి వెళ్లవద్దు. అధికారుల హెచ్చరికలను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలి" అని జీవీ రామచంద్రరావు మత్స్యకారులకు విజ్ఞప్తి చేశారు.

# మున్సిపల్ ఎన్నికల్లో కూటమి ప్రభంజనం సృష్టించాలి

(7వ పేజీ తరువాయి)

100 శాతం విజయ తీరాలకు చేరుకోవడమే ధ్యేయంగా ముందుకు సాగాలని నాయకులు పిలుపునిచ్చారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియతో పాటు, క్షేత్రస్థాయిలో మూడు పార్టీల శ్రేణులను సమన్వయం చేసుకుంటూ కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించారు. రాబోయే ఎన్నికల్లో కూటమి పూర్తిస్థాయి విజయం సాధించేలా వ్యూహాత్మకంగా ముందుకు వెళ్లాలని ఈ సమావేశంలో స్పష్టం చేశారు.

# కూటమి ప్రభుత్వం రాజీపడదు

(7వ పేజీ తరువాయి)

నిర్ణయం ప్రకారం ప్రభుత్వం ముందుకెళ్తుందని,ప్రభుత్వం సానుకూలంగా ఉన్నా.. ఉద్యోగులను కొందరు రెచ్చగొట్టడం సరికాదన్నారు.ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి, ఉద్యోగులకు మేలు చేయాలన్న తపన తప్ప వారిని ఇబ్బంది పెట్టే ఉద్దేశం మా ప్రభుత్వానికి లేదు. మా ప్రభుత్వం ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వం, ఉద్యోగులకు మంచి చేస్తున్న ప్రభుత్వానికి ఉద్యోగులంతా సహకరించాలని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి కోరారు.

# 'నాన్న'పై రచనలకు ఆహ్వానం

## బందిలి డేవిడ్ రాజు స్మారక రచనల పోటీ-2026

విశాఖపట్నం, సెప్టెంబరు 27, ప్రభాతవార్త :

ప్రముఖ సాహితీవేత్త, కవి, కథకుడు, పత్రికా రచయిత, సాంస్కృతిక విశ్లేషకుడు రాజహంస ఆధ్వర్యంలో దివంగత ప్రధానోపాధ్యాయుడు బందిలి డేవిడ్ రాజు స్మారక రచనల పోటీ-2026 నిర్వహించనున్నట్లు బందిలి ఫౌండేషన్ కార్యనిర్వాహక సంచాలకుడు బందిలి రతన్‌రాజు తెలిపారు.
ఈ ఏడాది పోటీకి 'నాన్న' ఇతివృత్తంగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. కవులు, రచయితలు కథ, కవిత, వ్యాసం, గల్పిక, పాట తదితర సాహితీ ప్రక్రియల్లో రచనలు పంపవచ్చన్నారు. రచనలు ఉత్తమ పురుషలో సాగాలని, ఆత్మస్తుతి, పరనిందలకు తావులే కుండా ఉండాలని సూచించారు. రచన అరఠావు సైజు కాగితంపై ఒక్కో పేజీకి 24 లైన్ల చొప్పున, గరిష్ఠంగా నాలుగు పేజీలకు మించకూడదని తెలిపారు. రచనపై రచయిత పేరు, చిరునామా, ఫోన్ నంబర్ వంటి వివ రాలు రాయకూడదన్నారు. వీలైతే రచనతో పాటు తండ్రితో కలిసి దిగిన ఫొటోను పంపవచ్చని పేర్కొన్నారు.
రచనలు అక్టోబరు 10, 2026లోగా అసలు ప్రతిని పోస్టు, కొరియర్, స్పీడ్ పోస్టు లేదా స్వయంగా పంపాలి. పంపాల్సిన చిరునామా: రాజహంస, కేరాఫ్ బందిలి రతన్‌రాజు, ఇంటి నంబర్ 9-17-28/13, ఫ్లాట్ నంబర్ 502, సీబీఎం కాంపౌండ్, వీఐపీ టవర్స్ ఎదురువీధి, విశాఖపట్నం-530003, ఆంధ్రప్రదేశ్.
రచన ఈ పోటీ కోసం మాత్రమే రాసినదని, అనుసరణ లేదా అనుకరణ కాదని, మరే ఇతర ప్రచురణ సంస్థ పరిశీలనలో లేదని పేర్కొంటూ హామీ పత్రంపై సంతకం చేసి రచనతోపాటు జతచేయాలని తెలిపారు. నిష్ణాతులైన సాహితీవేత్తలు నిర్ణేతలుగా వ్యవహరించను న్నారని, ఎంపికైన ఉత్తమ రచనలకు నవం బరు నెలాఖరు లేదా డిసెంబరు రెండో వారంలో విశాఖపట్నంలో జరిగే కార్యక్రమం లో బహుమతులు అందజేస్తామని తెలి పారు. పోటీలో పాల్గొన్న వారందరికీ అదే కార్యక్రమంలో యోగ్యతా పత్రాలు అందజే యనున్నట్లు పేర్కొన్నారు. పోటీకి వచ్చిన రచనలను క్రోడీకరించి, నిపుణులతో ఆంగ్లం లోకి అనువదించి, ఇల్లస్ట్రేషన్లతో పుస్తకంగా ప్రచురించనున్నట్లు తెలిపారు. ఎంపికైన ఉత్తమ రచనలకు పుస్తకంలో ప్రాధాన్యం ఉంటుందని, రచయితలు తమ కాపీలను ముందుగానే రిజర్వు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9490263115 నంబరులో సంప్రదిం చాలని బందిలి రతన్‌రాజు కోరారు.

# నాట్యకళకు జనం బ్రహ్మరథం





(7వ పేజీ తరువాయి)

బృందం భరతనాట్య ప్రదర్శనతో అలరించింది. 'ఓం సూర్య నారాయణ నమః' అంశంతో సాగిన నృత్యరూపకంలో సూర్యా రాధన, సూర్య నమస్కారాలు, వివిధ ఆసన భంగిమలను నాట్యంతో మేళవించారు. 1996లో వసుంధర దొరస్వామి పీహెచ్‌డీ పరిశోధన ఆధారంగా ఈ నృత్యరూపకం రూపొందినట్లు తెలిపారు. రాజస్థాన్‌కు చెందిన అఫ్సాన్ గుజరావత్ బృందం ప్రదర్శిం చిన చక్రీ జానపద నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కళాకారుల వేగవంతమైన భ్రమణాలు, పరిభ్రమణాలు ప్రేక్షకులను అలరించాయి. ధూమర్, కబేలియా తదితర రాజస్థానీ జాన పద నృత్యాలను కూడా ప్రదర్శించారు. స్థానిక కళాకారులకు అవకాశం కల్పిస్తూ నంబాల జ్యోతి, అరుణా పరమేశ్ కాకర, ఆదిత్యశ్రీ, కేవీ లక్ష్మి, విజయజ్యోతి తదితరుల శిష్యబృం దాలు వివిధ నృత్య ప్రదర్శనలు ఇచ్చాయి. దీంతో రెండు రోజుల నృత్యోత్సవా నికి ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది.

### వసుంధర దొరస్వామికి ఎక్సలెన్సీ అవార్డు

డాక్టర్ వసుంధర దొరస్వామికి పద్మభూషణ్ గురు డాక్టర్ సరోజా వైద్యనాథన్ ఎక్సలెన్సీ అవార్డును ప్రదానం చేశారు. అవార్డుతో పాటు రూ.25 వేల నగదు, ప్రశంసాపత్రం, దుశ్శాలువాతో సత్కరించారు. అఫ్సాన్ గుజరావత్‌కు వైశాఖీ యువ పురస్కారం, మహారాష్ట్రకు చెందిన భరత నాట్య కళాకా రుడు పవిత్ర కృష్ణ భట్‌కు డాక్టర్ సరోజా వైద్యనాథన్ యువ పురస్కారం అందజేశారు. స్థానిక కళాకారులను ప్రోత్స హించిన గురువు లకు వైశాఖీ బెస్ట్ టీచర్ అవార్డులను అందిం చారు. కార్యక్రమంలో సీవీ కామేష్, రవిశంకర్ నారాయణ్, సిరి కుమార్, పి.ఉషశ్రీ, కళాకృష్ణ, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ పేరాల బాలమురళీకృష్ణ వ్యాఖ్యాతగా వ్యవహరిం చారు.

# భవిష్యత్ అంతా టూరిజానిదే

(7వ పేజీ తరువాయి)

జరుగుతున్నాయని, రాష్ట్రానికి వచ్చే విదేశీ పర్యాటకుల్లో 85 శాతం మంది వైజాగ్‌నే సందర్శిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం నగరంలో 10కి పైగా ఫైవ్‌స్టార్ హోటళ్లు నిర్మాణంలో ఉన్నాయని, మేఫెయిర్, ఒబెరాయ్ వంటి సంస్థలు సెవెన్-స్టార్ వసతులతో ప్రాజెక్టులు చేపడుతున్నాయని పేర్కొన్నారు. వెస్టిన్, మారియట్, తాజ్ వంటి అంతర్జాతీయ సంస్థలు కొత్త హోటళ్లను నిర్మిస్తున్నాయని చెప్పారు. అమెరికా పర్యటనలో అంతర్జాతీయ పెట్టుబడిదారులు, నిపుణులు విశాఖను ఇటలీలోని సుప్రసిద్ధ 'అమాల్ఫీ కోస్ట్'తో పోలుస్తూ, అత్యంత అందమైన మరియు పరిశుభ్రమైన నగరంగా ప్రశంసించారని కలెక్టర్ గుర్తుచేశారు.

### అంతర్జాతీయ పర్యాటక ఫెయిర్లలో విశాఖకు విస్తృత ప్రచారం: సీపీ శంఖబ్రత బాగ్చి

నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ విశాఖ ఆధ్యాత్మిక కేంద్రంగానే కాక, మహిళలకు అత్యంత సురక్షితమైన నగరంగా నిలిచిందని పేర్కొన్నారు. స్వదేశీ పర్యాటకులతో పాటు విదేశీ పర్యాటకులను విశేషంగా ఆకర్షించేందుకు అంతర్జాతీయ పర్యాటక ప్రదర్శనలలో (టూరిజం ఫైర్స్ ) విశాఖ బీచ్ టూరిజంను ప్రత్యేకంగా ప్రమోట్ చేయాలని సూచించారు. నూతన ఎయిర్‌పోర్ట్, మెరుగైన ఎయిర్ కనెక్టివిటీ ద్వారా అంతర్జాతీయ పర్యాటక పటంలో విశాఖను అగ్రగామిగా నిలపవచ్చని అభిప్రాయపడ్డారు.

### పర్యాటక మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట: ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

?విశాఖ తూర్పు శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నగర అభివృద్ధి కోసం రూ. 4,000 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారని తెలిపారు. కైలాసగిరికి రెండో రోడ్డు నిర్మాణం, పార్కింగ్ సదుపాయాల పెంపు, తొట్లకొండ అభివృద్ధి పనులు ఇందులో భాగమని వివరించారు. దేశంలోనే అత్యంత పొడవైన బీచ్ కారిడార్ విశాఖ సొంతమని, జోడుగుళ్ళపాలెం నుంచి భీమిలి వరకు 200 అడుగుల ఫోర్-లేన్ బీచ్ రోడ్డు పనులను డిసెంబర్ నాటికి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

### విశాఖను ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేయడమే లక్ష్యం: ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు

ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు మాట్లాడుతూ నవ్యాంధ్రప్రదేశ్‌లో అత్యధిక పర్యాటకులను ఆకర్షిస్తున్న ఏకైక నగరం విశాఖ అని తెలిపారు. విశాఖను రాష్ట్ర ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం టీసీఎస్ (టీసీస్ ) మరియు గూగుల్ డేటా సెంటర్ వంటి సంస్థలను నగరానికి తీసుకొచ్చిందని గుర్తుచేశారు. పారిశ్రామిక, ఐటీ అభివృద్ధి వేగవంతమైతే ఆర్థిక లావాదేవీలు పెరిగి పర్యాటక రంగం దానంతటదే విస్తరిస్తుందని చెప్పారు.

### పర్యాటకుల సౌకర్యార్థం జీవీఎంసీ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు: కమిషనర్ కేతన్ గార్గ్

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ పర్యాటక సీజన్ ప్రారంభమైన దృష్ట్యా నగరంలో మౌలిక వసతులను మరింత మెరుగుపరుస్తామని చెప్పారు. గతంలో ప్రారంభించిన హాప్-ఆన్ హాప్-ఆఫ్ బస్సు సేవలతో పర్యాటక ప్రాంతాల అనుసంధానం సులభతరమైందని తెలిపారు. ఇదే వేదికపై 40-50 దేశాలు పర్యటించిన ముగ్గురు విశేష యాత్రికులను (ట్రావెలర్స్ ) అధికారులు ఘనంగా సత్కరించారు. అనంతరం స్థానిక కళాకారుల స్కిట్, లైవ్ బ్యాండ్ సంగీత విభావరి, ఓపెన్ మైక్ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను విశేషంగా అలరించాయి.
ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ డీవీఎం జగదీష్ డీటీఓ మాధవి, జీవీఎంసీ అధికారులు, నగర ప్రముఖులు మరియు పెద్ద ఎత్తున యువత,ప్రజలు పాల్గొన్నారు. వేదికపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టు కున్నాయి.

# ఓటు చోరీ పేరిట ప్రతిపక్షాల ఆరోపణలు నిరాధారం

(7వ పేజీ తరువాయి)

మాధవ్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు చోరీ పేరుతో ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలపై మాధవ్ తీవ్రంగా స్పందించారు. ఎన్నికల సంఘం విడుదల చేసిన పూర్తి ప్రెస్‌నోట్‌ను ప్రతి ఒక్కరూ చదవాలని సూచించారు.
నరేంద్ర మోదీపై చేస్తున్న ప్రతి ఆరోపణకు ప్రజాస్వామ్యబద్ధంగా సమాధానం చెప్పేందుకు తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.
రాహుల్ గాంధీతో పాటు సోషల్ మీడియాలో వస్తున్న ఆరోపణలను తప్పుబట్టారు. అసత్య ప్రచారాలతో ప్రజలను పక్కదారి పట్టించవద్దని హెచ్చరించారు. ప్రతిపక్షాలకు నిజంగా ప్రజల్లో బలం ఉంటే... తమ పార్టీలను బలోపేతం చేసుకుని ఎన్నికల్లో పోటీ చేసి గెలవాలని సూచించారు.
ఓటు చోరీ ఆరోపణలపై మాధవ్ స్పందిస్తూ... దేశంలో ఓటర్ల జాబితా తయారీ, సవరణకు పటిష్టమైన వ్యవస్థ ఉందని మాధవ్ వివరించారు. సీఈఓ, ఈఆర్ఓ, డిప్యూటీ ఈఆర్ఓలతో పాటు బూత్ లెవల్ అధికారులు పనిచేస్తున్నారని, వివిధ ఫార్మ్స్ ద్వారా ఓటర్ల జాబితా సవరణ జరుగుతుందని తెలిపారు. క్రమం తప్పకుండా ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు.ఇంత పెద్ద వ్యవస్థలో కొన్ని పొరపాట్లు జరిగే అవకాశం ఉన్నప్పటికీ... దానిని 'ఓటు చోరీ'గా అభివర్ణించడం సత్యదూరమని తెలిపారు ఎస్ఐఆర్ ప్రక్రియ కూడా పారదర్శకంగా జరుగుతుందని ఎన్నికల సంఘం స్పష్టం చేసిందని తెలిపారు.గతంలో బీజేపీకి కొన్ని రాష్ట్రాల్లో పరాజయాలు ఎదురైన విషయాన్ని కూడా ప్రస్తావిస్తూ... ప్రజల తీర్పును పార్టీ గౌరవిస్తుందని చెప్పారు. బీజేపీ బలానికి ప్రధాన కారణం పార్టీ సంస్థాగత నిర్మాణమేనని . బూత్ స్థాయి నుంచి మండల, జిల్లా స్థాయి వరకు పార్టీ వ్యవస్థ పనిచేస్తుందని, కార్యకర్తలకు నిర్దిష్ట కార్యక్రమాలు అప్పగించి వాటి అమలును పర్యవేక్షిస్తామని తెలిపారు.
ప్రజలను తప్పుదారి పట్టించేలా తప్పుడు ప్రచారాలు చేయడం మానుకోవాలని ప్రతిపక్షాలకు మాధవ్ హెచ్చరించారు. నిజంగా ప్రజల్లో బలం ఉంటే... ప్రజాక్షేత్రంలో తమ రాజకీయ ఆలోచనలను ప్రజల ముందుంచి ఎన్నికల్లో పోటీ చేసి మద్దతు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఉమ్మిడి సుజాత, రాష్ట్ర అధికార ప్రతినిధి సుహాసిని ఆనంద్, మీడియా ప్యానలిస్టులు కే ఎన్ పీ చక్రవర్తి, కరణం రెడ్డి నర్సింగరావు, ఎంఎస్‌ఎమ్ఈ డైరెక్టర్ విజయనందరెడ్డి పాల్గొన్నారు.

# అడవివరం ప్రజా రైతు హక్కుల సాధన కమిటీ ఏర్పాటు

విశాఖపట్నం, సెప్టెంబర్ 27ప్రభాత వార్త :



అడవివరం గ్రామంలో గ్రామ పెద్దలు, అఖిలపక్ష నాయకుల సమక్షంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో "అడవివరం ప్రజా రైతు హక్కుల సాధన కమిటీ"ని ఏకగ్రీవంగా ఏర్పాటు చేసి, కమిటీ సభ్యులను ప్రకటించారు. ఈ కమిటీకి అధ్యక్షులుగా సిరిపురపు వరాహ నరసింహం (ఎస్వీ ), ప్రధాన కార్యదర్శులుగా పంచదార్ల ప్రసాద్, పాలూరు శ్రీను, లంక వరంలను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కొలుసు శ్రీనివాస్, రౌతు సత్తిబాబు, సిరిపురపు సురేష్, లండా దేవి చంద్రరావు, బసన అప్పలనాయుడు, జెర్రిపోతుల నరసింహ మూర్తి, మజ్జి అప్పలరమణ, అక్కిరెడ్డి శ్రీను, మజ్జి చంద్రశ్రీనివాస్, అయ్యల సోమయాజుల మణిబాబు. కోశాధికారులుగా దాసరిరాజాజీ, కంచెర్ల సురేష్, సహాయ కార్యదర్శులుగా రంగాల అప్పలరాజు, లండా చిన్న శ్రీనివాస్, మజ్జి భీమేశ్వరరావు, సిరిపురపు చిన్నకృష్ణ, విజినిగిరి త్రినాథరావు, గెద వెంకటరమణ, తోట రమేష్, సిడగం సన్యాసప్పడు, దాసరి పైడిరాజు, విజినిగిరి శంకర్లు ఎన్నక య్యారు. సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌లుగా తిరుమల పెదింటి కీర్తితేజ, పాశర్ల ప్రసాద్ తరుణ్ ఆదిత్య.కార్యవర్గ సభ్యులుగా భోగాపురపు పైడికొండ, నరవల కొండబాబు, పల్లి అప్పలరమణ, ధనియాల అప్పలరాజు, కాటంకంటి జగదీష్, చందక అప్పలరాజు, కిలారి బుజ్జి వెంకటరమణ.
పొలిటికల్ బ్యూరో సభ్యులుగా పాశర్ల ప్రసాద్, కర్రి అప్పలస్వామి, ఎర్ర వరం బాబు, మజ్జి సూరిబాబు, లంక సత్తిబాబు, కొలుసు ఈశ్వరరావు, బవిరిశెట్టి పండు, శ్రీరామ్, మేకల కాసు గోపాల్, రాచ ఆనందవర్మలను ఎన్నుకున్నారు ఈ సంద ర్భంగా కమిటీకి పలువురు విరాళాలను ప్రకటించారు. కర్రి అప్పలస్వామి రూ.1,00,000, మజ్జి సూరిబాబు రూ.50,000, లంక సత్తిబాబు రూ.30,000, రౌతు సత్తిబాబు రూ.10,000 విరాళాలు ప్రకటించారు. కమిటీ సభ్యులు స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గారిని కలిసి, కమిటీ చేపట్టబోయే కార్యక్రమాలకు పూర్తి సహకారం అందించాలని కోరనున్నట్లు తెలిపారు. ప్రధానంగా గ్రామకంతం సమస్యలు, పంచగ్రామాల భూ సమస్యలు మరియు రైతుల హక్కుల సాధన కోసం ఈ కమిటీ కృషి చేయనుందని నాయకులు తెలిపారు. ఈ సమావేశానికి అడవివరం మాజీ సర్పంచ్ పాశర్ల ప్రసాద్ అధ్యక్షత వహించారు.

## మైనర్ బాలిక ఆత్మహత్య కేసులో
# నిందితుడికి 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

విశాఖ- లీగల్ సెప్టెంబర్ 27, ప్రభాత వార్త.

మైనర్ బాలిక ఆత్మహత్య కేసులో విశాఖపట్నం ప్రత్యేక పోక్సో కోర్టు శుక్రవారం సంచలన తీర్పు వెలువరించింది. ఇరువర్గాల వాదనలు విన్న అనంతరం గౌరవ న్యాయస్థానం నిందితుడికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.1.10 లక్షల జరిమానాను విధించింది.జరిమానాలోపది వేల రూపాయలు ను రాష్ట్ర ప్రభుత్వానికి, మిగిలిన రూ.1 లక్షను బాధితురాలి తల్లిదండ్రులకు నష్టపరిహారంగా చెల్లించాలని న్యాయస్థానం ఆదేశించింది.
వివరాల్లోకి వెళితే, 2022లో విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన తన 17 ఏళ్ల కుమార్తెను నిందితుడు కృష్ణ బయటకు తీసుకెళ్లాడని, అనంతరం ఆమె ఎలుకల మందు (రాట్ పాయిజన్) సేవించి ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించాడని ఆరోపిస్తూ బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు మేరకు ఎయిర్‌పోర్ట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తు అనంతరం కేసును న్యాయస్థానంలో ప్రవేశపెట్టారు. విచారణ పూర్తయిన అనంతరం విశాఖపట్నం ప్రత్యేక పోక్సో కోర్టు నిందితుడు ఉండ ఎర్ని విజయ్ గణపతి కృష్ణ కుమార్‌ను దోషిగా నిర్ధారిస్తూ 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.1,10,000 జరిమానా విధించింది. జరిమానాలో రూ.10,000ను రాష్ట్ర ప్రభుత్వానికి, రూ.1,00,000ను బాధితురాలి తల్లిదండ్రులకు నష్టపరిహారంగా చెల్లించాలని గౌరవ న్యాయస్థానం తన తీర్పులో పేర్కొంది.ఈ కేసు లో ప్రభుత్వం తరుపున పోక్సో ప్రత్యేక న్యాయ స్థానంపబ్లిక్ ప్రాసి క్యూటర్ బత్తి రాజశేఖర్ వాదనలు వినిపించారు.

# నమ్మించి దోపిడీ చేశారు..

(7వ పేజీ తరువాయి)

బాధితులు భారీ మొత్తంలో నగదుతో బయలుదేరారు. శుక్రవారం అర్ధరాత్రి డైమండ్ పార్క్ నుంచి హైవే వైపు వెళ్లే మార్గంలో కారులో రమేష్, అతని భార్య, స్నేహితుడు డాలర్లు తీసుకొచ్చే వ్యక్తుల కోసం ఎదురుచూస్తున్నారు. కొద్దిసేపటి తర్వాత ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్రవాహనంపై అక్కడికి చేరుకున్నారు. ఆన్‌లైన్‌లో పరిచయమైన 'రాజు' అనే వ్యక్తి తమను పంపించాడని చెప్పడంతో బాధితులు వారిని నమ్మినట్లు సమాచారం. ఆ తర్వాత పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. కారులో ఉన్న రమేష్, అతని భార్య, స్నేహితుడిపై నిందితులు దాడికి పాల్పడి, వారు వెంట తీసుకొచ్చిన రెండు బ్యాగులను బలవంతంగా తీసుకెళ్లినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### రెండు బ్యాగుల్లో భారీ మొత్తం

నిందితులు ఎత్తుకెళ్లిన బ్యాగుల్లో ఒకదానిలో రమేష్ స్నేహితుడికి చెందిన రూ.50 లక్షల నగదు ఉన్నట్లు బాధితులు తెలిపారు. మరో బ్యాగులో రమేష్‌కు చెందిన రూ.18 లక్షల నగదు, పది తులాల బంగారు ఆభరణాలు ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మొత్తం రూ.68 లక్షల నగదు, పది తులాల బంగారం అపహరణకు గురైనట్లు పోలీసులు గుర్తించారు. మనీ ఎక్స్ఛేంజ్ పేరుతో తమను నమ్మించి, నగదు--బంగారం దోచుకెళ్లారని బాధితులు వెంటనే ద్వారకానగర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుల నుంచి పూర్తి వివరాలను సేకరించారు.

### సీసీ కెమెరాలపై పోలీసుల దృష్టి

ద్వారకానగర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితులు వచ్చిన మార్గం, తిరిగి వెళ్లిన దిశను గుర్తించేందుకు పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు. ఆన్‌లైన్‌లో బాధితులకు పరిచయమైన వ్యక్తుల వివరాలతో పాటు ఫోన్ కాల్స్, ఇతర సాంకేతిక ఆధారాలను సేకరిస్తున్నారు. నిందితులను పట్టుకునేందుకు మూడు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఘటనలో ప్రత్యక్షంగా పాల్గొన్న ముగ్గురు వ్యక్తులతో పాటు, ఆన్‌లైన్‌లో బాధితులకు పరిచయమైన వ్యక్తుల పాత్రపైనా పోలీసులు ఆరా తీస్తున్నారు. మనీ ఎక్స్ఛేంజ్ పేరుతో ఇంత భారీ మొత్తంలో నగదు, బంగారం తీసుకుని బాధితులు అక్కడికి చేరుకోవడం, నిందితులు ముందస్తు సమాచారంతోనే వారిని టార్గెట్ చేశారా? అనే కోణంలోనూ దర్యాప్తు కొనసాగుతోంది. నిందితులు పట్టుబడితే ఈ వ్యవహారంలో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# వారసత్వ బాటలో విశాఖ

(7వ పేజీ తరువాయి)

తరాలకు అందించాల్సిన అవసరంపై కార్యక్రమంలో అవగాహన కల్పించారు. పర్యాటక ప్రదేశాలతో పాటు చారిత్రక కట్టడాలను సంరక్షించడం ద్వారా విశాఖను మరింత ఆకర్షణీయమైన పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దవచ్చని కార్యక్రమంలో పాల్గొన్న వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారిణి జె. మాధవి, డివిజనల్ మేనేజర్ జగదీష్, విద్యాశాఖాధికారి ఎన్. ప్రేమ కుమార్, ఇంటాక్ ప్రతినిధి రాజశేఖర్ రెడ్డి, పురావస్తు శాఖ అధికారులు, పర్యాటక రంగ ప్రతినిధులు, స్టార్ హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.
సోమవారం జివిఎంసి లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం .

# పునర్వ్యవస్థీకరణ చెందిన 10 జోన్‌లలో పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహణ

## జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్



విశాఖపట్నం, సెప్టెంబర్ 27, ప్రభాత వార్త :

మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోను, పునర్వ్యవస్థీకరణ చెందిన భీమిలి, మధురవాడ , ఈస్ట్, వెస్ట్, సౌత్ ,నార్త్, పెందుర్తి ,గాజువాక, అగనంపూడి అనకాపల్లి జోన్ల కార్యాలయాల్లోనూ "ప్రజా సమస్యల పరిష్కార వేదిక ( పీజీఆర్ఎస్ )కార్యక్రమం" 2026 సెప్టెంబర్ 28 వ తేదీ సోమవారం ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు నిర్వహించబడునని జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ ఒక ప్రకటనలో ద్వారా ఆదివారం తెలిపారు.కావున, నగరంలో పారిశుద్ధ్యం, పట్టణ ప్రణాళిక విభాగం, నీటి సరఫరా, వీధి దీపాలు,హారికల్చర్, రెవిన్యూ, యు సి డి, ఇంజినీరింగ్ మొదలగు జీవీఎంసీ విభాగాలకు సంబంధించిన సమస్యలపై 2026 సెప్టెంబర్ 28 వ తేదీ సోమవారం ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో నగర ప్రజలు అర్జీల ద్వారా సమస్యలను తెలియపరుచుకోవచ్చునని నగర ప్రజలకు జివిఎంసి కమిషనర్ తెలియచేశారు. గమనిక: 1) జీవీఎంసీ వెస్ట్ జోన్ కార్యాలయం 52 వ వార్డు లో గల ఎన్. ఎ .డి కొత్త రోడ్డు , గౌరీ నగర్ లో పశ్చిమ నియోజకవర్గం కార్యాలయం నందు ఏర్పాటు చేయడమైనది. 2) నార్త్ జోన్ కార్యాలయం 51 వ వార్డులో మాధవధార ఉడా లేఅవుట్, ఆర్ . టి. ఎ ఆఫీస్ రోడ్డు, పంప్ హౌస్ వెనుక ఉత్తర నియోజకవర్గం కార్యాలయం లో ఏర్పాటు చేయడమైనది. 3) అగనంపూడి జోన్ కార్యాలయం 85వ వార్డులో పెదమడక, శివాలయం రోడ్డు , వినాయక టెంపుల్ సమీపములో గల రాజీవ్ గాంధీ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేయడమైనది. కావున ప్రజలు ఈ పై జోన్ల ప్రదేశాలను గమనించవలసిందిగా కోరుచూ ,మిగిలిన అన్ని జోన్ల కార్యాలయాలు యధాస్థానంలో ఉన్నవని తెలియజేసారు.

vsp9:vsp9.qxd 27-09-2026 21:57 Page 1






## అమ్మవారి భక్తులకు భారీ అన్న సమారాధన



**పాడేరు,సెప్టెంబర్ 27,ప్రభాతవార్త:**

గిరిజన ఆరాధ్య దైవం కోరికలు తీర్చే కొంగుబంగారంగా పేరుగాంచినపాడేరు శ్రీ శ్రీ శ్రీ మోదకొండమ్మ అమ్మ వారి సన్నిధిలో ఆలయ కమిటీ చైర్మన్ ,పాడేరు శాసనసభ్యులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు ఆదేశాల మేరకు ఆదివారం పాడేరు డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ జనరల్ డీఎస్పీ రాజా సింహ రెడ్డి రిషిత రెడ్డి దంపతులు, కాంద్రేగుల సురేష్ కుమార్ , గోరపల్లి సత్యారావు వారి ఆర్థిక సహకారాలకు అన్న సమారాధన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు కార్యక్రమానికి సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో అమ్మ వారి భక్తులు పాల్గొని అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటి బాబు నాయుడు, సభ్యులు చల్లా రామకృష్ణ ,బోనంగి వెంకటరమణ, దన్నేటి పలాస రాము, కిల్లు చంద్రమోహన్ కుమార్ ,కొణతాల సతీష్ ,బింగినాపల్లి హరిబాబు,బాకూరి పాండురాజు, గూడెపు సూర్య ప్రకాష్ కారం,దేవుడు, లకే రత్నాబాయి పలాసి రమణమ్మ, మోద స్వరూప, కిల్లు శ్రవణ్ కుమార్ దంపతులు దిలీప్ కుమార్, ఏ. సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## గోమంగి పరిధిలో బ్రిడ్జికి గండి.. ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



**పాడేరు,సెప్టెంబర్27,ప్రభాతవార్త:**

పెదబయలు మండలం గోమంగి పంచాయతీ గోమంగి, మద్దిగరువు వెళ్లే మార్గంలో గోమంగి మినీ గురుకులం దగ్గర బ్రిడ్జికి గండిపడడంతో సుమారు 15 పంచాయితీ ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడ రాధాకృష్ణ పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ: సుమారు 15 పంచాయతీల ప్రజలు బస్సు కు ఆధారపడి ప్రయాణం చేస్తుంటారు గత తుపాను కారణంగా బ్రిడ్జి గండి పడటంతో నామమాత్రంగా గతంలో పూడ్చివేసి వదిలేశారు, మొన్న ఐదు రోజుల కురిసిన భారీ వర్షానికి బ్రిడ్జి మొత్తం కుంగిపోవడంతో బస్సు రాకపోకలకు పూర్తిగా అంతరాయం కలిగింది దానివల్ల బస్సు కు ఆధారపడే ప్రజల అనేక ఇబ్బందులు పడుతున్నారని ఈ విషయంపై అనేక మార్లు అధికారులు దృష్టి తీసుకు వెళ్లిన పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. అలాగే మరివీధి సంత బయలు దగ్గర కల్వర్టు పూర్తి కొట్టుకుపోవడంతో ప్రయాణికుల అనేక ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు చుట్టం చూపుకు వచ్చి చూసినట్లు పోతున్నారు తప్ప సమస్య సమస్యగానే మిగిలిపోతుందని కనీసం వాటి పరిష్కారం చూపటం లేదని, తారాబు జలపాతానికి చూడటానికి వెళ్లే ప్రజలకు కూడా అనేక ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే పాడైపోయిన బ్రిడ్జిలు, కల్వర్టులు నూతనంగా నిర్మించాలని వారొక ప్రకటనలో డిమాండ్ చేశారు. నిరుద్యోగుల సంఘం జిల్లా నాయకులు ఖర్జవై కుమార్, టిడిపి పంచాయతీ అధ్యక్షులు గంపరాయి ధనంజయ్, గంపరై వెంకటరావు, కే.వైకుంతం ధర్మ, పౌల్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు కౌన్సిలింగ్, తల్లిదండ్రులకు సమాచారం లేకుండా టీసీలు ఇవ్వడం దుర్మార్గం

### గిరిజన విద్యార్థి సంఘం అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి బూడిదే మాధవరావు, బాబుజ్జి ఆగ్రహం




**పాడేరు,సెప్టెంబర్27,ప్రభాతవార్త:**

అల్లూరి జిల్లా పెదబయలు మండలం సీతగుంట గిరిజన సంక్షేమ (ట్రైబల్ వెల్ఫేర్) ఇంగ్లీష్ మీడియం బాయ్స్ పాఠశాలలో ఎనిమిది మంది విద్యార్థులను పాఠశాల నుండి తొలగిస్తూ (టీసీలు ఇస్తూ) యాజమాన్యం తీసుకున్న ఏకపక్ష నిర్ణయాన్ని గిరిజన విద్యార్థి సంఘం తీవ్రంగా ఖండిస్తోందని గిరిజన విద్యార్థి సంఘం అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి బూడిదే మాధవరావు పేర్కొన్నారు. శనివారం విద్యార్థుల తల్లిదండ్రుల కు కనీస సమాచారం కూడా ఇవ్వకుండా, ఉన్నపళంగా టీసీలు జారీ చేసి వారి భవిష్యత్తును అంధకారంలోకి నెట్టడం పాఠశాల ప్రధానోపాధ్యాయులు (హెచ్ఎం) యాజమాన్యం బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. విద్యార్థుల్లో క్రమశిక్షణ లోపం ఉన్నా, వారు తప్పుడు మార్గాల్లో వెళ్తున్నా వారిని సరైన దారిలో పెట్టాల్సిన బాధ్యత విద్యాసంస్థలపై ఉంది. పిల్లల్లో మార్పు తీసుకురావడానికి వారికి మానసిక నిపుణులతో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు.అలాగే కౌన్సిలింగ్ ఇవ్వాలి. అంతేకాని, సమస్యల నుంచి తప్పుకోవడానికి విద్యార్థులను బడి నుండి బయటకు పంపేయడం ఏ రకమైన విద్యా విధానం? ఇలా టీసీలు ఇచ్చి రోడ్డున పడేస్తే వారి భవిష్యత్తు ఏమవ్వాలి?ఈ వయసులో పిల్లలు తప్పులు చేస్తే తల్లిదండ్రులను పిలిపించి మాట్లాడా లి. వారికి పరిస్థితిని వివరించి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి పిల్లల్లో మార్పు తీసుకురావడానికి ప్రయత్నించాలి. అవేమీ చేయకుండా నేరుగా టీసీలు ఇచ్చి పంపించే హక్కు స్కూల్ యాజమాన్యానికి ఎవరిచ్చారు?

**గిరిజన విద్యార్థి సంఘం ప్రశ్నించింది.**

సీతగుంట ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్‌లో 8 మంది విద్యార్థులకు టీసీలు ఇవ్వడంపై ఉన్నతాధికారులు తక్షణమే సమగ్ర విచారణ జరపాలి.నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వారికి తగిన కౌన్సిలింగ్ ఇచ్చి, తిరిగి పాఠశాలలోకి చేర్చుకోవాలి.గిరిజన విద్యార్థుల విద్యా హక్కులను కాలరాస్తూ, వారి భవిష్యత్తుతో ఆడుకుంటే గిరిజన విద్యార్థి సంఘం ఊరుకోదని, బాధితులకు న్యాయం జరిగే వరకు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని గిరిజన విద్యార్థి సంఘం హెచ్చరిస్తున్నామన్నారు.

## గ్రూప్ -2 స్టడీ మెటీరియల్ పంపిణీ



**కొయ్యూరు, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :**

మండలంలోని బూదరాళ్ల పంచాయతీ పరిధి కన్నవరం గ్రామానికి చెందిన ఆదివాసీ నిరుద్యోగ యువకుడు డిగ్రీ ఉత్తీర్ణత పొందిన మర్రి కేశవరావు విన్నపం మేరకు ఆదివారం కొయ్యూరుకు చెందిన రెవెన్యూ ఉద్యోగి దుమంతి సత్యనారాయణ త్వరలో విడుదల కాబోవు గ్రూప్ – 2 నోటిఫికేషన్ కి అనుగుణంగా గ్రూప్ –2 ప్రిలిమ్స్‌కి ఉపయోగపడే స్టడీ మెటీరియల్ ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా పోటీ పరీక్షల మెలకువలను తెలియజేశారు. కార్యక్రమంలో పోగుల పాలెం నాకు చెందిన పాంగి భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్టర్లకు కాసుల వర్షం... అధికారులకి కమీషన్లు...!

### ఇదీ మండలవిద్యుత్ శాఖ అధికారుల తీరు-బాలారం తాజా మాజీ సర్పంచ్ అప్పన అప్పలనర్స ఫైర్

**కొయ్యూరు, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :**



మండల విద్యుత్ శాఖ అధికారుల తీరు చూస్తుంటే ఆశ్చర్యం కలిగిస్తుందని అవసరం ఉన్న చోట కాకుండా, కాంట్రాక్టరుకు కాసులు కురిపించే విధంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని బాలారం తాజా మాజీ సర్పంచ్ విమర్శించారు. శుక్రవారం స్థానిక విలేకరులకు విడుదల చేసిన ప్రకటనలో అప్పల నర్సమాట్లాడుతూ– ప్రజలందరికీ ఎంతో ప్రమాదకరంగా ఉన్న పనులును ఎలక్ట్రికల్ సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లినా కనీసం స్పందన లేదని తెలిపారు. మండలం లో విద్యుత్ అధికారులు ఒక కాంట్రాక్టర్ కు అనుకూలంగా ఉంటూ ఆ కాంట్రాక్టర్ చెప్పిన పనులు చేయడానికే ముందుకు వస్తున్నారని విమర్శించారు. ఒక విద్యుత్తు స్థంభం మార్చితే సరిపోయే పరిస్థితిల్లు ఉన్న కాంట్రాక్టర్ కు లాభం సమకూర్చేందుకు నాలుగు, ఐదు విద్యుత్తుస్థంబాలు మార్చుతున్నారని ఇదే విషయం మండల ఎలక్ట్రికల్ ఏ ఈ ని ప్రశ్నిస్తే ఏమి చేసుకుంటారో చేసుకోండి.. అన్నట్టు నిర్లక్ష్య సమాధానం ఇస్తున్నారని ఆరోపించారు. ఒక అధికార పార్టీ తాజా మాజీ సర్పంచ్ కే ఈ విదంగా సమాధానం చెప్పితే ఇక అమాయక ప్రజలకు, ప్రతిపక్ష నాయకులకు ఏ విధంగా సమాధానం ఇస్తారో ఆలోచించాలని తెలిపారు . పైస్థాయి అధికారుల సహకారం లేకుండా ఆ అధికారి ఆలా మాట్లాడతారా ?అని విస్మయం వ్యక్తం చేశారు . విద్యుత్ అధికారులు చిన్న చిన్న పనులకి కూడా ఇస్టిమేషన్ వెయ్యాలి అని కాలయాపన చేసి ప్రజలకి విసుగు తెప్పించి చివరకు ప్రజల నుండి రూ.వేలల్లో డబ్బులు వసూళ్లు చేసుకుంటున్నారని విమర్శించారు. గతంలో ఇదే విదంగా అధికారుల తీరు పై పత్రికలో ప్రకటన ఇస్తే తుతు మంత్రంగా పనులు చేసి మమ అనిపించారని అన్నారు. మరల ఇప్పటి వరకు వాళ్ళ జాడే లేదని తెలిపారు. అదేవిధంగా ఇంటి సమీపంలో నుండి విద్యుత్ వైర్లు వెళ్లడంతో ఇంటి నిర్మాణాలకు కూడా నిలిచిపోయాయని తెలియజేశారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు ఈ విషయం పై దృష్టిసారించి చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేస్తామన్నారు.

## ఆదివాసీ మహిళ కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం, ఆర్థిక సాయం అందించాలి

**పాడేరు,సెప్టెంబర్27,ప్రభాతవార్త:**

మండలం ధారకొండ పంచాయతీ పరిధిలోని చిన్న గంగవరం గ్రామానికి చెందిన 28 ఏళ్ల ఆదివాసీ మహిళ పాంగి లావణ్య ప్రసవం వేదన తర్వాత మరణించిన సంఘటనపై అల్లూరి సీతారామరాజు జిల్లా సిపిఎం కమిటీ కార్యదర్శి పి.అప్పల నరస తీవ్ర ఆందోళన వ్యక్తంవేశారు.గురువారం రాత్రి ఉత్తరాంధ్ర తీరాన్ని దాటిన డీప్ డిప్రెషన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు వరదలు సంభవించాయి. దారకొండ పంచాయతీలోని చిన్న గంగవరం గ్రామంలో ఉన్న మట్టి రోడ్ కల్వర్ట్ తుపాన్ రాకముందే వచ్చిన వర్షాలకు పూర్తిగా ధ్వంసమైంది. కనీసం మరమ్మత్తు చేయడానికి కూడా ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. దీంతో గ్రామం పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఎటువంటి రవాణా సౌకర్యం లేకుండా పోయింది.పాంగి లావణ్య గురువారం రాత్రి ప్రసవ వేదనతో మగ శిశువుకు జన్మనిచ్చారు. ప్రసవం తర్వాత ఆమె స్పృహ కోల్పోయి పరిస్థితి విషమించింది. గ్రామస్తులు ఆమెను దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి (పీహెచ్‌సీ) తీసుకెళ్లడానికి ప్రయత్నించారు. కానీ మార్గంలోని వాగులు ఉప్పొంగడం, గ్రామాన్ని మైదాన ప్రాంతంతో కలిపే వంతెన కొట్టుకుపోవడంతో ఏ మార్గం ద్వారా కూడా తరలించలేకపోయారు. భారీ వర్షాలు, రోడ్ల పరిస్థితి కారణంగా వాహనాలు అందుబాటులో లేకపోవడంతో వైద్యసహాయం అందక పాంగి లావణ్య మరణించారు. తుపాన్/డీప్ డిప్రెషన్ సంభవిస్తుందని ముందుగానే తెలిసినా నిండు గర్భిణీ మహిళలను ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవడం, ఆసుపత్రికి తరలించడం, వంతెనలు–కల్వర్ట్‌లను సరిగా నిర్వహించడం, మరమ్మత్తు చేయడంలో ప్రభుత్వం తీవ్ర వైఫల్యం చూపింది. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఈ విషాదం చోటు చేసుకుంది. మృతి చెందిన పాంగి లావణ్య కుటుంబానికి తక్షణం తగిన నష్టపరిహారం (కనీసం రూ. 25 లక్షలు) ఆర్థిక సాయం అందించాలనీ,నవజాత శిశువుకు పాలు, పోషకాహారం, వైద్య సహాయం తదితర అవసరమైన ఏర్పాట్లు వెంటనే చేయాలనీ, ఇలాంటి విషాదాలు మళ్లీ జరగకుండా గిరిజన ప్రాంతాల్లో వంతెనలు, రోడ్లు, ఆరోగ్య సేవలు బలోపేతం చేసి ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలనీతక్షణమే చిన్న గంగ వరం గ్రామాల్లో శాశ్వత వంతెన నిర్మాణాన్నికి నిధులు మంజూరు చేసి పూర్తి చేయాలనీప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయం చేయాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కమిటీ కార్యదర్శి పి అప్పల నరస కోరారు.

## బొండంలో నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**అరకులోయ, సెప్టెంబర్ 27:**



ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు అరకులోయ మండలం బొండం గ్రామ పంచాయతీలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి వీసం ప్రసాద్ తెలిపారు. అల్లూరి జిల్లా కలెక్టర్, నిశాంతి.టి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.బొండం గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి, సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. బొండం గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలు, ఫిర్యాదులను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని వీసం ప్రసాద్ సూచించారు.

## ఎర్త్ వైర్‌లో విద్యుత్ ప్రవాహం.. ఆవు మృతి

### నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడి వేడుకోలు



**గూడెంకొత్తవీధి, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని వంతడాపల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం విద్యుత్ షాక్‌కు గురై ఓ ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. గ్రామానికి చెందిన గిరిజన రైతు బూడిద అప్పారావు తన ఆవుల మందను మేతకు తీసుకెళ్లి తిరిగి ఇంటికి తీసుకొస్తుండగా, ఇంటి సమీపంలోని విద్యుత్ స్తంభాన్ని ఓ ఆవు తాకింది. స్తంభానికి అమర్చిన ఎర్త్ వైర్‌లో విద్యుత్ ప్రవాహం ఉండటంతో ఆవు తీవ్ర విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. కళ్లముందే తన జీవనాధారమైన పాడిపశువు మృతి చెందడంతో రైతు అప్పారావు కన్నీరుమున్నీరయ్యారు. విద్యుత్ స్తంభాల ఎర్త్ వైర్లలో విద్యుత్ ప్రవాహం లేకుండా తగిన భద్రతా చర్యలు తీసుకోవడంలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహించారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. పాడిపశువును కోల్పోవడంతో తన కుటుంబ జీవనాధారానికి నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం స్పందించి తక్షణమే నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. గ్రామంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, వైర్లను వెంటనే పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టి భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు విద్యుత్ అధికారులను కోరుతున్నారు.

## రహదారి కోసం ఏళ్లుగా నిరీక్షణ

### వర్షాలకు కొట్టుకుపోయిన తాత్కాలిక మట్టి రోడ్డు



**గూడెంకొత్తవీధి, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :**

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం, పరిధిలోని పెద్ద గొందిపల్లి గ్రామానికి మాత్రం రహదారి సౌకర్యం అందని ద్రాక్షగానే మిగిలింది. ఏళ్లుగా రహదారి లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి కోసం అధికారులను పలుమార్లు ఆశ్రయించినా సమస్య పరిష్కారం కాకపోవడంతో గ్రామస్తులంతా ఏకమై ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) ద్వారా శ్రమదానం చేసి తాత్కాలికంగా మట్టి రహదారిని నిర్మించుకున్నారు. దీంతో కనీసం రాకపోకలకు ఇబ్బంది ఉండదని భావించిన గ్రామస్తుల ఆశలు ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ఆవిరయ్యాయి. వరద ఉధృతికి మట్టి రహదారి కొట్టుకుపోవడంతో గ్రామానికి మళ్లీ రాకపోకలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు పరిస్థితి మరింత దయనీయంగా మారుతోందని, అత్యవసర సమయంలో 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసినా గ్రామానికి చేరుకునే పరిస్థితి లేదని గ్రామస్తులు మచ్చుల పెద్దబ్బి, కొడబాల పెద్దబ్బి, సలిమితి బాలయ్య ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం నడిచి వెళ్లేందుకు కూడా వీలు లేని మార్గంలో నిత్యం ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి పెద్ద గొందిపల్లి గ్రామానికి శాశ్వత ప్రాతిపదికన తారు రహదారి నిర్మించాలని పాతూరు సన్యాసమ్మ, దేశగిరి సుభద్ర, సలిమితి రేణుక తదితర గ్రామస్తులు కోరారు. గిరిజన ప్రాంత ప్రజల రవాణా సమస్యను దృష్టిలో ఉంచుకుని ఐటీడీఏ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకుని రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

## ఐదేళ్లుగా పూర్తికాని తారు రోడ్డు పనులు

### భారీ వర్షాలతో మరింత అధ్వానంగా మారిన రహదారి

**గూడెంకొత్తవీధి, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త:**



మన్యంలో రహదారి కష్టాలు గిరిజనులను వెంటాడుతూనే ఉన్నాయి. మండలంలో అత్యంత వెనుకబడిన అమ్మవారి దారకొండ పంచాయతీ ప్రజలు రహదారి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రహదారి మరింత దెబ్బతినడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రహదారి సమస్యపై పాలకులు, అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

**ఐదేళ్ల క్రితమే నిధులు మంజూరు**

అమ్మవారి దారకొండకు సప్పర్ల మీదుగా తారు రోడ్డు నిర్మాణానికి సుమారు ఐదేళ్ల క్రితమే నిధులు మంజూరైనట్లు స్థానికులు తెలిపారు. అప్పట్లో పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు కొంతమేర గ్రావెల్, చిప్స్ వేసి పనులను మధ్యలోనే నిలిపివేశారని గ్రామస్తులు పేర్కొన్నారు. ఐదేళ్లు గడిచినా తారు పనులు పూర్తికాకపోవడంతో రహదారి పరిస్థితి అధ్వానంగా మారింది. పనులు పూర్తికాకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో రోగులు, గర్భిణీలను ఆస్పత్రులకు తరలించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యావసర సరుకులు, ఇతర అవసరాల కోసం రాకపోకలు సాగించాలన్నా అవస్థలు తప్పడం లేదని చెబుతున్నారు. దీంతో తమకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించాలని వారు కోరుతున్నారు.

**తక్షణమే రోడ్డు పనులు పూర్తి చేయాలి**

ఇప్పటికైనా ఐటీడీఏ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ స్పందించి అమ్మవారి దారకొండ––సప్పర్ల రహదారి నిర్మాణ పనులను పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. నిలిచిపోయిన తారు రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసి, తమ గ్రామాలకు సురక్షితమైన రహదారి సౌకర్యం కల్పించాలని అమ్మవారి దారకొండ పంచాయతీ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## వెంకయ్యపాలెంలో ఘనంగా వినాయక నిమజ్జనోత్సవం



**రాంబిల్లి, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త:**

మండలంలో జిరాయితి చింతువా పంచాయతీ వెంకయ్యపాలెం గ్రామంలోని రామాలయం వద్ద ప్రతిష్ఠించిన వినాయకుడికి ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గణనాథుడిని దర్శించుకునేందుకు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తుల కోసం అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్థులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం వినాయకుడి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి కోలాటాలు, భక్తిగీతాలు, మంగళవాయిద్యాల నడుమ గ్రామంలో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. వినాయక నామస్మరణతో గ్రామ వీధులు మార్మోగగా, చిన్నారులు, మహిళలు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం భక్తుల సమక్షంలో గణనాథుడి నిమజ్జన కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

## తుఫాన్ సమయంలో ప్రజలకు అండగా నిలిచిన వారికి కృతజ్ఞతలు: టీఎన్ఎస్ఎఫ్



**గూడెంకొత్తవీధి, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :**

తుఫాన్ కష్టకాలంలో జీకేవీధి మండల ప్రజలకు అండగా నిలిచి, సహాయక చర్యల్లో భాగస్వాములైన మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, పాత్రికేయులు, 16 పంచాయతీల సచివాలయ సిబ్బందికి జీకేవీధి మండల టీఎన్ఎస్ఎఫ్ తరపున కృతజ్ఞతాభివందనాలు తెలిపారు. భారీ వర్షాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో ప్రజల భద్రతకు అధికారులు, సిబ్బంది అందించిన సేవలను ఈ సందర్భంగా టీఎన్ఎస్ఎఫ్ నాయకులు కొనియాడారు. ప్రజలకు సమాచారం అందించడంలో పాత్రికేయులు, స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో ప్రజాప్రతినిధులు, క్షేత్రస్థాయిలో సేవలందించిన సచివాలయ సిబ్బంది చేసిన కృషికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. విపత్కర పరిస్థితుల్లో సమన్వయంతో పనిచేసిన ప్రతి ఒక్కరికీ మండల టీఎన్ఎస్ఎఫ్ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.

## ధారకొండలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

### రహదారుల వెంట అపరిశుభ్రత.. చర్యలు తీసుకోవాలని స్థానికుల విజ్ఞప్తి



**గూడెంకొత్తవీధి, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త:**

మండలంలోని దారకొండ ప్రాంతంలో రహదారుల వెంట ప్లాస్టిక్ వ్యర్థాలు భారీగా పేరుకుపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పరిసరాల్లో, ముఖ్యంగా రహదారి అంచుల్లో, వర్షపు నీరు నిలిచే ప్రాంతాల్లో ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు, ఇతర వ్యర్థాలు పేరుకుపోయి అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వ్యర్థాలు నీటిలో కలవడంతో దుర్వాసన వెదజల్లుతోందని, వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాలు వర్షపు నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారడంతో నీరు నిలిచిపోయి దోమలు, క్రిమికీటకాలు వృద్ధి చెందే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా పశువులు ప్లాస్టిక్ వ్యర్థాలను తినే ప్రమాదం ఉందని, పర్యావరణంపై కూడా ప్రతికూల ప్రభావం పడుతోందని గ్రామస్తులు పేర్కొన్నారు. దారకొండ ప్రాంతంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ చెత్తను వెంటనే తొలగించి పారిశుధ్య చర్యలు చేపట్టడంతో పాటు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు.

## 29న పాడేరు నియోజకవర్గ టీడీపీ విస్తృత సమావేశం

### స్థానిక సంస్థల ఎన్నికల అభ్యర్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణకు పిలుపు

**గూడెంకొత్తవీధి, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :**



పాడేరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ విస్తృత సమావేశం ఈ నెల 29న నిర్వహించనున్నట్లు జీకేవీధి మండల టీడీపీ అధ్యక్షుడు పొత్తూరు కొండలరావు తెలిపారు. ఈ సమావేశానికి జీకేవీధి మండలంలోని 16 పంచాయతీలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, మండల అనుబంధ కమిటీలు, గ్రామ కమిటీ అధ్యక్షులు, కార్యదర్శులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, పార్టీ సీనియర్ నాయకులు, సహకార బ్యాంకు చైర్మన్లు, డైరెక్టర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, వివిధ సంస్థల ప్రతినిధులు, యూనిట్ ఇన్‌చార్జిలు, కన్వీనర్లు, పార్టీ అభిమానులు హాజరుకావాలని కోరారు. అలాగే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు పోటీ చేయాలనుకునే ఆశావహులు పార్టీ అధిష్ఠానం సూచనల మేరకు పాడేరు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి వద్ద తమ దరఖాస్తులను సమర్పించాలని కొండలరావు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పార్టీ సంస్థాగత అంశాలతో పాటు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు.




## గణనాథుడ్ని దర్శించుకున్న వైసీపీ నేతలు

**అనకాపల్లి, సెప్టెంబర్ 27, (ప్రభాతవార్త):**



స్థానిక నర్సింగరావు పేట శ్రీ శారదా బాల గణపతి యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక నవరాత్రులు సందర్భంగా వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు , మాజీ కార్పొరేటర్ మందపాటి సునీత ఆదివారం దర్శించుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. సంఘం సభ్యుల ఆధ్వర్యంలో వారిని ఘనంగా సత్కరించి జ్ఞాపకలను అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షులు జాజుల రమేష్ , 84వ వార్డ్ అధ్యక్షులు కోరుకొండ రాఘవ, తదితరులు పాల్గొన్నారు.

## దుర్గాదేవి నూతన ఉత్సవ కమిటీ ప్రమాణ స్వీకారం

### ఘనంగా దుర్గాదేవి పందిరి రాట మహోత్సవం



**అనకాపల్లి, సెప్టెంబర్ 27 (ప్రభాత వార్త) :**

స్థానిక గవరపాలెంలో శతకం పట్టు వద్ద కొలువైయు న్న కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం దుర్గాదేవి శరన్నవరాత్రులు సందర్భంగా ఆలయ అర్చకులు కే హరినారాయణ ఆధ్వర్యంలో ఆలయం వద్ద పందిరిరాట మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ రాట పూజలో పి.వెంకట అప్పారావు, వాణి దంపతులు,బుద్ధ సంతోష్,హేమ దంపతులు ఆలయ వ్యవస్థాపకులు పివి రమణ, ఆలయ శాశ్వత చైర్మన్, ఆలయ నిర్వాహకులు కాంద్రేగుల నాయుడు, ప్రస్తుత ఉత్సవ కమిటీ చైర్మన్ భీమరశెట్టి వరాహ నూకరాజు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. గత ఏడాది వలే ఈ ఏడాది కూడా దేవీ నవరాత్రులు అత్యంత ఘనంగా నిర్వహిస్తామని వారు తెలియజేశారు. అనంతరం నూతన ఉత్సవ కమిటీ ప్రమాణ స్వీకారం మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలు దాడి జయవీర్,కొణతాల సంతోష్ అప్పారావు నాయుడు, కర్రి సన్యాసినాయుడు, భీమర శెట్టి వరాహ నూకరాజు పాల్గొన్నారు.నూతన ఉత్సవ కమిటీ చైర్మన్ గా కొణతాల మురళీకృష్ణ, నూతనడైరెక్టర్లుగా సూరిశెట్టి శ్రీను, దూల ప్రసాదు, కాంద్రేగుల బుజ్జి, సూరిశెట్టి గణేష్, పెంటకోట మధు, విల్లూరి ఫణి, యాళ్ల శ్రీనివాసరావు, దాడి నాగభూషణం, కొయిలాడ నాగ గణేష్ ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో,శ్రీ గౌరీ పరమేశ్వరి కమిటీ సభ్యులు, ప్రజా టెంట్ హౌస్, శ్రీ మరిడిమాంబ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### ప్రముఖ వైద్యుడు డిడి నాయుడు

**అనకాపల్లి, సెప్టెంబర్ 27, (ప్రభాత వార్త)**



ప్రస్తుతం వర్షాకాలం సీజన్ కావడంతో ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ వైద్యులు ఎన్టీఆర్ వైద్యాలయం అభివృద్ధి కమిటీ మెంబర్ డాక్టర్ డి డి నాయుడు అన్నారు. ఆదివారం ఆయన ఎన్టీఆర్ ఆసుపత్రిని సందర్శించారు. ఆసుపత్రిలోని ప్రతి వార్డును పరిశీలించి రోగులకు డాక్టర్లు ఇస్తున్న వైద్యంపై ఆరా తీశారు. ఐసీయూ ఎమర్జెన్సీ వార్డుకు వెళ్లి పేషెంట్లను తనిఖీ చేసి వారికి జరుగుతున్న వైద్యమును పరీక్షించారు. వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్త వహించాలని ముఖ్యంగా జ్వరాలు వచ్చినప్పుడు అశ్రద్ధ చేయకూడదని చెప్పారు . వర్షాకాలం అవడం వలన డెంగ్యూ జ్వరాలతో వైద్యం కోసం ఎక్కువగా వస్తున్నరని రోజుకి 30 నుంచి 40 కేసులు జ్వరాలతో వస్తున్నారని చెప్పారు. ఏడిస్ దోమ వలన ఈ డెంగ్యూ జ్వరం వస్తుందన్నారు. దీని లక్షణాలు జ్వరం 103 104 డిగ్రీలు ఉంటుందన్నారు. తలనొప్పి, కండరాల నొప్పి, కంటి నొప్పి లక్షణాలు డెంగ్యూ జ్వరం వల్ల ప్లేట్లెట్స్ తగ్గిపోతాయి అన్నారు. సరైన సమయంలో తగిన వైద్యం పొందకపోతే ప్రాణానికి ప్రమాదమని, ప్రతి ఒక్కరు పై లక్షణాలు ఉంటే ఆసుపత్రిలో వైద్యం చేయించుకోవాలని సూచించారు. ఆ జాగ్రత్తగా ఉంటే మెదడు మూతపిండాలు కాలేయం దెబ్బతినే అవకాశం ఉందని డాక్టర్ నాయుడు సూచించారు.

## ప్రమాదాల నివారణకు చర్యలు : ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణ



**ఎలమంచిలి,సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :**

రోడ్డు భద్రత దృష్ట్యా వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు జాతీయ రహదారి కొక్కిరాపల్లి, షేకుల్లపాలెం జంక్షన్ వద్ద స్టాపర్లను ఏర్పాటు చేశారు. ప్రమాదాల నివారణ, వాహనదారులు నెమ్మదిగా ప్రయాణించేలా చర్యలు చేపట్టినట్లు ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఈ ప్రాంతాల్లో వాహనదారులు వేగ నియంత్రణ పాటించి జాగ్రత్తగా ప్రయాణించాలని సూచించారు.

## భక్తులకు కండువాలు పంపిణీ చేసిన పప్పు ఈశ్వరరావు

**ఎలమంచిలి,సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :**



మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన వివిధ గణేష్ మండపాలను సందర్శించి, వినాయక విగ్రహంతో కూడిన కండువాలను తన సొంత నిధులతో హిందూ బంధువులకు అందజేసిన పప్పు ఈశ్వరరావు.ఈ కార్యక్రమంలో భాగంగా తెరపల్లి, యలమంచిలి ధర్మవరం, శేషుకొండ కాలనీ, యలమంచిలి గాంధీనగర్, పెదపల్లి రైల్వే స్టేషన్ రోడ్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలకు కండువాలను అందజేయడం జరిగింది. కార్యక్రమంలో హిందూ బంధువులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

**పాయకరావుపేట, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :**

మండలంలోని పెద్ద రామభద్రపురం తమలపాకు తోటలో కూలి పనికి వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఈ నేరానికి సంబంధించి స్థానిక పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ ఆలీ అందించిన వివరాలిలా ఉన్నాయి.సత్యవరం గ్రామానికి చెందిన గేదెల మల్లేశ్వరరావు (60) పెద్ద రాంబద్రపురం గ్రామంలోని దాడి గోపి తమలపాకు తోటలో ఆకులు కోస్తుండగా, సమీపంలోని విద్యుత్ స్తంభంపై ఉన్న కరెంటు తీగలు తెగి ఆయనపై పడ్డాయి.దీంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు.సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ అలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా గ్యార్మి షరీఫ్ పండగ

**(నక్కపల్లి /అడ్డరోడ్డు, ప్రభాతవార్త )**



మండలంలోని పెద్ద బోదు గళ్ళం గ్రామంలో గ్యార్మి షరీఫ్ పండగను భక్తిశ్రద్ధలతో ముస్లిం సోదరులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం గ్రామంలో ముస్లింలంతా గుర్రాన్ని అందంగా ముస్తాబు చేసి వీధుల్లో ఊరేగించారు. దీన్ని ఇంటింటికి తీసుకెళ్లగా స్థానికులు గుర్రానికి పూజలు చేసి చందనం జండాలను గుర్రంపై వేశారు. తర్వాత వీటిని దర్గా వద్దకు తీసుకెళ్లిన మత పెద్దలు ఇక్కడ ప్రార్థనలు జరిపారు. ఈ గ్యార్మి షరీఫ్ పండగ సందర్భంగా గ్రామంలో పెద్ద ఎత్తున విద్యుత్ అలంకరణ చేశారు. విశేషంగా భక్తులను ఆకట్టుకుంది.

## శతకంపట్టు కనకదుర్గమ్మవారి దసరా ఉత్సవాల గోడపత్రిక ఆవిష్కరణ

**అనకాపల్లి, సెప్టెంబర్ 27 (ప్రభాత వార్త):**



స్థానిక గవరపాలెంలో శతకం పట్టు వద్ద కొలువైయున్న శ్రీ కనకదుర్గ అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ తెలియజేశారు. ఆదివారం ఉత్సవాలకు సంబంధించి గోడ పత్రికను ఆలయం వద్ద ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ పెద్దలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో వచ్చేనెల 11నుంచి 20 వరకు అమ్మవారి దసరా నవరాత్రుల మహోత్సవాలు ఈ సంవత్సరం మరింత అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటకోత్సవాల కరపత్రాలను కూడా ఈ సందర్భంగా విడుదల చేశారు. కాగా ఇప్పటికే దసరా ఉత్సవాల సందర్భంగా శతకం పట్టు వద్ద శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. రంగు రంగుల విద్యుత్ అలంకరణలతో సరికొత్తగా ఆలయం కాంతులీనుతోంది. అక్టోబర్ నెల 11 నుంచి 20 వరకు జరుగు అమ్మవారి దసరా నవరాత్రుల ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ శాశ్వత చైర్మన్ కాంద్రేగుల నాయుడు, ఆలయ వ్యవస్థాపకుడు పివి రమణ, ఉత్సవ పూర్వ చైర్మన్ దాడి జయవీర్, నూతన ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, శ్రీ గౌరీ పరమేశ్వరుల ఉత్సవ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావు నాయుడు లు పేర్కొన్నారు.గత 9 ఏళ్లుగా అమ్మవారి ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించామని, ఈ ఏడాది కూడా అనేక వినూత్న కార్యక్రమాలతో అత్యంత వైభవంగా ఉత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. వచ్చేనెల 11న అమ్మవారి ఆలయం నుంచి రథయాత్ర ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజూ 3000 మంది భవానీలకు భిక్షలు ఏర్పాటు చేసామని, సుమారు 7500 మందికి వాయనాలు ఏర్పాటు చేసామని, పారిశుధ్య కార్మికులకు వస్త్రదానం, విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు అందజేస్తున్నామన్నారు.అలాగే అక్టోబర్ 20 న,దసరా రోజున జరుగు అమ్మవారి తిరుగు రథోత్సవ జాతరను 18 జానపద కళారూపాలతో, 9 భారీ స్టేజి లతో అత్యంత ఘనంగా పట్టణ పురవీధుల గుండా నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో నవరాత్రి 9 రోజులు అమ్మవారి ఆలయానికి విచ్చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని, అమ్మవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని ఈ సందర్భం గా కోరారు. కార్యక్రమంలో వాణిజ్య ప్రముఖులు మళ్ల సీతారాములు ,పూర్వ ఉత్సవ కమిటీ చైర్మన్లు కర్రి సన్యాసినాయుడు, భీమరశెట్టి వరాహ నూకరాజు శ్రీ గౌరీ పరమేశ్వరుల ఉత్సవ ప్రధాన కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు కొణతాల వరప్రసాద్, నాటకోత్సవాల పర్యవేక్షకులు,మాజీ మున్సిపల్ కౌన్సిలర్ కే. యం. నాయుడు, విజయ గౌరీ సేవా సంఘం అధ్యక్షులు ఆళ్ళ రామచంద్రరావు, ఆలయ ప్రతినిధులు మద్దాల శంకర్రావు, దాడి కృష్ణ, పి. వి. సత్యనారాయణ, సూరిశెట్టి నరసింగరావు, కే యం. నాయుడు, మళ్ల జగ్గప్పారావు , బుద్ధ సంతోష్, గండేపల్లి మురళి,పాలమరశెట్టి సూర్య,ఏ. సూరిబాబు, భీశెట్టి ప్రసన్న, ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## నిర్వాసితుల కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలి : సిపిఎం



**(నక్కపల్లి, ప్రభాతవార్త):**

మండలం లోని పెద్ద బోదుగాలం వద్ద నిర్మిస్తున్న ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్ నిర్వాసితులకు కాలనీ లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, సిపిఎం మండల కార్యదర్శి ఎం.రాజేష్ నిర్వాసితులతో కలిసి కాలనీ లో పర్యటించి, నిర్వాసితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అర్హత కలిగిన నిర్వాసితులకు, వివాహం అయిన ఆడ పిల్లలకు వెంటనే ప్యాకేజీ ఇవ్వాలని , మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇళ్లులు, భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఆర్ కార్డులు ఇచ్చి ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్ లో ఉద్యోగాలు కల్పించాలని కోరారు. ప్రస్తుతం జరుగుతున్న పనులలో నిర్వాసితులకు చదువు, వయసుతో సంబంధం లేకుండా వారు చేయగలిగే పనులు కల్పించాలన్నారు.ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్ యాజమాన్యం ఆర్ అండ్ ఆర్ కాలనీ ని దత్తత్ తీసుకుని కాలనీ మౌలిక సదుపాయాలు కల్పించాలి తక్షణం రక్షిత మంచినీరు కొరకు మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి ఉచితం మంచి నీరు అందించాలని కోరారు.ఆర్ అండ్ ఆర్ కాలనీ చుట్టూ పెద్ద ఎత్తున తోటలు ఉండుటం చేత కోతులు మంద కాలనీలోకి చొరబడి మనుషులపై దాడి చేస్తూ ఇళ్ళలో కి చొరబడి వస్తువులు పట్టుకెళ్ళి పోతున్నాయని తెలిపారు వెంటనే ప్రభుత్వం స్పందించి కోతులను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిర్వాసితుల స్వంత గ్రామాల నుండి నిర్వాసితులను ఆగమేఘాల మీద తరలించారని, నిర్వాసితులు సంస్కృతి, సంప్రదాయాలు, మనోభావాలను పరిగణనలోకి తీసుకోకుండా చేసారని దీని కారణంగా అనేక అనార్ధాలు జరుగుతున్నాయని, తొలగించిన గ్రామాలలో ఉండే దేవాలయాలు, గుడులు నిర్వాసితుల కాలనీ లో నిర్మిస్తామని చెప్పిన అధికారులు నేడు పట్టించుకోవడంలేదని, దాని కారణంగా మేము ప్రశాంత జీవితం కోల్పోయి ఏ రోజు ఏం జరిగితుందో అని బిక్కు బిక్కు మని జీవిస్తున్నామని నిర్వాసితులు నాయకులు వద్ద ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు. వెంటనే ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో ఆందోళన తప్పదని హెచ్చరించారు. సిపిఎం నాయకులతో పాటు ఆర్.అప్పారావు, బి.నూకరాజు, క్రిష్ణారావు, దుర్గ, జీ.అప్పారావు ,తదితరులు ఉన్నారు.

## ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం

### బొజ్జన్న కొండ చరిత్ర కరపత్రాల విడుదల

**అనకాపల్లి, సెప్టెంబర్ 27, (ప్రభాతవార్త):**




స్థానిక సిద్దార్ధ సోషల్ సర్వీస్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూచౌక్ జంక్షన్ లో గౌతమబుద్ధుని విగ్రహం వద్ద ప్రపంచ పర్యాటకదినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సంస్థ అధ్యక్షులు బల్లా నాగభూషణశీ భగవాన్ బుద్ధుని విగ్రహానికి పూలమాలవేసి, క్యాండిల్స్ వెలిగించి ప్రార్ధనలు చేసి ఘన నివాళులర్పించారు. అనంతరం అనకాపల్లి మణిహారం ప్రముఖ బౌద్ధ పర్యాటక కేంద్రం బొజ్జన్నకొండ చరిత్ర కరపత్రం లను విడుదల చేసి పంపిణీ చేసారు. ఈ సందర్భముగా మాట్లాడుతూ మాట్లాడుతూ అనకాపల్లి మణిహారం శంకరశీ లో గల ప్రపంచ అతి పురాతన చారిత్రక బౌద్ధ పర్యాటక కేంద్రం బొజ్జన్నకొండ ఈ మధ్యకాలములో సుమారు 9 కోట్ల 50 లక్షల రూపాయల కేంద్ర రాష్ట్రప్రభుత్వాల ఆర్థిక సహాయనిధులతో అత్యంత ప్రతిష్టాత్మకముగా అభివృద్ధి చేసి అందులో భాగముగా బుద్ధుని చరిత్ర, బొజ్జన్నకొండ చరిత్ర చిత్ర ప్రదర్శనకుగాను లేజర్ స్క్రీన్ దియేటర్,హరిత రిశార్ట్స్, ఫుడ్ కోర్ట్, లైటింగ్ సౌండ్ సిస్టమ్, రోడ్డు మార్గం గౌతమ బుద్ధుని విగ్రహములు, మౌలిక వసతులు, పచ్చని మొక్కలతో కూడిన ఇతర సదుపాయాలతో అభివృద్ధి చేయడం తో నూతనము గా ఏర్పాటుకాబడిన అనకాపల్లి జిల్లా ప్రపంచ పర్యాటక చరిత్రలో ఒక గొప్ప బౌద్ధ పర్యాటక కీర్తి కిరీటముగా నిలిచిపోతుందని కొనియాడారు.అలాగే ప్రతీ ఏటా ప్రపంచ పర్యాటకదినోత్సవ వేడుకలను బొజ్జన్నకొండ వద్ద నిర్వహించి బొజ్జన్నకొండ ప్రాముఖ్యతలను, విశిష్టతలను చాటి చెప్పేలా ప్రభుత్వం కృషి చేయాలని అన్నారు.అలాగే బొజ్జన్నకొండ వద్ద గత రెండేళ్ల క్రితం నూతనము గా నిర్మించిన లేజర్ స్క్రీన్ దియేటర్, హరిత రిశార్ట్స్, ఫుడ్ కోర్టులను సందర్శక బొజ్జన్నకొండ పర్యాటకులకు, దేశ విదేశీ పర్యాటకులకు, బౌద్ధ బిక్షవులకు వినియోగములోనికి తీసుకురావాలని ప్రభుత్వానికి, జిల్లా కలెక్టర్ కే. విజయకృష్ణన్ కి, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కి, స్థానిక ఎంపీ ఎమ్మెల్యే లకు కేంద్ర పురాతత్వ శాఖ అధికారులకు బల్లా నాగభూషణం విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిద్దార్ధ అసోసియేషన్ కార్యదర్శి వినకోట నీలేష్ గుప్తా, సహాయ కార్యదర్శి రొబ్బి మల్లేశ్వరరావు, కార్యవర్గసభ్యులు , వెంకటరమణ మూర్తి, రాయి సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

## భారీగా వినాయక నిమజ్జనం.. తరలివచ్చిన భక్తులు





**(నక్కపల్లి, ప్రభాతవార్త) :**

నక్కపల్లి పట్టణంలోని శెట్టిబలిజిపేట, ఎన్టీఆర్ నగర్ కాలనీలో వినాయక నవరాత్రి ముగింపు కార్యక్రమాల సందర్భంగా గ్రామం పురవీధుల్లో స్వామివారిని ఘనంగా ఊరేగించారు. వందలాది మంది భక్తుల నడుమ నిమజ్జన కార్యక్రమంనకు సంబంధించి భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకుని మండపం వద్ద 22 కేజీల లడ్డు వేలం పాట నిర్వహించారు. లడ్డు వేలం పాటలో గ్రామానికి చెందిన కేసు బోయిన పెద అప్పలరాజు చిన్న అప్పలరాజు పాల్గొన్నారు. ఈ 22 కేజీల లడ్డును కేసు పోయిన పెద అప్పలరాజు దక్కించుకున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం స్థానిక పూజారి శ్రీపాద భాస్కర ప్రసాద్ అందజేశారు. నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా కమిటీ సభ్యులు యువకులు ఆధ్వర్యంలో పూడి వెంకటరమణ ,పూడి అప్పలనాయుడు, రెడ్డి అప్పలరాజు, అప్పలనాయుడు, రమణ, దమ్ము నాగేశ్వరరావు, తదితరులు సారధ్యంలో నవరాత్రి ఉత్సవాల్లో పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించిన పూజారి శ్రీపాద భాస్కర ప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. వీరితోపాటు సంఘ సేవకులు నవర నూకరాజు శర్మను కూడా సత్కరించారు. అన్నసమారాధనలో భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు

**అనకాపల్లి, సెప్టెంబర్ 27 (ప్రభాత వార్త)**



బవులువాడ గ్రామంలో ఆదివారం శ్రీ వరాహ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సుమారు 200 మంది దంపతులతో సామూహిక కళ్యాణ మహోత్స వాలు నిర్వహించారు. టీడీపీ జిల్లా నాయకులు పీలా గోవింద సత్యనారాయణ, బత్తుల తాతయ్య బాబు, జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ భీమరశెట్టి రాంకీ, ఎంపీ సీఎం రమేష్ కార్యాల ఇన్చార్జి విజయ్ నాయుడు,తదితరులు పాల్గొన్నారు. వీరిని ఆలయ గ్రామ కమిటీ ప్రతినిధులు సత్కరించారు.

## కూటమి ఐక్యతతో స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యం

### ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ



**అనకాపల్లి, సెప్టెంబర్ 27, (ప్రభాత వార్త)**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులతో కార్యకర్తలు పూర్తి సమన్వయంతో, ఐక్యతతో విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని మాజీ మంత్రి, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక గవరపాలెం సత్య ఏసీ ఫంక్షన్ హాల్ నందు ఆదివారం శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ అధ్యక్షతన కూటమి కుటుంబ సభ్యుల పార్టీ ఆత్మీయ సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ , మాజీ శాసనమండలి సభ్యులు బుద్ధ నాగ జగదీష్ , తెలుగుదేశం జిల్లా అధ్యక్షులు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు , అనకాపల్లి జిల్లా బిజెపి అధ్యక్షులు ద్వారపరెడ్డి పరమేశ్వర రావు , గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర , డి సి ఎం ఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, ఇతర నాయకులు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొణతాల మాట్లాడుతూ కూటమి మూడు పార్టీలు పేరుకే వేర్వేరు పార్టీలైనా, ఎన్నికల సమయంలో ఒక కుటుంబంలా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. అధిష్టానం ఏ పార్టీకి, ఏ అభ్యర్థికి అవకాశం కల్పించినా వ్యక్తిగత అభిప్రాయాలు, ఆశలు పక్కన పెట్టి కూటమి అభ్యర్థి విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని,. అభ్యర్థులు ఎవరు, ఏ పార్టీకి ఎన్ని స్థానాలు అనే అంశాలపై ముందస్తు ఊహాగానాలకు తావివ్వకుండా పార్టీ అధిష్టానం నిర్ణయాన్ని గౌరవించాలని కొణతాల తెలిపారు. స్థానిక సంస్థలే రాజకీయాలకు బలమైన పునాది అని తెలిపారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు గెలవడం మాత్రమే కాకుండా గ్రామ, మండల, జిల్లా స్థాయిలో కూటమి సంస్థాగతంగా బలపడాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్, కార్పొరేటర్, మేయర్ తదితర స్థానాల్లో కూటమి అభ్యర్థుల విజయానికి ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించుకోవాలని తెలిపారు.ప్రతి వార్డులో టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసి వార్డు స్థాయి సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ప్రతి బూత్‌కు సంబంధించిన కార్యకర్తలు, బూత్ లెవెల్ ఏజెంట్లు, క్రియాశీలక సభ్యుల వివరాలను సిద్ధం చేసుకోవాలన్నారు. మారిన వార్డు పరిధులు, పోలింగ్ కేంద్రాలకు అనుగుణంగా బూత్ కమిటీలను పునర్వ్యవస్థీకరించాల్సిన అవసరం ఉందన్నారు.కార్యక్రమంలో అనకాపల్లి నియోజకవర్గం పరిధి కూటమి నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మిస్సింగ్ కేసు మిస్టరీ వీడింది

### దొంగనోట్ల వివాదంలోనే హత్య? గోదావరిలో గాలింపు

**ఎలమంచిలి, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :**



పట్టణంలో సంచలనం రేపిన మిస్సింగ్ కేసులో పోలీసుల దర్యాప్తులో కీలక మలుపు చోటుచేసుకుంది. వ్యాపారం నిమిత్తం వెళ్లి కనిపించకుండా పోయిన వ్యక్తి హత్యకు గురైనట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఘటన వివరాలివి.. ఎలమంచిలికి చెందిన కర్రి వరప్రకాశరావు ఈ నెల 16వ తేదీన వ్యాపారం నిమిత్తం రాజమండ్రి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. రోజులు గడుస్తున్నా ఇంటికి తిరిగి రాకపోవడం, ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ రావడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు ఈ నెల 20వ తేదీన టౌన్ పోలీస్ స్టేషన్ లో మిస్సింగ్ కేసుగా ఫిర్యాదు చేశారు. ఈ కేసు విషయమై సిఐ ధనుంజయరావు ఆధ్వర్యంలో పట్టణ ఎస్సై సావిత్రి దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన అసలు కథమిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. వరప్రకాశరావు కాల్ డేటా, అతని సన్నిహితులను విచారించగా అసలు విషయం బయటపడింది. డబ్బు మార్పిడి, దొంగనోట్ల వ్యవహారంలో జరిగిన చీటింగ్ కారణంగా నలుగురు వ్యక్తుల మధ్య తీవ్ర వివాదం జరిగినట్లు, ఆ వివాదంలోనే వరప్రకాశరావు హత్యకు గురైనట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది.హత్య అనంతరం నిందితులు మృతదేహాన్ని రాజమహేంద్రవరం సమీపంలోని ధవళేశ్వరం వద్ద గోదావరి నదిలో పడవేసినట్లు విచారణలో వెల్లడైంది.

**గోదావరిలో ముమ్మర గాలింపు:**

ప్రస్తుతం మృతదేహం ఆచూకీ లభించలేదు. మృతదేహం కోసం పోలీసులు గోదావరి నదిలో ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. కేసుకు సంబంధించి ఇప్పటికే పలు కీలక ఆధారాలు లభించాయని, నిందితులను త్వరలోనే అదుపులోకి తీసుకుని పూర్తి వాస్తవాలు వెల్లడిస్తామని తెలిపారు.

## కల్వర్టు రంధ్రాలకు తాత్కాలిక మరమ్మతులు

### వార్త కథనం ప్రచురితమైన వెంటనే స్పందించిన ఆర్అండ్‌బి ఏఈ పద్మని



**రాంబిల్లి, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త:**

మండలంలోని కొత్తపట్నం-పూడిమడక ప్రధాన రహదారిపై సీతపాలెం కూడలి వద్ద కల్వర్టుకు ఏర్పడిన రంధ్రాలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కల్వర్టు దెబ్బతిని రంధ్రాలు ఏర్పడటంతో ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, ఇతర వాహనాల రాకపోకలకు ప్రమాదకర పరిస్థితి నెలకొంది. కల్వర్టుపై ఏర్పడిన రంధ్రాల కారణంగా వాహనదారులు భయాందోళన మధ్య ప్రయాణిస్తున్న విషయాన్ని ఇటీవల వార్తాపత్రికలో ప్రచురించడంతో రోడ్లు భవనాల శాఖ (ఆర్అండ్‌బీ) అచ్యుతాపురం సెక్షన్ ఏఈ ఎస్. పద్మిని స్పందించారు. వెంటనే సిబ్బందిని అక్కడికి పంపించి రంధ్రాలను, రాళ్లతో ,మట్టితో తాత్కాలికంగా పూడ్చివేయించారు. దీంతో ప్రస్తుతం వాహనాల రాకపోకలకు కొంత మేర ఇబ్బంది కొంతమేర తగ్గిందన్నారు.ఈ విషయంపై ఏఈ ఎస్. పద్మిని మాట్లాడుతూ, కల్వర్టుకు శాశ్వత నిర్మాణం చేపట్టేందుకు అవసరమైన నిధులు మంజూరైన వెంటనే పనులు చేపట్టి సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని తెలిపారు.వార్తాపత్రికలో సమస్యను వెలుగులోకి తీసుకురావడంతో అధికారులు తక్షణమే స్పందించి తాత్కాలికంగా రంధ్రాలను పూడ్చడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## అంత్రిగుడలో వీధి కాలువలు ఏర్పాటు చేయాలి

### వైసిపి యువజన విభాగ కార్యదర్శి కె.విజయదశమి డిమాండ్

**డుంబ్రిగుడ, సెప్టెంబర్ 27, ప్రభాత వార్త :**



పోతంగి పంచాయతీ అంత్రిగూడ పివిటిజి గ్రామంలో వీధి కాలువలు ఏర్పాటు చేయాలని వైసిపి యువజన విభాగ కార్యదర్శి, పంచాయతీ కార్యదర్శి కె విజయదశమి డిమాండ్ చేశారు. ఆదివారం ఆ పార్టీ నాయకులతో కలిసి ఆ గ్రామంలో సందర్శించి వర్షాల ప్రభావం కారణంగా ఏర్పడిన సమస్యలపై గ్రామస్తులతో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ గ్రామంలో వీధి కాలువలు లేకపోవడంతో ప్రస్తుతం కురిసిన వర్షాల కారణంగా వర్షపు నీరు నివాసగృహాల లోపల వరద నీరు చేరుతుంద నీ ఆ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఓ గిరిజనుడుకు చెందిన పెంకుటిల్లులో వర్షపు నీరు చేరడంతో ఇబ్బందులు పడ్డారని చెప్పారు. ఇదే కాకుండా ఆ గ్రామంలో పూర్తిస్థాయిలో వీధి కాలువలు లేకపోవడంతో వర్షపు నీరంతా నివాస గృహాలు లోపల చేరుతుందన్నారు. తక్షణమే అధికారులు స్పందించి ఆ గ్రామంలో వీధి కాలువలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆ గ్రామస్తులు ,వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## వ్యాన్లలో తరలిస్తున్న పశువులు పట్టివేత

**హుకుంపేట, సెప్టెంబర్ 27,ప్రభాత వార్త:**

మండల కేంద్రంలోని కొంతిలి జంక్షన్ వద్ద ఆదివారం వాహనాల తనిఖీలు భాగంగా అక్రమంగా తరలిస్తున్న పశువులతొ పాటు, ఇద్దరు ముద్దాయిలను అదుపులోకి తీసుకున్నామని ఎస్సై దుర్గ ప్రసాద్ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం కొంతిలి జంక్షన్ వద్ద బలోరా పికప్ వ్యాన్ లో 14 ఎద్దులు అక్రమంగా మైదాన ప్రాంతాలకు తరలిస్తున్న చోడవరపు నవీన్ మరియు చోడవరపు అప్పలరాజు అనే ఇద్దరు వ్యక్తులను తీసుకున్నామని తెలిపారు. మూగజీవులను హింసించిన, మాంసం కమేళాలకు తరలించిన చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టుకున్న పశువులను గోసాలు తరలిస్తామని ఆయన తెలిపారు.

## తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపట్టాలి

**గూడెంకొత్తవీధి, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :**



మండలంలో హెలెన్ తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న రహదారులు నెలలు గడిచినా ఇప్పటికీ అధ్వాన్నంగానే ఉన్నాయని సీపీఎం మండల కార్యదర్శి, గాలికొండ మాజీ ఎంపీటీసీ బుజ్జిబాబు అన్నారు. మండలంలోని రహదారుల దుస్థితిపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న రోడ్లకు ఇప్పటివరకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టలేదని పేర్కొన్నారు. మండలంలోని అనేక గ్రామాలకు వెళ్లే రహదారులు గుంతలమయంగా మారి, వర్షాకాలంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందన్నారు. ఈ మార్గాల్లో నిత్యం ప్రయాణించే ప్రజలు, రైతులు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఆసుపత్రులకు తరలించడం కూడా కష్టతరంగా మారుతోందని పేర్కొన్నారు. గిరిజన ప్రాంత ప్రజల రవాణా సమస్యలను దృష్టిలో ఉంచుకుని కలెక్టర్, ఐటీడీఏ పీవో ప్రత్యేక చొరవ తీసుకోవాలని బుజ్జిబాబు కోరారు.

## సింహాద్రినాధుని దర్శించుకున్న ప్రముఖులు



సింహాచలం, సెప్టెంబరు 27, ప్రభాతవార్త :

శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత, మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి నూతి రామ్మోహన్ నాయుడు, జిల్లా న్యాయమూర్తి జి.శ్రీనివాస రావు దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన వీరికి ఆలయ కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ?ముందుగా ఆలయ సంప్రదాయం ప్రకారం న్యాయమూర్తి బేడా మండపంలోని ప్రసిద్ధ 'కప్పస్తంభం'ను ఆలింగనం చేసుకున్నారు. అనంతరం అంతరాలయంలో శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం ఆలయ మండపంలో వేద పండితులు ఆమెకు వేదాశీర్వచనం అందించారు. ఆలయ ఈవో జల్లేపల్లి వెంకట్రావు శేషవస్త్రంతో సత్కరించి, స్వామివారి ప్రసాదాలతో పాటు జ్ఞాపికగా స్వామివారి దివ్య చిత్రపటాన్ని అందజేశారు.

## ఘనంగా బాలగణపతి యూత్ ఆధ్వర్యంలో అన్నసమారాధన

గాజువాక, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :



జీవీఎంసీ 71వ వార్డు బాలగణపతి యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన భారీ అన్నసమారాధన కార్యక్రమా నికి విశేష స్పందన లభించింది. వినాయకుని నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సుమారు 3,000 మంది భక్తులు పాల్గొన్నారు. భక్తులకు వివిధ రకాల రుచికరమైన వంటకాలతో విందు భోజనాలు వడ్డించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా యూత్ ప్రతినిధులు సకల సౌకర్యాలు కల్పించారు. ఈ కార్యక్రమంలో 71వ వార్డు మాజీ కార్పొరేటర్ రాజాన రామారావు, చేనేత సహకార సంస్థ (వీవర్స్) మాజీ డైరెక్టర్ పప్పు రాజారావు, భూపతిరాజు సుజాత, పప్పు శంకరరావు తదితరులు పాల్గొని సేవా కార్యక్రమాలను అభినందించారు.

## ఆధ్యాత్మిక సేవే లక్ష్యంగా 'పీఎస్ఆర్' ట్రస్ట్: పెంటకోట శంకర్రావు



గాజువాక, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :

ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాల్లో పీఎస్ఆర్ ఫౌం డేషన్ ఎల్లప్పుడూ ముందుం టుందని ట్రస్ట్ చైర్మన్, టిడిపి నాయకులు పెంటకోట శంకర్రావు తెలిపారు. వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పెద గంట్యాడ హౌసింగ్ బోర్డ్ కాలనీలో 'లోకల్ బాయ్స్' ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనను ఆయన ప్రారంభించి, మూడు వేల మందికి ప్రసాద వితరణ చేశారు. అనంతరం కణితి మార్కెట్ రోడ్డులో 'మార్కెట్ యూత్' ఆధ్వర్యంలో జరిగిన అన్నదానంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఎస్ఆర్ మాట్లాడుతూ.. నేటి యువతలో ఆధ్యాత్మిక చైతన్యం పెరగడం అభినందనీయమని, దైవ కార్యక్రమాలకు తమ ట్రస్ట్ సహకారం ఎప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, కార్యదర్శి శివ, సభ్యులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్‌లో విశాఖకు ఓవరాల్ ఛాంపియన్‌షిప్



గాజువాక, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :

రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో విశాఖపట్నం జిల్లా క్రీడాకారులు విశేష ప్రతిభ చాటి ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. ఏయూ బాక్సింగ్ హాలులో రాష్ట్ర కిక్ బాక్సింగ్ సంఘం అధ్యక్షుడు ఆనంద్ బాలు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల ముగింపు కార్యక్రమానికి సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానెలిస్ట్ కరణంరెడ్డి నరసింగరావు (కేఎన్ఆర్) ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా కేఎన్ఆర్ మాట్లాడుతూ... కిక్ బాక్సింగ్ క్రీడ ద్వారా క్రీడాకారులకు ఆత్మరక్షణతో పాటు ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. రాష్ట్రంలోని 8 జిల్లాల నుంచి 260 మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో విశాఖపట్నం మొదటి స్థానంలో నిలవగా, అనకాపల్లి, శ్రీకాకుళం జిల్లాలు ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ, కరాటే సంఘం జాతీయ అధ్యక్షుడు సతీష్ కుమార్, కిక్ బాక్సింగ్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేంద్ర ఆచారి, కోశాధికారి జోగారావు పాల్గొన్నారు.

# దళిత, బీసీ విద్యార్థుల ఉన్నతికి ప్రభుత్వం అండ

**మేఘాద్రి గెడ్డ గురుకుల సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌ను సందర్శించిన మంత్రి డాక్టర్ డోలా**

విశాఖపట్నం, సెప్టెంబర్ 27ప్రభాత వార్త :



ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, పట్టుదల, అంకిత భావంతో చదివి ఉన్నత ర్యాం కులు సాధించి తమ తల్లిదండ్రులకు, గురుకుల వ్యవస్థకు రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలి" అని రాష్ట్ర సాంఘిక సంక్షేమం, జిల్లా ఇంచార్జి మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి సూచించారు. దళిత, బడుగు, బలహీన వర్గాల కు చెందిన విద్యార్థుల విద్యాభివృద్ధి, భవిష్యత్ ఉన్నతికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని మంత్రి అన్నారు. ఆదివారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురు కులం, మెగాద్రిగడ్డ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా స్థానిక ఎమ్మెల్యే పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు)తో కలిసి సందర్శిం చారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదం డ్రులు, ఆకాశ్ ఐఐటీ/నీట్ ఫ్యాకల్టీతో మంత్రి, ఎమ్మెల్యేలు మాట్లాడి విద్యార్థులకు అందు తున్న ఐఐటీ/నీట్ కోచింగ్, విద్యా ప్రమాణాలు, భోజన వసతులు, ఇతర మౌలిక సదుపాయాలు, విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ, "దళిత, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు ఆర్థిక పరిస్థితుల కారణంగా తమ లక్ష్యాలను వదులుకోవాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం వారికి అండగా నిలుస్తోందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, మంచి భోజనం, ఆరోగ్య సంరక్షణ, వసతి, ఐఐటీ /నీట్ వంటి పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణతో పాటు అవసరమైన అన్ని సౌకర్యాలను అందించినప్పుడే వారు తమకు నిర్దేశించుకున్న ఉన్నత లక్ష్యాలను సాధించగలుగుతారన్నారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారికి మరింత మెరుగైన అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి తెలిపారు. గురుకుల విద్యార్థులు జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా అవసరమైన సహకారం అందిస్తామని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే శ్రీ పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు) విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, క్రమశిక్షణతో చదివి తమ తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని, అందుబాటులో ఉన్న విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీఓ ఎన్. రామకృష్ణ, ప్రిన్సిపాల్ మృదుల ప్రియదర్శిని, ఆకాశ్ ఐఐటీ /నీట్ ఫ్యాకల్టీ, బోధనా సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# జీవీఎంసీ ఎన్నికల బరిలో బ్రాహ్మణులు

**కార్యాచరణ సిద్ధం చేసిన జేసీ కన్వీనర్ అందుకూరి కిరణ్ కుమార్**

విశాఖపట్నం, సెప్టెంబర్ 27ప్రభాత వార్త :



రానున్న జీవీఎంసీ కార్పొరేషన్ ఎన్నికల్లో బ్రాహ్మణ సామాజికవర్గం తరపున పోటీకి సిద్ధంగా ఉన్న అభ్యర్థులతో బ్రాహ్మణ జేఏసీ కన్వీనర్ అందుకూరి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో విశాఖపట్నం లో ఒక కీలక సమావేశం నిర్వహించారు ఈ సమావేశానికి బ్రాహ్మణ రాజకీయ ప్రముఖులు, వివిధ డివిజన్ల నుండి పోటీ చేయాలనుకుంటున్న ఆశావహులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు ఈ సందర్భంగా ఏ ఏ రాజకీయ పార్టీల నుండి ఏ ఏ బ్రాహ్మణ నాయకులు పోటీకి సిద్ధంగా ఉన్నారనే పూర్తి వివరాలను, సమా చారాన్ని జేఏసీ సేక రించింది. ఎన్నికల్లో బ్రాహ్మణులకు సముచిత స్థానం కల్పించేలా, త్వర లోనే అన్ని ప్రధాన రాజకీయ పార్టీల ముఖ్య నాయకులను కలిసి బ్రాహ్మణ జేఏసీ తరపున అధికారిక రిప్రజెంటేషన్ (వినతిపత్రం) ఇవ్వాలని ఈ సమావేశంలో ఏక గ్రీవంగా తీర్మానించారు. సామాజికంగా, రాజ కీయంగా బ్రాహ్మణులకు రాబోయే ఎన్నికల్లో సరైన ప్రాధాన్యత దక్కేలా అందరూ సమిష్టిగా ముందుకు సాగాలని కన్వీనర్ అందుకూరి కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ జేఏసీ సభ్యులు, వివిధ బ్రాహ్మణ సంఘాల ప్రముఖ నాయకులు రాపర్తి కన్నా, కావూరు చరణ్ కుమార్, సుసర్ల హరి, జగన్నాథం, సుబ్రమణ్యం, రామకృష్ణ, కాళిదాసు, సుధీర్, శ్రీకాంత్ వివి.వామనరావు, వేదుల హనుమంతరావు, పూర్ణా నంద శర్మ, వడ్డాది ఉదయ కుమార్, పీవీ నారాయణ, అరుణ్ కుమార్ తది తరులు పాల్గొని తమ మద్దతును ప్రకటించారు.

# వెజిటేబుల్ మార్కెట్‌లో గందరగోళం

**వేలాదిగా తరలివచ్చిన భక్తులకు అన్న ప్రసాదం అందించలేక అవస్థలు**

**భక్తులను బూతులు తిట్టిన మార్కెట్ యాజమాన్యం**

**దీంతో భోజనాలు తినకుండా వెనుతిరిగిన భక్తులు**



జ్ఞానాపురం, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :

జ్ఞానాపురం వెజిటేబుల్ మార్కెట్ చవితి భోజనాలు భక్తులకు కంటతడి పెట్టించాయి. భక్తితో అన్న ప్రసాదం స్వీకరించేందుకు వేలాదిగా వచ్చిన భక్తులకు మార్కెట్ యాజమాన్యం చుక్కలు చూపించింది. భక్తులకు భోజనాలు వడ్డించడంలో మార్కెట్ యంత్రాగం చతికిల పడినట్టు భక్తులు తెలిపారు. శనివారం మధ్యాహ్నం అట్టహాసంగా ప్రారంభమైన అన్న ప్రసాదాలపై భక్తులు నిరసన వ్యక్తం చేశారు. భోజనాలకు వచ్చిన భక్తులపై మార్కెట్ యజమానులు నోటికి వచ్చినట్టు తిట్టి , ఇష్టానుసారం మాట్లాడటంతో చాలామంది భోజనం చేయకుండా వెళ్లిపోయినట్టు చెప్పారు. వెజిటబుల్ మార్కెట్ ఓనర్స్ ఆధ్వర్యంలో జరిగిన అన్నప్రసాద వితరణ కోసం జ్ఞానాపురం, కంచరపాలెం, కొబ్బరి తోట, అచ్చియమ్మపేట తదితర ప్రాంతాల్లో ఆటోలతో భారీ ప్రచారం చేశారు, దీనితో జనాలు తండోపతండాలుగా శనివారం మార్కెట్ కు తరలివచ్చారు. ఈ రద్దీకి తగినట్లు ఏర్పాట్లు చేయడంలో మార్కెట్ సంఘం పూర్తిగా విఫలమైనట్టు భక్తులు తెలిపారు. స్పూన్ సైజు పరమాన్నం, గోలికాయంత. భూరి, అతి తక్కువ కూరలతో వడ్డనలు చేయడం విమర్శలకు గురయ్యాయి. వేలాదిమంది భక్తులకు భోజనాలు సరిగా అందకపోవడంతో అవస్థలు పడ్డారు. మార్కెట్ యాజమాన్యం భక్తులపై విరుచుకుపడి బూతులు మాట్లాడి గొడవలు ఏర్పడే పరిస్థితి నెలకొన్నట్టు పలువురు తెలిపారు. వేలాదిమంది భక్తులు వస్తారని ఆలోచన ఉన్నప్పటికీ మహిళలకు ఒక కౌంటర్, పురుషులకు ఒక కౌంటర్ మాత్రమే ఏర్పాటు చేసి భక్తుల సహనాన్ని పరీక్షించడంపై విమర్శలు గుప్పించారూ, తెల్ల అన్నం కోసం ఒకే కౌంటర్ ఉండటంతో జనాలు తోసుకున్నారు. మార్కెట్ వాసులకు ప్రత్యేకంగా వేరే ప్రాంతంలో వడ్డనలు పెట్టడం జనాలకు మరింత మండింది. ఏర్పాట్లు సక్రమంగా చేయలేని మార్కెట్ యాజమాన్యం ఎందుకు డప్పు కొట్టి పిలవడంపై భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కొద్దిరోజుల క్రితం 60 వంటకాలు అంటూ హడావుడిపై అనేక విమర్శలు రావడం, తిరిగి వెజిటబుల్ మార్కెట్ లోని అదే పరిస్థితి నెలకొనడంపై భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో ఎలాంటి తప్పిదం లేకుండా భోజన కార్యక్రమాలు ఏర్పాటు చేసుకోవాలని భక్తులు సూచిస్తున్నారు.

# ఫుట్‌బాల్ కోచ్ ఎర్రంశెట్టి నరేష్‌కు ఘన నివాళి

**కుటుంబ సభ్యులను పరామర్శించిన ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్**

విశాఖపట్నం, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :



ఫుట్‌బాల్ క్రీడాభివృద్ధికి విశేష సేవలందిం చిన ప్రముఖ ఫుట్‌బాల్ కోచ్ ఎర్రంశెట్టి నరేష్ (హిట్లర్) అకాల మరణం క్రీడా రంగానికి, ఆయన శిష్యుల కు, మిత్రులకు తీరని లోటుగా మారింది. ఆయన మృతికి పలువురు క్రీడాకారులు, కోచ్‌లు, విద్యా వేత్తలు, శిష్యులు, అభిమానులు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్ నరేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి నివాళులర్పించారు. చినవాల్తేర్‌కు చెందిన ఎర్రంశెట్టి నరేష్ ఎంఏ, బీపీఈడీ, ఎంపీఈడీ, ఎన్ఐఎస్ విద్యార్హతలు కలిగి ఉన్నారు. ఏఐఎఫ్ఎఫ్ గ్రాస్‌రూట్స్ ఫుట్‌బాల్ కోచ్‌గా, డి-లైసెన్స్, సి-లైసెన్స్ కోచ్‌గా సేవలందించారు. తనతో కలిసి ఫుట్‌బాల్ ఆడిన మిత్రులతో ఏర్పాటు చేసిన బ్లూ స్టార్ ఎఫ్‌సీకి ఏఐఎఫ్ఎఫ్‌లో గుర్తింపు తీసుకురా వడంతో పాటు పలు టోర్నమెంట్లలో జట్టు విజయాలకు కృషి చేశారు. విశాఖ జిల్లా ఫుట్‌బాల్ అసోసి యేషన్ (వీడీఎఫ్ఏ)తో కలిసి కోచ్‌గా సేవలం దిస్తూ పలువురు క్రీడా కారులను సంతోష్ ట్రోఫీ స్థాయికి తీసుకెళ్లడంలో కీలకపాత్ర పోషించారు. ప్రతి ఏడాది నిర్వహించే సమ్మర్ ఫుట్‌బాల్ కోచింగ్ శిబిరాలకు సుమారు 250 మంది క్రీడాకారులు హాజరయ్యేవారని సన్నిహితులు తెలిపారు. క్రీడా కోచ్‌గా మాత్రమే కాకుండా ఆర్థిక ఇబ్బం దులు ఎదుర్కొంటున్న పలువురు విద్యార్థులకు విద్యాభ్యాసం కోసం ఆర్థిక సహాయం అందిం చారు. ఆర్థికంగా వెనుకబడిన యువతకు ఓపెన్ స్కూల్, ఇంటర్మీడియట్, బీపీఈడీ, కోచ్ ట్రైనింగ్ వంటి కోర్సులు చేయిస్తూ వారి భవిష్యత్తుకు బాటలు వేశారు. ఆయన వద్ద శిక్షణ పొందిన పలువురు క్రీడాకారులు ప్రస్తుతం శ్రీనిధి ఫుట్‌బాల్ ట్రస్ట్ తరఫున ఆడుతున్నారని సన్నిహితులు తెలిపారు. కరోనా సమయంలో తన వద్ద కోచ్‌లుగా పని చేసిన వారికి సొంత నిధులతో నిత్యావసర సరుకులు అందించి అండగా నిలిచారని గుర్తుచేశారు. ప్రస్తుతం గీతం కళాశాలలో కోచ్‌గా సేవలందిస్తూ ఫుట్‌బాల్ అభివృద్ధికి కృషి చేశారు. నరేష్ మృతికి ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు, ఆంధ్ర విశ్వవిద్యాల యానికి చెందిన వారు, క్రీడాకారులు, కోచ్‌లు, శిష్యులు, మిత్రులు సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

ఫుట్‌బాల్‌ను జీవితంగా భావించి ఎంతోమంది క్రీడాకారుల భవిష్యత్తుకు మార్గదర్శిగా నిలిచిన ఎర్రంశెట్టి నరేష్ సేవలు, శిష్యుల పట్ల ఆయన చూపిన ఆదరణ, విద్యా, క్రీడా రంగాలకు అందించిన సహకారం చిరస్మరణీయమని పలువురు పేర్కొన్నారు.

## విద్యుదాఘాతంతో షిఫ్ట్ ఆపరేటర్ మృతి

ఆనందపురం, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త:



విద్యుత్ సరఫరా వ్యవస్థను తనిఖీ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఓ షిఫ్ట్ ఆపరేటర్ మృతి చెందిన సంఘటన ఆనందపురం మండలం వెల్లంకి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఆనందపురం మండలం చందక పంచాయతీ జగన్నాథపురానికి చెందిన రెల్లి రవి (26) వెల్లంకిలో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు.

ఈ క్రమంలో శనివారం విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో రవి లైన్‌మెన్ బొచ్చా అశోక్ (గ్రేడ్-2 జేఎల్ఎం)తో కలిసి ఇండో ఆక్వా కంపెనీ వద్ద విద్యుత్ వ్యవస్థను తనిఖీ చేసేందుకు వెళ్లాడు. అక్కడ హెచ్‌జీ ఫ్యూజ్ పాడైనట్లు గుర్తించి మరమ్మతుల కోసం విద్యుత్ సరఫరాను నిలిపివేసేందుకు ఏబీ స్విచ్‌ను ఆపరేట్ చేశాడు.

అయితే ఏబీ స్విచ్‌లో ఉన్న యాంత్రిక లోపం కారణంగా మూడు బ్లేడ్లలో ఒకటి పూర్తిగా తెరుచుకోకపోవడంతో విద్యుత్ సరఫరా కొనసాగింది. ఈ విషయం తెలియని రవి విద్యుత్ పూర్తిగా నిలిచిపోయిందని భావించి హెచ్‌జీ ఫ్యూజ్ మార్చేందుకు విద్యుత్ స్తంభం ఎక్కాడు. ఈ సమయంలో ప్రమాదవశాత్తు లైవ్‌గా ఉన్న హైటెన్షన్ వైర్‌ను తాకడంతో తీవ్ర విద్యుదాఘాతానికి గురై స్తంభం పైనుంచి కిందపడిపోయాడు. వెంటనే లైన్‌మెన్ అశోక్, కంపెనీ కార్మికులు కలిసి రవిని కారులో కొమ్మాదిలోని గాయత్రి ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య సారికి ఊహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆనందపురం సీఐ వి.వి.సి.ఎం. ఎర్రనాయుడు కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తును ఎస్ఐ పి. శివకు అప్పగించారు. భీమిలి మార్చురీలో పంచనామా నిర్వహించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఘటనపై పోలీసులు తదుపరి దర్యాప్తు చేస్తున్నారు.

## అలరించిన 'కృష్ణ శృతి' గాత్ర సంగీత కచేరి



విశాఖపట్నం, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త

అక్కయ్యపాలెం శ్రీ లలిత పీఠం ప్రాంగణంలో సిద్దేశ్వరానంద భారతి స్వామివారి ఆశీస్సులతో ఐవియల్ శాస్త్రి సంగీత సమితి వారి ఆధ్వర్యంలో నెలవారీ సాంస్కృతిక ఉత్సవంలో భాగంగా శాస్త్రీయ భక్తి సంగీత గాత్ర కచేరీ జరిగింది . కార్యక్రమాన్ని సంస్థ వ్యవస్థాపక చైర్మన్ ఆకొండి వెంకటరావు జ్యోతిని వెలిగించి ప్రారంభించి గాత్ర సంగీత కచేరి యొక్క ప్రాముఖ్యతను తెలిపారు . విద్వాన్ ఐ కృష్ణ శృతి వాగ్గేయకారులైన ముత్తుస్వామి దీక్షితార్ , శ్రీత్యాగరాజ స్వామి వారి సంకీర్తనలను మధురంగా గానం చేసి ఆహూతుల ప్రశంసలను అందుకున్నారు . సంగీత గాత్ర కచేరీకి వయోలిన్ పై ఎవికె ఆదిత్య, మృదంగంపై జి.చరిత్ శృతిపై ఏ జ్ఞానసింధు సంగీత వాద్య సహకారం అందించేరు . తదుపరి కళాకారులను సంస్థ తరఫున నిర్వాహకులు ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం వి రాజశేఖర్ , లలిత పీఠం కార్యదర్శి ఎం కృష్ణసేన్, వివి శంకరం, కోశాధికారిపి.రంగనాథ ఆచార్యులు, సహాయ కోశాధికారి ఎం.నాగేశ్వరరావు, పూర్వ ఉపాధ్యక్షులు కె.సుబ్రహ్మణ్యం కే.చిదంబర స్వామి కళాభిమానులు సంగీత ప్రియులు తదితరులు పాల్గొన్నారు .

## డివైడర్‌ను ఢీకొన్న ద్విచక్రవాహనం : ఒకరి మృతి



ఆనందపురం, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త:

ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం ఆనందపురం మండ లం గండిగుండం సమీపంలోని అనకాపల్లి-ఆనందపురం 16వ జాతీయ రహదారిపై చోటుచేసు కుంది. ట్రాఫిక్ ఎస్సై పాపారావు తెలిపిన వివరాల ప్రకారం.. గాజువాక మల్కాపురం పరిధి పిలకవానిపాలేనికి చెందిన కర్ణపు అప్పలరెడ్డి ద్విచక్రవాహనంపై ఆనందపురం నుంచి పెందుర్తి వైపు వెళ్తున్నాడు. గండిగుండం సమీపంలోని వంతెనపైకి చేరుకునే సమయంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి రహదారి మధ్యలోని డివైడర్‌ను బలంగా ఢీకొంది. ప్రమాదంలో అప్పలరెడ్డి తీవ్రంగా గాయపడి రహదారిపై పడిపోయాడు. స్థానికులు, వాహనదారులు పోలీసులకు సమాచారం అందించగా.. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అప్పటికే అప్పలరెడ్డి మృతి చెందినట్లు గుర్తించారు. మృతదేహాన్ని భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవు

**-రౌడీ షీటర్లకు గాజువాక సీఐ హెచ్చరిక**




గాజువాక, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :

శాంతిభద్రతలకు విఘాతం కలి గిస్తే ఎంతటి వారైనా కఠిన చర్య లు తప్పవని గాజువాక ఇన్‌స్పెక్టర్ (సీఐ) వాసు నాయుడు హెచ్చరిం చారు. గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు ఆయన ఆధ్వర్యంలో ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ గొడవలు, బెదిరింపులు, దౌర్జన్యాలు, అసాంఘిక కార్యకలాపాలకు రౌడీ షీటర్లు పూర్తిగా దూరంగా ఉండాలని స్పష్టం చేశారు. నేరాలకు పాల్పడినా, ప్రజలకు భయాందోళనలు కలిగించినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటా మని తెలిపారు. ప్రజాభద్రత పరిరక్షణలో భాగంగా రౌడీ షీటర్ల కదలికలపై నిరంతరం ప్రత్యేక నిఘా కొనసాగుతుందని పోలీసు అధికారులు వెల్లడించారు.

28 -9Pg7exHMNWJQE.qxd:28 -9Pg7exHMNWJQE.qxd 1/1/02 6:40 AM Page 1



# అమరావతి పరిధిలో గ్రామకంఠం మినహాయింపులపై ప్రభుత్వం స్పష్టత

**అమరావతి,సెప్టెంబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతి పరిధిలో గ్రామకంఠం మినహాయింపులపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. 08డిసెంబర్ 2014ను కటాఫ్ తేదీగా తీసుకుని ఆ తేదీకి ముందే నిర్మాణాలు ఉన్న భూములు, చదరపు గజాల ప్రాతిపదికన రిజిస్ట్రేషన్లు జరిగిన ప్లాట్లను నిబంధనల ప్రకారం మినహాయింపునకు పరిగణించినట్లు తెలిపింది. గ్రామ నివాస ప్రాంతానికి దూరంగా ఉన్న ఖాళీ వ్యవసాయ భూములు, కటాఫ్ తేదీ తర్వాత రిజిస్ట్రేషన్లు జరిగిన భూములకు మినహాయింపు వర్తించదని స్పష్టం చేసింది.ఇప్పటికే 6,473.72 ఎకరాలను ఎల్పీఎస్ నుంచి మినహాయించగా అపరిష్కృత దరఖాస్తుల పరిశీలనకు ప్రభుత్వం 2026 జనవరిలో జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. తాజా దరఖాస్తులు, అభ్యంతరాలు అన్నీ జేసీ ఆధ్వర్యంలోని కమిటీ పరిశీలించి ఖరారు చేస్తుందని సీఆర్డీఏ భరోసా ఇచ్చింది. కమిటీకి వచ్చిన 685 దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రికార్డులు, శాటిలైట్ చిత్రాలు, రిజిస్ట్రేషన్ వివరాల ఆధారంగా నిర్ణయాలు తీసుకున్నట్లు వెల్లడించింది. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిబంధనల ప్రకారం అర్హులకు అన్ని ప్రయోజనాలు అందిస్తామని సీఆర్డీఏ స్పష్టం చేసింది.

# యువత ఆరోగ్యకరమైన అలవాట్లను అలవరచుకోవాలి

**విజయవాడ, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :**యువత అరోగ్యకరమైన అలవాట్లను అలవరుచుకుని మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని మైభారత్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రసంచాలకులు కె.ఉజ్వల్ పిలుపునిచ్చారు. నషాముక్త్ యువఫర్ వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా మైభారత్ ఆధ్వర్యంలో విజయవాడలోని బెంజ్‌సర్కిల్ సమీపంలో గల ఆదిత్య డి గ్రీ కళా శాలలో ఆదివారం మైహెల్త్ మైప్రైడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్ర మానికి ముఖ్యఅతిధిగా హాజరైన ఉజ్వల్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన, బాధ్యతాయువమైన యువత వికసిత్ భారత్ నిర్మాణంలో కీలకపాత్ర పోషి స్తుందన్నారు. మదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు. రాష్ట్ర ఈగల్ విభాగం అధికారులు పాల్గొని మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్ధాలను వివరించారు. సైకియాట్రిస్ట్ డాక్టర్ మీనా ఒత్తిడిని అధిగమిం చటంపై సూచలను ఇచ్చారు. జనసేవా సొసైటీ అధ్యక్షులు ఆదిశేషయ్య, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీర్రాజు, ఎన్‌టిఆర్ జిల్లా యుజన అధికారి బి.ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా 200 మంది విద్యార్ధులకు సాధారణ ఆరోగ్యపరీక్షలు నిర్వహించటంతోపాటు, వ్యక్తిగత కౌన్సిలింగ్ సదస్సులు నిర్వహించారు.

## జర్నలిస్టు అవార్డుల దరఖాస్తులు గడువు పొడిగింపు

● రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ సంచాలకులు కె.ఎస్. విశ్వనాథన్..

**విజయవాడ, సెప్టెంబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:** 2026 జర్న లిజం రంగంలో విశేష సేవలందిస్తూ, వృత్తిపరమైన ప్రతిభను కనబరిచిన పాత్రికేయులను ప్రోత్సహించి, వారి సేవలను గుర్తించి గౌరవించేందుకు 2025 సంవత్స రానికి 12 విభాగాల్లో ఉత్తమ జర్నలిస్టు అవార్డులు అందజే యాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ అవార్డులకు అర్హులైన వారిని ఎంపిక చేసేందు కు ఆయా విభాగాలకు చెందిన జర్నలిస్టుల నుంచి దరఖాస్తుల ను ఆహ్వానిస్తు న్నట్లు రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ సంచాలకులు కె.ఎస్. విశ్వనాథన్ ఒక ప్రకటనలో తెలిపారు. ముందు తెలిపిన విధంగా సెప్టెంబర్ 28లోగా ఉన్న గడువును 2026 అక్టోబర్ 05 వ తేదీ కి పొడిగించడం జరి గింది. అర్హత కలిగిన జర్నలిస్టులు తమ దరఖాస్తులను 2026 అక్టోబర్ 05 వ తేదీ సాయంత్రం 5.00 గంటలలోగా ...డైరెక్టర్,సమాచార పౌరసంబంధాల శాఖ,2వ అంతస్తు, ఎన్టీఆర్ పరిపాలన భవనం, పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్,విజయవాడ - 520013 చిరునామాకు పంపాల్సి ఉంటుంది.ఈ అవార్డులు వివరాలు వెబ్‌సైట్‌లో చూడవచ్చు

# వర్చువల్‌గా నూతన కోర్టుల ప్రారంభోత్సవం

● హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసాగిల్



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న జడ్జీలు




రాష్ట్ర హైకోర్టు సీజే నూతన కోర్టును పర్చువల్‌గా ప్రారంభిస్తున్న దృశ్యం

**తాడిపత్రిఅర్బన్, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త :** తాడిపత్రిలో ఆదివారం ఉదయం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసాగిల్ వర్చువల్‌గా నూతన కోర్టులను ప్రారంభించారు. అంతకుముందు తాడిపత్రిలో అదనపు న్యాయస్థానాలను హైకోర్టు నుంచి జిల్లా వ్యవహారాల పర్యవేక్షించే పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ బి.ఎస్.భానుమతి, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సురేష్‌రెడ్డి, జస్టిస్ చల్లా గుణరంజన్‌లు హాజరై నూతన కోర్టు భవనాలను ప్రారంభించారు. తాడిపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసాగిల్ వర్చువల్ విధానం ద్వారా మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతిపౌరుడికి కల్పించిన ప్రాథమిక హక్కులు మరియు న్యాయపరమైన రక్షణలో అందరికీ సమానంగా అందేలా చూడాల్సిన బాధ్యత న్యాయవ్యవస్థ, బార్ కార్యనిర్వాహక వ్యవస్థతో పాటు ప్రతి పౌరుడి పైనా ఉందన్నారు. రాజ్యాంగంలోని వివిధ ఆర్టికల్‌ల ద్వారా ప్రజలకు స్ఫూర్తిని కలిగించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు సమన్వయంతో ప్రజలకు న్యాయవ్యవస్థను చేరువుగా తీసుకెళ్లేందుకు కృషి చేయాలని సూచించారు. రాష్ట్రంలో కోర్టుల పనితీరుపై ప్రత్యేక దృష్టిని సారించడం జరిగిందని న్యాయస్థానాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అభివృద్ధి చర్యలు తీసుకుం టామని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసాగిల్ తెలిపారు.

**ప్రజలకు న్యాయవ్యవస్థను మరింత చేరువ చేయాలి :**

ప్రజలకు న్యాయవ్యవస్థను మరింతగా చేరువ చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని హైకోర్టు న్యాయమూర్తి మరియు అనంతపురం జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ బి.ఎస్.భానుమతి తెలిపారు. న్యాయవ్యవస్థ సమర్ధవంతంగా పనిచేయడానికి బార్, బెంచ్ మధ్య సమన్వయం అత్యంత కీలకమని పేర్కొన్నారు. కోర్టులో వాదనలు వినిపించే ప్రతి న్యాయవాది ఆఫీసర్ ఆఫ్ ది కోర్టుగా వ్యవహరిస్తూ, న్యాయస్థానానికి సహకరించాలని అలాగే చట్టపరమైన అంశాలను సమగ్రంగా కోర్టుకు తెలియజేయాలన్నారు. న్యాయ సేవల వేగవంతమే ప్రధాన ధ్యేయంగా కోర్టు కేసుల సంఖ్యను తగ్గించాలన్న సంకల్పంతో ఉన్నత న్యాయస్థానాలకు అదనపు కోర్టులను మంజూరు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. న్యాయమూర్తులు మరియు న్యాయవాదులు కక్షిదారులను దృష్టిలో ఉంచుకొని సత్వరమే ఆయా కేసులను పరిష్కరిం చేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని జిల్లాల పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో కొత్త జిల్లాలకు తగిన న్యాయస్థానాలు ఏర్పాటు అందులో మౌలిక సదుపాయాలను కల్పించుటకు చర్యలు తీసుకోవడం జరుగుతున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా న్యాయవ్యవస్థపై పెరుగుతున్న పని భారాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు తగిన కోర్టు భవనాలు సిబ్బంది సాంకేతిక సదుపాయాలు మరియు ఇతర మౌలిక వసతులు అవసరమని గౌరవ న్యాయమూర్తి తెలిపారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె.సురేష్‌రెడ్డి, జస్టిస్ చల్లా గుణరంజన్ వేరువేరుగా మాట్లాడుతూ న్యాయస్థానాల మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం కల్పించడమే ప్రధాన లక్ష్యంగా ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవడం జరుగుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా సమాజంలోని బలహీనవర్గాలు, ఆశ్రయ గృహాల్లో ఉన్న పిల్లలు మరియు ఇతర అవసరమైన వారికి చట్టపరమైన రక్షణ, సంక్షేమ సేవలు అందేలా న్యాయవ్యవస్థ మరియు కార్యనిర్వాహక వ్యవస్థ సమన్వయంతో పని చేయాలని సూచించారు. న్యాయస్థానాల ఏర్పాటు అభివృద్ధికి జిల్లా ప్రభుత్వ యంత్రాంగం మరియు న్యాయవ్యవస్థకు చెందిన అధికారులు, ఇతర సంబంధిత విభాగాల సమన్వయం అవసరమన్నారు. ఈ సందర్బంగా న్యాయస్థానాల పట్ల ప్రజలకు మెరుగైన సేవలు అందించడం పట్ల చూపుతున్న నిబద్ధతను న్యాయమూర్తులు అభినందించారు. అనంతరం సభాధ్యక్షత వహించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఈ.భీమారావు మాట్లాడుతూ న్యాయస్థానాల వల్ల ప్రజలకు సత్వర సమర్థవంతమైన న్యాయం అందించే కేంద్రంగా ఆయా కోర్టులు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన ఆయా కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేసిన బార్ అసోసియేషన్ సభ్యులకు, న్యాయవాదులు, అధికారులు, ప్రజలకు ప్రత్యేకంగా అభినందనలు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ముఖ్యఅతిథులకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పి జగదీష్, అనంతపురం ఎడిజె జడ్జి సత్యవాణి, అనంతపురం ఎక్సైజ్ కోర్టు జడ్జి పావని, తాడిపత్రి జూనియర్ సివిల్ జడ్జి అనిల్‌కుమార్‌నాయక్, తాడిపత్రి బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏవి రమణారెడ్డి, సీనియర్ న్యాయవాదులు రమేష్‌నాథ్‌రెడ్డి, పివి ప్రతాపరెడ్డి, ఎన్‌వి భాస్కర్‌రెడ్డితో పాటు న్యాయవాదులు సతీష్‌కుమార్, చక్రపాణి, కొండయ్య, పలు శాఖల అధికారులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవ్యవస్థ పట్ల విశ్వాసాన్ని పెంపొందించాలి

**హైకోర్టు సీజే లీసా గిల్**

**గుత్తి, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త :**న్యాయస్థానాల పట్ల ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని, నమ్మకాన్ని పెంపొందించాలని హైకోర్టు చీఫ్ జస్టిస్ లీసా గిల్ సూచించారు. గుత్తి పట్టణంలో కోర్టుల ప్రాంగణంలో ఆదివారం అదనపు సివిల్ జడ్జ్ కం జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టును సీజే పర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం నూతన న్యాయస్థానం భవనాలను హైకోర్టు జడ్జీలు భానుమతి, సురేష్‌రెడ్డి, చల్లా గుణరంజన్‌లు ప్రారంభించారు. కక్షిదారులకు త్వరితగతంగా న్యాయ సేవలు అందించేందుకు న్యాయస్థానం ఉపకరిస్తుందని జడ్జిలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు, స్థానిక ఆరవ అదనపు జిల్లా జడ్జి శంకర్‌రావు, సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథచారి, జేఎఫ్‌సీఎంలు శ్వేత, బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షులు రామ్మోహన్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు ఎన్ఎండి ఇస్మాయిల్, మహమ్మద్ జాకీర్ హుస్సేన్, నూర్ మహమ్మద్, నవీన్, శ్రీధర్, చలపతి, సూపరింటెండెంట్ షేక్ సాదిక్‌వలి, గుంతకల్లు డిఎస్‌పి శ్రీనివాస్, స్థానిక అర్బన్ సిఐ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

# పితృదేవతల స్మరణలో డిసిఎం పవన్ అన్నదానం

● సొంత ఖర్చులతో 14 రోజులపాటు అన్నసంతర్పణ

● పాదగయతో పాటు పలు ఆలయాల వద్ద భోజనాలు



**పిఠాపురం, సెప్టెంబర్ 27 ( ప్రభాతవార్త ):** పితృదేవతల స్మరణకు భక్తి, కృతజ్ఞతలకు ప్రతీకగా తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సొంత ఖర్చులతో 14 రోజులపాటు అన్నసంతర్పణకు శ్రీకారం చుట్టారు. పితృపక్షాల సందర్భంగా పాదగయ క్షేత్రంతో పాటు పలు ప్రముఖ ఆలయాల వద్ద భక్తులు, ప్రజలకు రుచికరమైన భోజనాన్ని ఏర్పాటు చేశారు. మనకు జన్మనిచ్చిన పితృదేవతలను స్మరించుకోవడం, వారి పట్ల కృతజ్ఞతను చాటుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని పవన్ కళ్యాణ్ సూచించారు. పూర్వీకులు ఆచరించిన యాగాలు, ధార్మిక కార్యక్రమాలు తమ వారసుల జీవితాలకు స్ఫూర్తి నిస్తాయని పేర్కొన్నారు. పితృపక్షాల్లో తర్పణం, పిండ ప్రదానం వంటి కార్యక్రమాల ద్వారా పితృదేవతలకు కృతజ్ఞతలు తెలియజేయాలని ఆయన సూచించారు. ఇందులో భాగంగా పాదగయ క్షేత్రం, శ్రీపాద వల్లభ మహాసంస్థానం, కోట సత్తమ్మ గుడి , జై గణేష్ దేవస్థానం, కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణాల్లో అన్నదానం నిర్వహించారు. పిఠాపురం మండల పరిధిలోని చిత్రాడ మహాలక్ష్మి అమ్మవారి ఆలయం, దొంతమూరు శివాలయం, కొలంక నూకాలమ్మవారి ఆలయాల వద్ద కూడా ప్రజలకు భోజనాలు ఏర్పాటు చేశారు.అన్నదాన కార్యక్రమాల ఏర్పాటును మాజీ ఎమ్మెల్యే, స్థానిక సంస్థల కేంద్ర సమ న్వయ కమిటీ సభ్యుడు పెండెం దొరబాబు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పితృదేవతల ఆశీర్వచనం కోసం 13 ఆలయాల్లో భక్తులకు 14 రోజులపాటు రుచికరమైన భోజనాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

## వైసిపివి చీప్ పాలిట్రిక్స్

● మంత్రి నారాయణ

**నెల్లూరు, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త - వైద్యం:** నెల్లూరు సిటీ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల వేగం పెరిగింది. నగరంలోని 4, 7, 9వ డివిజన్లలో ఆదివారం మంత్రి నారాయణ పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. కృష్ణవేణి స్కూల్ వీధిలో రూ.16 లక్షలతో, వైవీఎం ఎలిమెంటరీ స్కూల్ వద్ద రూ. 30 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. నవాబుపేట మార్కెట్ యార్డులో రూ.60 కోట్లతో నిర్మించనున్న మోడ్రన్ మార్కెట్ మొదటి దశ పనులకు భూమి పూజ చేశారు. పర్యటించిన ప్రతి ప్రాంతంలో స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ నెల్లూరులో రూ.3,500 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. తమ ప్రభుత్వానికి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక కొందరు చీప్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. అసత్య ఆరోపణలతో తనపై బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. వాళ్ల విమర్శలను ప్రజలు విశ్వసించరని, తాను కూడా పట్టించుకోనన్నారు. నాకు తప్పు చేయాల్సిన అవసరం లేదని, ప్రజలకు సేవ చేయాలని రాజకీయాల్లోకి వచ్చానని స్పష్టం చేశారు.పేదల అభ్యున్నతికి తన సొంత నిధులు కూడా ఖర్చు చేస్తున్నానని తెలిపారు. తాను సంపాదించుకోవాలని అనుకుంటే నారాయణ సంస్థల ద్వారా వేల కోట్లు సంపాదించుకోవచ్చని, వివిధ రాష్ట్రాల్లోని సంస్థల్లో ఆరు లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని, లక్ష మంది ఉపాధి పొందుతున్నారని చెప్పారు. విమర్శలు చేసే ముందు ఆలోచించుకోవాలని సూచించారు.2028 జూన్ 12 నాటికి నెల్లూరును గ్రీన్ సిటీగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. వచ్చే ఏడాది జూన్ 12లోపు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీటి పథకాలను పూర్తి చేస్తామని చెప్పారు. గత ప్రభుత్వం పది శాతం పనులు కూడా పూర్తి చేయకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లాయని, తిరిగి నిధులు తీసుకొచ్చి పనులను పూర్తి చేస్తున్నామని వివరించారు. నగరాన్ని దోమలులేని నగరంగా తీర్చిదిద్దటమే లక్ష్యమన్నారు.

## ఐక్యత నిరంతర పోరాటంతోనే

# బిసిల రాజ్యాధికారం సాధ్యం



**విజయవాడ, సెప్టెంబరు 27, ప్రభాతవార్త :** ఐక్యత ద్వారానే బీసీల రాజ్యాధికారం సాధ్యం అవుతుందని తమ హక్కుల సాధనకై అందరూ ఐక్యతతో నిరంతర పోరాటం చేయాలని రాజ్యసభ సభ్యులు విల్సన్ పేర్కొన్నారు. 2027లో జరిగే జనాభా లెక్కల్లో ఓబిసి కోడ్ తప్పనిసరిగా పెట్టాలనే అంశం పై ఆదివారం బీసీ చైతన్య వేదిక జాతీయ అధ్యక్షులు వీరవల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో విజయవాడలో ఎంబి భవన్లో జరిగిన జాతీయ సెమినార్లో ముఖ్య అతిథులుగా రాజ్యసభ ఎంపి, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది పి విల్సన్, మాజీ డిజిపి అధికారి జే పూర్ణ చంద్రరావు, మాజీ ఐఏఎస్ అధికారి దళపతి విజయ్ కుమార్, ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరజ్ మండల యాదవ్, బీపీ మండల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ అల వెంకటేశ్వర్లు, ఏపీ బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు మరియు బీసీ చైతన్య వేదిక చీఫ్ అడ్వైజర్ పావులూరి హనుమంతరావు పాల్గొని ప్రసంగిస్తూ 1871 నుంచి 1931 వరకు జరిపిన జనాభా లెక్కల ప్రకారం ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తున్నారని, మండల్ కమిషన్ ప్రకారం 52శాతమ్ము ఓబీసీలకు కేంద్ర ప్రభుత్వంలో విద్యా ఉద్యోగాలలో 27శాతం మాత్రమే ఇస్తున్న రిజర్వేషన్లవల్ల ఓబీసీలు జనాభా దామాషా ప్రకారం దక్కవలసిన అవకాశాలన్నీ కోల్పోతున్నారని, కాబట్టి 2027లో జరిగే జనాభా లెక్కలలో తప్పనిసరిగా ఓబీసీలకు యూనికోడ్ పెట్టాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. తమ హక్కుల సాధనకు అందరూ ఐక్యతతో నిరంతర పోరాటం చేయవలసిన ఆవశ్యకత ఉందని అన్నారు. త్వరలో అన్ని బీసీ సంఘాలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఏకీకృత వేదిక ద్వారా బీసీ జనగణన తోపాటు బీసీలకు రావలసిన రిజర్వేషన్‌ల సాధనకై ఐక్యతతో ముందుకు సాగుతామన్నారు. కులగణలో బీసీలకు ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయాలని దీనికి అన్ని రాజకీయ పార్టీలు కూడా మద్దతు ఇవ్వాలన్నారు. ప్రతి ఎన్నికలవేళ బీసీలకు హామీ ఇచ్చి అమలు చేయలేని అసమర్థ ప్రభుత్వాలకు త్వరలోనే బీసీలందరూ తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. అక్టోబర్ 15వ తేదీ అన్ని మండల, జిల్లా రాష్ట్రస్థాయిలో అన్ని బీసీ సంఘాలు కూడా ఐక్యతతో తమ నిరసన తెలియజేస్తూ ప్రభుత్వానికి వినతి పత్రాన్ని అందించేలా ప్రత్యేక కార్యచరణతో ముందుకు సాగాలని, త్వరలో కన్యాకుమారి నుండి ఢిల్లీ వరకు ప్రత్యేక ఓబీసీ రథయాత్ర నిర్వహించి రామ్లీల మైదానంలో లక్షల మంది బీసీలతో బహిరంగ సభను ఏర్పాటు చేసి బీసీల యొక్క గర్జనను ఏర్పాటు చేయను న్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో, బీవీఎస్ సత్యనారాయణ, కూరపాటి హనుమంతరావు ఎ న్జీవో రాంబాబు పివి రమణయ్య ఉగ్గం సాంబశి వరావు మహిళా అధ్యక్షురాలు దివి ఉమాలక్ష్మి బీ సీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బుచ్చిరెడ్డిపాలెం రూపురేఖలు మారుస్తాం

● ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



**బుచ్చి (నెల్లూరు), సెప్టెంబర్ 27 ప్రభాతవార్త :**బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాల్టీకి సంబందించి మున్సిఫల్ శాఖా మంత్రి పొంగూరు నారాయణ, 45 కోట్లు మంజూరు చేస్తామని చెప్పడం జరిగింది అందులో మొదటిగా 22 కోట్లు విడుదల చేయడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం వవ్వేరు బ్యాంకు ఆవరణంలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతు బుచ్చిరెడ్డిపాళెం లో ట్రాఫిక్ సమస్యను గుర్తించి కేంద్ర నిధులు 14.45 కోట్లు మంజూరు చేయడం జరిగిందని త్వరలో రోడ్డు నిర్మాణం చేపట్టడం జరుగుతుందని అన్నారు. జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రజలు 28 వార్డులు గెలిపించాలని ఆయన కోరారు. అనంతరం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతు మాది టెంకాయ కొట్టే ప్రభుత్వం కాదని,టెంకాయకొట్టి గుమ్మడికాయ కూడా కొట్టే ప్రభుత్వమని ఆమె ఎద్దేవ చేశారు. బుచ్చిరెడ్డిపాళెం ముంబాయి రహదారికి 14.45 కోట్లు మంజూరు చేసి ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ఆమె ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. మున్సిఫల్‌శాఖా మంత్రి పొంగూరు నారాయణ మంజూరు చేసిన 45 కోట్లలో 22 కోట్లతో ప్రతి వారులో సిమెంట్ రోడ్డు వేయనున్నట్లు ఆమె తెలిపారు . కోవూరు షుగర్ ఫ్యాక్టరీ కార్మికుల బకాయిల చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి ఆమె ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈనెల 29 న ఉదయగిరి నియోజకవర్గం రామాపురంలో జరిగే పల్లెపండుగ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖా మంత్రి నారాలోకేష్ వస్తున్నారని అక్కడ కూడా మన నియోజకవర్గానికి నిధులు మంజూరు అవుతాయని ఆమె స్పష్టం చేశారు. అనం తరం వవ్వేరు బ్యాంకు చైర్మన్ దొడ్ల విజయ లక్ష్మీ,కోదండరామిరెడ్డి ఆహ్వానం మేరకు ఎంపి ,ఎమ్మెల్యే వవ్వేరు బ్యాంకులో వారు ఆతిధ్యం తీసుకున్నారు. వవ్వేరు బ్యాంకు గురించి చైర్మన్ దొడ్ల విజయలక్ష్మీ,మాజీ సిఇఒ మన్నారపు శ్రీని వాసులు వివరించారు. ఈకార్యక్రమంలో భాగం గా నాలుగోవార్డులో, 13 వవార్డులో, 11 వవార్డు లు సిమెంట్‌రోడ్లుకు శంకుస్దాపన చేశారు. ఈకార్యక్రమంలో సీనియర్‌నాయకులు కమలాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ, వవ్వేరు బ్యాంకు చైర్మన్ దొడ్ల విజయలక్ష్మీ, దొడ్ల కోదండరామిరెడ్డి, బుచ్చి రూరల్ బ్యాంకు చైర్మన్ ఏటూరు శివరామకృష్ణారెడ్డి , పార్లమెంటరీ ఉపాధ్యాక్షులు ఎం.వి శేషయ్య, జొన్నవాడ దేవస్థానం మాజీ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు, టౌన్ అద్యక్షులు గుత్తా శ్రీనివాసులు,గౌరవాద్యక్షులు టంగుటూరు మల్లికార్జునరెడ్డి , కౌన్సిలర్ పుట్టా లక్ష్మీకాంతమ్మ, వైస్ చైర్మన్ యరటపల్లి శివకుమార్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ పఠాన్ నస్రీన్, మైనార్టీనాయకులు షబ్బీర్, ఫర్వీనా,అక్తర్, మహబూభాషా, కో ఆప్షన్ మెంబర్ దస్తగిరి, కౌన్సిలర్ కోటంరెడ్డి లలితారెడ్డి,శ్రీకాంత్‌రెడ్డి, జొన్నలగడ్డ శివయ్య, కమీషనర్ చిన్నబాబు, కౌన్సిలర్ బెల్లం మల్లారెడ్డి,కౌన్సిలర్ శ్రీదేవి, గుబ్బా సురేష్, కౌన్సిలర్ అందె ప్రత్యూషా, జనసేన నాయకులు మాదవ్,బిజెపినాయకులు కాసా శ్రీనివాసులు, పలువురు టిడిపినాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శరన్నవరాత్రి ఉత్సవాల్లో సాంస్కృతిక ప్రదర్శనలకు దరఖాస్తుల ఆహ్వానం



**ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 27, ప్రభాతవార్త :** దుర్గమ్మవారి ఆలయంలో అక్టోబర్ 11 నుండి 20వ తేదీ వరకు జరిగే దసరా మహోత్సవాల్లో శ్రీ కనకదుర్గ అమ్మవారి సన్నిధిలో సాంస్కృతిక, భక్తి సంగీత, నృత్య కళా ప్రదర్శనలు ఇచ్చేందుకు ఆసక్తిగల అర్హులైన శాస్త్రీయ సంగీతం, కూచి పూడి, భరతనాట్యం, హరికథ, భక్తిరంజని, భజ న, బుర్రకథ, కోలాటం, నాటకం తదితర సాంప్రదాయ కళారూపాలలో ప్రావీ ణ్యం ఉన్న కళాకారులు కళా బృందాల నుండి దరఖాస్తులను ఆహ్వాని స్తున్నామని కళాకారులు దేవస్థానం వెబ్ సైట్ డబ్లుడబ్లుడబ్లు.కనకదుర్గమ్మ.వోఆర్జి' లో దర ఖాస్తు చేసుకోవాలని ఆలయ ఇఒ వి.కె. శీనానా యక్ తెలిపారు. నిబంధనల ప్రకారం ఒక కళా బృందానికి గరిష్టంగా ఆరుగురు (ప్రధాన కళాకా రుడు + ఐదుగురు సహ కళాకారులు) మాత్రమే ప్రదర్శనకు అవకాశముందన్నారు. శ్రీ అమ్మవారి దర్శనం నిమిత్తం కూడా ఈ ఆరుగురు సభ్యు లను మాత్రమే ఒక బృందంగా అనుమతిస్తా మ న్నారు. దరఖాస్తు ఫారంతో పాటు లలిత కళల లో డిప్లొమా / డిగ్రీ / పీజీ సర్టిఫికెట్ల జిరాక్స్ ప్ర తులు, కళా రంగంలో అనుభవం, గత ప్రదర్శ నల పేపర్ క్లిప్పింగ్స్, ఫొటోలు, ప్రదర్శనా ప్రశంసా పత్రాలు తప్పనిసరిగా జతపరచాలి.

**బ్యాంక్ వివరాలు:** ప్రధాన కళాకారుని ఆధార్ నెంబర్, మొబైల్ నెంబర్‌తో పాటు సంబంధిత బ్యాంక్ పాస్‌బుక్ మొదటి పేజీ జిరాక్స్ కాపీని (ఖాతా సంఖ్య, ఐఎఫ్‌సిఐ కోడ్ స్పష్టంగా ఉండేలా) విధిగా జతచేసిన దరఖాస్తులను దేవస్థాన కార్యాలయానికి పోస్టు ద్వారా గానీ, నేరుగా స్వయంగా గానీ దేవస్థానం అధికారిక ఈమెయిల్ ఎండోఈవోఎస్‌డిఎంఎస్‌డిఎట్‌దరేట్‌జివోవి.ఇన్ ద్వారా అక్టోబర్ 5లోగా అందించాలని, నిర్ణీత గడువు ముగిసిన తర్వాత వచ్చిన దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ పరిగణనలోకి తీసుకోమన్నారు. పూర్తి వివరాలు కొరకు టోల్ ఫ్రీ నెంబర్ :1800 425 9099 పై సంప్రదించాలన్నారు.

## గుత్తి కోటను పర్యాటకపరంగా అభివృద్ధి పరుస్తాం

● ఎంపి అంబికా లక్ష్మినారాయణ, కార్మిక బోర్డు చైర్మన్ వెంకటశివుడుయాదవ్



**గుత్తి, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త :**భావితరాలకు వారసత్వ సంపదను అందిస్తూ గుత్తి కోటను పర్యాటకపరంగా అభివృద్ధి పరిచేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటామని అనంతపురం ఎంపి అంబికా లక్ష్మినారాయణ, కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకటశివుడుయాదవ్, అసిస్టెంట్ కలెక్టర్ సియాజ్‌కుమార్‌తో పాటుగా గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షులు విజయభాస్కర్‌చౌదరి, పర్యాటకశాఖ రీజనల్ డైరెక్టర్ ఓబులమ్మ, తదితరులు పేర్కొన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని పర్యాటకశాఖ, గుత్తి కోట సంరక్షణ సమితి సంయుక్త ఆధ్వర్యంలో గుత్తి కోటలో ఆదివారం ఘనంగా ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోట ద్వారం నగరేశ్వర దేవస్థానం నుండి విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎంపి మాట్లాడుతూ గుత్తి కోట ప్రాశస్త్యం జాతీయ వ్యాప్తంగా తెలిసేలా పోస్టల్ స్టాంపును త్వరలో కేంద్రం విడుదల చేయనుందని తెలిపారు. దాదాపు 70 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో కోట అభివృద్ధికి ప్రతిపాదన పంపామని ఆయన తెలిపారు. అదేవిధంగా జాతీయ రహదారి నుండి కోట వరకు నాలుగు కోట్ల రూపాయల అంచనా వ్యయంతో అనుసంధానంగా రోడ్లు, పార్కులు తదితర సౌకర్యాలను కల్పిస్తున్నామని తెలిపారు. డిసెంబర్‌లో పెద్దఎత్తున గుత్తి కోటపై పర్యాటక ఉత్సవాలు నిర్వహిస్తామని ఎంపి పేర్కొన్నారు. అనంతరం డాక్టర్ హేమావతి రచించిన అనంత పర్యాటకం గ్రంథాన్ని ఆవిష్కరించారు. అదేవిధంగా తాడిపత్రికి చెందిన రాయలసీమ నాణేల సేకరణ సమితి ఆధ్వర్యంలో నాగరాజారావు, విష్ణుభగవాన్‌లు ఏర్పాటు చేసిన నాణెముల ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది. క్రీస్తు పూర్వం నుండి ఇప్పటిదాకా పురాతన నాణేలను సేకరించి ప్రదర్శనలో ఉంచారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సురేంద్ర, జిల్లా పర్యాటక శాఖ అధికారి రమణారెడ్డి, డి ప్యూటీ తహాశీల్దార్ సూర్యనారాయణ, ఎంపిడిఒ ప్రభాకర్, గుత్తి కోట సంరక్షణ సమితి నాయకులు సూర్యనారాయణరెడ్డి, నవ్య చిరంజీవి, సుధాకర్‌నాయుడు, హెచ్ ఎం జిలాన్, టిడిపి నాయ కు లు శ్రీకాంత్‌చౌదరి, రవితేజ నారాయణస్వామి, బళ్లారి నౌషాద్ అలీ, బిజెపి నాయకులు వెంకప్ప, హేమలత, నూరుల్ హసన్ బాష, మోడల్ స్కూల్ కమిటీ చైర్మన్ పవన్‌కుమార్, రవితేజ సుంకన్న, పెద్దఎత్తున విద్యార్థులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# తగ్గనున్న కరెంట్ బిల్లు ఛార్జీలు

● ట్రూడౌన్ ప్రక్రియ ద్వారా వినియోగదారుల కరెంట్ బిల్లుల్లో ఛార్జీల రాయితీ

**విజయవాడ,సెప్టెంబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలోని విద్యుత్ వినియోగదారులకు తీపి కబురు అందించింది. ట్రూడౌన్ ప్రక్రియ ద్వారా వినియోగదారుల కరెంట్ బిల్లుల్లో ఛార్జీల రాయితీని కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఆమోదం తెలిపింది. గత రెండేళ్లలో కలిపి దాదాపు రూ. 1,553 కోట్ల మేర లబ్ధి చేకూరనుంది. ఇది గృహ, వాణిజ్య, పారిశ్రామిక వినియోగదారులందరికీ గొప్ప ఆర్థిక ఉపశమనాన్ని ఇస్తుందని చెప్పవచ్చు. రాష్ట్రంలో విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలు నిర్వహణ వ్యయాన్ని తగ్గించుకోవడంతో పాటు.. సమర్థవంతమైన ఆర్థిక నిర్వహణను పాటించడమే ఈ భారీ తగ్గింపునకు ప్రధాన కారణ ఏపీఈఆర్సి ప్రకారం, 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 629 కోట్లను ట్రూడౌన్ చేసేందుకు అనుమతి ఇచ్చింది. ఈ మొత్తాన్ని భవిష్యత్తులో వచ్చే కరెంట్ బిల్లులలో సర్దుబాటు చేయాలని డిస్కంలను ఆదేశించింది. దీనికి తోడు, గత ఆర్థిక సంవత్సరం లోనూ ప్రభుత్వం రూ. 924 కోట్లను ట్రూడౌన్ చేసింది. దీనిఫలితంగా ఇప్పటికే ప్రతి యూనిట్ విద్యుత్ వినియోగంపై 13 పైసల చొప్పున ఛార్జీలను తగ్గిస్తూ వస్తున్నారు. వరుసగా రెండేళ్లలో దాదాపు రూ. 1,553 కోట్లను తగ్గించడం వల్ల అన్ని వర్గాల వినియోగదారుల జేబులపై భారం తగ్గనుంది.

28skl13:28skl13.qxd 27-09-2026 22:27 Page 1



## దివంగత నేత సుధాకర్ ప్రసాద్‌కు ఘన నివాళి



**శ్రీకాకుళం , ప్రభాతవార్త:**

స్థానిక రెవెన్యూ గెస్ట్ హౌస్ నందు పూర్వపు రెవెన్యూ సర్వీసుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూ ఉద్యోగుల శ్రేయస్సు కోసం అహర్నిశలు కృషి చేస్తూ ఉద్యోగుల హక్కుల కోసం పోరాటం చేస్తూ ఉద్యమ బాటలో అసువులు బాసిన రెవెన్యూ టైగర్ కీర్తిశేషులు కామ్రేడ్ తోట సుధాకర్ ప్రసాద్ 25వ వర్ధంతి సందర్భంగా ఘనమైన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏపీ.ఆర్.ఎస్.ఏ జిల్లా అధ్యక్షులు మరియు ఏపీ జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ బైరి రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి డి సోని కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## గండ్లు పడిన ప్రాంతాన్ని పరిశీలించిన ఏఈ సతీష్ కుమార్

**సంతకవిటి, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :**



ఇటీవ కురిసిన భారీ వర్షాలు, తుఫాన్ ప్రభావంతో నాగావళి నది వరద కారణంగా గారన్నాయుడుపేట-పనసపేట గ్రామాల మధ్య సాయన్న గెడ్డపై మరియు చిత్తారపురం-గారన్నాయుడుపేట గ్రామాల మధ్య రోడ్డుకు భారీ గండ్లు పడడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ విషయాన్ని టీడీపీ నాయకులు రాకోటి సత్యమూర్తి, ఆర్అండ్‌బీ అసిస్టెంట్ ఇంజనీర్ సతీష్ కుమార్‌కు తెలియజేయగా ఆదివారం సతీష్ కుమార్ చిత్తారపురం పంచాయతీ టీడీపీ నాయకులతో కలిసి గండ్లు పడ్డ ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వెంటనే గండ్లు పడిన ప్రదేశాలను బాగు చేసి రాకపోకలను పునరుద్ధరించాలని రాకోటి సత్యమూర్తి సతీష్ కుమార్‌ను కోరారు. ప్రజల భద్రత, రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేకుండా అవసరమైన అన్ని చర్యలు త్వరితగతిన చేపడతామని సతీష్ కుమార్ తెలిపారు.

## కంద్ర కాలనీలో విద్యుత్ ఉపకరణాల పంపిణీ

**ఇచ్ఛాపురం, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త:**



పట్టణ పరిధి కంద్ర కాలనీలో తుఫాను బాధితులకు విద్యుత్ ఉపకరణాలు పంపిణీ చేశారు. రుత్విక గోల్డ్ డైరెక్టర్ పైడిశెట్టి దినేష్ అందజేశారు. 15 విద్యుత్ స్తంభాలకి కావాల్సిన లైట్లు క్యాంపులు ఇతర సామగ్రి అందజేశారు. విద్యుత్ స్తంభాలపై అమర్చి పోల్‌పై నుండి సరఫరా పునరుద్ధరణ జరిగే వరకు మొత్తం ఖర్చు భరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కొయి రామారావు, పైల నారాయణ, కృష్ణ, కూర్మరావు, పైల శ్రీను, సంతోష్, శేఖర్, రామారావు కృష్ణయ్య , తదితరులు పాల్గొన్నారు.

## దసరా ఉత్సవాలు వైభవంగా జరిపించండి




### ఎమ్మెల్యే జయకృష్ణ

**పాలకొండ, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :**

రానున్న దసరా ఉత్సవాలు అంగ రంగ వైభవంగా ఎటువంటి ఆటంకాలు లేకుండా జరిపించాలని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ కోరారు. ఇటీవల ఉత్సవాల నిర్వహణకై ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి ఏడాది ప్రజలకు అన్ని విధాల సౌకర్యాలు కల్పించి నిర్వహిస్తున్న ఈ దసరా ఉత్సవాలకు ఈ ఏడాది కూడా ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలని చూడాలని ప్రత్యేక చర్యలు తీసుకోవాలని దేవాదాయశాఖ అధికారులకు సూచించారు. అన్నదానం సదుపాయంతో పాటు ప్రజలకు క్యూలైన్ ఏర్పాటల్లో ఎటువంటి లోటుపాట్లు జరగకూడదని ఆయన పేర్కొన్నారు. అక్టోబర్ 11వ తేదీ నుంచి నవరాత్రులు జరిపించే ఈ ఉత్సవం రాష్ట్రంలో ప్రత్యేకత సంతరించుకుందని రాష్ట్రం నలుమూలల నుంచి ఎంతోమంది భక్తులు తమ కోర్కెలు తీర్చుకునేందుకు వస్తారని ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. అదేవిధంగా కోట దుర్గ ఆలయ అభివృద్ధికి రెండు కోట్ల రూపాయలు మంజూరుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి వల్ల కొండబాబు, అరకు పార్లమెంటరీ ఇన్‌చార్జ్ గంట సంతోష్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గుమ్మడి సింహాద్రి, మండల అధ్యక్షులు గండి రామనాయుడు, డి.ఎస్.పి ఎం.రాంబాబు సిఐ ప్రసాదరావు, ఎస్సై దోల వెంకన్న, టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పడాల భూదేవి, కూటమి నేతలు కర్నేన అప్పలనాయుడు, నగర పంచాయతీ కమిషనర్ నూకరాజు, కోటి దుర్గ ఆలయ సిబ్బంది, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## అర్నాబ్ తుపాన్ బాధితులకు ఉలాల భారతిదివ్య ఆర్థిక భరోసా

**ఇచ్ఛాపురం, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త:**



అర్నాబ్ తుపాన్ ప్రభావంతో ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలోని పురుషోత్తపురం గ్రామంలో నాలుగు ఇళ్లు కూలిపోగా, 7వ వార్డులో ఓ కుటుంబానికి చెందిన ఇంటి గోడ కూలిపోయింది. ఈ విపత్కర పరిస్థితుల్లో బాధిత కుటుంబాలకు అండగా నిలిచారు శ్రీకాకుళం జిల్లా మహిళా అధ్యక్షురాలు ఉలాల భారతీదివ్య. బాధిత కుటుంబాల పరిస్థితిని స్వయంగా తెలుసుకుని, వారి కష్టాల్లో భాగస్వామ్యమవుతూ ఒక్కో కుటుంబానికి రూ.5,000 చొప్పున తన వంతు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆపద సమయంలో బాధితులకు ఆర్థిక చేయూత నివ్వడంతో పాటు, వారికి ధైర్యం, భరోసా కల్పించారు. కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలవడం, అవసరమైన వేళ చేతనైన సహాయం అందించడం తన బాధ్యతగా భావిస్తూ ఉలాల భారతీదివ్య మానవీయతను చాటుకున్నారు. ఆర్థిక సహాయం పొందిన వారిలో దుపాన లక్ష్మీ, రత్నాల లక్ష్మీ, నెయ్యల సావిత్రి, నెయ్యల ఖిలాషినీ, సింహాచలం బాడిత్య ఉన్నారు. కార్యక్రమంలో ద్వారక హాస్పిటల్ ఎం.డి డాక్టర్ ఉలాల శేషు యాదవ్, 1వ వార్డు మాజీ కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్ కుమార్, 2వ వార్డు మాజీ కౌన్సిలర్ ప్రతినిధి చాట్ల తిరుపతి, 4వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి సాలిన భాగీరథి, 3వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి మట్ట సోనీ, 7వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి పరపతి మంజులత, పరపతి కోటి, రామ్మూర్తి, కేశవ, తదితరులు పాల్గొన్నారు.

## మన్యంలో కానరాని ఆర్‌డబ్ల్యుఎస్... పత్తాలేని జలజీవన్

### నేటికీ 150 గ్రామాలు గ్రావిటీ ద్వారా తాగునీరు

### టైఫాయిడ్ కిడ్నీ చర్మవ్యాధులతో బాధపడుతున్న గిరిజనులు

**సీతంపేట, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :**



గిరిజన ప్రాంతాలలో స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జలజీవన్ పథకం క్రింద పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశారు. ఈ పథకం పూర్తిస్థాయిలో అమలు చేయడంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వైఫల్యం చెందారని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఈ పథకం అమలు కాకపోవడంతో ఈ నిధులు దుర్వినియోగం చేస్తున్నారనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. ఇదిలా ఉండగా నేటికీ మండలంలో 150 గిరిజన గ్రామాలు గ్రావిటీ ద్వారానే నీరు త్రాగవలసిన పరిస్థితి నెలకొంది. దీంతో చర్మవ్యాధులు టైఫాయిడ్ కిడ్నీ వంటి వ్యాధులు సంభవిస్తున్నాయి. కొన్ని గ్రామాలకు జలజీవన్ ద్వారా పైపులు అమర్చినప్పటికీ వాటి ద్వారా నీరు సరఫరా లేని పరిస్థితి నెలకొంది. ఈ శాఖపై పూర్తిస్థాయి సమీక్షలు గానీ ఉన్నతాధికారులు చేపట్టకపోవడంతో ఈ శాఖ అలంకారప్రాయంగానే ఉందనే గిరిజనులు మండిపడుతున్నారు. కొన్ని గ్రామాల్లో సోలార్ ద్వారా నేటి సరఫరాను అందించడానికి సోలార్ ఏర్పాటు చేసినా అవి మరమ్మతులకు గురి కావడంతో నీరు కల్పించలేని పరిస్థితి ఉంది. గతంలో ఈ శాఖ డీఈ ఏఈ కార్యాలయం సీతంపేట కేంద్రంగా నిర్వహించేవారు. ప్రస్తుతం ఈ కార్యాలయం స్థానికంగా లేకపోవడంతో అధికారులు అందుబాటులో లేని పరిస్థితి నెలకొంది. అదేవిధంగా 23 గిరిజన గ్రామాలకు వంశధార జలాలు కూడా అందని పరిస్థితి ఉంది. పైప్‌లైన్ పూర్తి మరమ్మతులకు గురి కావడంతో త్రాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. దీనిపై జిల్లా కలెక్టర్ ఐటీడీఏ పీవో స్పందించి గిరిజన గ్రామాలకు పూర్తిస్థాయిలో త్రాగునీరు సౌకర్యం కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు.

## కూటమి హయాంలో గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం

**కంచిలి, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :**



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలుగుదేశం పార్టీ కంచిలి మండల అధ్యక్షులు మాదిన రామారావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ దాసరి రాజు అన్నారు. ఆదివారం కంచిలి మండలం జలంత్రకోట పంచాయతీ పరిధిలోని మధుపురం గ్రామంలో రూ.1.30 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న బీటీ రహదారి నిర్మాణానికి వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రహదారులు, డ్రైనేజీ తదితర పనులను చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మాజీ జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయకు ఘన సన్మానం

**ఆముదాలవలస, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :**



శ్రీకాకుళం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా పదవీ బాధ్యతలను విజయవంతంగా పూర్తి చేసుకున్న పిరియా విజయ ఘనంగా సన్మానించాను. ఆదివారం ఒక ప్రైవేటు కల్యాణ మండపంలో కళింగ కుటుంబం ఆధ్వర్యంలో ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే, రాష్ట్ర పీయూసీ కమిటీ చైర్మన్ కూన రవికుమార్ ముఖ్యఅతిథిగా హాజరై పిరియా విజయ సాయిరాజ్‌ను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా పిరియా విజయ సాయిరాజ్ తన పదవీకాలంలో ప్రజా సమస్యల పరిష్కారానికి, జిల్లా అభివృద్ధికి తనవంతు కృషి చేశారని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధిగా ఆమె అందించిన సేవలు అభినందనీయమన్నారు. పదవీ బాధ్యతలను విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా కళింగ కుటుంబం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ఆత్మీయ అభినందన సభ అభినందనీయమని తెలిపారు. ప్రజా జీవితంలో మరింత ఉన్నత స్థానాలకు ఎదిగి, ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షిస్తూ పిరియా విజయ సాయిరాజ్‌కు కూన రవికుమార్ శుభాకాంక్షలు తెలిపారు. మాజీ కేంద్రమంత్రి కిల్లి కృపారాణి, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, కోట గోవిందరావు, సనపల అన్నాజీ రావు, పప్పల రమేష్, బుడుమూరు సూర్యరావు, తమ్మినేని చిరంజీవి నాగ్, తమ్మినేని వాణిశ్రీ, కళింగ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ముంపు ప్రాంతాల్లో పర్యటించిన ఆర్డీవో సాయి ప్రత్యూష

**ఆముదాలవలస, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :**



మండలంలోని ముంపు ప్రభావిత ప్రాంతాలైన చీమలవలస, కలివరం, తొగరం, దూసి గ్రామాల్లో ఆర్డీవో సాయి ప్రత్యూష విస్తృతంగా పర్యటించి వరద పరిస్థితులను పరిశీలించారు. ఆదివారం చీమలవలస, కలివరం గ్రామాల్లో పర్యటించి మాట్లాడుతూ పంట పొలాల్లో నిల్వ ఉన్న వరద నీరు త్వరితగతిన బయటకు వెళ్లేలా తక్షణ చర్యలు చేపట్టాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే తొగరం, దూసి గ్రామాల్లో ఎస్కేప్ ఛానల్స్‌ను పరిశీలించి, భవిష్యత్తులో రైతులకు ఇటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కాలువల అభివృద్ధి, నిర్వహణ పనులను ప్రాధాన్యతతో చేపట్టాలని సూచించారు. ముంపు నీటి పారుదల వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించి రైతుల పంటలను కాపాడేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సత్యం, మండల వ్యవసాయ అధికారి మెట్ట మోహనరావు, ఎంపీడీవో మెట్ట వైకుంఠరావు, మండల ప్రత్యేక అధికారి, ఇరిగేషన్ డి.ఈ, ఏ.ఈ. రామ శివాజీ, ప్రజా ప్రతినిధులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులు మరియు రైతులు పాల్గొన్నారు.

## ముంపు ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్

### పంట నష్టం అంచనా వేయాలని అధికారులకు ఆదేశాలు

**సంతబొమ్మాళి, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :**



తుఫాన్ నేపథ్యంలో సంతబొమ్మాళి మండలంలో ముంపునకు గురైన వరి పంట పొలాలను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం పరిశీలించారు. మండలంలోని బోరుభద్ర మరువాడ, మేఘవరం, లక్కివలస, కె లింగూడు, నౌపడ గ్రామ పంచాయతీలలో పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. వేలాది రూపాయలు మదుపులు పెట్టి నాట్లు వేసాము. ఈ తుఫాన్ వల్ల వరద ముంపు బారిన పడి తీవ్రంగా నష్ట పోయామని పలువురు రైతులు జిల్లా కలెక్టర్‌కు తెలిపారు. ముంపునకు గురై నష్టం వాటిల్లే పంట పొలాల వివరాలను నమోదు చేయాలని తహసిల్దార్ హేమసుందర్, మండల వ్యవసాయ అధికారి అప్పారావుకు కలెక్టర్ ఆదేశించారు. గత ఐదు రోజులుగా వరద నీటిలో వరిచేలు ఉండిపోవడం వలన పంటలు పూర్తిగా పాడయ్యే పరిస్థితి ఉందని ఆయా పంచాయతీలకు చెందిన నాయకులు రైతులు కలెక్టర్‌కు వివరించారు. ప్రతి సంవత్సరం లోతట్టు ప్రాంతాలైన మా ప్రాంతానికి చెందిన పంట పొలాలు ముంపునకు గురై నష్టపోతూ ఉన్నామని, ఈ ఏడాది సైతం సుమారు 1500 ఎకరాలలో వరి పంట పొలాలు నష్టపోయే పరిస్థితి ఉందని వివరించారు. కోటబొమ్మాళి ఏఎంసి డైరెక్టర్ సూరాడ ధనరాజు, ఎంపీడీఓ పార్వతీసం, డెప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసరావు, మేఘవరం పంచాయతీ మాజీ సర్పంచ్ ప్రతినిధి పరపతి రాజశేఖర్, మాజీ సర్పంచ్ వంక సోమేశ్వరరావు, నీటి సంఘం డైరెక్టర్ మేరుగు నూకయ్య, మరువాడ పంచాయతీ సామాజిక కార్యకర్త సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకుడు చొక్కరి కృష్ణారావు, టీడీపీ నాయకులు, రైతులు ఉన్నారు.

## గ్రామీణ రహదారులకు మహర్దశ చంద్రబాబుతోనే



### ప్రభుత్వ విప్ అశోక్

**కవిటి, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :**

గ్రామీణ రహదారులకు మహర్దశ కూటమి ప్రభుత్వము అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంటూ ఇచ్ఛాపురం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్పు డాక్టర్ డాక్టర్ అశోక్ అన్నారు. ఆదివారం నాడు కవిటి మండలం మండలం బల్లిపుట్టుగ పంచాయతీ ఎస్ కే ఈ రోడ్డు నుంచి తలగానపుట్టుక గ్రామానికి ఒక కోటి 30 లక్షలతో నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే అశోక్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌలిక సౌకర్యాలు కల్పనకు ప్రధాన భూమిక వహించిన పార్టీ వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అంటూ ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసిలు రమేష్, కృష్ణారావు కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బార్ల చిన్నబాబు, పిఎసి అధ్యక్షులు ప్రధాన్, ఏఎంసీ చైర్మన్ మణిచంద్ర ప్రకాష్, మాజీ ఎంపీటీసీ ప్రతినిధులు సంతోష్ పట్నాయక్, విజయ్ కృష్ణ, తెలుగుదేశం నాయకులు బెందాళం సురేష్ భీమారావు, స్థానిక ప్రతినిధులు పాండు దొలాయితోపాటు పలువురు తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## బీసీలకు వెన్నెముక టీడీపీయే



### -వైకాపా నేతలు ఆత్మపరిశీలన చేసుకోవాలి : ఎంపీ కలిశెట్టి

**రణస్థలం, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :**

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకు బీసీల రాజకీయ సామాజిక సాధికారతకు పెద్దపీట వేస్తోందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు స్పష్టం చేశారు. ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్టీఆర్ కాలం నుంచి చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ నాయకత్వంలో బీసీలను శాసనసభ్యులుగా, ఎంపీలుగా, స్థానిక సంస్థల చైర్మన్లుగా చట్టసభలకు పంపిన ఘనత టీడీపీకే దక్కుతుందని పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాసరావుతో పాటు గతంలో అచ్చెన్నాయుడు, కళా వెంకటరావు వంటి అనేకమంది బీసీ నేతలకు కీలక పదవులు, మంత్రివర్గంలో, పొలిట్‌బ్యూరోలో సముచిత స్థానం కల్పించారన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు గతంలో టీడీపీ కల్పించిన ప్రాధాన్యత, రిజర్వేషన్ల విధానం వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టిందన్నారు. వైకాపా హయాంలో బీసీలకు జరిగిన అన్యాయాన్ని, బీసీ నేతలపై పెట్టిన అక్రమ కేసులను గుర్తుచేస్తూ బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు వైఎస్ జగన్‌కు, వైకాపా నేతలకు లేదని ధ్వజమెత్తారు. బీసీల నిజమైన ఎదుగుదల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని, వైకాపాలోని బీసీ నాయకులంతా తమ పార్టీ చేస్తున్న అన్యాయాన్ని గమనించి ఆత్మపరిశీలన చేసుకోవాలని ఆయన సూచించారు.

## ఘనంగా వినాయక నవరాత్రులు



**పొందూరు, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :**

ఆధ్యాత్మిక పరిఢవిల్లే పొందూరులో వినాయక నవరాత్రి ఉత్సవ వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. పొందూరు పట్టణంలో కస్పా వీధి, గొల్ల వీధి, శ్రీశైనవాడ, మహారాజా మార్కెట్ బస్టాండు వంటి పలు వీధుల్లో విగ్రహారాధన జరిపారు. అలాగే వాడవాడలా అన్నదానాలు, లడ్డు వేలం పాటలు నిర్వహిస్తున్నారు. చేనేతవాడ, గాంధీనగర్, హాస్పిటల్ వీధులు వంటి కొన్ని వీధుల్లో అనుపోత్సవాలు ముగించగా, రాంబాబు యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమంతో పాటు గణనాధునికి మేళతాళాలతో, మంగళ వాయిద్యాలతో, వేదపండితుల మంత్రోక్షణల మధ్య పురవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహిస్తూ, భక్తులకు స్వామి దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలు అందిస్తూ భారీ ఎత్తున గణనాధుని అనుపోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు.

## బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు సీఐటీయూ మద్దతు

**కొత్తూరు, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త :**




బ్యాంకు ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం చేపడుతున్న ఆందోళనలకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఐబీఏ, యూఎఫ్‌బీయూ మధ్య కుదిరిన ఒప్పందాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆమోదించి అమలు చేయాలని సీఐటీయూ నాయకుడు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. కొత్తూరు మండలంలో ఉన్న బ్యాంకు ఉద్యోగులను కలిసి సంఘీభావం తెలిపారు. సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు చేపట్టనున్న ఆందోళనలకు, ప్రభుత్వం స్పందించకపోతే అక్టోబర్ 26 నుంచి చేపట్టనున్న నిరవధిక సమ్మెకు మద్దతు ఉంటుందని తెలిపారు. వారానికి ఐదు రోజుల బ్యాంకింగ్ విధానంపై ఒప్పందం కుదిరినా కేంద్రం ఆమోదించకుండా జాప్యం చేస్తోందని విమర్శించారు. బ్యాంకుల పనితీరు ఆధారిత ప్రోత్సాహకాలను ఉద్యోగులందరికీ వర్తింపజేయాలని, కొద్దిమంది ఉన్నతాధికారులకు మాత్రమే పరిమితం చేయడం సరి కాదన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీనం, ప్రైవేటీకరణ ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని పేర్కొన్నారు.

# శ్రీకాకుళం వార్త



## జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం

**జలుమూరు, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :**



మండలంలోని జలుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమము సోమవారం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారులు గొలివి సుజాత, అహల్య తెలిపారు. ఈ కార్యక్రమంను ఉద్దేశించి వైద్యాధికారి సుజాత మాట్లాడుతూ ఆల్బెండజోల్ 400 మిల్లి గ్రాముల మాత్రలు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, అన్ని అంగన్వాడీ సెంటర్లలో ఉచితంగా ఇస్తున్నట్లు ఆమె తెలిపారు. 1-2 సంవత్సరముల పిల్లలకు ఆల్బెండజోల్, 2-19 వయసు పిల్లలకు ఒక మాత్ర ఆల్బెండజోల్ 400 ఎంజి ఇవ్వడం జరుగును. కార్యక్రమంలో హాజరకాని పిల్లలకు మరల 5వ తేదీన మాత్రలు ఇవ్వబడును. ఈ మాత్రలను బాగా నమిలి మింగవలెను.

## కార్యకర్తలు, నాయకులు సమష్టిగా పనిచేయాలి

### - రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు



**కోటబొమ్మాళి, సెప్టెంబరు 27, ప్రభాతవార్త :**

రెండున్నరేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంలో కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆయన ఆదివారం నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో టెక్కలి ఆర్డీవో ఎన్. కృష్ణమూర్తి, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, క ర్రి అప్పారావు, తర్ర రామక్రిష్ణ, పట్ట సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

## పశువుల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**కోటబొమ్మాళి, సెప్టెంబరు 27, ప్రభాతవార్త :**

కూటమి ప్రభుత్వం పశువుల భీమా పథకాన్ని పునఃప్రారంభించిందని, పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ ఎల్. కిరణ్ కుమార్ అన్నారు. ఆయన ఆదివారం స్థానిక విలేకర్లుతో మాట్లాడుతూ ఏదైన కారణం చేత పశువు మరణిస్తే రైతుకు ఆర్థికంగా నష్టం జరగకుంబా బీమా పరిహారం అందించటమే ఈ పథకం లక్ష్యమన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిపిఎల్ కుటుంబాలు చెందిన పాడిరైతులు రూ. 15 వేలు విలువ కలిగిన పశువుకు కేవలం రూ.199, రూ. 30 వేలు విలువకలిగిన పశువుకు రూ. 398, రూ. 50వేలు కలిగిన పశువుకు రూ.1723 చెల్లిస్తే సరిపోతుందని మిగిలిన ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే సబ్సిడీగా భరిస్తుందన్నారు. ఒక సారి భీమా చేస్తే 3 సంవత్సరాలు వరకు వర్తిస్తుంది. అక్టోబరు 5వ తేదీ లోపు రైతు సేవా కేంద్రంలోని పశువైద్యాధికారిని సంప్రదించి తమ పశువులకు చెవిపోగా వేయించి, బీమా నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

## టెక్కలి నియోజకవర్గంలో వైకాపాకి షాక్

### మంత్రి సమక్షంలో 500 కుటుంబాలు టీడీపీలో చేరిక

**కోటబొమ్మాళి, సెప్టెంబరు 27, ప్రభాతవార్త :**



టెక్కలి మండలంలోని సీతాపురం, తిర్లంగి పంచాయతీల పరిధిలో వైకాపా పార్టీకి చెందిన సుమారు 500 కుటుం బాలు ఆదివారం మండలం నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి మంత్రి టీడీపీ కండు వాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. సీతాపురం పం చాయతీ పరిధిలోని వీర రామమకృష్ణాపురం, అలాగే తిర్లంగ పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన వైకాపా నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరడం వల్ల పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. టెక్కలి నియోజకవర్గంతో పాటు గతంలో హరిశ్చంద్రపురం నియోజకవర్గంలో దాదాపుగా 44 ఏళ్లుగా తమ కుటుంబం రాజీయంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తోందని మంత్రి తెలిపారు. సీతాపురం, వెంకటాపురం గ్రామంలో గతంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఈ సందర్భంగా మంత్రి గుర్తుచేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బగాది శేషగిరి, బెండి శ్రీనివాసరావు, బెండి అప్పలసూర్యనారాయణ, టి. జగ్గారావు, బెండి కామరాజు, సోమేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

## జష్నే గౌసుల్ వరా వేడుకలో ఎమ్మెల్యే కూన

**ఆమదాలవలస, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :**



మున్సిపాలిటీలో గల వరదావరి క్వార్టర్స్‌లో ఉన్న నూరాని మసీదులో ఆదివారం సాయంత్రం జష్నే గౌసుల్ వరా వేడుకలు ఘనంగా ఆదివారం నిర్వహించారు. నూరాని మసీదు సెక్రటరీ షేక్ అబ్బు రహీం ఆధ్వర్యంలో మసీదు నుంచి గౌస్ పాక్ జెండా నిశాని ముస్లిం కాలనీ వరకు జులూస్ (ఊరేగింపు) నిర్వహించారు. గౌస్ పాక్ జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కూన రవికుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఈ వేడుకలకు ఒడిశా ధామ్ నగర్ షరీఫ్ ఇస్లామిక్ పండితుడు మౌలానా అస్గర్ అలీ మిస్బాహి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. అనంతరం ఫాతియా, సలాం, ఖురాన్ ఖాని, కార్యక్రమాలు నిర్వహించి, లంగర్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు మొదలవలస రమేష్, రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్,నూరాని మసీద్ ఇమామ్ అలీ అహ్మద్, షేక్.జిలాని, షేక్ అబ్రహిం, బొకారి, మక్బుల్, యాషీన్, అల్లభగాష్, ఫక్రూ, మదీనా, మాలిక్, మస్తాన్, జలీల్, జాము, పెద్ద ఎత్తున ముస్లిం పెద్దలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## తుఫాన్ తాకిడికి కూలిన 67 విద్యుత్ స్తంభాలు



**సంతబొమ్మాళి, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :**

తుఫాన్ ప్రభావం కారణంగా భారీ వర్షాలుకు తీవ్రమైన ఈదురుగాలులకు సంతబొమ్మాళి మండలంలో గత ఐదు రోజుల్లో 67 విద్యుత్ స్తంభాలు కూలిపోగా, 13 విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు పాడయ్యాయి. దీంతో పలు గ్రామాలతో పాటు రొయ్యల చెరువులకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. వెంటనే స్పందించిన సంతబొమ్మాళి మండలం విద్యుత్ శాఖ ఏఈ శశిభూషణరావు ఆధ్వర్యంలో లైన్ ఇన్స్పెక్టర్లు లైన్మెన్లు అసిస్టెంట్ లైన్మెన్లు పునరుద్ధరించే చర్యలు శరవేగంగా చేపట్టారు. విద్యుత్ స్తంభాలు ట్రాన్స్ఫార్మర్లు పాడైన సమాచారాన్ని తెలుసుకున్న వెంటనే శ్రీకాకుళం జిల్లా ఎస్ ఈ జి ఎన్ ప్రసాద్, టెక్కలి ఈ ఈ నరసింహ కుమార్, టెక్కలి డిప్యూటీ ఈ ఈ కృష్ణమూర్తి సంబంధిత సంఘటన స్థలాలను పరిశీలించారు. భావనపాడు సీతానగరం గోవిందాపురం యామాలపేట కే.లింగుడుతో పాటు పలు గ్రామాలను పరిశీలించారు. వారి ఆదేశాల మేరకు తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు ట్రాన్స్‌ఫార్మర్లు పునరుద్ధరించి సకాలంలో విద్యుత్ సరఫరా చేశారు.

# వేధింపులు సహించొద్దు..



జీవితంలో ఒక దశలో వేధింపులు ఏదో ఎదుర్కొన్న అమ్మాయి ల శాతం ఎక్కువ అయితే, వీటిని తేలిగ్గా తీసుకోవద్దంటున్నారు పరిశోధకులు. ఎందుకంటే.. వీటివల్ల దీర్ఘకాలంలో మహిళల్లో హృద్రోగాలు వచ్చే ముప్పు అధికమని హార్వర్డ్ యూనివర్సిటీ తాజా పరిశోధనలు చెబుతు న్నాయి. 60 వేలమందికి పైగా మహిళలపై అధ్యయనం చేశారు. వీటి ప్రకారం... వేధింపులు ఎదుర్కొని వారితో ప్రస్తుతం ఎదుర్కొన్న మహిళల్లో గుండెపోటు పక్షవాతం... వచ్చే ప్రమాదం 41 శాతం ఎక్కువ. ఇక, అది చేయొద్దు, ఇది చేయొద్దు. అలా ఉండాలి... ఇలా ఉండాలి.... అంటూ తరచూ ఎదుర్కొన్న వారిలో అయితే ఈ ప్రమాదం 70శాతానికి ఎగబాకింది. గృహహింస, ఆర్థిక ఇబ్బందులు... వంటి వాటివల్ల కలిగే ఒత్తిడి, భయాందోళనలు మన ఆరోగ్యానికి ఎంత హాని చేస్తాయో ఇవి అంతకంటే ఎక్కువ నష్టాన్ని కలిగిస్తాయి. గతంలో జరిగిన ఈ ఘటనలు పదే పదే గుర్తుకురావటం, అప్పుడూ ఇవే భయాందోళనలు, ఒత్తిళ్లను ఫీలవటం వల్ల మానసిక సమస్యలతోపాటు శారీరక ఆరోగ్యంపైనా ప్రతికూల ప్రభావం పడుతుంది. కాబట్టి, ఈ వేధింపులు కేవలం న్యాయపరమైనవో లేదా రక్షణకు సంబంధించినవో కాదనీ ఆరోగ్యానికి సంబంధించిన కీలకమైన విషయమని నిపుణులు సూచిస్తున్నారు. అవసరమైతే కుటుంబం, స్నేహితులు, నిపుణుల సాయం వెంటనే తీసుకోవాలనీ, సూచిస్తున్నారు.

అమ్మాయిల రజస్వల వయసు అంటే టీనేజీ ప్రారంభం. కానీ కొన్నేళ్లుగా ఈ వయసు తగ్గుతోంది. పదేళ్లలోపు చిన్నారుల్లోనూ నెలసరి మొదలవుతున్న పరిస్థితి. అయితే ప్రాచుర్యంలో ఉన్నట్టు దీనిక అధిక బరువుఒక్కటే కారణం కాదనీ, అంతకు మించి ఉన్నా యంటున్నారు పరిశోధకులు.

# లావొక్కంతయు కాదు !



స్థూలకాయం, అధిక బరువు కారణంగా అమ్మాయిల్లో రజస్వల వయసు తగ్గుతోందని నమ్ముతూ వస్తున్నారు పరిశోధకులు. అది వాస్తవమేనని చెబుతూనే..దీని వెనక మరెన్నో కారణాలు ఉన్నాయంటున్నాయి. తాజా పరిశోధనలు. హార్మోన్లపైన నేరుగా ప్రభావం చూపే రసాయనాలు వాతావరణంలో పెరగడం, చక్కెర నిల్వలు ఎక్కువగా ఉండే పానీయాలు తీసుకోవడం, బాల్యంలో ప్రతికూల అనుభవాలు ఎదురవ్వడం, ఒత్తిడి..ఇవన్నీ కారణాలు కావొచ్చని తాజా లాన్సెట్ మెడికల్ జర్నల్‌లో తెలిపారు హార్వర్డ్- ఎన్విరాన్మెంటల్ హెల్త్ విభాగం పరిశోధకులు. ఈ కోణాల్లో పరిశోధిస్తే రజస్వల ప్రక్రియను ఆలస్యం చేయొచ్చు లేదంటే నెమ్మది కావచ్చుంటున్నారు. ఒత్తిడి, గ్రంథుల వ్యవస్థను ధ్వంసం చేసే రసాయనలతో పాటు మరికొన్ని గణించలేని అధ్యయనం చేయని అంశాలూ ఉన్నాయని కొలంబియా యూనివర్సిటీ పరిశోధకులు చెబుతున్నారు. ఆహారపుటలవాట్లలో మార్పులు, శారీరక శ్రమని తగ్గించే పరిసరాలు, ఒత్తిడిని పెంచే సోషల్ మీడియా, రంగుని దృష్టిలో పెట్టుకుని వచ్చే క్రీముల్లో ఉండే హానికర రసాయనాలు.. ఇవన్నీ అందుకు కారణాలుగా నిలుస్తున్నాయనేది వీరు చెప్పే మాట.

# సమస్యను పరిష్కరిద్దాం !

మీ పిల్లలు ఇంటి పనుల్లో మీకు సాయ పడతారా? అని ఎవరైనా అంటే కొందరికి చిర్రెత్తు కొస్తుంది. మా వాళ్లకి ఆ అవసరం లేకుండా చేస్తున్నాం అంటూ గొప్పగా చెబుతారు. కానీ, దీనివల్ల కష్టించే తీరునీ, కలుపు గోలుతనాన్నీ, సామాజిక చొరవనీ వారికి దూరం చేస్తున్నారని తెలుసా అని ప్రశ్నిస్తున్నారు నిపుణులు... ఏ తల్లిదండ్రులైనా తాము పడిన కష్టం తమ పిల్లలు పడకూడదను కోవడం సహజమే. అలాగని వాళ్లకు కష్టం తెలియకుండా చేయడం వల్ల వారి భవిష్యత్తుని ప్రమాదంలో పడేస్తున్నారని గ్రహించాలి. దీనివల్ల నిజంగా వారికి ఏదైనా సమస్య వచ్చినప్పుడు పరిష్కరించుకునే విధానం తెలియక కంగుబాటుకు గురవుతారు. అందుకే, తమ పనులు తాము చేసుకోవడం, ఇతరులకు సాయం చేయడం వంటివి జీవనశైలిలో భాగం చేయాలి. ఇంటి పనుల్లో సాయం చేయడం అంటే.. వారికి బాధ్యత అలవాటు చేయడం, వారి వయసుకి, శారీరక సామర్థ్యానికి తగ్గట్లు తమ గదిని శుభ్రంచేసు కోవడం, మొక్క లకు నీళ్ల పోయ డం, దుకాణానికి వెళ్లడం, కడిగగిన గిన్నెలు సర్దడం వంటివన్నీ ఈ తరహానే. . ఏ ఫలితం కూడా ఊరకనే



రాదు. పెద్దలుగా మీకు ఆ విషయం తెలిసి ఉండొచ్చు. పిల్లలకీ నేర్పించండి. వాళ్లు కోరుకున్నవీ, లేనివీ మీరు మీ స్థాయికి తగ్గట్లు తెచ్చివ్వడం గొప్ప విషయమే అయినా వాటి విలువా వారికి తెలియాలి. ఏదైనా సంపాదించాలంటే బోలెడంత శ్రమిస్తేనే కానీ సాధ్యంకాదనే విషయాని ఆచారణలో చూపించాలి. అప్పుడే జీవితంలో కష్టసుఖాలను అర్థం చేసుకుని అడుగులు వేస్తారు. పిల్లలకి ఎంత సేపూ నాది అనేభావనే కాదు. చుట్టూ ఉన్న ప్రపంచంతోనూ సంబంధాలు ఏర్పరచండి. ఆపదలో ఉన్నవారికి సాయం చేయడం, తోటివారితో వస్తువుల్నీ, పుస్తకాల్నీ పంచుకోవడం, స్నేహితులతో కష్టసుఖాలను షేర్ చేసుకోవడం వంటివన్నీ వారికి సామాజిక చొరవను అలవరుస్తాయి. □

# ఓం నమః శివాయ



.. శివలింగ దర్శనం .. శివాభిషేకం అనేక జన్మల పాపాలను పటా పంచలు చేస్తాయి. అందు వలన చాలా మంది తమ పూజా మందిరాల్లో చిన్నపాటి శివలింగాలను ఏర్పాటు చేసుకుని అనునిత్యం అభిషేకం చేస్తూ వుంటారు. కొంతమంది బంగారపు శివలింగాన్ని .. మరికొందరు వెండి శివలింగాన్ని .. ఇంకొందరు ఇత్తడి శివలింగాన్ని తయారు చేయించుకుని ఆరాధిస్తూ వుంటారు. ఒక్కో విధమైన శివలింగాన్ని పూజించడం వలన, ఒక్కో విశేషమైన ఫలితం లభిస్తుందని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి. ఇక కొంతమంది స్పటిక శివలింగం సంపాదించుకుని తమ పూజా మందిరంలో ఏర్పాటు చేసుకుంటూ వుంటారు. స్పటిక లింగాన్ని ఆరాధిం చడం వలన దారిద్ర్యం తొలగి పోతుంది. స్పటిక శివలింగాన్ని పూజించడం వలన, సిరిసంపదలు చేకూరతాయి. సౌభాగ్య సిద్ధి కలగడమే కాకుండా, సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుంది. మనసులోని ధర్మబద్ధమైన కోరికలునెర వేరతాయి.

# పాస్తా రుచిగా..



పాస్తా ఒకటిన్నర కప్పు, చిన్నగా తరిగిన అల్లం, వెల్లుల్లి ముక్కలు అర టీస్పూన్ చొప్పున, సన్నగా తరిగిన ఉల్లిపాయలు, పచ్చిమిర్చిరెండు చొప్పున, క్యారెట్, క్యాప్సికం ముక్కలుటేబుల్స్పూన్ చొప్పున, ఉప్పు రుచికి సరిపడా, చిన్నగా తరిగిన టొమాటోలు రెండు, మిరియాలపొడిపావు టీస్పూన్‌పావు, అర టీస్పూన్ చొప్పున, చొప్పున, టొమాటోసాస్ టేబుల్స్పూన్, రెడ్ చిల్లీసాస్ టీస్పూన్, కొత్తమీర తురుము గుప్పెడు.

**తయారీ విధానం:** Tన్నెలోకి ఐదు కప్పుల నీళ్లు తీసుకుని వేడిచేయాలి. కొద్దిగా ఉప్పు, కాస్త నూనె వేయాలి. ఇలా వేయడం వల్ల పాస్తా అతుక్కోకుండా పొడిపొడిగా ఉంటుంది. నీళ్లు మరుగుతున్నప్పుడు గోధుమ పాస్తా వేసి మెత్తగా ఉడికించాలి. నీళ్లు లేకుండా వడకట్టుకుని ప్లేటులో వేసుకోవాలి. కడాయిలో నూనె పోసి అల్లం, వెల్లుల్లి తరుగు, తర్వాత, పచ్చిమిర్చి ముక్కలు, క్యారెట్, క్యాప్సికం, టొమాటో ముక్కలు వేసుకుని వేయించాలి. మూడు వంతులు వేగిన తర్వాత మిరియాలపొడి, కారం, గరం మసాలా, ధనియాల పొడులను వేయాలి.. తర్వాత టొమాటో సాస్, రెడ్ చిల్లీసాస్, తగినంత ఉప్పు కలపాలి. తక్కువమంట మీద మరికాసేపు వేయించి పాస్తా వేయాలి. ఇప్పుడు మంట పెంచి పాస్తాను కలుపుతూ ఉడికించాలి. చివరగా కొత్తిమీర తురుము చల్లి దించేస్తే వేడివేడి మసాలా పాస్తా సిద్ధం.

# చెద, చెడు వాసన రాకుండా!

కాలం ఏదైనా వార్డ్‌రోబ్‌లను ఎప్పుడూ మూసే ఉంచినా, వాతావరణంలో కాస్త తేమ ఎక్కువైనా.. వాసన వస్తాయి. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా చెదలూ, పురుగులూ ఇబ్బంది. ఎడతాయి. ఇలాంటప్పుడు దుస్తులు పాడవకుండా సమస్య దూరవ్వాలంటే..



బీరువాలో దుస్తుల్ని నెలల తరబడి మడత తీయకుండా వదిలేయకండి. అప్పుడప్పుడూ ఎండలో ఆరేయాలి. మడతల్లో చిన్న దేవదారు ముక్కల్ని ఉంచాలి. లేదంటే పచ్చ కర్పూరాన్ని వస్త్రంలో చుట్టి పెట్టొచ్చు. ఈ వాసన చెద పురుగులకు నచ్చదు.

వార్డ్‌రోబ్‌లో ఏమైనా క్రాక్స్, గ్యాప్స్ ఉంటే వాటిని సీల్ చేయండి. దుమ్మూ, ధూళిని ఎప్పటికప్పుడు వాక్యూమ్ చేస్తే సరి. వేప ఆకులు లవంగాలు.. ఇవి అన్నీ చెదల నివారణకు సాయపడతాయి. వాటి దుర్వాసనతో పాటూ తేమ కూడా పోవాలంటే.. లవంగాల పొడి, బొగ్గు, బేకింగ్ సోడా లోపల ఉంచండి. చెమట, నూనె, ఆహార మరకలు ఉన్న దుస్తులను పూర్తిగా శుభ్రం చేశాకే బీరువాట పెట్టండి. లేదటే ఇవి సిల్వర్‌ఫిష్, ఇతర పురుగులను ఆకర్షస్తాయి. అలానే బీరువాల్లో కార్డ్‌బోర్డు బాక్సులను నిల్వ చేయొద్దు. ఎప్పుడో ఒకసారి ధరించే దుస్తుల్ని వాక్యూమ్ సీల్డ్ చేసి బ్యాగుల్లో పెట్టండి. దుస్తుల వరుసల మధ్య ఖాళీ ఉండనివ్వండి. పిప్పర్‌మెంట్, యూకలిప్టస్ వంటి ఎసెన్షియల్ ఆయిల్స్‌లో ముంచి తీసిన కాటన్ బాల్స్‌ని లోపల పెడితే పురుగులు రావు.

# కాసు మూవీ గ్లింప్స్ లాంచ్ ఈవెంట్



యంగ్ టాలెంటెడ్ హీరో శ్రీ నందు నటిస్తున్న కొత్త సినిమా కాసు. ఈ చిత్రంలో ఇందుకుమార్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమాను ఎ.కె.ఆర్. డ్రీమ్ పిక్చర్స్ ఎల్ఎల్ పీ బ్యానర్‌పై ఇందు కుమార్, నరేంద్ర కొండ నిర్మిస్తున్నారు. పి.ఎస్. హర్షవర్ధన్ దర్శకత్వం వహిస్తున్నారు. తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ, హిందీలో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. స్టార్ ప్రొడ్యూసర్ ఏఎం రత్నం అతిథిగా శనివారం సాయంత్రం హైదరాబాద్‌లో కాసు సినిమా గ్లింప్స్ లాంచ్ ఈవెంట్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రొడ్యూసర్ నరేంద్ర కొండ మాట్లాడుతూ ఈ చిత్రంలో ఒక బ్యూటిఫుల్ లవ్ స్టోరీ చూపిస్తున్నాం. ప్రేమలో ఉన్న ఒక జంట మధ్య డబ్బు విషయంలో దురాశ అనేది మొదలైతే ఆ రిలేషన్ కు, వారి ప్రేమకు ఎలాంటి ఇబ్బందులు వస్తాయి అనేది మా మూవీలో ఆద్యంతం ఆసక్తికరంగా తెరకెక్కించారు మా డైరెక్టర్ హర్షవర్ధన్. డైరెక్టర్ పి.ఎస్.హర్షవర్ధన్ మాట్లాడుతూ ఈ రోజు మా మూవీ ఈవెంట్ కు అతిథిగా వచ్చిన ఎంఎం రత్నం గారికి థ్యాంక్స్. ఆయనకు నేను పెద్ద అభిమానిని. మా ప్రొడ్యూసర్స్ నరేంద్ర గారు, ఇందు గారి సపోర్ట్ తో ఈ సినిమా చేస్తున్నాం. హీరోయిన్, ప్రొడ్యూసర్ ఇందుకుమార్ మాట్లాడుతూ మా కాసు మూవీ ఎలా ఉంటుంది, మీ కాసులకు ఎంత న్యాయం చేస్తుంది అనేది ముందు ముందు తెలుసుకుంటారు. ఒక పల్లెటూరి నుంచి వచ్చిన అమ్మాయిని నేను. సొసైటీ గురించి ఏమీ తెలియదు. యాంకరింగ్ తో మొదలుపెట్టి ఈ రోజు నిర్మాతగా, హీరోయిన్‌గా మీ ముందుకు వస్తున్నా. నేను ఏది చేసినా సంతోషించేది మా నాన్నగారు. హీరో శ్రీ నందు మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి ఈ చిత్రంలో జై అనే క్యారెక్టర్ ఇచ్చినందుకు మా డైరెక్టర్ హర్షవర్ధన్ కు థ్యాంక్స్ చెబుతున్నా. కాసు లాంటి ప్రపంచంలో నన్ను జై గా చూసినందుకు హ్యాపీగా ఉంది. దండోర, సైక్ సిద్ధార్థ తర్వాత నేను చేస్తున్న చిత్రమిది.

# ప్యారడైజ్ రెస్పాన్స్ ఒక తుఫాన్‌లా వచ్చింది:నాని



మీడియా ములాఖాత్‌లో కలెక్షన్ కింగ్ మోహన్ బాబు మాట్లాడుతూ... అందరికీ హృదయ పూర్వక వందనాలు, ఆశీస్సులు. సుధాకర్‌గా రు ఎక్కడా కూడా డబ్బుకి వెనకాడకుండా ఈ సినిమా చేశారు. ఆ భగవంతుడు ఆయనకు విజయాన్ని ఇచ్చాడు. దర్శకుడిపై భారం వేసి, సినిమాను నిర్మించిన వాళ్లలో ఒకరిద్దరినే చూశా. మా గురువుగారు దాసరి గారు పై కూ డా ఇలాగే నిర్మాతలు నమ్మకం పెట్టుకునేవారు. ఇప్పుడు శ్రీకాంత్‌పై సుధాకర్ చెరుకూరి అదే నమ్మకం ఉంచారు. నేచురల్ స్టార్ నాని మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈ సినిమా విషయంలో అన్ని కొత్తగానే జరిగాయి. ఫిలిం మేకింగ్, లొకేషన్స్ లో సిచువేషన్, ట్రైలర్ లేకపోవడం, రిలీజ్ ముందు ఉండే సిచువేషన్.. ఇవన్నీ కొత్తగా ఉన్నాయి. ఒక కొత్త సినిమా చేస్తున్నాం, ఒక కొత్త ఎక్స్‌పీరియన్స్ ఇస్తున్నాం అనుకున్నాం. కానీ ఇలా రెస్పాన్స్ కూడా ఇంత కొత్తగా ఉంటుందని అనుకోలేదు. ఇది నాకు చాలా కొత్త ఎక్స్‌పీరియన్స్. నేను ఎన్నో సినిమాలు చేశాను. ఈ మధ్యకాలంలో సినిమాలు రిలీజ్ అయిన ఉదయం చాలా పాజిటివ్ రెస్పాన్స్ ఉంటుంది. సాయంత్రానికి మిక్స్‌డ్ రెస్పాన్స్‌గా మారిపోతుందిడైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల మాట్లాడుతూ. అందరికీ నమస్కారం. సినిమాని హిట్ చేసినందుకు అందరికీ థాంక్యూ. ముందుగా జూనియర్ ఆర్టిస్టులందరికీ థాంక్యూ. ఈ సినిమా కోసం బురదలో, వర్షంలో చాలా కష్టపడ్డారు. సమ్మక్క క్యారెక్టర్‌ని సోనాలి గారు కాకపోతే ఇంకెవరు చేసినా ఇంత బాగా వచ్చేది కాదు. ఆ పాత్రని అద్భుతంగా చేశారు. సంపూ బిర్యానీ క్యారెక్టర్‌ని చాలా అద్భుతంగా చేశారు. మా హీరోయిన్ కయాదుకు థాంక్యూ. అది చాలా ఛాలెంజింగ్ క్యారెక్టర్. తను ఆ ఛాలెంజ్‌ని తీసుకుని చేసింది. ప్రియదర్శి శంకరన్న పాత్రని చాలా చక్కగా చేశాడు.

## గాంధీ జయంతి రోజు ప్రేమనే ఊరిలో



మహారత్న ప్రొడక్షన్స్, ఎస్కే పిక్చర్స్, వనిల్లా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్లపై చందు శ్రీనివాస్, సురేష్ కొండేటి, మమత దేవేంద్ర ఎం సం యుక్తంగా నిర్మించిన చిత్రం 'ప్రేమనే ఊరిల్లో. ఈ సినిమాకి మనోజ్ కుమార్ కథ, కథనం, దర్శకత్వం వహించారు. శ్రీరామ్, రమిక శివు, తపస్విని పూనాచ, రంగాయణ రఘు తదితరులు కీలక పాత్రల్లో నటించారు. రేబీనీ, కాంతారా వంటి చిత్రాలకు డైలాగ్స్ అందిం చిన హనుమాన్ చౌదరి ఈ చిత్రానికి సంభాషణలు రాయగా ప్రముఖ గేయ రచయిత రాంబాబు గోసాల పాటలను రచించారు. సునద్ గౌతమ్ సంగీతం అందిస్తుండగా, రాజ్‌కాంత్ ఎస్.కె సినిమాటోగ్రఫీ, హర్షిత్ ప్రభు ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహించారు. సెప్టెంబర్ 25న కన్నడలో విడుదలైన ఈ చిత్రానికి అనూహ్య స్పందన లభించగా గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2వ తేదీన తెలుగులో విడుదలకు సిద్ధమవుతుంది. కర్ణాటకలో హౌస్ ఫుల్ అవుతున్న ఈ ప్రేమ కథ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులు కూడా అదేవిధంగా ఆదరిస్తారని మేకర్స్ చెబుతున్నారు.

# సిటీ ఆఫ్ గోల్డ్ ఫస్ట్ లుక్



మోస్ట్ ట్యాలెంటెడ్ విక్రమ్ ప్రభు 26వ చిత్రం ఖిసిటీ ఆఫ్ గోల్డ్‌ఖి. ఈ చిత్రానికి సిద్ధార్థ్ దర్శకత్వం వహించారు. విక్రమ్ ప్రభు సరసన శివత్మిక రాజశేఖర్ కథానాయికగా నటిస్తుండగా, ఇంటర్నెట్ సం చలనం అమలా షాజీ ముఖ్య పా త్రలలో కనిపిస్తున్నారు. ఫస్ట్ లుక్‌లో విక్రమ్ ప్రభు ఎంతో ఇంటెన్స్ లుక్‌తో కూర్చు ని.. చాలా క్యాజువల్‌గా బంగారు కడ్డీలను పైకి విసురుతూ పట్టుకుంటూ కనిపిం చారు. గ్లింప్స్ ప్రేక్షకులను మరింత ఆసక్తికరమైన ప్రపంచంలోకి తీసుకెళ్తుంది. బంగా రం మార్కెట్, అక్కడ పనిచేసే వ్యక్తులు, సామాన్య ప్రజలకు పెద్దగా తెలియని ఒక రహస్య వ్యవస్థను ఇందులో చూపించారు. ఆకట్టుకునే విజువల్స్ ద్వారా సినిమా నేప థ్యాన్ని, పాత్రలను పరిచయం చేయడం క్యూరియాసిటీ పెంచింది. విక్రమ్ ప్రభు ఇందులో ఇంటెన్స్ రోల్‌లో కనిపించనున్నారు. అలగం పెరుమాళ్, జాఫర్ ఇడుక్కి, జీఎం సుందర్, వసుంధర, సునీల్ సుగత, జయకుమార్, మోరిష్ దాస్, బాల హాసన్, లిజ్జీ ఆంటోనీ తదితరులు ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్నారు. సినిమాటోగ్రాఫర్ కార్తీక్ శరాజ్ ఈ డార్క్ అండ్ మిస్టీరియస్ ప్రపంచాన్ని అద్భుతమైన విజువల్స్‌తో ఆవిష్కరించారు. యువన్ శంకర్ రాజా సంగీతం సినిమాకు మరింత డెప్త్‌ను తీసుకొచ్చింది.

# రావణుడిగా యష్ పవర్‌ఫుల్ పోస్టర్స్



నమిత్ మల్హోత్రా ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్, 8 సార్లు ఆస్కార్ అవార్డు గెలుచుకున్న దీవినిబి, యశ్‌కు చెందిన మాన్స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న 'రామాయణ్ఠంలో రణ్‌బీర్ కపూర్, సాయి పల్లవి, యశ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. నితీష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న నమిత్ మల్హోత్రా 'రామాయణ్ఠ ఈ ఏడాది అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో ఒకటి. తాజాగా రాకింగ్ స్టార్ యశ్ రావణుడిగా నటిస్తున్న ఫస్ట్ అఫీషియల్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇందులో ఆయన పోషిస్తున్న లార్జర్ ద్యాన్ లైఫ్ రావణుడి అవతార్‌ను పవర్‌ఫుల్‌గా చూపించారు. ఇంటెన్సిటీ, పవర్‌ఫుల్ ఆరాతో ఆకట్టుకున్న యశ్.. ఈ ఐకానిక్ పాత్రపై మరింత ఆసక్తిని పెంచుతున్నారు. తాజాగా విడుదలైన పోస్టర్‌లో యశ్ తన పవర్‌ఫుల్ లుక్‌తో ఫ్రేమ్‌ను డామినేట్ చేస్తున్నారు. విలువైన రత్నాలతో అలంకరించిన మెరిసే బంగారు కిరీటం, పొరలుగా ఉన్న ముత్యాల హారాలు, భారీ బంగారు కంకణాలతో యశ్ కనిపిస్తున్నారు. ఇంటెన్స్ చూపు, ఇంపోజింగ్ ప్రెజెన్స్‌తో రావణుడి పాత్రకు కావాల్సిన రాజసం, గంభీరతను తీసుకొచ్చారు. దీనితో పాటు శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతాదేవిగా సాయి పల్లవి, లక్ష్మణుడిగా రవి దూబేను పరిచయం చేస్తూ మరో కొత్త పోస్టర్‌ను కూడా మేకర్స్ విడుదల చేశారు. వనవాస కాలంలో అడవిలో శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణుడు కలిసి సాగిస్తున్న ప్రయాణాన్ని ప్రతిబింబించేలా రూపొందించిన ఈ పోస్టర్ ఎంతో ఆకట్టుకుంటోంది.

తెర

# డోంట్ ట్రబుల్ ది ట్రబుల్‌లో అన్ని ఎలిమెంట్స్ ఉంటాయి

**: ఫహాద్ ఫాజిల్**



ఫహాద్ ఫాజిల్ హీరోగా ఆర్కా మీడియా వర్క్స్, షోయింగ్ బిజినెస్ బ్యానర్ల మీద శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని, ఎస్ఎస్ కార్తికేయ నిర్మించిన చిత్రం డోంట్ ట్రబుల్ ది ట్రబుల్. శశాంక్ ఏలేటి దర్శకుడు. అక్టోబర్ 2న మూవీ రిలీజ్ అవుతుంది. ఈ క్రమంలో శనివారం ఫహాద్ ఫాజిల్ మీడియాతో ముచ్చటించారు. సినిమా గురించి ఆయన చెప్పిన విశేషాలివే..

**డోంట్ ట్రబుల్ ది ట్రబుల్ సినిమా చేయటానికి కారణమేంటి?**

కార్తికేయ నాకు ఫోన్ చేసిన 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్ఠ కథ గురించి చెప్పారు. శశాంక్ వచ్చి కథ చెప్పారు. నా జీవితంలో అసలు ఇలాంటి ఓ కథను వినలేదు. విన్న వెంటనే నాకు చాలా నచ్చింది. ఈ సినిమాని ఎలా అయినా సరే చేయాలని ఫిక్స్ అయ్యాను.

**సినిమాలో మ్యాజిక్ అనేది కీలకంగా ఉంటుందా?**

'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్ఠ అనే చిత్రంలో ప్రేమ, ఆప్యాయత, అనుబంధం వంటి చాలా ఎలిమెంట్స్ ఉంటాయి. మ్యాజిక్ అనే పార్ట్ ఒక అంశం మాత్రమే. ఈ సినిమాలో లోతైన అంశాలు, భావోద్వేగాలెన్నో ఉన్నాయి.

**'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్ఠ సినిమా చేసే క్రమంలో ఎలాంటి ఛాలెంజెస్ ఫేస్ చేశారు?**

మలయాళంలో కథను అర్థం చేసుకుని, డైలాగ్స్ నేర్చుకుని.. ఇంగ్లీష్‌లోకి మార్చుకుని.. తెలుగులో నటించడం నాకు ఛాలెంజింగ్‌గా అనిపించింది. కాస్త కష్టంగానే అనిపించినా ఈ జర్నీ నాకు ఎంతో నచ్చింది.

**సినిమాను చాలా వరకు రియల్ లొకేషన్స్‌లో షూట్ చేయటం ఎలా అనిపించింది?**

నాకు రియల్ లొకేషన్‌లో షూటింగ్ చేయడం అంటేనే ఇష్టం. కానీ 'పుష్ప సినిమాకి మాత్రం అలా చేయడం కుదరలేదు. ఈ సినిమాని చాలా వరకు రియల్ లొకేషన్స్‌లోనే షూట్ చేశాం.

**విభిన్నమైన సినిమాల్లో నటిస్తుంటారు.. రైటర్స్‌కు ఉన్న ఇంపార్టెన్స్ గురించి చెప్పండి?**

ఆర్టిస్టుల కంటే రచయిత, దర్శకులకే ఎక్కువ ఇంపార్టెన్స్ ఇవ్వాలన్నది నా అభిప్రాయం. శశాంక్ ఈ మూవీకి రైటర్, డైరెక్టర్. కథ బాగుంటేనే సినిమా బాగుంటుంది. తెలుగు ఇండస్ట్రీ వల్లే మన సినిమా ప్రపంచ స్థాయికి వెళ్లింది.

**చిన్నపాప సారాతో నటించటం ఎలా అనిపించింది?**

సారా అద్భుతమైన నటి. కెమెరా ముందు ఎంతో ఆర్గానిక్‌గా నటిస్తుంది. పేపర్ మీదున్న దాని కంటే ఎక్కువగా ఇంప్రవైజ్ చేస్తుంది. ఎంతో యాక్టివ్‌గా, ఎనర్జిటిక్‌గా యాక్ట్ చేసింది.

**డోంట్ ట్రబుల్ ది ట్రబుల్డ్‌లో మీ పాత్ర ఎలా ఉండబోతుంది?**

నేను చేసే ప్రతీ పనిలో నా బెస్ట్ ఇవ్వాలని, నా వర్క్ పట్ల నేను నిజాయతీగా ఉండాలని అనుకుంటాను. ఇందులోని నా పాత్ర అద్భుతంగా ఉంటుంది. నా కారెక్టర్‌లోని జర్నీ కొత్తగా ఉంటుంది.

**తెలుగు మాట్లాడటం నేర్చుకున్నారా?**

నేను గత ఏడాదిన్నరగా ఇక్కడే ఉంటున్నాను. ఎంతో మంది ఫ్రెండ్స్ అయ్యారు. తెలుగు కొంచెం కొంచెం వచ్చింది. నెక్స్ట్ టైం పూర్తిగా మాట్లాడతాను.

**కాలభైరవ సంగీతం గురించి చెప్పండి?**

కాల భైరవ సంగీతం సినిమాకి ప్రాణం పోసింది. ఆయన మ్యూజిక్ ఈ మూవీలో ఒక కారెక్టర్‌లా ఉంటుంది. ఆయన బీజీఎం యాడ్ అయ్యాక సినిమా నెక్స్ట్ లెవెల్‌లో అనిపించింది.

28vzm15:28vzm15.qxd 27-09-2026 22:53 Page 1



## 29 న విజయనగరంలో జిల్లా ఆర్యవైశ్య సంఘ సమావేశం



గరివిడి, సెప్టెంబర్ 27, ప్రభాత వార్త :

జిల్లా ఆర్యవైశ్య సంఘ సమావేశం ఈ నెల 29 న విజయనగరం ఆర్య వైశ్య అసోసియేషన్ భవనంలో నిర్వహిస్తున్నట్లు ఆర్య వైశ్య సంఘ జిల్లా ఉపాధ్యక్షులు వి వి ఎస్ ఎస్ ఎన్ గుప్తా తెలిపారు. జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు బండారు చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగే సమావేశంలో మాజీ ఉప శాసన సభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి,తదితరులు పాల్గొంటారని ఆయన తెలిపారు. పలు విభాగాల నూతన కార్యవర్గ సభ్యులు ఎన్నిక నిర్వహిస్తారన్నారు. ఆర్య వైశ్య సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరవ్వాలని గుప్తా కోరారు.

## పోషక విలువలు కలిగిన పదార్థాలే తీసుకోవాలి



శృంగవరపుకోట,సెప్టెంబర్27, ప్రభాతవార్త :

పోషక విలువలు కలిగిన పదార్థాలే తీసుకోవాలని అంగన్వాడీ సూపర్ వైజర్ నాగరత్నం తెలిపారు. ఆదివారం కొత్తపాలెం,జడ్ కుమారం, మరుపల్లి, అయితన్న పాలెం, కెఎస్.పురం,గౌరీపురం, కె.అడ్డతీగ, పెదఖండేపల్లి -2 అంగన్వాడీ కేంద్రాల్లో పోషక మాసోత్సవాలు అలాగే ప్రధానమంత్రి 25ఏళ్ల రాజకీయ ప్రస్థానం పూర్తయిన నేపథ్యంలో సేవా సంకల్ప్ అభియాన్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ నాగరత్నం పాల్గొని మాట్లాడుతూ గర్భిణీలు బాలింతలు తీసుకోవలసిన పోషక పదార్థాలపై అవగాహన కల్పించారు. పోషక విలువలు కలిగిన పప్పు ధాన్యాలు,ఆకుకూరలు,కాయగూరలు, పండ్లు,గుడ్లు,పాలు చిరుధాన్యాలు తదితర పోషక పదార్థాలను ఆహారంలో భాగంగా తరుచూ తీసుకోవాలని తెలిపారు.అలాగే ప్రధాని మాతృత్వ వందన యోజన పథకం,పోషకాహారం,ప్రీస్కూల్ గురించి లబ్ధిదారులకు సూపర్ వైజర్ నాగరత్నం తెలియజేశారు. బాలింతలు,గర్భిణీలు, తల్లులు,పిల్లలు,అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్‌బికె వద్ద బిజెపి కార్యకర్తలు శ్రమదానం

కురుపాం,సెప్టెంబర్27, ప్రభాతవార్త:



సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమం లో భాగంగా ఈ నెల 17 నుండి అక్టోబర్ 17 నెల రోజులపాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న బిజెపి నాయకులు ఆదివారం కురుపాం భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు గెంబలి ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో రైతు సేవ కేంద్ర వద్ద ఉన్న పొదలు, డొంకలు తొలగించారు. పార్టీ మండల కన్వీనర్ ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ ప్రజల కోసం పనిచేస్తున్న ప్రభుత్వ కార్యాలయాలు పరిశుభ్రత అందరి బాధ్యత అని అన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి చుట్టూ పరిసరాలు శుభ్రత పాటించి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు నడుకూరు దూళికేశ్వరరావు, పార్వతీపురం మన్యం జిల్లా ఉపాధ్యక్షులు బోటు అనిల్ కుమార్, ఎం జె పి స్కూల్ చైర్మన్ మణిభూషణరావు, ఎ ఎం సి డైరెక్టర్ శ్రీనివాస రావు, యువ మోర్చా అధ్యక్షులు చదువుల రమేష్ , తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలకు ఏ కష్టం వచ్చినా నేనున్నా : మంత్రి

### ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజాసేవలో భాగంగా అంగన్వాడీ ఉత్సవంలో సంధ్యారాణి



సాలూరు, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :

సాలూరు పట్టణ ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ లో ఐసీడీఎస్ జిల్లా పీడి కనకదుర్గ అధ్యక్షతన సీడీపీఓ మంగమ్మ ఆధ్వర్యంలో ఆదివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 వసంతాల ప్రజాసేవలో భాగంగా అంగన్వాడీ ఉత్సవం నిర్వహించారు. దీనికి విశిష్ట అతిథిగా స్త్రీ శిశు,గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి హాజరయ్యారు.అక్కడ ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతు అంగన్వాడీ కేంద్రాలు ద్వారా అనుబంధ పోషకాహారం,వ్యాక్సినేషన్,ఆరోగ్య సలహాలు,శిశు సంరక్షణ విద్య,పోషకాహారం,విద్య వంటి 6 సేవలు అందిస్తున్నామని స్పష్టం చేశారు.అలాగే అంగన్వాడీ లకు ఏ కష్టం వచ్చిన నేనున్నానని మంత్రి సంధ్యారాణి భరోసా కల్పించారు.అనంతరం అంగన్వాడి కేంద్రంలో పిల్లలకు 5వేల 670 స్టీల్ ప్లేట్లు,గ్లాసులు ఇంకా సొంత అంగన్వాడి సెంటర్లకు 50 టీవీలు అలాగే టీచర్లు ఇంకా హెల్పర్లకు1736 చీరలు (యూనిఫాం) మంత్రి చేతుల మీదుగా అందజేశారు. టీడీపీ టౌన్ ప్రెసిడెంట్ నిమ్మాది చిట్టి,ఆముదాల.పరమేష్,ముఖీ సూర్యనారాయణ సాలూరు,పాచిపెంట,మక్కువ సూపర్వైజర్లు,టీచర్లు, హెల్పర్లు , తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

శృంగవరపుకోట,సెప్టెంబర్27,ప్రభాతవార్త:



ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినం పురస్కరించుకొని జాతీయ పార్టీ,రాష్ట్ర పార్టీ ఆదేశాలతో నిర్వహిస్తున్న సేవా సంకల్పం అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఎస్.కోట ఆర్కే కల్యాణ మండపంలో ఎన్ వీఎన్ బ్లడ్ బ్యాంకు సహకారంతో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.మండల బీజేపీ పార్టీ అధ్యక్షులు మరిసా శ్రీను ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా బీజేపీ అధ్యక్షులు ఉప్పలపాటి రాజేష్ వర్మ,జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు కె.లోకాభి రామకోటి,జిల్లా బీజేపీ సీనియర్ నాయకులు సిహెచ్ ఆర్కే ప్రసాద్,దొడ్డి సూర్యారావు,మండల ప్రధాన కార్యదర్శి బి.చంద్రశేఖర్.ఎన్. పైడిమ నాయుడు,నాగిరెడ్డి కోట లక్ష్మి,రాయవరం భాగ్యలక్ష్మి, కార్యకర్తలు , తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కు అందజేత



నెల్లిమర్ల, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :

మండల కేంద్రం నెల్లిమర్లకు చెందిన ఉపాధ్యాయుడు చల్ల రవికుమార్ కుమారుడి అనారోగ్య పరిస్థితిపై ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు స్పందించారు. మానవతా దృక్పథంతో ఆ కుటుంబానికి సాయం చేయాలని ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లి సీ.ఎం సహాయనిధి ద్వారా 5,74,371 రూపాయలను మంజూరు చేయించారు. ఈ చెక్కును నేరుగా ఆదివారం నెల్లిమర్ల లోని వారి ఇంటికి వెళ్లి ఎమ్మెల్సీ శ్రీనివాస నాయుడు తన చేతులతో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబ్బాయికి ఆపరేషన్ నిమిత్తం 10 లక్షలు అవసరమై ఉందని, ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లగా సీఎం సహాయ నిధి నుంచి 5,74,371 రూపాయలు మంజూరు చేశారని వివరించారు. తన అభ్యర్థులను మన్నించి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి కి ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. అలాగే ఉపాధ్యాయుడు కుటుంబానికి ఆర్థిక సాయం వచ్చేలా కృషిచేసిన ఎమ్మెల్సీ శ్రీనివాసులు నాయుడు కు ఉపాధ్యాయుడు రవికుమార్ కుటుంబీకులు, పి ఆర్ టి యు మండల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పిఆర్టియు మండల అధ్యక్షులు కె. ఎస్. జె మోహన్, ప్రధాన కార్యదర్శి కడలి సత్య సాయి గణేష్ ,జిల్లా ఉపాధ్యక్షులు తాలాడ మహేష్ ఉపాధ్యాయులు, సూరిబాబు,సువ్వాని బాలకృష్ణ, రమేష్,నానాజీ, ఆదినారాయణ, శ్రీను, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## శిథిలావస్థకు చేరిన నేషనల్ హైవే డ్రైన్స్

### ఇబ్బందులు పడుతున్న బూసాయవలస గ్రామస్థులు

రామభద్రపురం, సెప్టెంబర్ 27, ప్రభాత వార్త:



జాతీయ రహదారిపై నిర్మించిన కాలువలు ఎత్తుపైకి కట్టడంతో వీధుల్లో ఉన్న ము ర్రుగునీరు కాలువల ద్వారా వెళ్లడం లేదని, గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జిల్లా టీడీపీ అధ్యక్షుడు మడక తిరుపతిరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం బూసాయవలస గ్రామంలోని కాలువలను పరిశీలించారు. కొ న్నిచోట్ల ఈ కాలువలు విరిగిపోయాయని, తూతూ మంత్రంగా నిర్మించిన ఈ కాలువల వల్ల ప్రజలకు ఎటువంటి ఉపయోగంలేద ని తెలిపారు. కొన్నిచోట్ల పిచ్చి మొక్కలతో నిండిపోయాయని, ఆర్ అండ్ బి అధికారులు పట్టించుకోక పోవడంతో సంబంధిత కాం ట్రాక్టర్ నిర్వహణ చేపట్టడం లేదని తెలిపారు. దీని పై ఆర్ అండ్ బి అధికారులు చర్యలు తీసుకొని కాలువ ల మరమ్మతులు చేపట్టాలని కోరారు. ముఖ్యంగా గ్రామం కిందకు ఉండిపోవడంతో ఈ కాలువలు ఎత్తులో కట్టడం వలన ఈ సమస్య తలెత్తు తోందని, దీనిని సరిచేయాలని కోరారు. ఆయన వెంట టీడీపీ నాయకులు సువ్వాడ హరిబాబు, నల్ల కూర్మారావు, జన సేన నాయ కుడు అల్లు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి ఎద్దడి లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలి

రామభద్రపురం, సెప్టెంబర్ 27, ప్రభాత వార్త:




రామభద్రపురం మండలంలో ఉన్న అన్ని గ్రామ పంచాయతీల్లో తాగునీటి సమస్య లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రత్నం సూచించారు. బూసాయవలస, ముచ్చర్లవలస గ్రామాల్లో రక్షిత మంచినీటి ప థకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాతూ ఇటీవల కురిసిన వర్షాల కారణంగా రక్షిత మంచినీటి పథకాల్లో క్లోరినేషన్ కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టాలని సూచించారు. అలాగే అపారిశుధ్యం సమస్య తలెత్తకుండా చర్యలు తీస ఎకోవాలన్నారు. అనంతరం మామిడివలస గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. పిల్లలకు మెనూ ప్రకారం ఆహారం అందివ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వెంకటరమణ, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

## విలువల వికాసమే లక్ష్యంగా .. సుపథ 23వ వార్షికోత్సవం



లక్కవరపుకోట, సెప్టెంబర్ 27 ప్రభాత వార్త :

లక్కవరపుకోటలోని సుపథ ఆశ్రమ ప్రాంగణంలో ఆదివారం సుపథ స్వచ్ఛంద సేవా సంస్థ 23వ వార్షికోత్సవం, సుపథ ప్రతిభా పరీక్షలు ఆశ్రమ నిర్వాహకులు వేద పండితులు అక్కా జోస్యుల శ్రీ హరి శర్మ అలాగే శ్రీ గురు బృందం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో మానవతా విలువలు, మాతృభాషపై అభిమానం, సంస్కృతీ సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో సుపథ సంస్థ గత 23 సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తోంది.అని సూపద వ్యవస్థాపకులు యూ వి ఏ ఎన్ రాజు మాస్టర్ తెలిపారు .ఈ సందర్భంగా తెలుగు తెలుసుకుందాం, పద్య పఠనం, శ్లోక పఠనం, దేశభక్తి గేయాలు, వ్యాసరచన, శ్రీకృష్ణ చరితామృతం, శ్రీమద్రామాయణం ప్రహేళిక (క్విజ్) తదితర అంశాలపై ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత స్థాయి విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. సుపథ సంస్థ ముందుగా రూపొందించిన పాఠ్యాంశాలను విద్యార్థులకు ఉచితంగా అందజేశారు.వేపాడ, లక్కవరపుకోట మండలాల్లోని 46 పాఠశాలల నుంచి సుమారు 640 మంది విద్యార్థులు ఈ ప్రతిభా పరీక్షల్లో పాల్గొన్నారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలతో పాటు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.సుపథ వ్యవస్థాపకులు యు.వి.ఏ.ఎన్. రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి రాజమండ్రి జిల్లా జడ్జి లగిశెట్టి వెంకటేశ్వరరావు విశిష్ట అతిథిగా, శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రత్యేక ఆహ్వానితులుగా ఎల్.కోట మండల విద్యాశాఖాధికారి-1 సి.హెచ్. కూర్మారావు, మండల విద్యాశాఖాధికారి-2 జి. శ్రీనివాసరావు, జగద్గురు పీఠం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.విద్యతో పాటు విద్యార్థుల్లో విలువలను పెంపొందించే దిశగా సుపథ సంస్థ చేస్తున్న కృషిని పాల్గొన్న అతిథులు అభినందించారు.మాకెందుకు లే అని అనుకుంటే ఇలాంటి మంచి ఆలోచన వచ్చి ఉండేది కాదని ఇలా సమాజ హితం కోసం విద్యార్థుల భవిష్యత్తు కోసం వారికి నైతిక విలువలు నేర్పడం కోసం తపన పడుతున్న సపథ నిర్వాహకులు సేవను కొనియాడారు.

## పెద్దగెడ్డ జలాశయంలో వ్యక్తి పడిపోయాడన్న అనుమానంతో గాలింపు

పాచిపెంట, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త:



కొత్తవలస గ్రామానికి చెందిన చింతవీరరాజు(38) ఆన్లైన్బెట్టింగులకు బానిసై ఆదివారం పాచిపెంట పెద్ద గడ్డ జలాశయంలో పడిపోయాడన అనుమానంతో పాచిపెంట పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నట్లు ఎస్సై అర్జున్ తెలిపారు. పోలీసు వివరాలు ప్రకారముచింత వీర్రాజు కొన్ని సంవత్సరాలుగా ఆన్లైన్లోకి బానిసై అప్పులు పాలైన వీర్రాజుకు కుటుంబ సభ్యులు పెద్దలు నచ్చచెప్పిన తన మారకపోవడం యదవిధిగా చివరికి ఇంటి నుండి ఆదివారం కనిపించడం లేదని పోలీసులకు కుటుంబ సభ్యులుఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈరోజే పెద్ద గడ్డ జలాశయం వద్ద మనస్థాపానికి గురై జలాశయం వద్ద ద్విచక్ర వాహనం విడిచిపెట్టి బతకడం ఇష్టం లేదు అని లెటర్ కనిపించగా కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో మిస్సింగ్ కేసు నమోదు చేసి పెద్దగెడ్డ జలాశయంలో దూకాడన్న అనుమానంతో పాచిపెంట పోలీస్ జలాశయంలో గాలింపు చేపట్టారు.

## 39వ జాతీయ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ జట్ల విజయదుందుభి

బొబ్బిలి, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త:




సెమీఫైనల్స్, సూపర్-8కు దూసుకెళ్లిన బాలురు, బాలికల జట్లు 39వ జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ బాలురు, బాలికల జట్లు అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తూ టోర్నమెంట్‌లో ముందంజ వేశాయి. లీగ్ దశ నుంచి ఆధిపత్యం ప్రదర్శించిన ఇరు జట్లు వరుస విజయాలతో ప్రత్యర్థులకు చెక్ పెట్టి సూపర్-8 మరియు సెమీఫైనల్స్‌కు అర్హత సాధించాయి.

**బాలికల జట్టు ఘన విజయాలు:**

ఆంధ్రప్రదేశ్ బాలికల జట్టు ప్రత్యర్థులపై పూర్తి ఆధిపత్యం చాటుతూ సూపర్-8 దశకు చేరుకుంది.

జమ్మూ కాశ్మీర్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో 3 - 1 తేడాతో విజయం సాధించింది.

హిమాచల్ ప్రదేశ్‌పై సమష్టిగా రాణించి 7 - 2 తేడాతో ఘన విజయం నమోదు చేసింది.

జార్ఖండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఏకపక్షంగా చెలరేగి 10 - 0 తేడాతో ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా జయకేతనం ఎగురవేసింది.

**బాలుర జట్టు తిరుగులేని జోరు:**

బాలుర విభాగంలోనూ ఆంధ్రప్రదేశ్ జట్టు అజేయంగా నిలిచి సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లింది.

ఢిల్లీ జట్టుతో జరిగిన ప్రారంభ మ్యాచ్‌లో 12 - 0 తేడాతో తిరుగులేని ఏకపక్ష విజయాన్ని నమోదు చేసింది.

మణిపూర్‌పై సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శిస్తూ 7 - 0 తేడాతో క్లీన్ స్వీప్ చేసింది.

పంజాబ్‌తో హోరాహోరీగా సాగిన కీలక పోరులో తీవ్ర ఒత్తిడిని అధిగమించి 5 - 4 తేడాతో విజయం సాధించి ఘనంగా సెమీఫైనల్‌లో అడుగుపెట్టింది. ఏదైనా మన నాయన గారి హస్తవాసి ?????? వాసికెక్కింది. ధన్యవాదాలు నాయన ఆంధ్ర జట్లు మన బొబ్బిలిలో మీ సారధ్యంలో ఎంపిక జరిగి జాతీయస్థాయిలో రాణించడానికి ముఖ్యకారణం మీరు నాయన.అలాగే పారాది గ్రామంలో ఉన్న జడ్పీహెచ్ఎస్ స్కూల్ నందు ఈ సాఫ్ట్ బాల్ టోర్నమెంట్ కండక్ట్ చేయడానికి పూర్తి సహాయ సహకారాలు అందించిన అల్లాడ భాస్కర్ రావు గారికి, ఎంపికైన జట్లకు 15 రోజులు కోచింగ్ క్యాంప్ నిర్వహించి నాయన సూచనల మేరకు వారికి తగిన శిక్షణ ఇచ్చి వారిని దృఢంగా తయారు చేసిన పిడి వెంకట్ నాయుడుకి ధన్యవాదాలు.

## తుఫాన్ గాలులకు నేలకొరిగిన అరటిపంట



గరుగుబిల్లి, సెప్టెంబర్ 27, ప్రభాత వార్త :

తుఫాన్ కారణంగా వీచిన భారీ గాలులకు మండల పరిధిలోని పలు గ్రామాల్లోని అరటి తోటలు నేల మట్టమయ్యాయి. గెలలతో ఉన్న అరటి పంట నేలమట్టం కావడంతో రైతులు తీవ్ర నష్టాలకు గురయ్యారు. మరి కొద్ది రోజుల్లో అరటిపంట గెలలతో ఉన్న అరటిపంట చేతికశీదుతుందన్న సమ యంలో తుఫాన్ కారణంగా వీచిన భారీ గాలులకు నేలమట్టం కావడంతో తీవ్ర నష్టాలకు గురయ్యామని మండల పరిధిలోని గిజబ తదితర గ్రామాలకు చెందిన రైతులు పేర్కొన్నారు. అయితే మండలం పరిధిలోని కొద్ది గ్రామాల రైతులు మాత్రమే ప్రస్తుతం అరటి పంటను పండిస్తున్నారు. తుఫాన్ కారణంగా వీచిన భారీ గాలులకు అరటిపంట నేలమట్టమైన రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించేందుకు తగు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

## పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

గరుగుబిల్లి, సెప్టెంబర్ 27, ప్రభాత వార్త:



పౌష్టికాహారముతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని.. అదే విధంగా అంగన్వాడీ కేంద్రాల పరిధిలో రాష్ట్రీయ పోషణ్ మా కార్యక్రమంను నెల రోజులు నిర్వహించడం జరుగుతుందని కొమరాడ ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి గొట్టాపు సుగుణ కుమారి పేర్కొన్నారు. గరుగుబిల్లి మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రం (1), అంగన్వాడి కేంద్రం(2)లో శుక్రవారం పోషణ్ మా కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహార ప్రదర్శన కార్యక్రమమును నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికా హార ప్రదర్శన కార్యక్రమంలో పాల్గొన్న కొమరాడ ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి గొట్టాపు సుగుణకుమారి మాట్లాడారు. రక్త హీనత నివారణపై ప్రజలకు అవగా హన కల్పించేందుకు పలు కార్యక్రమాల ను చేపడుతున్నామన్నారు. అంగ న్వాడీ కేంద్రాల్లో వచ్చే నెల 8వ తేదీ వరకు పోషణ్ కార్యక్రమంలో భాగంగా పలు కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. గరుగుబిల్లి సెక్టార్ సూపర్వైజర్ రౌతు లక్ష్మి, బిజెపి నాయకులు తుమ్మగుంట శంకర్రావు, అంగన్వాడీ వర్కర్లు మహంతి పద్మావతి, పల్ల కృష్ణవేణి, మూడడ్ల స్వాతి పాల్గొన్నారు.

విజయనగరం పార్వతీపురం మన్యం వార్త 25

## రామతీర్థంలో ఘనంగా సుందరకాండ పారాయణ

నెల్లిమర్ల, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :



ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ రామస్వామి వారి దేవస్థానం లో ఆదివారం భగవత్ భాగవత రామానుజ దాస బృందం (సింహాచలం) సభ్యులచే సుందరకాండ పారాయణ కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. పారాయణ కార్యక్రమం లో భాగంగా దివ్య ప్రబంధం, సేవా కాలం, స్తోత్రం పారాయణం ఘనంగా నిర్వహించారు. శ్రీరామ వైభవం 42వ అవృత్తిని దాస బృందం సభ్యులు ఈ సందర్భంగా పూర్తి చేశారు.సహస్ర శ్లోకి పారాయణం, భగవద్గీత పారాయణ నిర్వహించారు. భగవత్ రామానుజ దాసబృందం సభ్యులు కందాళ రాజగోపాలాచార్యులు తోపాటు ఆయన శిష్య బృందం పాల్గొన్నారు. దేవస్థానం కార్యనిర్వాహణాధికారి వై. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వారికి ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో దేవస్థానం అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



నెల్లిమర్ల, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :

స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. నెల్లిమర్లలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సచివాలయ ఉద్యోగులు సెలవు దినాలతో పని లేకుండా అతి కష్టం మీద తప్పనిసరి విధులు నిర్వహిస్తున్నారని, వారి సమస్యల పరిష్కారం విషయంలో ప్రభుత్వం నాన్చుడు ధోరణి వ్యవహరించడం బాధాకరమని అన్నారు. గత వైసిపి ప్రభుత్వం నియమించిన వాలంటీర్ల వ్యవస్థను తాజా కూటమి ప్రభుత్వం రద్దు చేసిందని, వాలంటీర్లు నిర్వర్తించిన బాధ్యతలను సైతం సచివాలయ ఉద్యోగులే చేస్తున్నారని రేగాన పేర్కొన్నారు. సచివాలయ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని రాగానే డిమాండ్ చేశారు. ఉద్యమం తీవ్రతరం కాకముందే ప్రభుత్వం స్పందించాలని ఆయన కోరారు.

## సిరిమాను ఉత్సవం రాష్ట్ర పండుగగా ప్రభుత్వం గుర్తింపు

విజయనగరం, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త:



ఉత్తరాంధ్ర ఇలవేల్పు పైడితల్లి అమ్మవారి జాతరను అమ్మవారి సిరిమాను ఉత్సవాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర పండగగా ప్రకటించడం ఉత్తరాంధ్ర ప్రాంతం పట్ల ముఖ్యమంత్రికి ఉన్న అభిమానాన్ని తెలియజేస్తుందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆలయ సహాయ కమిషనర్ కార్యనిర్వాహణాధికారి కే శిరీష మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ను ఆదివారం మంత్రి క్యాంప్ కార్యాలయం నందు మర్యాదపూర్వకంగా కలిసి ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో వేద ఆశీర్వచనం అందజేసి సిరిమాను సంబరాల ఆహ్వాన పత్రిక అందించారు. ఈ సందర్భంగా ఈవో కే శిరీష రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్న పైడితల్లి అమ్మవారి సిరిమాను సంబరాలను విజయవంతం చేసేందుకు సహకారం అందించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను కోరారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ నమ్మినవారికి కొంగు బంగారమైన అమ్మవారి ఉత్సవాలలో అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కలిగించాలని, అన్ని శాఖల అధికారుల సమన్వయంతో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సౌలభ్యాలు కలగజేయాలని సూచించారు.

## టిడిపి నేత చిన్న శ్రీనుని కలిసిన కొత్తవలస జనసేన పార్టీ సీనియర్ నాయకులు

విజయనగరం. సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:



విజయనగరం, కొత్తవలస మండలాల జనసేన మండల పార్టీ ప్రెసిడెంట్ గౌరపల్లి రవికుమార్ ఆధ్వర్యంలో సుమారు 70 మంది జనసేన పార్టీ సీనియర్ నాయకులు ధర్మపురి నందుగల సిరి సహస్ర రైజింగ్ ప్యాలెస్ లో ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ , తెలుగుదేశం పార్టీ నాయకులు గౌ!! శ్రీ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) గారి నివాసంలో ఆదివారం చిన్న శ్రీనుగారు,కుమార్తె తెలుగుదేశం పార్టీ యువ నాయకురాలు మరియు చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మ నూతనంగా తెలుగుదేశం పార్టీలో చేరిన శుభ సందర్భంగా మర్యాద పూర్వకంగా కలిసి, శుభాకాంక్షలు తెలిపి, తమ మద్దతును తెలియజేశారు.అనంతరం చిన్న శ్రీను మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మనమందరం కలిసి కూటమి పార్టీ తరఫున పనిచేయాలని ఆయన కోరారు. కొత్తవలస మండల పార్టీ ప్రెసిడెంట్ గౌరపల్లి రవికుమార్, నియోజకవర్గ నాయకులు చిన్న బాబు, జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి టి.విజయ్ కుమార్, జనసేన పార్టీ వైస్ ప్రెసిడెంట్ బి. దేవానంద్ మండలం నాయకులు అయ్యప్ప, ధారబాబు, మల్ల రాజు, గౌరపల్లి వెంకట్రావుతో సహా పాల్గొని జనసేన పార్టీ తరఫున తమ మద్దతును తెలియజేశారు.

## వైసీపీకి మూకుమ్మడి రాజీనామాలు



మెరకముడిదాం,సెప్టెంబర్ 27:

చీపురుపల్లి నియోజకవర్గం మెరకముడిదాం మండలం మాజీ జడ్పిటిసి,వైసీపీ మండల పార్టీ అధ్యక్షులు కోట్ల వెంకట్రావు, మాజీ సర్పంచ్ జిల్లా బూత్ కమిటీ కన్వీనర్ బూర్లె నరేష్ వైసీపీ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఆదివారం చిన్నబంటుపల్లి లో మీడియా సమావేశం లో ప్రకటించారు.మాజీ జడ్పీ చైర్మన్ చిన్న శ్రీను వెంట నడవాలని నిర్ణయించుకున్నామని పేర్కొన్నారు.13 గ్రామాల మాజీ సర్పంచులు,మాజీ ఎంపీటీసీలు,వివిధ హోదాల్లో ఉన్న వారు రాజీనామాలు చేస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో మండలం నుంచి భారీ ఎత్తున పార్టీ చేరికలు ఉంటాయని తెలిపారు.

## మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

నెల్లిమర్ల, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :



నెల్లిమర్ల నగర పంచాయతీలో మౌలిక సదుపాయాలు కల్పనకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట బీసీ కాలనీకి ఇటీవల నిర్మించిన సిసి రోడ్డును ఆమె ఆదివారం లాంఛనంగా ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆమెకు స్థానిక మహిళల నుంచి ఘనస్వాగతం లభించింది. పూలదండలు పుష్పగుచ్చాలతో ఆమెను సాదరంగా సత్కరించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగర పంచాయతీ పరిధిలోని నెల్లిమర్ల, జరజాపుపేట గ్రామాల్లో అవసరమైన సీసీ రోడ్లు సీసీ కాలువలు, త్రాగునీరు సరఫరా, వైద్య సదుపాయాలు కల్పనకు ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు. ఇందుకు అవసరమైన నిధులను ఎప్పటికీ మంజూరు చేయించడం జరిగిందని అన్నారు. కూటమి ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. లోకం ప్రసాద్, ఆ పార్టీకి చెందిన నెల్లిమర్ల, జరజాపుపేట గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

## జిల్లాలో ఖాళీగా ఉన్న 30 మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రభాత వార్త - భోగాపురం:

జిల్లాలో రెన్యువల్ చేసుకోని 30 మద్యం దుకాణాలకు ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. జిల్లాలో మొత్తం 169 మద్యం దుకాణాలు ఉండగా, 139 దుకాణాలు ఇప్పటికే పాత యజమానులు రెన్యువల్ చేసుకున్నారని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. మిగిలిన 30 దుకాణాలకు సెప్టెంబరు 24 నుంచి అక్టోబరు 1 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వెల్లడించారు. అక్టోబరు 3న దరఖాస్తుల పరిశీలన చేసి , అక్టోబరు 5న జిల్లా కలెక్టర్ సమక్షంలో లాటరీ నిర్వహించనున్నట్లు తెలిపారు. సాధారణ తనిఖీల్లో భాగంగా భోగాపురం ఎక్సైజ్ స్టేషన్‌ను ఆదివారం విజయనగరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వై.శ్రీనివాస చౌదరి, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి.శ్రీనాథుడు పరిశీలనకు వచ్చిన సందర్భంలో పై విషయాలకు సంబంధించి మీడియాతోమాట్లాడారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి అక్రమ మద్యం విక్రయాలు, నమోదైన కేసులు, ఇతర శాఖాపరమైన అంశాలపై సీఐ వి.రవికుమార్‌ను అడిగి తెలుసుకున్నారు.

28-09pg10exHMNWJQE.qxd:28-09pg10exHMNWJQE.qxd 1/1/02 5:58 AM Page 1





# నేడు భారత్‌తో అఫ్ఘాన్ ఢీ

## వర్షం దెబ్బకు క్వార్టర్ ఫైనల్ టీమ్స్ మార్పులు

**న్యూఢిల్లీ:** ఆసియా గేమ్స్ 2026లో భారత్ ప్రత్యర్థి ఎవరో తేలిపోయింది. నేరుగా క్వార్టర్ ఫైనల్స్‌లో ప్రవేశించిన శ్రేయాస్ అయ్యర్ నేతృత్వంలోని టీమిండియాతో అఫ్ఘానిస్థాన్ తలపడనుంది. ఈ హైవోల్టేజ్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ఈ నెల 28న జపాన్‌లోని లోని కొరోగి స్పోర్ట్స్ పార్క్‌లో ఉదయం 10.30 గంటలకు జరగనుంది. ఇరు జట్లూ నువ్వా నేనా అన్నట్టు తలపడటానికి సిద్ధమవుతుండటంతో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఇక వర్షం పుణ్యమా అని అఫ్గనిస్థాన్ క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించింది. జపాన్, నేపాల్ మధ్య శనివారం జరగాల్సిన గ్రూప్ ఏ చివరి లీగ్ మ్యాచ్ వర్షం కారణంగా ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయింది. దీంతో అంపైర్లు రెండు జట్లకు చెరో పాయింట్ కేటాయించారు. అంతకుముందు అఫ్ఘానిస్థాన్ చేతిలో ఓడిపోయిన జపాన్ ఈ మ్యాచ్ కూడా రద్దు కావడంతో కేవలం ఒకే ఒక్క పాయింట్‌తో టోర్నమెంట్ నుంచి నిష్క్రమించాల్సి వచ్చింది. మరోవైపు నేపాల్‌మూడు పాయింట్లతో గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచింది. వర్షం అంతరాయం కారణంగా ఈ మ్యాచ్‌ను 15 ఓవర్లకు కుదించగా, నేపాల్ 4 వికెట్లకు 149 పరుగులు చేసింది. జపాన్, నేపాల్ మధ్య మ్యాచ్ రద్దు కావడం అఫ్ఘానిస్థాన్ జట్టుకు నిజంగా ఒక వరంలా మారింది. టోర్నమెంట్‌లో భాగంగా అఫ్ఘాన్ జట్టు తొలి మ్యాచ్‌లో జపాన్‌పై విజయం సాధించినప్పటికీ, రెండో మ్యాచ్‌లో నేపాల్ చేతిలో ఓటమి చవిచూసింది. దీంతో ఆ జట్టు తదుపరి దశకు అర్హత సాధించడం చాలా కష్టంగా మారింది. అయితే చివరి నిమిషంలో వర్షం రూపంలో వచ్చిన అదృష్టం వల్ల జపాన్‌నేపాల్ మ్యాచ్ రద్దయి, అఫ్ఘానిస్థాన్ జట్టు ఎలాంటి అడ్డంకులు లేకుండా క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధించింది. ఈ అద్భుత పరిణామంతో అఫ్ఘాన్‌కు భారత్‌కు మధ్య క్వార్టర్ ఫైనల్స్‌కు కారణమైంది. నేరుగా క్వార్టర్ ఫైనల్స్‌లో ప్రవేశించిన బలమైన టీమిండియా ఇప్పుడు అఫ్ఘానిస్థాన్‌తో తలపడనుంది.



## బ్యాడ్మింటన్‌లో సింధు, ఉన్నతి, ట్రీసా-గాయత్రి, క్రాస్టో-ధ్రువ్ ఓటమి

**ఇచినోమియా సిటీ:** ఆసియా క్రీడల్లో భారత బ్యాడ్మింటన్ ప్రస్థానం ముగిసింది. మహిళల సింగిల్స్‌లో పివి సింధు, ఉన్నతి హుడా, మహిళల డబుల్స్‌లో ట్రీసా జాలీ–గాయత్రి గోపీచంద్, మిక్స్‌డ్ డబుల్స్‌లో తనిషా క్రాస్టో–ధ్రువ్ కపిల జోడీ ఓటమి చెందాయ. మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్‌లో చైనాకు చెందిన చెన్ యుఫెయ్ చేతిలో భారత్ క్రీడాకారిణి పివి సింధు 21–11, 18–21, 10–21 తేడాతో ఓటమి చెందింది. అంతకు ముందు రోజు రెండుసార్లు ఆడిన సింధు, 24 గంటల లోపే ఆదివారం ఓటమి చెందింది. టోక్యో ఒలింపిక్ ఛాంపియన్‌పై జరిగిన తొలి గేమ్‌లో భారత క్రీడాకారిణి ఆధిపత్యం చెలాయించి, దాన్ని



21–11 తేడాతో కైవసం చేసుకుంది. అంతకుముందు, ఉన్నతి హూడా జపాన్‌కు చెందిన మూడుసార్లు ప్రపంచ ఛాంపియన్ అకానె యమగుచితో పోరాడి 16–21, 21–14, 17–21 తేడాతో ఓడిపోయింది. తొలి గేమ్‌లో యమగుచి తనకు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని 21–16 తేడాతో కైవసం చేసుకుంది. రెండో గేమ్‌లో ఉన్నతి 21–14 తేడాతో విజయం సాధించినా, నిర్ణయాత్మక సెట్‌లో జపనీస్ షట్లర్ 21–17 తేడాతో గెలుపొందింది. మహిళల డబుల్స్‌లో, ప్రపంచ ఛాంపియన్‌షిప్ కాంస్య పతక విజేతలు ట్రీసా జాలీ–గాయత్రి గోపీచంద్, మలేషియాకు చెందిన ప్రపంచ నెం.5 జోడీ థినా మురళీధరన్–పెర్లీ టాన్ చేతిలో 18 -21, 8–21 తేడాతో ఓడిపోయారు. మిక్స్‌డ్ బుల్స్‌లో తనిషా క్రాస్టో, ధ్రువ్ కపిల జోడీ చైనాకు చెందిన ప్రపంచ నంబర్ 1 జోడీ యాన్ జె ఫెంగ్, డాంగ్‌పింగ్ హువాంగ్‌ల చేతిలో 14–21, 21–18, 18–21 తేడాతో ఓడిపోయింది.



## స్క్వాష్‌లో అభయ్, అనాహత్‌కు డబుల్స్ రజతం

**నగోయా:** ఆసియా క్రీడల సింగిల్స్ స్క్వాష్ ఫైనల్‌లో పురుషుల విభాగంలో అభయ్‌సింగ్, మహిళల విభాగాల్లో టీనేజ్ స్టార్ అనాహత్ సింగ్‌లు ఆదివారం రజతాలను సాధించడంతో భారత్ ఖాతాలో డబుల్స్ పతకాలు జమ అయ్యాయి. నాగోయాలో మలేషియాకు చెందిన డిఫెండింగ్ ఛాంపియన్ ఇయాన్ యోవ్ ఎన్‌జి చేతిలో 11–9, 11–5, 11–5 తేడాతో ఓడిన అభయ్‌కు రజతం దక్కింది. తొలుత అభయ్ 2–1తో స్వల్ప ఆధిక్యం సాధించగా, ఇయాన్ 4 పాయింట్లు సాధించి 6–3 ఆధిక్యంలోకి వెళ్లాడు. తర్వాత అభయ్ స్కోరును 8–8తో సమం చేసిఒక పాయింట్‌ను సాధించినా, ఇయాన్ 10–8 వద్ద రెండు పాయింట్లు సాధించి 11–9 తేడాతో తొలి గేమ్‌ను ముగించాడు. రెండో గేమ్‌లో 2–2తో సమంగా ఉండగా ఇయాన్ 7–3 ఆధిక్యంలోకి, తర్వాత 10–5 వద్ద 5 పాయింట్లుతో 2–0 ఆధిక్యం సంపాదించాడు. 4–2 ఆధిక్యంతో అభయ్ మూడవ గేమ్‌ను ప్రారంభించినా ఇయాన్ స్కోరును 4–4తో సమం చేసి 3 పాయింట్లు సాధించి 7–5 తోను, మరో 2పాయింట్లతో 9–5 ఆధిక్యాన్ని సాధించాడు. తర్వాత ఇయాన్ 10–5 వద్ద 5 పాయింట్లు సాధించి టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. మహిళల సింగిల్స్ ఫైనల్‌లో అనాహత్ మలేషియా డిఫెండింగ్ ఛాంపియన్ శివసంగరి సుబ్రమణియం చేతిలో 4–11, 4–11, 7–11 తేడాతో ఓడిపోయి రజత పతకాన్ని గెలుచుకుంది. తొలి గేమ్‌లో శివసంగరి చేతిలో 4–11 తేడాతో ఓడిపోయింది. రెండో గేమ్‌లోన అనాహత్‌ను 4 పాయింట్లకే పరిమితం చేసి 2–0 ఆధిక్యాన్ని సాధించగా, మూడవ గేమ్‌లో 11–7 తేడాతో శిసంగరి టైటిల్‌ను నిలబెట్టుకుంది.

## డ్రెస్సేజ్‌లో పతకం లేకుండా ముగిసిన ప్రచారం

**టోక్యో:** ఆదివారం జరిగిన వ్యక్తిగత డ్రెస్సేజ్ (గుర్రపు స్వారీ క్రీడ) విభాగంలో హృదయ్ ఛేడా, జై సుద్ పతకాలు సాధించలేక పోవడంతో, ఆసియా గేమ్స్ 2026లో భారత్ తన ప్రచారాన్ని పతకం లేకుండా ముగించింది. టీమ్ డ్రెస్సేజ్‌లో భారత్ అత్యంత సమీప స్థానాన్ని పొందింది, ఇక్కడ నలుగురి బృందం 201.971 పాయింట్ల సంయుక్త స్కోరుతో నాల్గవ స్థానంలో నిలిచింది. భారత్‌కు చెందిన శృతి వోరా



మ్యాగ్నానిమస్ అనే గుర్రంపై 68.059 స్కోరుతో దేశం తరఫున అగ్రస్థానంలో నిలిచారు. డోనో డి మ్యాగియోపై స్వారీ చేసిన హృదయ్ ఛేడా 67.353 స్కోరు సాధించగా, జై సుద్ 66.559 స్కోరును, గౌరవ్ పుండిర్ 65.794 స్కోరును నమోదు చేశారు.

కేవలం అత్యుత్తమ మూడు ఫలితాలను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నందున, ఇదే జట్టు డ్రాప్ స్కోరుగా పరిగణించబడింది. వ్యక్తిగత డ్రెస్సేజ్ ఈవెంట్‌లో, ఫైనల్ క్వాలిఫికేషన్ యొక్క రెండవ రౌండ్‌లోనే శృతి, గౌరవ్ నిష్క్రమించారు. హృదయ్ మరియు జై మెడల్ రౌండ్‌కు చేరుకున్నారు, కానీ వరుసగా ఎనిమిది మరియు తొమ్మిదవ స్థానాలతో సరిపెట్టుకున్నారు.




## మహిళల హాకీ: భారత్ విజయం

### 7-0తో సింగపూర్ చిత్తు

**గిఫు:** ఆదివారం గిఫు ప్రిఫెక్చురల్ గ్రీన్ స్టేడియంలో జరిగిన పూల్ బి చివరి మ్యాచ్‌లో సింగపూర్‌పై 7–0 తేడాతో ఘన విజయం సాధించడం ద్వారా భారత మహిళల హాకీ జట్టు ఆసియా గేమ్స్ 2026 గ్రూప్ దశలో తమ అజేయ పరంపరను పూర్తి చేసింది. ఈ విజయంతో భారత్ దక్షిణ కొరియాతో సెమీఫైనల్ పోరుకు సిద్ధమైంది. భారత్ ఆధిపత్యం చెలాయించి, 28 పెనాల్టీ కార్నర్‌లను సంపాదించినప్పటికీ, తొలి పావుగంటలో గోల్ కీపర్ ఫెలిస్సా లాయ్ సింగపూర్ పటిష్టంగా నిలిచింది. రెండవ క్వార్టర్‌లో కెప్టెన్ సలీమా టెటె ఫీల్డ్ గోల్‌తో ఎట్టకేలకు ప్రతిష్టంభనను అధిగమించింది. ఆ తర్వాత సునెలిత టోప్పో పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచి, మరో గోల్ జోడించి భారత్‌ను 3-0 ఆధిక్యంలోకి తీసుకువెళ్ళింది. లాల్‌రెమ్సియామి రుతుజ పిసాల్ గోల్స్‌తో భారత్ తమ ఆధిక్యాన్ని మరింత పెంచుకుని 5–0 భారీ ఆధిక్యం సాధించింది. 3వ క్వార్టర్‌లో నిక్కీ ప్రధాన్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలచి స్కోరును 6–0కి చేర్చింది. ఆఖరి క్వార్టర్‌లో పెనాల్టీ కార్నర్ నుండి దీపిక డ్రాగ్ ఫ్లిక్‌తో 7–0 విజయాన్ని ఖాయం చేస్తూ స్కోరింగ్‌ను పూర్తి చేసింది.

## డెకాథ్లాన్‌లో తేజస్విన్‌కు కాంస్యం

### హై జంప్‌లో సర్వేశ్ రజతం

### స్టీపుల్‌చేజ్‌లో పరుల్‌కు కాంస్యం

**నాగోయా:** భారత స్టార్ అథ్లెట్ తేజస్విన్ శంకర్ ఆదివారం ఆసియా క్రీడల్లో పురుషుల డెకాథ్లాన్‌లో 7,934 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్యం, సర్వేశ్ కుషారే పురుషుల హైజంప్‌లో రజత పతకం, పరుల్ చౌదరి మహిళల 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. అత్యంత కఠినమైన ఈ పోటీలోని చివరి ఈవెంట్ 1500 మీటర్ల పరుగులో 4:33.09 సమయాన్ని నమోదు చేసి, శంకర్ విజయంతో ముగించాడు. అలాగే కుషారే 2.25 మీటర్ల అత్యుత్తమ జంప్‌తో, చైనీస్ తైపీకి చెందిన స్వర్ణ పతక విజేత చావో హువాన్‌ఫుతో సమానంగా నిలిచాడు. కుషారే తన మొదటి ప్రయత్నాలలోనే 2.10మీ, 2.14మీ, 2.18 మీ, 2.22 మీటర్ల ఎత్తులను అధిగమించి ఆరంభాన్ని ఇచ్చాడు. ఇద్దరుఅథ్లెట్లు 3




ప్రయత్నాలలోనూ 2.28 మీటర్ల ఎత్తును అధిగమించడంలో విఫలమవడంతో, చావోకు స్వర్ణం, కుషారేకు రజతం లభించాయి. మహిళల 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో, 1500 మీటర్ల పరుగులో నాలుగో స్థానంతో వెనుకబడిన పరుల్, 9:08.67 సమయంతో పుంజుకుని కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. ఆమె 9:06.82 సమయంలో రజతం గెలుచుకున్న కజకిస్తాన్‌కు చెందిననోరా తనుయ్‌కంటే 2.46సెకన్ల వెనుకబడి ముగించింది.

## ఇకపై ప్రిపెయిడ్ 30 రోజులకు మొబైల్ రీఛార్జి

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 27:** మొబైల్ యూజర్లకు గుడ్‌న్యూస్. ఇన్నాళ్లు 28రోజులకే ప్రీపెయిడ్ మొబైల్ రీచార్జ్ ప్లాన్స్ ఉండేవి. అయితే, ఇప్పుడు చాలా మంది ప్రజలకు ఉపయోగపడేలా టెలికాం రీచార్జ్ ఆప్షన్లలో మార్పులు వచ్చాయని రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా తెలిపారు. కొత్త నిబంధనల ప్రకారం 30 రోజుల వ్యాలిడిటీ ఉన్న రీచార్జ్ ప్లాన్‌లతో పాటు డేటా అవసరం లేని వారికి ప్రత్యేకంగా వాయిస్ అండ్ ఎస్ఎంఎస్ ఓన్లీ ప్లాన్స్ అందుబాటులోకి వస్తాయని చెప్పారు. దీనిని ఆయన తక్కువ బడ్జెట్ వినియోగదారుల విజయంగా అభివర్ణించారు. టెలికామ్ కన్స్యూమర్ ప్రొటెక్షన్(13వ సవరణ) రెగ్యులేషన్స్ 2026ను విడుదల చేసింది. దీని ప్రకారం టెలికాం కంపెనీలు వాయిస్, ఎస్ఎంఎస్ ఓన్లీ స్పెషల్ టారిఫ్ ఓచర్స్‌లను అందించాల్సి ఉంది. వాయిస్, ఎస్ఎంఎస్, డేటా కలిపిన రీచార్జులు ప్రతీ 30 రోజులు లేదా అంత కన్నా తక్కువ వాలిడిటీ పిరియడ్‌కు అనుగుణంగా ప్లాన్స్‌ను టెలికాం సంస్థలు అందించాల్సి ఉంటుంది. డేటా అవసరం లేని వారికి వాయిస్ మరియు ఎస్ఎంఎస్ రీచార్జ్ ప్లాన్‌లను కూడా అందించాలి. ప్రీపెయిడ్ యూజర్లు చాలా కాలంగా ఎదుర్కొంటున్న 28రోజుల రీచార్జులకు చెక్ పడినట్లే తెలుస్తోంది. దీనిపై రాఘవ్ చద్దా గతంలో పార్లమెంట్‌తో తన వాదన వినిపించారు. 28 రోజుల వ్యాలిడిటీని మంత్లీ ప్లాన్‌గా పరిగణించడం వల్ల యేడాదికి 13 సార్లు రీచార్జ్ చేయాల్సి వస్తోందని చెప్పారు. తాజా నిబంధన వల్ల 30 రోజుల రీచార్జ్ ప్లాన్స్‌తో ఇకపై యేడాదికి 13 సార్లు చేయాల్సిన రీచార్జులు 12కు తగ్గే అవకాశం ఉందని చెప్పారు. కొత్త మార్పుల్ని రాఘవ్ చద్దా స్వాగతించారు.






## పండగ సీజన్‌లో కస్టమర్లకు షాక్

### ధరలు పెరుగుతున్న టివి, ఫ్రిజ్, ఎసీలు

**ముంబయి, సెప్టెంబరు 27:** పండగ సీజన్‌కు ముందు ప్రజలకు ప్రముఖ కంపెనీలు షాక్ ఇవ్వనున్నాయి. ఎలక్ట్రానిక్స్ తయారీదారులు ఎయిర్ కండిషనర్లు, ఎల్ఇడి టివిలు, వాషింగ్ మెషీన్లు, ఇతర ఉత్పత్తుల ధరలను 5 శాతం నుంచి 8 శాతానికిపెంచనున్నారు. అక్టోబర్ 1నుంచి అమల్లోకి వస్తుంది. రాగి, ఉక్కు ధరల పెరుగుదలతో పాటు పశ్చిమ ఆసియా సంక్షోభం కారణంగా ధరలు పెంచాల్సి వస్తుందని కంపెనీలు చెబుతున్నాయి. ఈ యేడాది ధరల పెంపు ఇది మూడోసారి. తయారీదారులు రాగి, అల్యూమినియం, ఉక్కు, ముడిచమురు ఉత్పత్తు ధరల పెరుగుదల, అధిక సరుకు రవాణా ఖర్చులు కూడా ధరల సవరణకు అనివార్యమయ్యాయని కంపెనీలు వివరించాయి. ఎయిర్ కండీషనర్ ధరలు 58 శాతం పెరగనున్నాయి. వాషింగ్ మెషీన్లు, రిఫ్రిజిరేటర్లు, ఎల్ఇడి టీవీల ధరలను 34 శాతం పెంచుతున్నారని పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి. బ్లూ స్టార్, గోద్రెజ్ అప్లయన్స్, హైయర్, డైకిన్, సూపర్ ప్లాస్టోనిక్స్ వంటి కంపెనీలు ఇప్పటికే 410 శాతం వరకు ధరల పెంపును ప్రకటించాయి. పానాసోనిక్ ఏదైనా పెరుగుదలను నిర్ణయించే ముందు పరిస్థితిని అంచనా వేస్తున్నట్లుతెలిపింది. హిటాచీ బ్రాండెడ్ ఎయిర్‌కండీషనర్లను కలిగి ఉన్న ఎల్‌జి, బాష్ హోమ్ కంఫర్ట్ కూడా ఎసి ధరలను దాదాపు 5 శాతం పెంచాయి. కమోడిటీ ఖర్చులు ఎక్కువగా ఉండడంతో ఇప్పటికే ఏసీలు, డీప్ ఫ్రీజర్ల ధరలు 58 శాతం మేర పెరిగాయని బ్లూ స్టార్ మేనేజింగ్ డైరెక్టర్ బి త్యాగరాజన్ చెప్పారు. గత యేడాది పండుగ సీజన్‌తో పోల్చి చూస్తే, ఖర్చులు దాదాపు 15 శాతం పెరిగాయన్నారు.

వాణిజ్యం

# భారత్ మార్కెట్లకు ఈ వారం 20 ఐపిఒలు




## ఇన్వెస్టర్లకు ఇక పండగే

**ముంబయి, సెప్టెంబరు 27:** భారత ప్రైమరీ మార్కెట్ ఇన్వెస్టర్లకు ఈ వారం సరికొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. సెప్టెంబర్ చివరి వారంలో ఏకంగా 20 కంపెనీలు తమ తొలి పబ్లిక్ ఆఫరింగ్‌ల ద్వారా దలాల్ స్ట్రీట్ నుంచి నిధులు సమీకరించేందుకు సిద్ధమయ్యాయి. ఈ సంవత్సరంలోనే ఒకే వారంలో ఇన్ని ఐపిఒలు తెరచుకోవడం ఇదే తొలిసారి. దీంతో ఈ 2026లోనే అత్యంత బిజీ వారంగా ఈ వారం నిలవనుంది. ఈ భారీ వేలంలో 4 మెయిన్ బోర్డు ఐపిఒలతో పాటు 16 ఎస్ఎంఇ ఐపిఒలు కూడా అందుబాటులోకి వస్తున్నాయి. రిటైల్ ఇన్వెస్టర్లు ఎక్కువగా ఆసక్తి చూపే మెయిన్ బోర్డ్ కేటగిరీలో ఈ వారం 4 ఐపిఒలు ప్రారంభమవుతున్నాయి. అందులో ఎస్ఆర్ఐటి కూడా ఉంది రూ.218.440 కోట్లు విలువైన బుక్ వాల్యూతో వస్తోంది. ధరల శ్రేణి రూ.123 నుంచి రూ.130 గా నిర్ణయించారు. 115 షేర్లు కనీస పెట్టుబడి రూ.14,950గా నిర్ణయించారు. 28న మొదలై 30న ముగియనుంది. షా ఇన్వెస్టర్స్ హోమ్ 28వ తేదీన ప్రారంభమయి 30వ తేదీ ముగుస్తుంది. షేరు ధరలు రూ.159 -167గా నిర్ణయించారు. నిత్యాస్ జెమ్స్ అండ్ జువెలరీ 30వ తేదీ మొదలవుతోంది. అక్టోబర్ 5నముగుస్తుంది. షేరుధర రూ.70 నుంచి రూ.75గా నిర్ణయించారు. కనీస పెట్టుబడి రూ.15 వేలుగా నిర్ణయించారు. విశాల్ నిర్మితి సైతం 30వ తేదీన ప్రారంభమవుతోంది. రూ.178కోట్లు సమీకరించనుంది. అక్టోబర్ 5వ తేదీవరకు సబ్‌స్క్రిప్షన్ కొనసాగుతుంది. షేరుధరలు రూ.208నుంచి రూ.220గా నిర్ణయించారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమల కేటగిరీలో దాదాపు 16 కంపెనీలు తమ ఐపీఓ లను తీసుకువస్తున్నాయి. బ్లాక్ ఒపాల్ కన్సల్టెంట్స్, ఎవరెస్ట్ ఐఎంఎస్ టెక్నాలజీస్, వాన్స్ ఎలక్ట్రో ఇంజనీరింగ్స్, డోవ్ సాఫ్ట్, అక్మే ఇండియా ఇండస్ట్రీస్, టీఎన్ఎ సొల్యూషన్స్, ఎస్‌జేపి అల్ట్రాసోనిక్స్, ఎవెన్షన్స్, సోల్ ఫెగ్ స్మార్ట్ ఎలక్ట్రానిక్స్, ఒమారా వెంచర్స్ ఇండియా, పపడమల్జీ ఆగ్రో ఫుడ్స్ మొదలైనవి ఇందులో ఉన్నాయి. ఎస్ఎంఇ ఐపిఒలలో కనీస పెట్టుబడి సాధారణంగా లాట్ సైజ్ ప్రకారం రూ.2 లక్షల నుంచి రూ.2.80 లక్షల వరకు ఉంటుంది.

## ఎన్ఆర్ఐ డిపాజిట్లు 36.24 బిలియన్ డాలర్లు

**ముంబై, సెప్టెంబర్ 27:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలల్లో నాన్‌రెసిడెంట్ ఇండియన్ (ఎన్ఆర్ఐ) డిపాజిట్ పథకాల్లోకి నిధులు భారీగా వచ్చాయి. విదేశీ కరెన్సీ డిపాజిట్లలో గణనీయమైన వృద్ధి నమోదైంది. విదేశీ కరెన్సీ నిధులను ఆకర్షించేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ ప్రత్యేక విధాన చర్యలు తీసుకోవడం ఇందుకు ప్రధాన కారణంగా నిలిచింది. ఆంబిఐ గణాంకాల ప్రకారం, ఈ యేడాది ఏప్రిల్–జూలై కాలంలో ఎన్ఆర్ఐ డిపాజిట్ పథకాల్లోకి నికర నిధులు యేడాది ప్రాతిపదికన 678.2 శాతం పెరిగి 36.24 బిలియన్ డాలర్లకు చేరింది. గత యేడాది ఇదే కాలంలో ఈ మొత్తం 4.66 బిలియన్ డాలర్లుగా ఉంది. ఈ భారీ వృద్ధికి ప్రధానంగా ఫారెన్ కరెన్సీ నాన్‌రెసిడెంట్ (బ్యాంక్) లేదా ఎఫ్‌సీఎన్ఆర్(బి) డిపాజిట్లు కారణమయ్యాయి. విదేశీ కరెన్సీ నిధులను ఆకర్షించేందుకు ఆర్‌బిఐ జూన్‌లో రాయితీతో కూడిన స్వాప్ సదుపాయాన్ని ప్రవేశపెట్టింది. ఈ చర్య ద్వారా ఆగస్టు 31 నాటికి సుమారు 133 బిలియన్ డాలర్ల నిధులు సమీకరించారు. ఎఫ్‌సీఎన్ఆర్(బి) ఖాతాల్లోకి నిధుల ప్రవాహం గణనీయంగా పెరిగింది. ఏప్రిల్‌జూలై కాలంలో ఎఫ్‌సీఎన్ఆర్(బి) డిపాజిట్లలోకి వచ్చిన నిధులు 34.53 బిలియన్ డాలర్లకు చేరాయి. గత యేడాది ఇదే కాలంలో ఇవి కేవలం 772 మిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఈ పెరుగుదల నేపథ్యంలో జూలై 2026 చివరి నాటికి ఎఫ్‌సీ ఎన్ఆర్(బి) ఖాతాల్లోని మొత్తం బకాయిడిపాజిట్లు 68.28 బిలియన్ డాలర్లకు చేరాయి. ఎఫ్‌సీఎన్ఆర్(బి) ఖాతాలద్వారా ఎన్ఆర్ఐలు ఒకటి నుంచి ఐదేళ్ల కాలపరిమితితో స్వేచ్ఛగా మార్చుకోగల విదేశీ కరెన్సీల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసుకోవచ్చు. డిపాజిట్ కాలంలో మారకపు విలువల్లో వచ్చే హెచ్చుతగ్గుల నుంచి ఇవి రక్షణ కల్పిస్తాయి. జూలై 2026 నాటికి దేశంలోని మొత్తం ఎన్ఆర్ఐ డిపాజిట్లు 200.89 బిలియన్ డాలర్లకు పెరిగాయి. జూలై 2025లో ఇవి 167.86 బిలియన్ డాలర్లు కాగా, జూన్ 2026లో 168.51 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఏప్రిల్‌జూలై కాలంలో ఎన్ఆర్ఓ ఖాతాల్లోకి వచ్చిన నిధులు 1.51 బిలియన్ డాలర్లకు పెరిగాయి. గత యేడాది ఇదే కాలంలో ఇవి 1.47 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.

## పశ్చిమాసియా ధోరణులు..క్రూడ్ ధరలే

# ఈ వారం మార్కెట్లకు దిక్సూచి



**ముంబై, సెప్టెంబరు 27:** భారత స్టాక్ మార్కెట్లు ఈ వారం వెస్ట్ ఏషియాలో చోటుచేసుకునే పరిణామాలు, ముడి చమురు ధరల కదలికలఆధారంగా స్పందించే అవకాశం ఉంది. వీటితో పాటు బాండ్ ఈల్డ్స్, విదేశీ పెట్టుబడిదారుల నిధుల రాక, కీలక దేశీయ ఆర్థిక గణాంకాలను కూడా ఇన్వెస్టర్లు నిశితంగా గమనించనున్నారు. గత వారం వరుసగా ఏడో వారంలోనూ నిఫ్టీ 50, సెన్సెక్స్ నష్టాలతో ముగిశాయి. సెప్టెంబర్ 25తో ముగిసిన వారంలో నిఫ్టీ 0.9 శాతం క్షీణించి 23,140.50 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 0.5 శాతం పడిపోయి 73,895.74 వద్ద స్థిరపడింది. పెరిగిన ముడి చమురు ధరలు, అమెరికా ట్రెజరీ ఈల్డ్స్‌లో పెరుగుదల, విదేశీ పెట్టుబడిదారుల విక్రయాలు మార్కెట్ సెంటిమెంట్‌పై ఒత్తిడి తెచ్చాయి. బీమా కమిషన్లపై పరిమితి విధించాలన్న ఐఆర్‌డిఎఐ ప్రతిపాదనతో ఆర్థిక రంగ షేర్లలో కొత్తగా అమ్మకాల ఒత్తిడి ఏర్పడటం కూడా ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. అమెరికా–ఇరాన్ వివాదం, హోర్ముజ్ జలసంధికి సంబంధించిన పరిణామాలు మార్కెట్‌కు కీలక ట్రిగ్గర్లుగా కొనసాగనున్నాయి. హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడానికి సంబంధించిన ఒక కార్యాచరణ ప్రణాళికలో పురోగతి కనిపిస్తే ఇంధన ధరలు తగ్గే అవకాశం ఉందని, తద్వారా భారత్ దిగుమతి బిల్లు, రూపాయికి కొంత ఊరట లభించవచ్చని రిలయన్స్ బ్రోకింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌రిసెర్చ్ అజిత్ మిశ్రా తెలిపారు. దలాల్ స్ట్రీట్‌కు ముడి చమురు ధరలు మరోసారి ప్రధాన అంశంగా మారనున్నాయి. భౌగోళిక రాజకీయ ఆందోళనలు కొనసాగడంతో గత వారం బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 107 డాలర్లను దాటింది. అంతకుముందు కొద్దికాలం 100 డాలర్ల దిగువకు కూడా పడిపోయింది. క్రూడ్ ధరలు అధిక స్థాయిలో కొనసాగుతున్న నేపథ్యంలో రూపాయి కదలికలు కూడా మార్కెట్‌కు కీలక సూచికగా మారనున్నాయి. గతవారాంతంలో అమెరికా డాలర్‌తో రూపాయి విలువ రూ.95.75 వద్ద ముగిసింది. ఈక్విటీ మార్కెట్లలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల పెట్టుబడుల ఉపసంహరణ కొనసాగుతున్న నేపథ్యంలో వారి పెట్టుబడుల తీరును కూడా మార్కెట్ వర్గాలు నిశితంగా పరిశీలించను న్నాయి. గతవారంలో ఎక్స్ఛేంజీల ద్వారా విదేశీ పెట్టుబడిదారులు మొత్తం రూ.25,682 కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారని చెప్పారు. అదేక్రమంలో రూ.8,551 కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు తెలిపారు. ఈ ఏడాది ఇప్పటివరకు ఎక్స్ఛేంజీల ద్వారా ఎఫ్‌పిఐల మొత్తం విక్రయాలు రూ.2,95,971 కోట్లకు చేరగా, ఇదే కాలంలో ప్రైమరీ మార్కెట్ ద్వారా వారి పెట్టుబడులు రూ.54,398 కోట్లుగా ఉన్నాయని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రతినిధి విజయకుమార్ పేర్కొన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా వ్యవసాయ రసాయన విక్రయాలు

### అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, జియోమార్ట్‌పై సిసిపిఎ జరిమానా



**న్యూఢిల్లీ,సెప్టెంబరు 27:** రిజిస్ట్రేషన్ లేని వ్యవసాయ రసాయన ఉత్పత్తి సైక్లోసినోన్ హెర్బిసైడ్‌ను తమ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లలో విక్రయించి, ప్రకటనలు చేసినందుకు ఈ కామర్స్ సంస్థలు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, జియోమార్ట్‌లపై కేంద్ర వినియోగదారుల రక్షణ ప్రాధికార సంస్థ చర్యలు తీసుకుంది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లకు రూ.10 లక్షల చొప్పున, జియోమార్ట్‌కు రూ.5 లక్షల జరిమానా విధించింది. నిబంధనలకు విరుద్ధమైన లేదా వినియోగదారుల భద్రతకు ముప్పు కలిగించే ఉత్పత్తులు తమ ప్లాట్‌ఫామ్‌లలో కనిపించకుండా స్వీయ ఆడిట్ నిర్వహించాలని ఎఫ్ఎస్ఎస్ఎఐ ఆదేశించింది. ఆదేశాలు జారీ చేసిన 15 రోజుల్లోగా తమ వివరణలు సమర్పించాలని సూచించింది. సైక్లోసినోన్ హెర్బిసైడ్ విక్రయాలు, ప్రకటనలను వెంటనే నిలిపివేయాలని ఆయా ఈకామర్స్ సంస్థలను కేంద్రం ఆదేశించింది. ఈ ఉత్పత్తిని మార్కెట్ చేస్తున్న సమయంలో అందులోని క్రియాశీల రసాయన పదార్థం పేరు, దాని కూర్పు వంటి కీలక వివరాలను వెల్లడించలేదని ప్రాధికార సంస్థ గుర్తించింది. క్రాప్ కేర్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా తొలుత చేసిన ఫిర్యాదును కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖకి పంపింది. దీనిపై సిసిపిఎ దర్యాప్తు చేపట్టింది. సైక్లోసినోన్' పేరుతో ఎలాంటి రసాయనం నమోదై లేదు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.